'శంబల' - ప్రభువు!

రెండవ భాగము

డా. వేదవ్యాస Ph.D., D.Litt.

'శంబల' - ప్రభువు !

భవిష్యత్తుకై - పరిశోధనాత్మక నవలిక !

రెండవ-భాగము

రచన :

డా. వేదవ్యాస IAS., D.Litt.

ప్రచురణ :
భారతీయ సంస్కృతి సముద్ధరణ సంస్థ (USCEFI)
ప్లాట్ నెం.56, రోడ్ నెం.8, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33
ఫోన్ నెం. 040-23547350
2013

Rs.100/-

‘శంబల’-ప్రభువు - గ్రంథపరిచయం

— **డా॥ సి. ఆనందారామం**

ప్రఖ్యాత సినీరచయిత్రి;
ప్రొఫెసర్, కేంద్రవిశ్వవిద్యాలయం, హైదరాబాదు

పూజ్య గురుదేవులు **వేదిక్ యూనివర్శిటీ** (USA) అధ్యక్షులు డా॥ ఎక్కిరాల వేదవ్యాసగారు రచించిన **“శంబల ప్రభువు”** ఒక అపూర్వమైన తాత్త్విక నవల; “విశ్వశ్రేయః కావ్యం” అన్న సూక్తికి అక్షరాలా తగివున్నది. అన్ని దేశాలవారికీ, అన్ని కాలాలలోనూ అనుసరణీయమైన దివ్యసందేశాన్ని సాహిత్యపరంగా అందిస్తోంది.

ఈ నవలలోని ప్రధానపాత్ర — లామా దోర్జీ భోగ్యాల్

మహాశయుడు జపించే మంత్రం "ఓం మణిపద్మహాం:" ఈ నవలకు నాయకమణి! ఈ మంత్రం ఏదేవుణ్ణీ ఉద్దేశించింది కాదు, ఏదేవుడికైనా వర్తించేది. ప్రత్యేకించి ఏ ఒక్క మతంవారికీ చెందిందికాదు. మతానికి అతీతంగా మానవుడిలోని ఆధ్యాత్మిక శక్తిని వెలిగించేది. అష్టదళపద్మం వంటి హృదయపద్మంలో మణిలా వెలిగే అంతర్యామికొరకై అన్వేషణ — ఈ నవలకు మూలసూత్రం. ఏమతంవారైనా కాదనగలరా ?

ఈ నవల అల్లిన ప్రణాళిక అద్భుతం. విభిన్నదేశాలకు చెందిన వివిధ మతస్థులు ఒక బృందంగా ఏర్పడి ఒక టిబెటియన్ లామాగురువు పర్యవేక్షణలో సాగించిన సాహసయాత్ర — దీనిలోని ప్రధాన ఇతివృత్తం. బాహ్యదృష్టికి ఈ యాత్ర హిమాలయ శిఖరాలలో సాగే యాత్రలాగ వర్ణిస్తూనే, అంతర్లీనంగా ఒక మహాయోగి లోపల జరిగే యోగసాధనా మార్గాన్ని ధ్వనిగా సూచించటం ఈ నవలలో గొప్ప విశేషం. నవలా రూపంలో ఇంతటి ధ్వనికావ్యం శ్రీ అరవిందుని **"సావిత్రి"** తరువాత ఇటీవలి ఆధునిక కాలంలో రాలేదేమో ! ఇంకొక్క విశేషం ! ఏఒక్క మతాన్నీ సమర్థించకుండా — మిగిలిన ఏమతాలవారికీ కోపంరాకుండా భారతీయ ఆధ్యాత్మిక సత్యాన్ని, తత్వాన్ని విశ్లేషించిన రచయిత గడుసుతనాన్ని కూడా ఈ నవలలో చూడగలం !

అన్ని మతగ్రంథాలలోను "సృష్టి-ప్రళయం-ప్రతిసృష్టి"-వర్ణన తప్పనిసరిగా వుంటుంది. ఈ కాలచక్రంయొక్క నిర్మాణమే అన్ని మతగ్రంథాలకీ ప్రాతిపదిక అనుకున్నా, అలా అనటంలో తప్పులేదు — భగవంతుడి కరుణతో సృష్టి — మానవుని అల్పత్వంవల్లా, వారి దుర్మార్గాలవల్లా ప్రళయం — మళ్ళీ ఒక భగవత్ అవతారపురుషుని, కృషితో జరిగే

ప్రతిసృష్టి — **"శంబల-ప్రభువు"** నవలలో ఈ చక్రీయ నిర్మాణాన్నే సూచించారు గురుదేవులు.

ఇది ఒక మహాయోగి ధ్యానంలో పొందిన 'దర్శనం'గా వర్ణించటం ఇంకొక గొప్ప విశేషం. భారతీయ వేదశాస్త్రాలన్నీ ధ్యానమే సృష్టికి మూలమని చెబుతున్నాయి. భూమిమీద జరిగిన సృష్టియొక్క ప్రారంభ దశను ఇందులో గొప్పగా వర్ణించారు.

హిమాలయాలలోని సాహసయాత్రకు ప్రారంభంలోనే వీరికి సిద్ధ పురుషులైన వేదవ్యాసాది మహామునీంద్రుల తేజోరూపదర్శనమౌతుంది. వారినుండి ఆశీర్వాదపూర్వకంగా అక్షతలు లభిస్తాయి. యోగసాధనా మార్గంలో పరమగురువుల ఆశీస్సులు ప్రధానంకదా !

ఇక ఇక్కడినుండి నవల ఉత్కంఠతో ఊపిరి బిగబట్టి చదివించే అద్భుత ప్రపంచంలో నడుస్తుంది. గడగడలాడించే చలితో, నరాలు బిగుసుకుపోతాయేమోనన్నంత భయాందోళనలు — అంతలో అడుగడుగునా అద్భుతాలు, ఆశ్చర్యాలతో లామా గురుదేవుల "రక్ష" — మణిలా మెరిసే మంచుపై ఇంద్రధనుస్సులు సృష్టించే సూర్యకిరణాలు; అద్భుతమైన స్ఫటికపర్వతం — గడ్డకట్టిన మంచునది క్రిందినుంచి నడిచే సొరంగమార్గం — హిమాలయ సానువుల్లో "మంచుకోతి"లా దర్శనమిచ్చిన ఆంజనేయస్వామి — తుఫానులు రాకుండా చేసే హోమాలు, మంచుకొండలమధ్య వేడిగా ఉడుకులెత్తే ఉష్ణగుండాలు; ప్రదక్షిణగా దిగవలసిన మెట్లు — ఆ సోపానమార్గాలకున్న రహస్య ద్వారాలు; గణితశాస్త్రంతోపాటు, జ్యోతిష యోగశాస్త్రములు — అన్నీ

కలబోసి నిర్మించిన కట్టడాలు — ఎట్టకేలకు స్ఫటికపర్వతములోని అంతరంగ మందిర దర్శనం... ఎంతో ఉత్సుకత కలిగించేలా వర్ణించారు డా॥ వేదవ్యాస గురుదేవులు. తరువాత అన్నింటికి నిగూఢ రహస్యాలు వివరించే వివరణలు లామాయోగి భోగ్యాల్ ముఖతః ఇచ్చారు. అది నేను నామాటల్లో వివరించటంకంటే స్వయంగా చదువుకోవటమే బాగుంటుంది — “ప్రకృతి పురుషుల సమ్మేళనానికి ప్రతీకఅయిన శ్రీచక్రమే స్ఫటికపర్వత నిర్మాణం. దాని అంతర్భాగపు మందిరానికి పోయే దారి, యోగపరిభాషలో వెన్నెముకలో దాగిన సుషుమ్నానాడియే — ఆ మార్గంలో పయనించటం అంటే, కుండలినీశక్తి మేల్కొని లేచి, సహస్రారంవైపుగా పయనించటం ! అష్టదళపద్మంవంటి స్ఫటికమందిరమే సహస్రారం ! అక్కడ తేజస్సుతో వెలిగే పరబ్రహ్మను చేరుకున్నాక యోగికి బాహ్యజగత్తుకు సంబంధించిన స్పృహ ఉండదుగనుక యాత్రికులందరూ స్పృహతప్పినట్లు వర్ణన” — మెలకువ వచ్చేసరికి వాళ్ళు మళ్ళీ క్షేమంగా యధాస్థానాల్లో ఉన్నారు !

ఇంకా ప్రపంచమంతా పర్యటించే చింతామణిశిల వర్ణన హృదయానికి హత్తుకునేలా — దానిలో మారే రంగులూ, ఆ రంగులననుసరించి ఆయా దేశాల భవిష్యత్తువర్ణన మరో గొప్ప అద్భుతం! వేదవ్యాసగారు జ్యోతిషపండితులు కూడా కావటంవల్ల ఆయా అంశాలు వచ్చినప్పుడు చక్కగా లెక్కలువేసి, విశదీకరించారు. ఆయన సైంటిస్ట్‌కూడా గనుక, అన్నింటికీ శాస్త్రీయమైన, సైన్సుపరమైన విశ్లేషణ ఇచ్చారు. అలానే “చిరంజీవులు” అంటే భౌతికశరీరం దాచుకొని ఉండేవారు కారని, ఎప్పటికప్పుడు వారి శరీరం అణువులుగా విడిపోయి ప్రకృతిలో చేరి,

మళ్ళీ సంకల్పానుసారంగా అణువులను చేర్చుకొని తేజోరూపం "నిర్మాణ కాయులు" గా శరీరం ధరించేవారనీ, వీరిచ్చిన విశ్లేషణ గొప్పగావుంది.

పిరమిడ్ల నిర్మాణానికీ, స్ఫటికపర్వత నిర్మాణానికీ పోలిక వివరించటం, దానికి గణితశాస్త్రాన్ని ఆధారంచేసుకోవటం, వీరి విద్వత్తును చాటుతోంది. ఇందులోని ప్రకృతి వర్ణనలు ఎంతో అందంగా ఉన్నాయి. మంచుకొండలమీద మారే సూర్యకాంతుల రంగులు; సారంగమార్గాలు; గంగపుట్టిన చోటు (గోముఖ్) మొదలైనవెన్నో కళ్ళకు కట్టినట్టు వర్ణించారు. అక్కడక్కడ చురకలు కూడా వేసారు. "ఈరోజుల్లో దేవాలయాలకు ట్రస్టీలుగా నల్లడబ్బు దాచుకున్నవారిని నియమిస్తున్నారు..." లాంటివి !

ఈ నవల సృష్టి ప్రారంభంతో మొదలయి, ప్రళయపు పొలిమేరల్లో ముగిసింది — గతించిన భూతకాలంనుంచి రాబోయే భవిష్యత్‌కాలం వరకూ — కాలపు కెరటాల మీదుగా సాగిందన్నమాట !

ముగింపు అద్భుతం! అంతర్జాతీయ సంస్థ **'నాసా'** (NASA) వారు **"శంబల ప్రభువు"** ను, కంప్యూటర్ స్క్రీన్‌మీద చూస్తారు. ఎవరీ శంబల ప్రభువు ? — అంటే "ధర్మశరీరుడు" ధర్మమే శరీరంగా గలవాడు — అని వేదవ్యాసగారి వివరణ... "ధర్మం"లో నిలిచే ప్రభువు అన్నమాట ! మరి ఆయన ఎక్కే తెల్లగుఱ్ఱమో ? అన్ని మతగ్రంథాలూ అవతార పురుషుడు తెల్లగుఱ్ఱంపైన వస్తున్నాడని వర్ణిస్తాయే — ఈ తెల్లగుఱ్ఱం ఈ విశ్వంలోని సాత్వికతేజస్సుకీ, సత్యయుగానికీ, ఆత్మతత్వానికి ప్రతీక — అని వివరించారు రచయిత.

భవిష్యత్తులో సత్యస్వరూపుడై, ధర్మశరీరుడై అవతారపురుషుడు వస్తాడన్న ఆశాకిరణంతో ఈ నవల ముగుస్తుంది.

ముందు ముందు మరో నవల "**భవిష్యపురాణం**" రానున్నదట! దానిలో ఎన్ని అద్భుతాలు, ఎన్నెన్ని యోగరహస్యాలు ఉంటాయో, వేచి చూద్దాం!!

'**శంబల-ప్రభువు**' వంటి మహిమాన్వితమైన నవల వ్రాసిన గురుదేవులు డా॥ వేదవ్యాసగారు అభినందనీయులు ! పూజనీయులు !

సి. ఆనందారామం

(డా. సి. ఆనందారామం)

విషయసూచిక

ముందుమాట
28. ధ్యానంలో - కాలం! 325
29. కాలజ్ఞానం 331
30. ప్రపంచంయొక్క బాల్యం 338
31. మానవ- 'సృష్టి' జరిగిందిక్కడే! 350
32. పద్మంలో మణి - స్పటిక పర్వతం! 368
33. 'సిద్ధుల-కొండ' లోపల! 382
34. "నదిక్రింద సోరంగంలో!!" 389
35. గంగ-పుట్టిన "పాద-తీర్థం"! 405
36. మంచుకోతి 412
37. శంబల ప్రభువు! 421
38. "ధర్మ"-శరీరుడు! 432
39. "తెల్ల-గుఞ్జం" - అర్థం! 443
40. శంబల ఎక్కడ! 454
41. 'స్పటిక'-పర్వతంలోకి దారి! 460
42. తుఫానులు రాకుండా - హోమం! 477
43. ప్రపంచం-భవిష్యత్తు తెలిపే-
'నాడీగ్రంథం'! - "పురాణసంహిత!" 484

44. 'శ్వేతద్వీపం' - సిద్ధుల తపోభూమి! 499
45. 'స్పటిక'-పర్వతం! 516
46. శంబల - భవిష్యాలు 528
47. "వజ్ర-శ్రీచక్రం" - మేరువు! 537
48. శంబల - రహస్యం! 545
49. స్పటిక-మందిరం! 554
50. జీవించే - 'నడిచే-శిల' చింతామణి!" 561
51. శ్రీచక్రం - అర్థం! 567
52. అంతర్జాతీయ 'అంతరిక్ష-సంస్థ' "నాసా" - 'శిఖరాగ్ర సమావేశం - II' 575
53. అంతర్జాతీయ సైనిక కూటమి **శ్రీజూడుం** సేన రాకెట్లాంచెర్ తెల్లబూడిదా? 582
54. రానున్నది-"భవిష్యపురాణం"- కల్కిపురాణం! 590

‘మీతో – ఒక మాట !

(రెండవ సంపుటిక)

ప్రాచీనకాలంనుంచీ హిమాలయ పర్వతం — తపస్సుచేసుకునే సిద్ధగురువులకు, మహాఋషులకు, యోగులకూ మహోన్నత తపోభూమిగానూ — అనేక పుణ్యనదులకు పుట్టిల్లుగానూ — వనమూలికలూ దివ్యమైన ఓషధులు, “సోమలత”, ‘జ్యోతిర్లత’, ‘ఋదంతి’ వంటి అనేక మందుమొక్కలు చోటుచేసుకున్న ఒక పరమపవిత్రమైన ఆధ్యాత్మిక కేంద్రంగానూ — ప్రఖ్యాతి పొందింది.

మహర్షి వేదవ్యాసుడు తన ఐదవ-వేదమైన “**మహాభారతం**” లో పాండవాగ్రజుడైన ధర్మరాజు తన శరీరంతోనే స్వర్గాన్ని పొందటం — ఈ హిమాలయాలలోనే సాధ్యపడిందని వర్ణించాడు. అంతేకాదు ! ఆదికవి వాల్మీకిమహర్షి ఆదికావ్యమైన రామాయణంలోనూ, ‘కాళిదాస మహాకవి తన “కుమారసంభవం” కావ్యంలోనూ, హిమాలయాలలోని

“కైలాస పర్వతాన్ని” శివతపోభూమిగా చిత్రిస్తూ, సప్తమహాఋషులు ఆకాశంనుంచి కిందకి దిగి శివదర్శనంచేసి, కుమారసంభవం నిమిత్తం — శివపార్వతుల కళ్యాణంకోసం పెళ్ళిపెద్దలుగా రాయబారాన్ని నిర్వర్తించిన — కళ్యాణవేదికగా వర్ణించడమేగాక — సిద్ధులు, విద్యాధరులు, గంధర్వులు, మహామునులు — దేవతలుకూడా నిత్యమూ సంచరించే దేవతాస్థానంగా వర్ణించాడు !

ప్రపంచానికే ఆత్మవంటిదైన బదరీనారాయణ క్షేత్రం కూడా ఈ హిమగిరిమీదే వెలిసింది ! ఇంకా, రక-రకాల నవరత్నాలు, వెలలేని మణులు, దేవతాత్మలైన సాలగ్రామాలు లభించే పుణ్యక్షేత్రంకూడా ఈ హిమవత్ పర్వతమే !! గంగా, యమునా, బ్రహ్మపుత్ర వంటి పుణ్యనదులు — అనేక పుణ్యక్షేత్రాలని పవిత్రంచేస్తూ ఈ భారతభూమిలోని మానవుల పాపాలను ప్రక్షాళనచేస్తూ ప్రవహిస్తూ వున్నాయి !

ఇంతలోకే ‘**కలియుగం**’ ప్రారంభమైంది ! మానవులు చేసే పాపాలకూ, ఘోరాలకు, నేరాలకు, హింసలకూ అంతులేకుండాపోయింది! గోహత్య, బ్రహ్మహత్య, శిశుహత్య, స్త్రీహత్యలవంటి మహాపాతకాలు ఎన్నో లెక్కలేకుండా చేయడంవల్ల పాపములు, పాతకములు, మహాపాతకములు పేరుకుపోయి ఏపుణ్యనదులుకూడా ఈ పాపాలను కడిగివెయ్యలేక తామే కలుషితమైపోయే ఘోరమైన దుస్థితి ఇప్పటి — ఈ “**కలియుగం**”-చివరలో ఏర్పడింది !

ఫలితంగా హిమాలయాలు, పుణ్యక్షేత్రాలు, పుణ్యనదులూ తమ మహిమలనుకూడా కోల్పోయాయి ! దేవతలు — చాలాకాలంనుంచీ వారు నివాసంచేస్తూవున్న దేవాలయాలను విడిచిపెట్టి మాయమైపోయే

దుస్థితికూడా ఏర్పడింది !

ఫలితంగా సద్గురువులు, మహాత్ములు, యోగులు కూడా ఈ దేవాలయాలకు దూరంగా వుండవలసివచ్చింది. ఇదే అదనుగా భావించిన రాజకీయనాయకులు, నేరస్థులు, హంతకులు, గూండాలు — తమ డబ్బు సంపాదనకోసం ఆలయాలను వ్యాపారకేంద్రాలుగా మార్చి — విలాసపురుషులూ, సినిమావాళ్ళూ, నల్ల-డబ్బు సంపాదించినవారికి ఆలయాలను అధికారకేంద్రాలుగా తయారుచేసుకున్నారు !

ఈవిధంగా — **"కలియుగం"** చివరికి వొచ్చేసరికి ఈభూమ్మీద **'ధర్మానికే'** నిలువ నీడకూడా లేకుండాపోయింది !!! కలియుగం 5000 సంవత్సరాలు దాటిన మన మానవలోకం దీనస్థితి — ఇది !

ప్రపంచంలో ధర్మం నశించి, అధర్మం పెచ్చుపెరిగినపుడూ, అన్యాయం, హింసా, దుర్మార్గం పెచ్చుపెరిగిపోయి — అమాయకులను, బీదవారినీ, స్త్రీలనూ, పిల్లలను, అహింసగా జీవిస్తూ తపస్సుచేసుకునేవారికి, నిలవనీడ లేకుండా చేసి హింసించినపుడూ — ధర్మాన్ని రక్షించడానికి, సాధువులనూ కాపాడడానికీ భగవంతుడు ఈ ప్రపంచంలోకి అవతరిస్తాడని వేదాలు, పురాణాలు, శాస్త్రాలు ఘోషిస్తున్నాయి ! శ్రీకృష్ణభగవానుడే **'భగవద్గీత'**-లో —

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే !"

అంటూ తానే స్వయంగా ధర్మసంస్థాపనకోసం సాధువుల పరిరక్షణం కోసం యుగ యుగానికీ, అవతరిస్తానని వాగ్దానం చేశాడు ! ఇలా

భగవంతుడే కాకుండా అనేకమంది "కారణ-జన్ములు", సిద్ధ పురుషులు, యోగులు, "పరమ-గురువులు" కూడా ఈ "కలియుగం"-చివర వచ్చే "యుగసంధిలో అవతరించారు ! ఆప్రకారమే భగవంతుడు మాట ఇచ్చినట్టుగానే ఈ ప్రపంచంలోకి ఇప్పటికీ మళ్లీ అవతరిస్తూ వున్నారు !

ఈ పరిస్థితిలో పందొమ్మిదవ శతాబ్దం చివరిలో సుప్రసిద్ధ రష్యన్ యోగిని మేడమ్ బ్లావెట్స్కీ అనే కారణజన్మురాలు రష్యాలోని రాజకుటుంబంలో జన్మించింది. ఆమెకు చిన్నతనం నుంచి సంసారజీవితం అన్నా, రాజరికపు దర్బారు హోదాలన్నా విరక్తిగా వుండేది. తన "పరమ-గురువులు" ఎక్కడో దూరంగా తూర్పుదేశాలలో వున్నారని వారినిచేరు కోవటమే తన జీవిత-లక్ష్యమనీ తపించేది.

బంధుమిత్రులు, కుటుంబంలోని పెద్దలు ఈమెకు పెళ్ళిచేయాల ఎంత ప్రయత్నించినా పెళ్ళి అన్నా సంసారిక జీవితంఅన్నా ఆమె విముఖంగా వుండేది ! చివరికి బలవంతాన చేసిన పెళ్ళికూడా అట్టేకాల నిలవలేదు. భర్త చిన్నప్పుడే మరణించగా బ్లావెట్స్కీ కట్టుదిట్టమై రష్యన్ కోటగోడలు దాటి తప్పించుకుని మగాడివేషంలో — త "పరమ-గురువు"ల కోసం బయలుదేరింది.

అలా ఎక్కడినుంచో తనని దూరాన్నించే పిలుస్తున్న **'ఆధ్యాత్మి కేంద్రం'** నుంచి సిద్ధగురువుల పిలుపును అనుసరిస్తూ ఆమె ప్రపంచ లోని అనేక ప్రాచీన ఆధ్యాత్మికవిద్యలు సాంప్రదాయంగావున్న — ఈజిప్టు, స్కాట్‌ల్యాండ్, మంగోలియా, "గోబీ-ఎడారి" దాటి —

హిమాలయపర్వతాలను చేరుకుంది. తళతళమని వెండికొండలాగ మెరిసే హిమవత్ పర్వత శిఖరాలను చూడగానే తాను వెళ్ళవలసిన గమ్యం ఇదేనని బ్లావెట్స్కీ అప్పుడే నిర్ణయించుకుంది.

ఆతరువాత అయిదు సంవత్సరాలు ఆమె బయట ప్రపంచానికి కనిపించకుండా మాయమై టిబెట్‌లోని రహస్య ఆధ్యాత్మిక కేంద్రంలో, తన గురువులవద్ద శిష్య శిక్షణ పొందింది. యోగం, మంత్రశాస్త్రం, తాంత్రికసిద్ధులు అనేకం ఆమెకు గురుదేవులు “శక్తిపాతం” ద్వారా ధారపోసి అనుగ్రహించారు. ఫలితంగా ఆమెకు ఎన్నో “యోగసిద్ధులు” లభించాయి. శరీరం విడిచి దూరంగా ప్రయాణించటం ఎదుటివారి మనస్సులోని ఆలోచనలను చదివేయటం మాత్రమేకాక వారి ఆలోచనలను మార్చి అతితక్కువ కాలంలో ఆధ్యాత్మిక సాధనకు అందని ఎత్తులపైకి తీసుకువెళ్ళడం వంటి “యోగ-సిద్ధులు” పొందింది.

ఆతరువాత ప్రపంచంలో పెరిగిపోయిన నాస్తికత్వం, స్వార్థం, హింస, భౌతికవాదం (Materialism) పేరుకుపోయిన **"కలియుగం"**ని పటాపంచలుచేసే నూతన ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని అందించటంకోసం తన గురువుల ఆదేశంతో తిరిగి యూరప్‌లో అడుగుపెట్టింది.

ఆమె ఇంగ్లండు, అమెరికా, జర్మనీ వంటి దేశాలు పర్యటించి ప్రపంచ ప్రసిద్ధిపొందిన సైంటిస్టులను కలుసుకొని — సైన్సుకందని తన దివ్యశక్తులతో యోగసిద్ధులతో సైన్సు-ప్రపంచాన్ని తల్లకిందులు చేసింది.

“సైన్సు” శాశ్వతసత్యమని నమ్మే — పదార్థం అణువులు,

పరమాణువులు (Atoms & Molecules) నశింపుకాని శాశ్వత యదార్థాలని నమ్మే "మూఢ-విశ్వాసాన్ని" భగ్నంచేసింది. సైంటిస్టులు పరీక్షించి ఇచ్చిన పాదరసాన్ని తనచేతిలో కొన్ని నిమిషాలు పట్టుకుని బంగారంగా మార్చి వేసింది ! గాలిలో చేతులు ఊపి కంటికి కనిపించని గాలిలోని అణువుల నుంచి వెండి, బంగారం సృష్టించేది ! ఇలా త్రుటిలో గరిటెలు, స్పూనులు, ఫోర్కులు క్షణాలమీద సృష్టించి అందరినీ ఆశ్చర్యపరిచింది!

సైన్సు చెప్పే పదార్థసిద్ధాంతం (Materialism) కేవలం ఒక మూఢ విశ్వాసమేనని — పదార్థం శక్తినుండి సృష్టించబడిందని — పదార్థము, శక్తి ఒకే ఆధ్యాత్మిక తేజస్సుయొక్క రెండు రూపాలని ఋజువుచేసింది. ఆధునిక సైన్సులైన కెమిస్ట్రీ (Chemistry), ఫిజిక్సు, బయాలజీ (జీవ శాస్త్రము) లోని మూలసిద్ధాంతాలను మార్చుకోవలసిన పరిస్థితి ప్రపంచ సైంటిస్టులకు కలిగించింది. 1897 చివర్లో ఆమె చూపిన సైన్సుకందని సిద్ధాంతాలు అర్థ శతాబ్దం తరువాత అణువులను బద్ధలుకొట్టి ఆటం బాంబును సృష్టించిన ఐన్‌స్టీన్ (Einstein) సిద్ధాంతాలను ఆమె తన పరమగురువుల జ్ఞానంతో ముందే ఋజువుచేసి సైన్స్ చరిత్రలోనే ఒక కొత్త యుగాన్ని ఆరంభించింది మేడమ్ బ్లావెట్స్కీ.

ఆతరువాత ఆమె ముసలితనంలో భోగము (Sex), డబ్బు, రాజకీయాల పిచ్చిలోపడ్డ — విదేశాలను వొదిలిపెట్టి పవిత్రమైన భారత దేశంలో మరణించాలని మద్రాసులో వచ్చి స్థిరపడ్డది. అక్కడే అడయార్‌లో వంద ఎకరాల భూమి అరణ్యంగా వున్నది సేకరించి — ఒక ఆశ్రమం తపోకేంద్రంగా ప్రారంభించింది బ్లావెట్స్కీ !

తన జీవితం చివరిదశలో ఆమె తన అనుభవాలను, హిమాలయా

లలో తాను దర్శించిన సిద్ధగురువులను వారి దివ్యజ్ఞానాన్ని తన రచనల ద్వారా ప్రపంచానికి అందించింది. — **The Secret Doctrine** (రహస్యజ్ఞానం) — **"భారతదేశంలోని కొండలు, గుహలు, దేవాలయాలు"** **(Caves, Temples and Legends of Hindustan)** అన్న రచనల ద్వారా ఎన్నో వింతలు బయటప్రపంచానికి ఆశ్చర్యపరిచేవి అందించారు.

ప్రపంచానికి త్వరలోనే **"కలియుగం"**-అంతం అయి **'సత్యయుగం'** ప్రారంభిస్తుందని దానికి మొదటిసందేశాన్ని తెచ్చే దూతగా **పరమ గురువులు** తనని పశ్చిమదేశాలకు పంపించారని తెలియజేసింది. ఆమె రచనలలో ప్రచురణ కాకుండావున్న రహస్యపత్రాలలో **"శంబల"** గురించీ, శంబలకుపోయే మార్గంగురించీ **కలియుగాంతం** చివరలో వచ్చే ప్రపంచానికి అంతటికీ ప్రభువు **(The Lord of the World)** త్వరలో రాగలడని ఖండితంగా తెలియజేసింది.

అంతేకాదు తనకు తెలిసిన **'బ్రహ్మజ్ఞానం'** అంతటినీ ఆనాటి గుడ్డి భౌతికవాదం నమ్మే యూరప్, అమెరికా వంటి స్వార్థంలో మునిగే దేశాలు జీర్ణించుకోలేవనీ — దానికి ఇంకా 20-వ శతాబ్దంలోగా రాగల పరమ గురువులు కారణజన్ములూ మార్చివేస్తారనికూడా ఆమె తెలిపింది. అందులో ఒక్కరు తాను పుట్టిన రష్యానుంచే వస్తారని స్పష్టంగా చెప్పింది.

జరిగిందికూడా అదే ! బ్లావెట్స్కీ (Blavatsky) తరువాత జార్జీ గుర్జీఫ్ (Georgi Gurdjieff) అనే సద్గురువు రష్యాలో కొండప్రాంతమైన జార్జియా రాష్ట్రంలో చదువులేని గొర్రెలకాపరులమధ్య జన్మించాడు ! ప్రపంచంలో అనేక భాషలు, అనేక మతాలగురించి, అనేక దేశాలను గురించి ఎవరికీ తెలియని వింతలూ విశేషాలు ఆశ్చర్యంగా చెప్పేవాడు.

ఆయన 16-భాషలు అనర్గళంగా మాట్లాడేవాడు. నిండు 89 ఏళ్ళు జీవించిన గుర్జీఫ్ మహాశయుడు లండన్‌లోను, ప్యారిస్‌లోనూ, రష్యాలోను పర్యటించి ఆశ్రమాలు నెలకొల్పి అనేకమంది సైంటిస్టులను, ఇంగ్లీషు నవలా రచయిత్రులను, రాజకీయనాయకులను ఒకచోట కలిపి, ప్రభావితంచేశాడు. అందులో కొందరు ఆయన ఆశ్రమంలో శిక్షణకూడా పొందారు.

ఇలా గుర్జీఫ్ ద్వారా ప్రభావితం చేయబడ్డవారిలో అప్పటి బ్రిటీషు ప్రధానమంత్రి చర్చిల్, రష్యా నియంత స్టాలిన్, 13-వ దలైలామా, **క్యాథరీన్ మ్యాన్స్‌ఫీల్డు (Catherene Mansfield)** వంటి ఇంకా ఎందరో బ్రిటీషు, అమెరికన్ మేధావులు — గుర్జీఫ్ శిష్యులలో కనిపిస్తారు. ప్రఖ్యాత అల్లోపతి వైద్యుడు డాక్టర్ **కెన్నెత్‌వాకర్ (Kenneth Walker)** ఇంగ్లీషు రచయిత **"సామర్సెట్-మామ్"**-వంటివారు అందులో కొందరు మాత్రమే.

సరిగ్గా భగవాన్ శ్రీ రమణమహర్షి సమకాలికుడు గుర్జీఫ్ ! అలానే, ఇంకా ఎందరో మహాత్ములుకూడా ఈమధ్యలో అవతరించారు. అలాంటి వారిలో శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, అనిబీసెంటు, సోదరి నివేదిత, స్వామిరామతీర్థ, దయానంద సరస్వతి — ఆ '**యుగ సంధి**'లో అవతరించిన నక్షత్రాలు, కలియుగం చీకటిని కాంతిమయం చేశాయి.

బ్లావెట్స్కీ తన చివరికాలంలో తన పరమగురువులలో ఒకరు దక్షిణభారతదేశంలో తెలుగు బ్రాహ్మణ శరీరంలో అవతరించారని — ఆయన రానున్న కుంభయుగంలో (Aquarian Age) యుగసంధికి

రానున్న కొత్తయుగానికి ధృవనక్షత్రంవంటివారని రాసింది ! సరిగ్గా అలానే తమిళనాడులో కుంభకోణంలో **మాస్టరు–C.V.V.** పరమగురువు అవతరించారు !! పరమాశ్చర్యం ఏమిటంటే ఒక మనిషే రెండు శరీరాలను ధరించినట్లు పోలివుంటే రష్యన్ సిద్ధగురువు గుర్జీఫ్ తెలుగు బ్రాహ్మణులైన మాస్టరు-C.V.V. ఒకరికొక్కరు "ఫోటో-కాపీ"ల లాగ కనిపిస్తారు. అలాగే వీరి సిద్ధాంతాలు కూడా !

కనబడే ఈ బ్రహ్మాండానికి చిన్నసైజు కాపీవంటి ప్రతిరూపమే, మానవశరీరం అనీ శరీరంలో గ్రహాలు, కర్మలు జయించటం — పది సంవత్సరాలలో జన్మరాహిత్యం వంటివి మాస్టరు C.V.V. గారి ముఖ్యమైన సిద్ధాంతాలు ! ఇంగ్లీషులో మంత్రాలను దర్శించి వాటితో — మరణించిన 80 ఏళ్ల ముసలమ్మను — ఆమె మరణించిన మూడోరోజున బ్రతికించి — ఇంకా అనేకమైన మహిమలను చూపించి మాస్టరు C.V.V. 60-వ ఏట తన శరీరాన్ని విడిచిపెట్టారు.

తనకు పైలోకాలలో వేరే పనివుందనీ — నూరేళ్ళలోపుగా తిరిగి వస్తానని ఈలోపుగా భూగోళం ఉత్తర, దక్షిణ ధ్రువాలు ఏటవాలుగా వొంగి వంకరగా వున్నాయని — వాటిని సరిచేస్తానని చెప్పారు. అప్పుడు భూమిమీద సునామీలు, భూకంపాలు ఏర్పడగలవని — ఇవి రానున్న నూతన "**సత్యయుగా**"నికి ప్రారంభసూచికలు కాగలవని మాస్టరుగారు తన డైరీలలో గుప్తరచనలుగా మనకోసం విడిచిపెట్టి వెళ్ళారు.

తమ శిష్యవర్గం వారిలో ప్రియశిష్యులు బ్రహ్మశ్రీ **వేటూరి ప్రభాకర శాస్త్రి**గారు మాస్టరుగారి **"నూతన-యోగం"** ద్వారా — ఎన్నో అసాధ్యమని డాక్టర్లు విడిచిపెట్టిన రోగాలను — నిముషాల్లో నయంచేశారు !

మాస్టర్ C.V.V. ప్రపంచానికి ఇచ్చిన ఈ "నూతన-యోగం"లో

అనేక ఆశ్చర్యకరమైన విషయాలు కనిపిస్తాయి. అందులో మొదటిది ఈ మానవశరీరం బయట కనిపించే విశాల విశ్వానికి చిన్నసైజు ప్రతిరూపం అన్నవిషయం ! అందుకనే, బైటి విశ్వంలో జరిగే మార్పులన్నీ ఆకాశంలో ఎగిరే పక్షుల ప్రతిబింబం — చెరువులో కనిపించినట్టు మనిషి శరీరం మీద ప్రతిబింబిస్తాయి ! ఈ విశాలవిశ్వం ఒక గడియారం వంటిదైతే మనలోని 'విశ్వం' చేతికి పెట్టుకునే 'రిస్టు-వాచీ' వంటిది ! రెండిటిలోనూ 'టైము' — ఒకటే. సైజుమాత్రమే తేడా !

ఒకటి నాలుగురోడ్లూ కలిసిన ట్రాఫిక్ సెంటర్‌లో వున్న **"టవర్-క్లాక్"** వంటిదైతే మనలోని బ్రహ్మాండం చిన్నసైజు గడియారంవంటిది ! అందుకని సిద్ధపురుషుల శరీరంలోని 'యోగ-కేంద్రాలు' బయట విశ్వంలోని సూర్యుడు గ్రహాలలాగే పనిచేస్తాయి.

దీనివల్ల 'మాస్టర్-యోగం' ప్రకారం మానవశరీరంలోని **"యోగ-చక్రాలు"** ఏడూ — ఏడువారాలకు అధిపతులైన సూర్యునినుంచీ శని వరకూ వారాధిపతులైన — **ఏడుగ్రహాలు** ! ఇవి **"మాస్టరు C.V.V."** అనే గ్రంథంలో ఇంకా వివరంగా చూడవచ్చు.

ఇంద్రధనుస్సులోని ఏడురంగుల వలే పరమాత్మ యొక్క ఏడు రకాల కిరణాలద్వారా దిగివచ్చిన 'పరమ-గురువులే' — "సప్త-మహర్షులు"గా మొదటి **కృతయుగంలో** మానవజాతికి వేదాలూ, సైన్సులూ, యోగశాస్త్రము, మంత్రశాస్త్రము అన్నిటినీ కలిపే **'ఆత్మవిద్య'** ద్వారా బ్రహ్మజ్ఞానమూ — ఇవన్నీ జంతుదశలోని మనిషికి రుచిచూపించారు ! ఆతర్వాత క్రమంగా మానవజాతి ఇప్పటికి అంతరిక్షయుగంవరకూ ఎదిగి ఇతర గ్రహాలమీద కాలుపెట్టేదాకా వచ్చింది !

ఇప్పుడు రాబోయేది ఒక **"కొత్త-యుగం"** లేక "కుంభయుగం !"

అందుకే కుంభరాశితో సంబంధించిన పరమగురువుగా మాస్టర్-CVV ధనిష్ఠా నక్షత్రంలో అవతరించడం జరిగింది ! దీనికి నిదర్శనంగా అన్నీ ఒకే పేరుతో — “కుంభకోణం”లో “కుంభరాశి” లో జన్మించిన మాస్టర్-CVV అవతారం “కుంభసంభవుడై”న అగస్త్యుని అనుగ్రహంవల్ల “కుంభమాసం”లో — ఆవిష్కారంకావడమే ఆశ్చర్యకరమైన సన్నివేశం ! ప్రపంచంలో కుంభరాశికి సంబంధించిన రష్యాలో పుట్టిన సద్గురువులే — **మేడమ్-బ్లావెట్స్కి**, ‘గుర్జీఫ్’, “ఔస్పెన్స్కీ”ల గురుపరంపరగా రావడంలో విశ్వాత్మయొక్క సంకల్పమిదే !

ఇంగ్లీషులో మంత్రాలు — కేవలం మూడుసార్లు ఉచ్చరించడంతోనే మనిషి పూర్వజన్మ కర్మలన్నీ నశించి — పదిసంవత్సరాలలోనే మోక్షం సిద్ధించే **వాగ్దానం** అభయంగా ఇచ్చారు మాస్టర్ CVV. ఈ పరంపరలోని వారైన వేటూరి ప్రభాకరశాస్త్రిగారి **“ప్రజ్ఞా-ప్రభాకరం”** అన్న గ్రంథంలో మాస్టరుగారి దివ్యానుగ్రహంతో చేసిన అనేక మహిమలు రోగనివారణ వంటివి నేటికీ చూడచ్చు !

II

భగవంతుని అవతారాలు పది ! **దశావతారాలు** అనబడే వీటిలో (1) మత్స్యావతారం, (2) కూర్మావతారం, (3) వరాహావతారం, (4) నారసింహావతారం, (5) వామనావతారం, (6) పరశురామావతారం, (7) రామావతారం, (8) శ్రీకృష్ణావతారం — గడిచిపోయాయి ! ఈ కలియుగంలో ధర్మచక్రాన్ని తిరిగి ప్రవర్తింపచేసిన **“ధర్మచక్ర ప్రవర్తకుడు”** శాస్తగా **బుద్ధదేవుని** రూపంలో భగవంతుడి (9) తొమ్మిదవ అవతారంకూడా 3000

సంవత్సరాలక్రితమే — మన భారతదేశంలో అవతరించడం కూడా జరిగింది !

ఇలా వొచ్చే దశావతారాల్లో తొమ్మిది అవతారాలూ భగవంతుడిచ్చిన వాగ్ధానం ప్రకారం అవతరించడం జరిగినట్టుగానే — భగవంతుడి దశావతారాల్లో ఆఖరుదైన — **పదవ** అవతారంకూడా ఈ కలియుగం చివరలో **"కల్కి-భగవానుడి"**గా శంబల అనే మణిద్వీపంలో అవతరిస్తాడని వేదవ్యాస మహర్షి భాగవతంలోనూ, మహాభారతంలోనూ వర్ణించడమేకాక — ఈ **"శంబల-ప్రభువు"** అవతారంలో జరిగే భగవత్ లీలలు, మహిమలు, ధర్మసంస్థాపనా మహాయజ్ఞం ఎలా జరుగుతుందోకూడా సంగ్రహంగా వర్ణించాడు ! రానున్న ఈ పదవ అవతారం అవతరించే పవిత్రమైన పుణ్యక్షేత్రమే ఈ — **'శంబల !'**

అయితే ఈ **"శంబల"** ఎక్కడవున్నదీ ఎవరికీ నిర్ధారణగా తెలియదు ! అది ఒక దేవరహస్యం ! అంటే సిద్ధగురువులు భగవంతుని అవతారం వచ్చినపుడు రామావతారంలో వశిష్ఠ, విశ్వామిత్ర, అగస్త్య మునులలాగా మళ్లీ — అలానే కృష్ణావతారంలో నారద, వేదవ్యాస, ధౌమ్య, మైత్రేయ మహర్షులలా — రానున్న శంబలప్రభువు అవతారంకోసం చిరంజీవులుగా ఇంకా ఈ భూమిమీదే జీవిస్తున్న మహర్షులు — ఈ అవతార రహస్యాన్ని **జాగ్రత్తగా కాపాడుతున్నారు** — దుర్మార్గులకు, స్వార్థపరులకూ అందకుండా !

ఈ శంబల హిమాలయాలలో **'స్పటిక పర్వతం'** వద్ద మంచు కొండలు గుండ్రంగా తామరపూవు రేకులవలే నెలకొన్న లోయలో నది మధ్యనగా — పద్మంలో మణిలాగా వున్నదని రహస్య నాడీగ్రంథాలలోను ఇంకా **భవిష్యపురాణం**, **కల్కిపురాణం**, **భవిష్యోత్తర** పురాణాలలోనూ

నిగూఢంగా చెప్పబడివున్నది !

విదేశీయులైన జర్మన్, రష్యన్, బ్రిటీష్ పరిశోధకులు ఈ శంబలను అన్వేషించి అది, ఎక్కడవున్నదో స్వయంగా చూడాలని 1903-1909 లో హిమాలయాల్లో చేపట్టిన సాహసయాత్రయొక్క గాధయొక్క — మొదటి భాగం దీనికిముందరి ఒకటో-సంపుటంలో అందించాను ! అందులో — హిమాలయాలలో శంబలకోసం పరిశోధించే బృందం ఎలా ఏర్పడిందో వారందరూ **"స్పటిక–పర్వతం"** ఎక్కడవుందో కనిపెట్టాలని **'మణిపద్మహం'** అన్న మంత్రంయొక్క రహస్యార్థంలో — పద్మంలాగా వున్న పర్వత శిఖరాలమధ్య 'మణి' అంటే — స్పటికంతో చేసిన శ్రీచక్రం మధ్యగా ఈ స్పటిక మందిరం ఏర్పడివున్నదని టిబెటన్‌లామా తెలియచేసిన రహస్యంవల్ల తెలుసుకుని దానికోసమని ప్రయాణం మొదలుపెట్టి సగం వరకూ పూర్తిచేశారు !

మంచుతో గడ్డకట్టుకొని వున్నది — ఓ నది అడుగున సొరంగం! అందులోంచి ప్రయాణిస్తే చేరుకునేది, **"సిద్ధగురువుల–తపోభూమి"** ఆపైన పరమగురువుల అనుగ్రహంకలవారికి మాత్రమే కనిపించే "శంబలకు పోయే దారి" ఈ సాహసయాత్రికులకు — తలదువ్వుకుంటే మధ్యగా పాపిట ఏర్పడినట్టుగా మార్గం దొరికింది ! ఆతర్వాత ఎన్నో ఆశ్చర్యాలూ, కలియుగం మొదటినుంచీ జీవించివున్న వేదవ్యాసమహర్షివంటి సిద్ధ మునుల దర్శనమూ, ఆంజనేయప్రభువు సాక్షాత్కారం వంటివి ముందుగా చెప్పటంకన్నా — జరిగింది జరిగినట్టు యధాతధంగా ఈ **రెండవ సంపుటంలో** మీకు అందిస్తున్నాను !

III

ప్రతి మనిషీ ఒక జన్మరాశిలో పుట్టినట్టే ప్రపంచంలో ప్రతి భూఖండమూ ఆకాశంలో దానిపైన వెలిగే “రాశి”కి సంబంధించి – ప్రపంచ చరిత్రలో దాని పాత్రను అది నిర్వహిస్తుంది !

రష్యాతోపాటు టిబెట్ కాశ్మీర్‌నుంచి ‘గోబీ-ఎడారి’ వరకూ గల **‘కుంభరాశి’**లో చేర్చబడ్డ దేశాలు వుండే మంచుపర్వతాల మధ్యనే **“శంబల”** కూడా వున్నది ! ఈ శంబల ప్రపంచానికే ఆధ్యాత్మిక కేంద్రం ! ఈ కేంద్రానికి బాహ్యంగా బైటకనిపించే చిహ్నం — మంచుకొండలమధ్య స్పటికంతో వున్న **‘స్పటిక-పర్వతం’** — ప్రత్యక్ష సాక్షి !

ఈ స్పటిక పర్వతంలో రహస్యంగా నిక్షేపించివున్న “స్పటిక-మందిరం” యొక్క ప్రతిరూపమే ఆదిశంకరులనుండీ అందరు శంకర పీఠాధిపతులూ పూజించే **“స్పటిక-శ్రీచక్రం”** !

ఈ **‘స్పటిక-మందిరం’** కోసం అన్వేషణ కథయే ఇది ! ఇందులోని పాత్రలు కల్పితాలేకాని — వారి వెనుక యదార్థమైన శాస్త్రరహస్యాలు సైన్సు విశేషాలు, యోగరహస్యాలు రంగురంగుల పూలమాలలాగా కట్టి ప్రతివారూ చదువుకునేలా ఆసక్తికోసం నవలారూపంలో పాఠకలోకానికి అందించడం జరిగింది !

దీనిని కేవలం కథలాగా కాకుండా రానున్న పదవ అవతారం అయిన శంబల ప్రభువుయొక్క అవతార రహస్యానికి సంబంధించిన దేవరహస్యంగా గ్రహిస్తారని ఆశిస్తూ — అనేక అమూల్య రహస్యాలు పాఠకుల ముందుంచుతున్నాను !

దీనివల్ల ప్రపంచానికి ఇంకొక ఉపయోగం కూడా జరగాలని కోరుతున్నాను ! అదేమిటంటే — ప్రపంచంలో రానున్న ఈ అవతార మూర్తికోసం ఎంతోమంది భక్తులు ఎదురుచూస్తున్నారని — తెలిసి, అమాయకులను విశ్వాసంగల మంచివారిని దోపిడీచేస్తూ డబ్బు దండుకోవాలనే "మేమే కల్కిభగవానులం !" అంటూ తయారైన దొంగలు, అనేకమంది — అరెస్టుకావటం — చివరికి పోలీసు బందీలుగా మనం రోజూ చూసే T.V. న్యూస్ మీడియాలో కనిపించే సత్యం !

ఇలాంటి మోసగాళ్లకు తెలియని రహస్యం ఒకటి వుంది ! — అదేమిటంటే **'శంబల ప్రభువు' "కల్కిభగవాను"డి అవతారం ఇక్కడ మన జిల్లాలలో, ఈ మైదానాల్లో ఎక్కడా పుట్టడం అనేది — జరగనే జరగదు !** ఆయన అవతరించేది కేవలం హిమాలయ పర్వతాలలోని, గాఢమైన మంచుకవతల 'స్పటిక-పర్వతం' అవతల ఉత్తరంగావున్న — **శంబలలోనే** !

ఇది చాలామందికి తెలియక — ప్రచారం చేసుకునే ప్రతీ వేషధారినీ నమ్మి — వేలు లక్షలు గుమ్మరించి పరువు మాన-ధనములను పోగొట్టుకొనే స్త్రీలకు ఆత్మీయులకూ, — ఇలాంటి అన్యాయం చేసేవారిని ఆశ్రయించే ప్రమాదం లేకుండా... **అసలు నిజమైన శంబల ప్రభువుయొక్క అవతారం గురించి** విదేశీయులు చేసిన హిమాలయ పరిశోధనలో వెల్లడైన రహస్యాలు తెలియపర్చడంవల్ల — ఇకముందు **ఇలాంటి దొంగవేధవ లను ఎవ్వరూ నమ్మకూడదని** — భగవంతుని నిజమైన అవతారంయొక్క లక్షణాలు, అవతరించే పుణ్యభూమిలోని మహిమలూ — అన్నీ ఇందులో ప్రత్యేకించి పొందుపరిచాను!

వీటిని **పరిశోధనాదృష్టితో** గమనికగా చదివి, అసలు భగవంతుని అవతారానికి నకిలీలకు తేడా గుర్తుంచుకోవడానికి — ఇది ఉపయోగ పడాలని మాత్రమే ఈ రహస్యాలను మీకు అందిస్తున్నాను !

ఇందులో నా పాత్ర నిమిత్తమాత్రమే ! కధ రాయడంలో కాగితమూ పెన్నూలాగే — నాశరీరాన్నీ మనస్సునూ ఒక పనిముట్టుగా వాడుకున్నాను ! **"శంబల-శక్తి"** యొక్క పరమానుగ్రహయే ఈ కధను నడిపించింది !

"పలికెడిది భాగవతమట !
పలికించెడివాడు రామభద్రుడట !!
అది నే పలికిన భవహరమగునట
... ..."

— అంటూ దీన్ని మీకు ఒక **పూజాపుష్పంగా** అందిస్తున్నాను భగవత్ సమర్పణగా !!

అనేక మంగళాశాసనములతో

ఇట్లు,

మీ

డా. వేదవ్యాస IAS, Ph.D., D. Litt


SPIRIT,
OR ETHER
BREATH,
OR AIR
FIRE OF
ENDEAVOUR
WATER
STEPS OF ATTAINMENT
LIFE ON EARTH

28

ధ్యానంలో - కాలం !

ఆరోజుల్లో నేను మా గురుదేవులు తాషీలామాగారి ఆశ్రమంలో విద్యార్థిగా శిక్షణ పొందుతున్నాను. అప్పటికింకా నాకు ఇరవై ఇరవైఐదు ఏళ్ళ మధ్యవయస్సు ! నాకు ధ్యానంలో శిక్షణపొందాలని ఎంతో కోరికగా వుండేది. ఒకరోజున నాకు యోగం, ధ్యానం గురించి బోధించే టీచర్ లామా వంటి బోధనాగురువును ఇలా అడిగాను.

“గురుదేవా ! ధ్యానంలో మనం కాలంలో వెనక్కివెళ్ళి గతించిపోయిన ప్రపంచ చరిత్రను తెలుసుకోవచ్చా ?” ఈ మంచుకొండలపైన ఎత్తుగా ఎదిగిన మన టిబెట్ పీఠభూమి — ఈ భూమ్మీద ఇలా ఏర్పడి ఎంత

కాలమయ్యింది ? అంతకుపూర్వము టిబెట్ ఎలావుండేది? ఈ భూగోళం మీద చాలా మార్పులు జరిగాయని మన పురాణాలు టిబెటన్ ప్రాచీన గ్రంథాలలోనూ వర్ణించబడివున్నాయికదా ! నాకు దాన్ని ప్రత్యక్షంగా చూడాలని ఎంతో కుతూహలంగా వుంది" అంటూ ప్రశ్నించాను.

దానికి మాగురుదేవులు నావంక తీవ్రంగా దృష్టిని కేంద్రీకరించి చూస్తూ — నా గతజన్మను చదివేస్తున్నట్టుగా నన్ను పరిశీలిస్తూ — ఇలా అన్నారు. "అబ్బాయి ! నువ్వింకా గురుకులంలో ఛాత్రనివాసంలో వుంటున్న విద్యార్థివే ! కాని, నువ్వు అడిగే విషయాలుమాత్రం చాలా పెద్దవిషయాలు ! మన శాస్త్రాల్లోని దేవరహస్యాలు !! ఇలా ఎందుకు అడుగుతున్నావా ? అని నేను నీ గతజన్మను పరిశీలించాను — నీ పూర్వజన్మ దృశ్యాలు ! బొమ్మలుగా కనిపించాయి అవి చూసి గతజన్మలో నీ సంస్కారాలే నీకీ విషయాలను గురించి ఆసక్తిని ప్రేరేపిస్తున్నాయని గమనించాను. అందుకే నీకు చెప్తాను శ్రద్ధగా విను."

"ఈ ప్రపంచంలో జరిగే ప్రతి సంఘటనా కాంతి చిత్రాల రూపంలో బొమ్మలలాగ ఆకాశంమీద ముద్రించబడివుంటుంది. దానినే — మన టిబెటన్ యోగపరిభాషలో **'ఆకాశ చరిత్ర' (Akasic Record)** అంటారు! నీ మనస్సును గనక శుభ్రంచేసి నీ సొంత ఆలోచనలు అడ్డంపడకుండా చూసుకోగలిగితే ఈ గుహలో కూర్చుని — లక్షల సంవత్సరాలక్రితం జరిగిన విషయాల్ని ఈ కొండగుహ గోడలమీద పురాతనమైన శిలలమీద ముద్రించినట్టు ఎలా రికార్డు కాబడివుంటాయో ప్రత్యక్షంగా అవన్నీ నీకు కనిపిస్తాయి. ఐతే దానికి ప్రత్యేకమైన ప్రాణాయామం అవసరం !

ఎందుకంటే మన ఊపిరిపీల్చేవిధానం మీదనే ఆధారపడివుంటుంది — శరీరానికి ఆత్మకు వుండే సంబంధం ! మన శ్వాసను గనక మారిస్తే మనలోని జీవుడు తన శరీరంలోంచి బయటకువచ్చి ప్రాణమయ-శరీరంతో మన కళ్ళముందరే నిలబడి కనిపిస్తాడు — వేరే మనిషిలాగ! ఇతడే జీవాత్మ !! అతని శరీరమే సూక్ష్మశరీరము ! దానిపైనవుండే పొర మనలోని ప్రాణశక్తితో తయారైన 'ప్రాణమయ శరీరం'. అందుకే అది శ్వాసవల్లే శరీరంనుంచి విడివడి వేరుగా గాలిలో బెలూన్‌వలే ఎగిరిపోగలదు. యోగులు దాని ద్వారానే కాలంలోకి ప్రయాణిస్తారు. గతంలో గడిచిపోయిన శతాబ్దాల చరిత్ర చూడాలన్నా — లేక రాబోయే శతాబ్దాల భవిష్యత్తును కాలజ్ఞానరూపంలో సినిమాలా దర్శించాలన్నా దానివలననే సాధ్యం.

ఇప్పుడు నీకీ ప్రత్యేక ప్రాణాయామ ప్రక్రియ నేర్పుతాను. ముందుగా దానికి నీ ఆహారం మార్చుకోవాలి. తేలికైన మూలికలు, ఆకుపసర్లు, మొలకెత్తిన ధాన్యము, పండ్లరసం మాత్రమే ఆహారంగా తింటూ జీవించాలి — కనీసం మూడునుంచి ఏడురోజులదాకా ! అప్పుడే ఈ అన్నంతో తయారైన నీ స్థూలశరీరం నిర్మలమై — మనలోని మనస్సును ఒక స్ఫటికం వంటి అద్దంలాగ తయారుచేస్తుంది'' అంటూ నాకు ఆ శిక్షణవిధానం అంతా బోధించారు.

బోధించటమేకాక మరి ముగ్గురు పెద్ద లామాల సహాయంతో కొండలలో దొరికే **'సంజీవని'** యొక్క ఆకుల పసరు తీసి నాచేత తాగించారు. పసరు చేదుగాను, వెగటుగానూ అనిపించింది. అయినా

ఓర్పుగా తాగాను. అన్నమూ, మామూలు వంటకాలతో తినే భోజనం మానిపించేశారు. దానితో నిద్ర పూర్తిగా పోయింది — రాత్రంతా మేలుకునే వుండేవాడిని గంటలు లెక్కపెడుతూ ! రెండవరోజునుంచీ నాచెవుల్లో రింగుమనే హోరులాంటి శబ్దం వినిపించసాగింది. దానికి భయపడ్డ నేను గురుదేవులవద్దకు వెళ్ళి చెప్పాను కంగారుగా.

దానికాయన నవ్వి నావంక వింతగాచూస్తూ — "నీచెవుల్లో వినిపిస్తున్న ధ్వని ఏమిటి? అలా ఎందుకు వినపడుతోందనుకుంటున్నావు ?" అన్నారు.

గురుదేవా ! "నీరసం వలన, ఆకలి — భోజనం తగ్గించటంవలనా నా చెవులు రెండూ గళ్ళుపడ్డాయని భావిస్తున్నాను — కాదా ?"

గురుదేవులు భళ్ళున నవ్వి — "నువ్వు అలా అనుకుంటున్నావని నాకు ముందరే అనుమానంవేసింది ! ఉపవాసం అంటే భయపడి ఛస్తారు చాలామంది ! నిజానికి మనిషి నెలరోజులదాకా నిరాహారంగా బ్రతికివుండగలడు. పైగా నీకు విధించింది నీవనుకున్న ప్రకారం పూర్తి నిరాహారమూ కాదు. తేలికైన ఆహారం తీసుకునే విధానం ! దానివలన నీ శరీరంలోని ఇంద్రియాలు నిర్మలమవుతాయి.

"గురుదేవా ! ఇంద్రియాలు అంటే మనకళ్ళు, ముక్కు, చెవులు ఇవేనా ?"

"కాదు ! ఈ కళ్ళు, ముక్కు, చెవులు మనయొక్క — స్థూలశరీరానికి అతికించబడివున్న ద్రాక్షపళ్ళ గుత్తిలాంటివి ! కరెంటుతీగకు తగిలించబడివున్న లైట్ల, బల్బులవలె ! నిజానికి మన **'ఇంద్రియాలు'** వీటికి లోపల వుంటాయి. మనం కళ్ళుమూసుకున్నా బొమ్మలు కనిపిస్తాయి గదా ! అవి చూసేవే, ఇంద్రియములు ! మనకి కలలోకూడా మాటలు వినిపిస్తాయే అవి వినేవే — ఇంద్రియములు. ఇవి మన లోపలవుండే ఇంద్రియాలు అసలీ జీవాత్మకుండే లోపలి ఇంద్రియాలు పనిచేయటం వలననే మనిషి బ్రతికివుంటాడు.

ఎందుకంటావా ! చచ్చిపోయిన శవానికికూడా ఈ కళ్ళు, చెవులూ, ముక్కూ అలాగే వుంటాయికదా ! బైట ఇంద్రియాలు మామూలుగానే వున్నాయికదా ? కాని, అతడు చూడలేడు, వినలేడు, మాట్లాడలేడు — ఎందుకు ? ఎందుకంటే లోపల చూసే 'తెలివి' అనే — మనస్సులో ఏర్పడ్డ ఇంద్రియాలు మరణిస్తే పోతాయి ! — ఇవి జీవాత్మకు అంటి

పెట్టుకునేవుంటాయి. అవే మనం నిద్రపోతే కూడా పనిచేస్తాయి. అందుకే మనకి కలలు కనిపిస్తాయి ! కలల్లో మాటలు వినిపిస్తాయి. అవన్నీ ఈ బయటవున్న శరీరానికి అతి కించివున్న చెవులవల్ల కళ్ళవలనా — కానే కాదు !

'యోగం' అనేది మనలో జీవాత్మకున్న ఇంద్రియాలను పరిశుద్ధం చేయడంతో మొదలవుతుంది ! దానివలన **"కాలం"** లోకి చూస్తాం. ఆకాశంలో ప్రదేశందాటి ఈ విశ్వానికి అవతలవున్నవి కూడా కనబడతాయి. దానివలననే **'దివ్యదృష్టి'** కలుగుతుంది.

ఆ దివ్యదృష్టితోనే కాలంలోకి వెనక్కి కూడా చూడవచ్చు. గతించిన శతాబ్దాలు — కాదు లక్షల, కోట్ల సంవత్సరాల చరిత్రకూడా చూడవచ్చు. అలానే భవిష్యత్తులోని కాలంలోకి ప్రయాణించి జరగబోయే కాలంలోని రికార్డ్ సినిమాలాగ చూడవచ్చు చిత్రాలరూపంలో ! దీనినే మనవాళ్ళు **'కాలజ్ఞానం'** అంటారు తెలిసిందా ?'' అన్నారు వేగంగా తన జపమాల తిప్పుకుంటూ!

కొంతసేపు ఆగి — మళ్ళీ ఇలా సమాధానం ఇచ్చారు.

❀

29

కాలజ్ఞానం

“నీవు అడిగినప్రశ్న చిన్నదేగాని దానికి సమాధానం చెప్పాలంటే చాలావున్నది. ఒకప్పుడు నేను నీవయస్సులో వుండగా మా గురుదేవులు పీఠాధిపతి తాషీలామా ధ్యానంలోని ఉన్నతస్థితులను బోధించటానికి, నాకు ప్రత్యేకశిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.

అప్పుడా ‘లామాసరీ’ లోని విద్యార్థులకు వారివారి ఆత్మసంస్కారాన్ని బట్టి ఆధ్యాత్మిక శక్తినిబట్టి రెండు, మూడు తరగతులుగా విడదీసి — ప్రత్యేక శిక్షణనిచ్చేవారు. అందులో నన్ను నా జాతకంలోని గ్రహాలు ప్రత్యేకంగా పరిశీలించినమీదట ఒక దివ్యదృష్టిగల లామాను నా సూక్ష్మ శరీరాన్ని దివ్యదృష్టితో పరిశీలించమని చెప్పి — నా పూర్వజన్మలలోకి చూసి నేను చేసిన సాధనలు, నా ఆత్మ ఎంతవరకూ ఆధ్యాత్మికంగా ముందుకు పురోగమించిందో — అన్నీ పరిశీలించిన మీదట నా పరిస్థితి

సంతృప్తికరంగా వున్నదని నిర్ణయించారు. అందువల్ల నన్ను ఉన్నత బ్రహ్మచారులు ఉన్న మొదటితరగతి శిష్యులలో చేర్చారు.”

“మా రోజుల్లో ఇలా ఒక విద్యార్థిని ఎంతో పరిశీలించినమీదటనే అతడికి ఏవిధమైన ఆధ్యాత్మిక శిక్షణ ఇవ్వాలో నిర్ణయించేవారు. నాకు దివ్యదృష్టినీ, భవిష్యత్తు గురించిన జ్ఞానమును, జ్యోతిషంలో ప్రావీణ్యత, ఆసక్తి వున్నాయన్న సంగతి నిర్ణయించి నాకా ప్రత్యేకశిక్షణ ఇవ్వటం ప్రారంభించారు. అందులో భాగంగా ఈ టిబెట్‌లోని అతిప్రాచీన భాగమైన హిమాలయ పర్వతాలక్రింద — పూజ్య దలైలామాగారి భవనం “పోతాలా” పునాదుల క్రింద-వున్న గుహలను పరిశీలించమని ఆదేశించారు.

నాతోపాటు తొంభైఏళ్ళకు పైబడ్డ ముసలిలామాలు మండుతున్న నేతికాగడాలను తీసుకుని నాముందునడిచారు. ‘ఝుంమ్మని ఓంకారం చేస్తూ టిబెటన్ మంత్రశాస్త్రంలోని మంత్రాలను, స్తోత్రాలను స్వరయుక్తంగా శ్రావ్యంగా చదువుతూ వారు ముందు నడుస్తున్నారు. అలాగే నావెనుకనే నాతోపాటు శిక్షణగా ఎంచుకున్న పది, పదమూడుమంది లామాశిష్యులు తలవంచుకుని నడిచొస్తున్నారు.

మాకు మామూలుగా లామాలు ధరించే ఎర్రటి ఊదారంగ వస్త్రాలకి బదులు నారింజపండు రంగూ ఎరుపూ కలిసిన చెంగా రంగులో ఉదయించే సూర్యునికాంతివంటి పీతాంబరం రంగు కాషాయ వస్త్రాలను ఎడమభుజం పైనుంచి ఐమూలగా చుట్టి సన్యాసులమాదిరిగా ధరింపచేశారు.

ఒకరోజు ముందుగా ఉపవాసం చేయించి పాలుమాత్రమే ఆహ

రంగా యిచ్చారు ! ఆరోజు ఉదయాన్నే జాము పొద్దుండగానే లేచి కాలకృత్యాలు, స్నానము, నిత్యజపము పూర్తికాగానే పైనచెప్పిన ముసలి లామాలతోసహా వారి పరివారంతోపాటు నేనూ బయలుదేరాను. నడుస్తున్న కొద్దీ నేల ఏటవాలుగా పల్లంగా కిందకి తూర్పుగా వంగివుంది ! అడుగుక్కీ నేలలో సొరంగంలాగ ప్రయాణిస్తున్నాము. నేల పల్లంగా వుండటంవలన మా నడక ఎవరో ముందుకు నన్ను నెట్టుకు వెళ్తున్నంత తొందరగా అడుగులు ముందుకు పడుతున్నాయి. నా ఆశ్చర్యాన్ని గమనించిన నా ముఖ్య గురుదేవులు :

"ఓ లామా ! (శిష్యుడా) ఆశ్చర్యపడుతున్నావా ఏమిటి ? ఇక్కడి నుంచి నేల పల్లంగా భూగర్భంలోకి సొరంగంలోకి వెళుతోంది. అందుకే నీకీ అడుగులతొందర — ఎవరో వెనకనుండి నెట్టుతున్నట్టు" అంటూ నవ్వారు నా మనస్సును శాంతపరుస్తూ ! అలా సుమారు ఒక గంటసేపు మంత్రాలు చదువుతూ ధ్యానస్థితిలో మనస్సు ఏకాగ్రంచేసి భూగర్భంలోకి ఆ లోతు మార్గంగుండా నడచివెళ్ళగా ఒక మనిషి తలవంచుకుని నడవవలసినంత ఎత్తుమాత్రమే వున్న — గుండ్రని విశాలమైన ఓ గుహలోకి ప్రవేశించాము. కొంచెం ముందుకుపోగానే దూరాన గుహ అంచులకు నీరు తగులుతూ ఊటగా వూరిన జల సన్నగా గలగల శబ్దంతో ప్రవహిస్తున్నది ! ఆశ్చర్యంగా తలఎత్తి పైకిచూశాను. ఆ సొరంగం కప్పు మీద ఆల్చిప్పలు, నత్తగుల్లలు రాతిపొరమీద అంటిపెట్టుకుని కనిపించాయి — స్పష్టంగా ! రాతిపొరలు తెలుపు, ఆకుపచ్చ, గులాబీ రంగు రంగులుగా పొడలు పొడలుగా ఉప్పునీటిలో ఆ శిలలు చాలాకాలం నానినట్టుగా చిత్ర విచిత్రంగా వున్నది.

నేల కుడి ఎడమలకు పల్లంగా ఏనుగువీపు ఆకారంలో గుండ్రంగా వొంపుతిరిగి ఏటవాలుగా క్రిందకు దిగిపోయింది ! కాగడాల వెలుతురులో చూస్తే జిగేల్‌మనే బంగారుకాంతితో తళుక్కున మెరుపులు లాంటి గీతలు — రాతిపొరలలో కనిపించాయి ! వాటి మధ్యలో నక్షత్రాల వంటి స్ఫటికశిలలు జిగేల్‌మని కళ్ళు మిరుమిట్లుగొలుపుతూ కనిపిస్తున్నాయి.

“అవి నేలలో బంగారం లభించే గనియొక్క అంచులు ! — అందుకే మెరుపుతీగలలాగా కొండపొరలలో బంగారం మెలికలు మెలికలు తిరుగుతూ జరీలాగ కనిపిస్తున్నాయి. అందుకే ప్రాచీనకాలంలో మన పూజ్య దలైలామా మందిరానికి ‘సువర్ణ మందిరము’ — లేక **“హిరణ్యగర్భ దేవాలయము”** అన్నపేర్లు వుండేవి.

ఈ బంగారము ఇక్కడి గుహలలో టన్నులకొద్దీ వుండటంవలన ఇది భూలోకంలోకల్లా పరమ పవిత్రభూమిగా పూజించే నేల ! ఈ గుహ ఒక జీవించే-శిల ! అంటే ప్రాణంతోవుండే స్వయంగా కదలిక కలిగిన **సాలగ్రామ శిల !** అందరూ పూజించే ఆ సాలగ్రామశిల యొక్క గుహ — ఇది! ఇంతకన్నా పవిత్రస్థానం ఈ భూగోళం మొత్తంమీద లేనే లేదు ! అందుకే జపధ్యానాలకు అతిపవిత్రస్థలంగా దీన్ని ఎంపికచేసి నీవంటి ఆధ్యాత్మిక సాధకులకు ఇక్కడ ధ్యానంచేసే అవకాశాన్ని కల్పించాము !

ఇక్కడ కూర్చొని నీ **మూడవ-కన్ను** తెరిచి, భవిష్యత్తును చూసే దృష్టిని సాధించి నిశ్శబ్దంగా నీ ఆలోచనలు శాంతించేదాకా ధ్యానించు. అంటే ధ్యానంలో స్పష్టంగా చూడు.

"నీకు తెలుసుగా ? ఈ ధ్యానం — మనం, మామూలుగా మనస్సును లోపలివైపు తిప్పి సమాధిలోకి ప్రవేశించే అంతర్ముఖ దృష్టికాదు ! ఇప్పుడు కావలసింది — ఆ రకం ధ్యానంకాదు, మనస్సు లోపలికి పోవటంకాదు !"

"మనస్సును బయటవైపుకు తిప్పి — మేఘములు, ఆకాశము దాటి పైకి వ్యాపించి, సూర్య చంద్ర గోళాలు దాటి ఈ విశ్వమంతా వ్యాపించే నీ మనస్సు — కాలాన్నీ, ఆకాశాన్నీ దాటాలి ! అప్పుడే కాలంలో ఏమి వుందో నీకు దర్శనమిస్తుంది. దాన్నే మన టిబెట్ ప్రాచీనగ్రంథాల్లో **"కాలజ్ఞానం"** అంటారు !

"అందుకే నిన్నొక గురుదేవుల పర్యవేక్షణలో కూర్చోబెట్టి నుదుటి మీద రెండు కనుబొమ్మలమధ్యన నీ **"మూడో-కన్ను"** తెరిపిస్తాము" — అంటూ నా భ్రూమధ్యంలో చుక్క-బొట్టు పెట్టుకునేచోట నొక్కి పూర్వం వర్ణించినవిధంగా నా మూడవకన్ను తెరిపించారు.

అంతే! ఒక విశాలమైన ఆకాశం నాఎదుట ఒకపెద్ద తివాచీ పరిచినట్టు పొడుగూ వెడల్పు తెరచాపలా తెరుచుకుని వ్యాపించి విస్తరించింది. కాసేపు నీలాకాశంలాగ మరికొంతసేపు నీలంరంగుతోనూ, ఇంకోసారి స్ఫటికంలాగ, మరికాసేపు స్వచ్ఛమైన ఎరుపురంగులోనూ, ఆకుపచ్చని నారింజ రంగులోనూ ఇలా — రక రకాలుగా రంగు రంగులుగా నా మూడవనేత్రం ముందు చేరాయి. వాటిని నిశితంగా పరిశీలిస్తూ నా సొంత ఆలోచనలు కరిగిపోయాయి ! చివరికి, అలాంటి వాటిని పట్టించుకోవటం మానేశాను. అప్పుడే నాఎదుట ఈ **'మన ఈ**

ప్రపంచంయొక్క గతచరిత్ర' మొత్తం — ఒక సినిమా చిత్రంలోని దృశ్యాల్లాగా ఒకదానివెంట ఒకటి కనిపించాయి అంచెలంచెలుగా !

అలా మూడురోజులవరకు నాకు కనిపించినవి, నాకు వినిపించినవీ దృశ్యాలు, చిత్రాలు, శబ్దాలూ వివరాలతో నేను వర్ణించి చెపుతూంటే మా పూజ్య గురుదేవులు తలపంకిస్తూ ఆసక్తిగా ఏకాగ్రతతో అంతా విన్నారు. ఆయన వెనకాలగా కూర్చుని ఇద్దరు నడివయస్సులోని లామాలు ఇనుప దబ్బనం వంటి ఘంటంతో నేను వర్ణించిచెబుతున్న వివరాలను శరవేగంతో తాళపత్రాలమీద రాసుకుపోతున్నారని తరవాతగాని, నాకు తెలియలేదు.

అలా నేను చూసినవి — నాకు వినిపించినవి నామనస్సుకు ఎలా అనిపించినవి అన్నీ అలా వర్ణించిచెప్పగా రాస్తే — అది ఈ ప్రపంచం యొక్క చిన్నప్పటి అంటే బాల్యంలోని గతచరిత్ర అని తెలిసింది — విని ఆశ్చర్యపోయాను నేనే ! అలా నేను చెప్పినది, రాసుకున్నది మళ్ళీ మన ప్రాచీన పురాణగ్రంథాలతో సరిచూసి హెచ్చుతగ్గులు గమనిస్తూ పూర్వఋషులు వర్ణించిన కాలజ్ఞానపు వర్ణనలో గతించిన **'బ్రహ్మకల్పముల'** చరిత్రతో సమన్వయం చేసి కాలజ్ఞానంలోనూ, పురాణాలలోనూ ఇవ్వబడిన వివరాలతో సమన్వయం చేయటం జరిగింది. అదంతా చెప్పాలంటే ఆ వివరాలతో — అది ఒకపెద్ద గ్రంథమౌతుంది'' — అంటూ పూర్తిచేసారు మా పూజ్య గురుదేవులు తాషీలామా.

గురుదేవులు నాకు అన్నీచెప్పారుగాని — ఏమీ చెప్పలేదు అనిపించింది నేను వారి పాదాలవంకే చూస్తూ ఇంకా ఇలా అడిగాను.

“ఓ పూజ్య గురుదేవులైన తాషీలామా ఆచార్యా ! మీరు నాకు అన్నీచెప్పి, ఏమీ చెప్పలేదు ! ధ్యానదృష్టితో మీరు చూసిన ఈ విశ్వంయొక్క గత చరిత్ర మీరు నాకు అందీ, అందకుండా అన్నీచెప్పి ఏమీ చెప్పలేదు.

“మీరు దర్శించిన ఈ విశాలవిశ్వంయొక్క చరిత్ర, మన టిబెట్ యొక్క ప్రాచీనచరిత్ర మీరు దివ్యదృష్టితో చూసినది చెపితే వినాలని నాకు చాలా ఆసక్తిగానూ ఆతృతగానూ వున్నది. దయచేసి నాకు అన్నీ వివరంగా చెప్పండి” అన్నాను. వారు చెప్పినదంతా విస్తరించి వ్రాయాలంటే అదంతా ఒకపెద్ద గ్రంథమే అవుతుంది.

అయినా నాలో కలిగిన ఆసక్తిని గమనించి మా గురుదేవులు నాకు వర్ణించిచెప్పిన **కాలజ్ఞానం** వివరాలు — ఈ తరువాత అధ్యాయంలో వర్ణిస్తాను.

◆

30

ప్రపంచం యొక్క - బాల్యం

అలా నేను హిమాలయపర్వతం అడుగున భూగర్భంలోని గుహలో కూర్చుని నెమ్మదిగా ఒక నిద్రవంటి ధ్యానస్థితిలోకి జారుకున్నాను. అప్పుడు కనిపించిందా దృశ్యం !

కాలంయొక్క 'వేగం' మారింది ! :-

"ఇదంతా ఎంతో ప్రాచీనమైన — **'ఆదికాలంలో'** జరిగింది ! ఎంత కాలంక్రితం జరిగిందో సరిగ్గా లెక్కించి చెప్పడంకూడా చాలాకష్టమే!

ఎందుకంటే కాలగమనంలో కూడా ఎన్నో మార్పులు జరిగాయి అప్పటికీ — ఇప్పటికీ ! ఈ భూగోళం తిరిగే **'వేగం'** ఇప్పటికన్నా

ఆకాలంలో మూడు, నాలుగురెట్లు ఎక్కువవేగంగా తిరిగేది ! దానివలన రోజు-యొక్క పొడవు ఇరవైనాలుగు గంటలే అనిపించినా — అదే ఇరవైనాలుగు గంటలు ఎంతో త్వరగా గడిచిపోయేవి ! సంవత్సరచక్రము అతివేగంగా తిరిగిపోయేది — ఇప్పటికన్నా నాలుగురెట్ల వేగంతో !! కాలంలోని కనిపించని ఈమార్పుని గడియారాలుకూడా గమనించలేవు.

ఎందుకంటే భూగోళంతిరిగే వేగంగనక మారితే దానియొక్క ఆకర్షణ శక్తి, అయస్కాంత బలముకూడా మారుతుంది. అందువల్ల గడియారాలు తిరిగే వేగంకూడా మారుతుంది. దానివల్ల భూమ్యాకర్షణబలం తగ్గి భూమిపై పెరిగే చెట్లు, నడిచే మనుషులు, జీవించే జంతువులు ఇప్పటి కంటే — పెద్దవిగానూ, పొడుగ్గానూ వుండేవి ! దానితోపాటు ప్రతి జీవి, ప్రతి మనిషి, జంతువులు, చెట్లు ఎక్కువకాలం జీవించినట్టు కనిపించేవి !

నిజానికి జరిగింది ఏమిటంటే అంతే జీవితకాలంలో భూమి గుండ్రంగా తిరిగే వేగం పెరగటంవలన సంవత్సరంయొక్క వేగంకూడా పెరిగింది. అలా కాలవేగము హెచ్చుగా వుండటంవలన — అదే ఆయుష్షులో అనేక సంవత్సరాలు గడిచినట్టు తిరిగిపోయేవి ! అందువల్ల పూర్వయుగాలలో మనుషులు **ఎక్కువకాలం** జీవించినట్టు కనిపించేవారు ! అప్పుడు కాలంవేగం అలావుండేది. అందుకే మనుషులు కొన్నివేల సంవత్సరాలు జీవించినట్టు పురాణాలలో కూడా వివరించబడివున్నది.”

“అందుకనే అన్నాను ఆనాటి ఆదికాలంలో కాలంయొక్క వేగము ఇప్పటికన్నా చాలా హెచ్చుగా తిరిగేది అని ! అందువల్ల మనకు పూర్వసృష్టిలో కనిపించిన చరిత్రా — అది జరిగేకాలమూ మనం చూస్తూ

వుంటే ఇప్పుడు పట్టే సమయం సరిగ్గా లెక్కించి చెప్పటం చాలాకష్టం. ఇన్ని సంవత్సరాలు అని చెప్పలేము — లెఖ్ఖగా ! ఏసంవత్సరాలో అవి తేల్చటం ఎలా ? ఏకాలం ?

“అది ప్రపంచంయొక్క బాల్యము ! అంటే పసిపిల్లవాడి జీవితంలో అన్నీ వేగంగా జరిగినట్టే చురుగ్గా ప్రపంచములోని చరిత్రకూడా త్వర త్వరగా నడిచిపోయింది. అప్పటి ఆకాలంలో భూమి సూర్యునికి నిటారుగా తిరిగేది — అంటే నీకు అర్థంకాకపోవచ్చు !

ఇప్పుడు భూగోళం ఆకాశంలో ఉత్తరధృవము, దక్షిణధృవము ఒకవైపునకు వాలి ఏటవాలుగా వొంగి వుంటుంది భూమి ఇరుసు. అందువల్ల ఒక సంవత్సరంలో భూమి సూర్యునిచుట్టూ తిరిగే సమయం కూడా ఉత్తర, దక్షిణ ధృవాలలాగే ఒరిగినందువల్ల రాత్రీ-పగలూ హెచ్చు తగ్గులతో వుంటుంది ! దానివల్ల మనకి సంవత్సరంలో అతివేడిగా వుండే వేసవికాలము లేదా చల్లగావుండే శీతాకాలమూ, ఏర్పడతాయి. కాని ఆరోజుల్లో అలా వుండేది కాదు. భూమి నిటారుగా వుండి, ఉత్తర దక్షిణ ధృవాలు సమానమైన తలములో నిలిచి సూర్యునిచుట్టూ లంబముగా తిరిగేది. అందువల్ల ఒకవృత్తంలో, తిరిగే చక్రంలా — మూడువందల అరవై (360°) డిగ్రీల కోణంలో తిరుగుతున్న భూమియొక్క సంవత్సరము పొడుగు — మూడు వందల అరవైరోజులే వుండేది !

దానికి పూర్వచరిత్రలో సాక్ష్యంకూడా లభిస్తోంది. ప్రాచీన జ్యోతిష గ్రంథాలలో రాసిన పరాశర మహాఋషి వంటి ఋషులు సంవత్సరంలో మూడువందల అరవైరోజులే అని **'సావన-సంవత్సరం'**గా లెక్కించారు.

వారి లెక్కలు ఇదే తెలుపుతున్నాయి. ఆరోజుల్లో కాలం ఆవిధముగానే వుండేది. అందువల్ల మనకి ఒక సంవత్సరంలో కలిగేమార్పులు వేసవి కాలము, వర్షాకాలము, శీతాకాలము అనే ఆరు ఋతువులూ అన్నీ — ఒకేరోజులో ఆరూ తిరిగేవి !

అంటే ఏమిటి ? ప్రతీరోజు సూర్యోదయంవేళ వసంతఋతువుతో రోజు ప్రారంభమై, మధ్యాహ్నం సమీపించేసరికి వేసవికాలము వచ్చి ఎండవేడిమి పెరిగేది ! మధ్యాహ్నము గడిచేసరికి వానలుపడి, వర్షాకాలంగానూ సాయంత్రముకాగానే శరదృతువుగా నీలాకాశంలో వెన్నెల కురిసేది ! రాత్రి శీతాకాలమువలే వణికించే చలిగాలులూ తరువాత శశిరఋతువూ — ఇలా సంవత్సరంలో ఆరుఋతువులు ఒకరోజులోని 24 గంటలలోనే — చక్రాకారంగా తిరిగేవి — భూగోళం సమానంగా సూర్యుడిచుట్టూ తిరగటంవల్ల !

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఆరోజుల్లో కాలగమనమే వేరు ! అయినా ఇదంతా ప్రధాన విషయముకాదు ఒక్కదానికి తప్ప ! ఈ కాలగమనాన్ని గురించి రహస్యం మరిచిపోతే పూర్వఋషులు వర్ణించిన విధంగా ఈ సృష్టిలో కనిపించే జంతువులు, “మనుష్యులు, చెట్ల జీవిత కాలం వేల సంవత్సరములు” అనిచెప్తే అది మనకు అసంబద్ధముగా తోచవచ్చు.

“అందుకే కాలాన్ని అర్థంచేసుకోవాలంటే ఖగోళశాస్త్ర పరిచయం అవసరము. అందుకే ముందరే చెప్పాను ! అది మన ఈ విశ్వంయొక్క **బాల్యము** అని !” — అంటూ నాగురుదేవులు గతించిన ప్రళయాలూ

గ్రహగోళాలు తిరిగే పరిభ్రమణాల్లో మార్పులూ తెలియజెప్పారు. నేను నిర్ఘాంతపోయాను ఆయనయొక్క — అపారమైన జ్ఞానంచూసి !

“అది ఈ విశ్వంయొక్క బాల్యం ! ఆకాలంలో భూమియొక్క — ‘భ్రమణం’ వేరుగా తిరిగేది. అప్పుడీ టిబెట్ ఒక సముద్రతీరం ! టిబెట్‌యొక్క దక్షిణతీరం మీదికి అలలుగా సముద్రకెరటాలు వచ్చి పడుతుండేవి. ఆరోజుల్లో, ఉదయభానుడి బంగారుకిరణాలు ఇప్పటి దక్షిణధృవం మీదనుంచే ఉదయిస్తూవుండేవి.

కాలం ప్రశాంతంగానూ ప్రకృతి సమృద్ధిగా, పండ్లూ, కాయలూ, పూలు, తేనే లెక్కకుమిక్కిలిగా మనుష్యుల అవసరాలకంటే ఎక్కువగా ఇస్తూవుండేది ! గాలిలో, ఆకాశంలో వాతావరణం ఏకాలుష్యమూ, పొగా లేకుండా నిర్మలంగా నీలంగా వజ్రంలాగ, స్ఫటికంలా ప్రకాశించేది ! ప్రజలకు సమృద్ధిగా ఆహారమూ, మంచివాతావరణమూ, నిర్మలమైన నీళ్ళూ పుష్కలంగా లభించడంతో బలంగానూ, దృఢంగానూ, ఆరోగ్యంగానూ వుండి మనుష్యులు చాలాకాలం జీవించేవారు. చాలాకాలం యవ్వనంతో, శరీరంలో బలమూ, ఉద్రేకమూ, సమృద్ధిగా వుండేవి. దానితో విచ్చలవిడిగా జీవించడం మొదలుపెట్టారు, కోరికలు ఎలా నడిపిస్తే అలా ! — ఏది కోరితే అది అనుభవించాలని చేతులుజాచే మనిషి జీవితం గాడితప్పింది.

దేనికైనా అతి మంచి, చెడుకే దారితీస్తుందన్న సత్యం నిజమైంది. ‘మనిషి ధర్మంతప్పి నడిస్తే ప్రకృతికూడా తాను నడిచే గాడితప్పి విజృంభిస్తుంది’ అన్న సత్యం మరొక్కసారి ఋజువైంది.

ఇంతలో ఏమైందో తెలియదు ! సూర్యునిచుట్టూ తిరిగే గ్రహగోళాల గతిలో ఏదో మార్పుకలిగింది — దీనితో ఒక బ్రహ్మాండమైన తోకచుక్క వంటి గ్రహం ఉల్కలాగా భూమికి దగ్గరగా దూసుకువచ్చింది.

ముందుగా ప్రజలకేమీ అనుమానం రాలేదు ! ఒకరోజున రాత్రి రెండుజాములవేళ ఆకాశంలో ఒకపెద్ద నక్షత్రం కనిపించింది! పొలాల్లో పనిచేసేవాళ్ళూ, వీధిలో తిరిగేవాళ్ళూ గమనించారు — కాని అదేమీ వింతగా అనిపించలేదు వారికి. చాలారోజులు నిలిచి వెలిగింది ఆకాశంలో ఆ తెల్లనిచుక్క — ఉదయించడం, అస్తమించడంలేకుండా. దానితో కొందరు కంగారుపడ్డారు, ఏమిటా? ఈవింత అని !

ఇంతలోకే ఆచుక్క పట్టపగలుకూడా కనిపించింది ! కనిపించడమే కాదు, చూస్తూవుండగానే రోజురోజుకీ పెరిగి పెద్దది కాసాగింది, భూమికి దగ్గరౌతున్నట్లుగా. ముందు నిమ్మకాయంత కనిపించింది, ఆతరువాత దబ్బకాయంత, మరికొంతకాలం తరువాత చంద్రబింబాన్ని కప్పేసింది. దానితో ప్రజలు ఆందోళనపడి, కల్లోలంగా దానినిగురించి చర్చించుకోవడం మొదలైంది.

ఇంతలోకే బత్తాయిపండుసైజులో పెరిగిన ఆ నక్షత్రంవంటి వింత వస్తువు వెనకాల — పొడుగాటి నాలుకవంటి మంటతో ప్రజ్వలించింది.

క్రమంగా ఆ నాలుకవంటి జ్వాల తోకలాగా పెరిగి — చివర నల్లటి పొగా, కొసన తెల్లటి తోకచుక్క తోకవంటి మంచూ, ఆవిరీ, పొగా కలిసిన చీపురుకట్టవంటి తోకతో వెలిగింది. రాత్రీపగలూ అనే భేదంలేకుండా అలా వెలుగుతున్న ఆచుక్క భూమివైపునకు దూసుకు



"యుగంమార్పు"–చుక్క !

వస్తున్నదేదో 'వింతవస్తువు' అని గుర్తించారు కొందరు జ్యోతిషశాస్త్రజ్ఞులు. దానితో ప్రజలలో భయం, కంగారు ఎక్కువైపోయాయి. రోజురోజుకీ గంటగంటకీ దాని సైజు పెరిగిపోతూ, అది భూమికి దగ్గరగా దూసుకు వస్తున్నట్టు అర్థమైంది అందరికీ.

దానితోపాటు ప్రచండమైన చలిగాలీ, ఈదురుగాలులూ, తుఫాను లాగా భూమ్మీద వీచసాగాయి. వారంరోజుల్లో ఆ తుఫానుగాలి మరింత ప్రచండమైంది. అదో సుడిగాలిలా పెరిగిపోయి, భూమిమీది ఇసుక, ధూళీ, దుమ్మూ ఆకాశానికి చిమ్మేసింది ! క్షణాలమీద ఆకాశం ఎర్రటి ధూళితో నిండిపోయింది. తట్టలకొద్దీ ఇసుక వర్షంలాకురిసింది. ఆకాశం అంతా ఓనీడలాగా, నల్లటి కారుమబ్బులాగా క్రమంగా చీకటిలో మూసుకుపోయింది.

సముద్రాలు, ప్రచండమైన అలలతో లేచి తీరంవెంబడి విరుచుకు పడ్డాయి తుఫానుగాలితో. దానితో ప్రజలలో విపరీతమైన భయాందోళనలు మొదలయ్యాయి. ప్రతి ఊళ్ళోనూ ఉప్పెనా, ప్రతి సముద్రతీరంలోనూ తాటిచెట్టు అంతఎత్తున కెరటాలు విరుచుకుపడి తుఫానులాగా వందల, వేల గ్రామాలను ముంచివేసింది. అయినా భయంకరమైన ఈదురు గాలులు తగ్గలేదు. సముద్రకెరటాలు ఒకదానివెంట ఒకటి ఇలా వందలు వేలు అలలుగా లేచి — పెంకుటింటిపైన పేర్చిన పెంకులవలే దొంతరలుగా పరుగెత్తివచ్చి భూమిమీద విరుచుకుపడ్డాయి. భూమిపైన జీవనం అతలా కుతలమైంది. ప్రపంచం మొత్తం అల్లకల్లోలం కాసాగింది.

అప్పటికి — ఆ భయంకర గ్రహం ఒక తోకచుక్కలా మారి

భూమివైపు గర్జనవంటి ధ్వనితో దూసుకు రాసాగింది — ఒక రాకెట్ లాగ ! దాని వేగానికి భూగోళం మొత్తం సముద్రకెరటాలమీద తేలిపోయే తెప్పలాగా ఇటూ అటూ ఊగిపోసాగింది భయంకరంగా !

ఇంతలో — అకస్మాత్తుగా ఉత్తర దిక్కు కిందకువొంగి దిగిపోయింది. దక్షిణం పైకి లేచిపోయింది — ఆకాశంలోకి ! మరుక్షణమే తటాలున దక్షిణందిక్కు పడిపోయి ఉత్తరం మళ్లీ పైకిలేచింది మెరుపువేగంతో! అలా ఉత్తర-దక్షిణాలు గిరగిరా బొంగరంలా తిరగసాగాయి. భూమి క్రిందా, ఆకాశం పైనా వుండవలసిన చోట కనిపించకుండా — భూమ్యాకాశాలు తల్లక్రిందులుగా కనిపించాయి. ఇదంతా ఆ ప్రళయాగ్ని సృష్టించే ఉల్కవంటి తోకచుక్కలా కనిపించే గ్రహం ప్రభావమని అందరికీ తెలిసిపోయింది ! అదింకా ఆకాశంలో క్రమంగా పెరిగిపోతూ బంతిలాగా సూదులవంటి కిరణాలతో భయంకరంగా ప్రకాశించింది.

ఇలా రాత్రీపగలూ ఏకధాటిగా ప్రకాశిస్తున్న ఆ గ్రహం వెలుతురూ, దాని వేడీ, ప్రచండమైన వాయువు తుఫానులకంటే లక్షరెట్ల వేగంతో ప్రభంజనంలా వీచి భూగోళాన్నే ఎగరగొట్టేసేలా ప్రళయంగా వీచే పెనుగాలుల్ని సృష్టించాయి. ఆ పెనుగాలికి పర్వతాలూ, రాళ్ళూ పైకెగిరి, లేచి ఆకాశంలో నాట్యమాడాయి. తట్టలకొద్దీ ఇసుకా, మట్టీ దేశాలమీద పారబోసినట్టు ధారగా కురిసింది. నగరాలూ, పల్లెలూ, దేశాలే దాని మట్టిలో కూరుకుపోసాగాయి.

చూస్తూవుండగానే ఆ గ్రహం ఇంకా భూమికి దగ్గరై మరింతదగ్గరగా సూర్యుడికన్నా పెద్దగా పెరిగిపోయి — చివరికి ఆకాశం పట్టనంత గుండ్రని వస్తువుగా అన్నివైపులా నిండిపోయి — తానే ప్రకాశించింది!

అది నిటారుగా భూమివైపుకు ఢీకొనబోయే వేగంతో మనవేపు దూసుకు వస్తున్నట్టు అందరికీ తెలిసిపోయింది ! పిచ్చిభయంతో దిక్కులకు పారిపోసాగారు, జంతువులూ, మనుషులూ, పక్షులూ అన్నీ! కాని, ఎటు పారిపోగలరు — భూమ్మీదనుంచి ?

ప్రపంచమంతా ప్రళయమే తాండవించింది. చెట్లు వేళ్ళతోసహా పెకలించుకుపోయాయి. వందల, వేలమైళ్ళ ఎకరాల అడవులు వేళ్ళతో సహా పెకలించబడి తోటమాలి కలుపుగడ్డిపీకినట్టు, ఆకాశంలోకి విసిరి వేయబడ్డాయి. ఇలా భూమిమీద కనిపించే చెట్టూ చేమా అన్నీ పెళ్ళగించుకునిపోయి, ఎర్రగా ప్రజ్వలించే ఆగ్రహం మంటకి నిముషంలో భూమి కరిగి బెల్లపు పాకంలా పైకిలేచింది లావాతో అగ్నిజ్వాలలు చిమ్ముతూ! అగ్నిపర్వతాలు సర్వత్రా ప్రజ్వలించాయి.

నల్లటి పొగ, ఎర్రటి జ్వాల, విపరీతమైన వేడి, ప్రాణులన్నీ దాదాపు నశించిపోయాయి, ఆ మహాప్రళయానికి.

అది భూమికి దగ్గరగా దూసుకునివచ్చిన ఏదోఒక గ్రహంయొక్క ఆకర్షణశక్తియొక్క ధాటి అని తెలుసుకున్నారు — దూరంగా కొండల మీద తపస్సుచేసుకునే ఋషీశ్వరులుమాత్రం ! అందులో కొందరు ఒంటి కాలిపై నిలిచి కంటికి కనిపించని '**విశ్వాత్మ**'ను ప్రార్థించారు — ప్రపంచం శాంతించాలని ! వున్నట్టుండి తటాలున భూమి ఓప్రక్కకు ఒరిగిపోయింది. సముద్రంనీళ్ళు పెద్దకెరటంలా లేచి ముంచివేశాయి — ఆ వేగంతో దూసుకునివచ్చి సుడిగుండంలా ! ఇలా పర్వతాలు సముద్రంగానూ — సముద్రం పర్వతాలగానూ మారిపోయి భూగోళం ఆకారమే గుర్తుపట్టకుండా మారిపోయింది.

ఇంతలో భయంకరమైన గర్జనవంటి ఉరుములతో భూమి వొణికిపోతూ కంపిస్తూవుండగా, సముద్రంలోంచి ఒక పర్వతశిఖరం పైకిలేచింది. క్షణాలమీద ఆకాశం అందుకునేఅంత ఎత్తుకు పెరిగిపోయింది ! చిచ్చుబుడ్డిలోని మంటలాగా పర్వతశిఖరాల్లోంచి అగ్నిజ్వాలలు పేలి కరిగిన రాయి, లావా తారులాగా మండుతూ అడవులను కాల్చేసింది. భూకంపంలా ఫెళఫెళా కదిలిపోయింది పునాదులతోసహా — ఈ భూమి !

అలా ఎంతకాలం జరిగిందో ఎవరికీ తెలియదు ! కాలమే ఆగిపోయింది! కొన్నిరోజులు భూగోళమే తిరగడం మానివేసింది. అటు సూర్యోదయమూ లేదు — ఇటు సూర్యుడస్తమించడమూ లేదు ! కొన్ని దేశాల్లో నెలల తరబడి రాత్రి !! మరికొన్నిచోట్ల ఒకటే ఏక పగలు, మాడిపోయే ఎండలు ! ఆతరువాత రాక్షసిబొగ్గుపొగతో ఆకాశం మూసుకుపోయింది. అది రాత్రో పగలో ఎవరికీ తెలియలేదు.

ఇలా సుమారు 49 రోజుల కాలం అయివుంటుందని వూహించిన ఆసమయంలో — దూరంగా దూసుకుని వెళ్ళిపోతున్న గ్రహం చుక్కలాగా చిన్నదైపోతూ తగ్గి, కనుమరుగైపోయింది.

కాని — అప్పటికే ఓపెద్ద గండిపడింది భూమిమీద ! అలా దూరంగా పారిపోతున్న ఆ గ్రహం ఆకర్షణశక్తికి భూమిలోంచి ఒకపెద్ద పెళ్ల పెచ్చులా వూడి ఆకాశంలో గిరగిరా తిరుగుతూ పెళ్లగా పగిలి ఎగిరిపోయింది ! అదే క్రమంగా ఇప్పటి **చంద్రుడుగా** — ఆకాశంలో వెలుగుతోంది, సూర్యరశ్మి పడి !

ఆ ప్రళయమంతా సర్దుకున్నతరువాత కొండలమీద తపస్సు చేసుకునే మునీశ్వరులు పొడుగాటి తాడు, ఇనుపదబ్బణాల సాయంతో

దిక్కులకు కొలిచారు. కాలమానం కనుగొన్నారు. ఆకాశం గమనించారు — పెదవి విరిచారు.

"కాలం మారిపోయింది. తూర్పున ఉదయించే సూర్యుడు ఇప్పుడు దక్షిణంగా ఉదయిస్తున్నాడు" అనుకున్నారు, అంతకుముందు దిక్కులను బట్టి. సముద్రతీరంగా వుండే టిబెట్ అకస్మాత్తుగా పర్వతంలాగా ఆకాశం వైపుకు పెరిగిపోయింది. రోజులలో ఎత్తుకు ఎదిగిపోయిన పర్వతపంక్తి మధ్యన మంచుతో కప్పబడి ఇప్పటి హిమాలయాలుగా మారిపోయింది.

తూర్పు-పడమరలు, ఉత్తర-దక్షిణాలు — ఇప్పుడంతా మారి పోయాయి. ఇంతెందుకు, భూమి తిరిగే ప్రదక్షిణమే అప్రదక్షిణగా, అపసవ్యంగా తిరుగుతున్నట్టు మారిపోయింది ! కాలమే వ్యతిరేకంగా నడుస్తోంది ఇప్పుడు ! ప్రకృతి అంతా గతితప్పింది. అలాగే మనుష్యుల బుద్ధి కూడా గాడితప్పి నడుస్తూంది. ధర్మం రోజురోజుకీ తరిగిపోసాగింది. సత్యం, దానం, తపస్సు — అన్నీ ఆశ్చర్యంగా అణగిపోయాయి రోజు రోజుకీ !

ఇలా ఒకప్పుడు సముద్రతీరంగావుండే మన టిబెట్‌దేశం పర్వత శిఖరాలమధ్య బంధింపబడి, మంచుకొండలమధ్య ఇప్పటి పీఠభూమిగా నిలిచిపోయింది — ఓ లామాసరీ శిష్యుడా ! ఇదే, నేను దివ్యదృష్టితో చూసిన ఆనాటి నా **'కాలజ్ఞానం'** లో చూసిన కథ !" — అంటూ ముగించారు తాషీలామా గురుదేవులు అని తన అనుభవాన్ని పూర్తి చేశాడు లామా దోర్జీ చోగ్యాల్ ! దాంతో మాసాహసయాత్రికుల మనస్సు లలో అనేక ప్రశ్నలు తలెత్తాయి !

✿

31

మానవ-సృష్టి జరిగిందిక్కడే !

“ఇక్కడ ఈ హిమాలయాల్లో అనేక మహిమగల ప్రదేశాలు, రహస్యమైన శక్తికేంద్రాలు ప్రపంచానికి జ్ఞానాన్నీ, విశ్వప్రేమనూ ప్రసారంచేయగల దివ్యశక్తిగల మహిమాన్విత ప్రదేశాలెన్నో వుంటాయని విన్నాం ! అలాంటివి ఏవైనా స్వయంగా మీరు చూశారా ? అవన్నీ గొర్రెలకాపరులూ కొండజాతి గిరిజనులు చెప్పేకథలూ, నమ్మే — కట్టుకథలా ? మూఢవిశ్వాసాలేనా ? లేక అందులో ఏదైనా సత్యం వుంటుందా ? ఇలాంటి ‘రహస్య-స్థావరాల’ గురించి మీనుంచి తెలుసుకోవాలని చాలాకాలంనుంచీ మా మనస్సులో ఉత్సాహం చెలరేగుతోంది. ఇన్నాళ్ళకు మాకీరోజున ఇలా మీతో ఇంతసేపు విశ్రాంతిగా గడిపే సావకాశం లభించింది ! దయచేసి మాకు మీకు తెలిసిన వింతలూ, విశేషాలూ కొన్ని మాకుకూడా తెలియజేయండి !”

"ఇది మిమ్మల్ని పరిక్షించడానికో లేక మీ విజ్ఞానాన్ని పరిశీలించడానికో మేం అడగడంలేదు ! ఈప్రశ్న కేవలం ఇక్కడి 'పవిత్రస్థలాల' గురించిన యదార్థవిషయాలు మీకు నిశ్చయంగా తెలిసివుంటాయని భావించి వాటినిగురించి మీనుంచి తెలుసుకోవాలని మా కుతూహలం. మీకు తెలిసినవి చెప్పండి లామా మహాశయా !" — అంటూ వేడి వేడి పాల్ పాయసాన్ని కొబ్బరిచెక్కదొప్పలో పోసి అందిస్తూ అడిగాడు మాలోని రహస్యమార్గాల పరిశోధనలో కీలకవ్యక్తి నికోలాస్ రోరిఖ్ !

లామా మహాశయుడు ఆయనకి అందించిన వేడి వేడి క్షీరాన్నం పళ్ళాన్ని అయితే వెంటనే అందుకున్నాడుగాని మేం ఎంతసేపు వేచి చూసినా — ఆయన అందులోని పాయసాన్ని జుర్రుకోవడంలో చూపిన ఆసక్తి మా ప్రశ్నలకు సమాధానం చెప్పడంలో చూపించలేదు. చుట్టూరా నిలబడ్డ మేమందరమూ ఆయనచుట్టూ అర్థచంద్రాకారంగా కూర్చుని — రాత్రి చలికి వెచ్చటిమంటను అందించే చలిమంటలోని నెగడులోని కట్టెల్ని ఎగసంతోసి మంటను మరింత పెద్దదిచేస్తూ అడిగాము ఇంకొక్క సారి.

ఈలోపల 'లామా' గురువుగారు తనకిచ్చిన పాయసం దొన్నెను ఖాళీచేసి తిరిగి మాకు అందించాడు, దాంట్లోవేసిన వెడల్పాటి స్పూన్‌తో సహా భద్రంగా ! కాని నోరువిప్పలేదు. చివాలున లేచి ఎదురుగావున్న వేడినీళ్ళతో చేతులు, పెదవులు శుభ్రంచేసుకొని మళ్ళీ తన స్థానంలోకి వచ్చి కూర్చున్నాడు — జపమాల వేగంగా త్రిప్పుతూ !

క్షణాలు గంటల్లా గడుస్తున్నాయి. అందరం నిశ్శబ్దాన్నే వింటూ ఆయనవంకే ఏకాగ్రతతో కళ్ళు కేంద్రీకరించి చూస్తున్నాం !

అలా కొన్ని నిముషాలు గడిచాయి. చివరికా 'లామా' మహాశయుడు క్షణకాలం కన్నులు మూసుకుని ధ్యానించాడు. తుమ్మెద జంకారం వంటి స్వరంతో ఓంకారం వీణానాదంలా ఆలాపనచేస్తున్నట్టుగా జపించాడు. ఇంతలో తటాలున తన కాషాయవస్త్రంలోనుంచి ఒక చెక్క పెట్టెను తీసి అందులోంచి అడుగున్నర పొడుగు గల టిబెటన్ అగరువత్తిని వెలిగించి మామధ్యలో గుచ్చాడు. దాని సాంబ్రాణి, చందనం, కస్తూరి కలిసిన పరిమళం వాసనలు గుడారంలో మామధ్యన గుండ్రంగా చక్రాకారంగా సుళ్లుతిరుగుతూ పైకిలేస్తుంటే మా లామా పురోహితుడు నెమ్మదిగా మంద్రస్వరంలో అందుకున్నాడు తనలో తానే మాట్లాడుకుంటున్నట్టుగా !

"మీరు అడిగింది చాలా లోతైన విషయం ! అందుకు సూటిగా సమాధానం ఒక్కటే చెప్పగలను — "ఈ హిమాలయ పర్వతాలలో పవిత్రమైనవి, ఆధ్యాత్మికశక్తిగల కేంద్రాలు ఏమైనా వున్నాయా ? అంటే — దానికి ఒక్కటే నా సమాధానం ! అసలు — ఈ హిమవత్ పర్వతమే గొప్ప ఆధ్యాత్మిక శక్తి-కేంద్రం ! శతాబ్దాల తరబడి ఈ హిమాలయ శిఖరాలు మావనజాతికి తలలోని మెదడువంటి కేంద్రంలా పనిచేస్తున్నాయి, ఒక ఆధ్యాత్మిక మానసికకేంద్రంలా ! శరీరంలో కపాలం అనగా మెదడు మన జ్ఞానానికి కేంద్రం అయినట్టే ఈ హిమాలయంలోని "సిద్ధుల-తపోభూమి" కి కూడా 'బ్రహ్మకపాలం' అని పేరెందుకువచ్చిందో అని ఆలోచిస్తే కారణం మీకే తెలియకపోదు".

"ప్రపంచంలోని జ్ఞానులు, మునులు ఇక్కడ తపస్సుచేస్తూవుంటారని కదా మీరుచెప్పేది?" అంటూ మాలో కుతూహలం ఎక్కువైన సైన్సు

పరిశోధకుడు ఔస్పెన్‌స్కీ ముందస్తుగా మాట్లాడాడు. అతడి ప్రసంగం అనవసరంగా తోచింది మాకు. అయినా ఓర్పుతో నిదానించి —

"లామా గురుదేవులు ఏంచెబుతారో విందాం ! మనం చెప్పేదాని కంటే ఆయన చెప్పేది వినటంవల్లనే లాభంకదా !" అంటూ గౌరవంగానే మందలిస్తూ లామా మహాశయుడి ప్రసంగానికి అతని అడ్డు తొలగించాము.

"ప్రపంచానికి జ్ఞానకేంద్రం వంటివి, ఈ హిమాలయాలు అని చెప్పాను గదా! దానికి కారణం మీ సైన్సు పరిశోధకులకు అందని రహస్యాతి రహస్యమైన — నిగూఢసత్యం ఒకటి చెప్పబోతున్నాను మీకు !"

అందరం ఊపిరిబిగపట్టి వినసాగాం ఏం చెపుతాడోనని!

"మీరందరూ ఎంతో చదువుకున్నవాళ్ళు గదా ! సైన్సు పరిశోధకులు, వృక్షశాస్త్రజ్ఞులు ఇంకా భూగర్భశాస్త్రం, ఆకాశంలో గ్రహాలు, నక్షత్రాలు గురించి — ఖగోళంగురించీ, చదివినవాళ్ళున్నారు, మీలో ! ప్రపంచ చరిత్రను కూడా మీలో కొందరు ప్రత్యేకించి పరిశోధన చేసివుండవచ్చు, కాని ప్రపంచానికి మొత్తం తెలియనిప్రశ్న ఒక్కటే !

"ఈ భూమ్మీద "మనిషి" సృష్టి ఎక్కడ జరిగిందీ?"

లామా కన్నులు జ్యోతులవలే వెలిగిపోతున్నాయి, మాఅందరివంకా తీవ్రంగా పరికించిచూస్తూ అడిగాడు — మళ్ళీ అదేప్రశ్న ! సమాధానంగా మేం ఒకళ్ళవంక ఒకళ్ళం చూసుకున్నాం ! చివరికి సణుగుతున్నట్టుగా ఇద్దరు ముగ్గురం కలిసి —

“మానవజాతి పరిణామం (Evolution) గురించి ప్రపంచ సైంటిస్టులకే అనేక రకాల సిద్ధాంతాలున్నాయి ! మానవుడు కోతినుంచి పరిణామంతో పెరిగా డని కొందరంటారు. మరికొందరు — మనిషికీ కోతికీ గల రెండు లక్షణాలూ కలిసిన ‘వంతెనవంటి-జీవి’ కోసం ఇంకా అన్వేషణలు పరిశోధనా చేస్తూనేవున్నారు. ఎన్నోకోతులకి మనిషికీ దగ్గర పోలిక వున్నప్పటికీ ఖచ్చితంగా మనిషీ — కోతీ కలిసిన వంతెనవంటి (Missing Link) జీవి ఇప్పటి వరకూ కట్టని Missing వంతెన Linkగానే మిగిలిపోయింది. మిగతా సిద్ధాంతాలు చాలావరకూ ఊహాగానాలగానే నడుస్తున్నాయి” అన్నాము సమాధానంగా !

దానికి లామా మహాశయుడు గంభీరమైన కంఠస్వరంతో “ సంవత్సరాల క్రిందట; కాదు — లక్షల సంవత్సరాల క్రితమే ! మానవజాతి మొట్టమొదటిగా ఓ జాతిగా ఏర్పాటుచేయబడివున్నది ఈ హిమాలయ పర్వతాలమీదే — అన్న విషయం మీకుతెలుసా ? తెలియదు ! ఇది సృష్టిరహస్యాలలో ఒక్కటైన ఆధ్యాత్మిక రహస్య విజ్ఞానమునకు సంబంధించినది !

అసలు మనిషి ఎలా సృష్టించబడ్డాడు ? మీ మత గ్రంథాలు — అంటే బైబులు, ఖురాను, పార్సీగ్రంథం వంటివి దేవుడు ప్రపంచాన్ని సృష్టించడం గురించి వర్ణనచేసి — మనిషియొక్క సృష్టి మాత్రం అస్పష్టంగా వదిలేశాయేం ? దానికి కారణం ఏమిటో తెలుసా ? మానవుడు నేరుగా భగవంతుడి సృష్టికాదు !!

“ఏమిటీ — మనిషి భగవంతుడి సృష్టి కాదా ?”

అందరం ఆశ్చర్యంతో నోరుతెరిచాం ! ఇంకేం మాట్లాడలేక ! మాకా సావకాశమే ఇవ్వకుండా 'లామా' మహాశయుడు చెప్పుకుపోతున్నాడు గంభీరమైన కంఠస్వరంతో !

“కొన్ని లక్షల — బహుశా కోట్ల సంవత్సరాల క్రితమే ఈ భూమి మీదికి అంతరిక్షంనుండీ వేరే నక్షత్ర గ్రహమండలాలనుండి — అతీతమైన మేధావులైన జీవులు సాహసయాత్రగా వచ్చారు — మనలాగే !”

“ఇతర గ్రహాలనుంచీ వచ్చారంటారా ?” వృక్షశాస్త్రజ్ఞుడు జగదీశ్ చంద్రబోస్ ప్రశ్నించాడు.

“ఈ సూర్యమండలంలోని వేరే గ్రహాలనుంచి కాదు ! — నేను చెప్పేది... వేరే కొన్ని “కాంతి-సంవత్సరాల” దూరంలో — అంటే కాంతి ప్రయాణించే వేగంతో మనం ప్రయాణిస్తే ఎన్ని లక్షల కోట్లమైళ్ళు ప్రయాణిస్తామో అంత దూరానికి ఇంకా అవతలనుంచే వేరే నక్షత్ర మండలంనుంచి రావటంజరిగింది — ఆ “బుద్ధిజీవులు !”

మాలోని సైంటిస్టులందరూ తుళ్ళిపడ్డారు ! మూఢాచారాలతో పుట్టి పెరిగిన 'లామా' మహాశయుడి నోటివెంట అతి ఆధునిక సైంటిస్టులకు రావలసిన 'కాంతి సంవత్సరం' పరిభాష రావడంతో ! దాంతో మాలో అందరికీ లామా మహాశయుడి గురించీ అతడొక మతగురువు మాత్రమే అన్న దురభిప్రాయం పటాపంచలైంది ! ఆయన ఓ గొప్ప మేధావి. ఎంతో మంది గురువులు జ్ఞానులవద్ద ఆయన సేకరించిన విజ్ఞానం ఈనాటి సైన్సువంటి విజ్ఞానం మాత్రమేకాకుండా — ఇప్పటి సైన్సుకు మించిన “రహస్య-జ్ఞాన” మేదో ఆయనకు తెలుసునన్న భావం కలిగింది ! అదే నిగూఢమైన అనుమానం అడుగడుగునా రూఢిఐంది ఆయన మాటలలో.

లామా మహాశయుడు ఇంకా ఇలా ప్రవచనం చేస్తున్నట్టు మాట్లాడాడు.

“అనంతమైన ఈ విశ్వంలో సముద్రం వంటి అగాధ-దూరతీరాలకు ఆవల, కాలంకంటే దూరంగా — ఎన్నో నక్షత్రమండలాలూ, ఇతర ప్రపంచాలూ, అంతరిక్షంలో తేలుతున్నాయి — సముద్రంలోని నౌకల్లాగా! వాటిలో రకరకాల జీవులు అక్కడి పరిస్థితులనుబట్టి అనేకవిధాలుగా ‘పరిణామం’ చెందారు.

అనవసర విషయాలను వదిలేసి మీకు సంగ్రహంగా అంతా చెప్పాలంటే — వాళ్ళు ఇప్పటి మన సైన్సుకన్నా కొన్నివేల సంవత్సరాలు పురోగమించి, భూమ్మీద మానవజాతికంటే ఎన్నో వేలరెట్లు మనకంటే పరిణామంలో ముందడుగు వేసినవాళ్ళే! వారు సాధించిన విజయాలలో మనస్సుకంటే వేగంగా ప్రయాణించే విమానాలుండడమేకాదు — **మనస్సుతో నడిపిస్తే** పనిచేసే కరెంటువిద్యుద్-అయస్కాంత శక్తితో నడిచే పరికరాలుకూడా వున్నాయి.

“అంటే ఒక్కమాటలో చెపుతాను — మీకు అర్థమయ్యేలాగా! ఇప్పటి మానవుడు విమానాలు, అంతరిక్షనౌకలు నడిపిస్తున్నాడు, పెట్రోలుతోనూ విద్యుత్తు, అణుశక్తి వంటి శక్తి ప్రసారంవల్ల! కాని వీటి అన్నిటికన్నా మించినది మానవుడి మెదడులోని “మేధాశక్తి”! సైన్సు ఇంత పురోగమించినా ఇప్పటి భూమ్మీద మానవజాతికి — **మనస్సుతో నడిపే విమానాలు** మన ఊహలకంటే ఎంతో ముందుకాలంలో భవిష్యత్తులో కూడా తయారీలో లేవు.”

“కాని ఇతర నక్షత్రమండలాలనుంచి వచ్చిన ఆ గ్రహాంతరవాసులకు మాత్రం మనస్సులతోనే వాళ్ళ విమానాలు నడిచేవి ! కళ్ళతోనే వాళ్ళ కెమారాలు ఫొటోలు తీయగలిగేవి ! మనం ఇప్పుడట — మాట్లాడితే వినబడే “టెలిఫోన్”లు కనిపెట్టాం ! కాని మాట చెప్పగానే విని మలుపు తిరిగే విమానాలూ, నోటితోనే “ఆగు” అనగానే ఆగే యంత్రాలు కనిపెట్టడం మాట అటుంచి ఊహించనైనాలేము ! అంటే ఇప్పటి మానవజాతి ఊహకు కూడా మించిన పురోగతిని సాధించారు ఆ జీవులు.”

“వారిలో కొందరు ఈ భూమికి వినోదయాత్రగానో విహారయాత్రగానో లేక పరిశీలనాయాత్రగానో వచ్చి అంతా చూశారు ! అప్పుడీ భూగోళం చుట్టూరా ఇంత గాలిలేదు. భూమి ఇంకా అగ్నిపర్వతాలతోనూ మండే లావా జ్వాలలతోనూ భూకంపాలలో ఆకాశానికి ఎగిసే గంధకపు పొగ, రాక్షసి-బొగ్గు మండే బొగ్గుమేఘాలూ ఆవరించివున్నాయితప్ప ప్రాణులు పీల్చేందుకు అవసరమైన ‘ప్రాణవాయువు’ లేదు! భూమిమీద నీరు కూడా నామమాత్రమే!”

“పరిస్థితిని పరిశీలించారు. వారివద్ద విద్యుత్ మెరుపులవంటి తళుకు (sparking) లతో గాలిలోని ప్రాణవాయువునూ కలిపి నీటిఆవిరిని సృష్టించారు — ‘కృత్రిమ మెరుపులతో’ అంటే విద్యుత్తుతోనే మెరుపులను సృష్టించారు. దాంతో ‘మేఘాలు’ ఏర్పడి నీటి ఆవిరి పోగుబడి కొన్ని సంవత్సరాలకు అవి వానచినుకులుగా వర్షించడం ఆరంభమయ్యింది. ఇలా కొన్ని వందల సంవత్సరాల కాలం గడిచిపోయింది ! కాని వాళ్ళు ఆకాశంలోనే ఎగురుతూ అలాగే నిలిచివున్నారు — వెనక్కివెళ్ళకుండా” తూనీగలలాగే !

"ఇలా భూమ్మీద వాతావరణం మారడంచూసి వాళ్ళ విమానాల్లో తెచ్చిన సన్నటి ఆవాలవంటి, ధూళిరేణువులవంటి ఏదో పొడిని చల్లారు, హెలికాప్టరువంటి విమానాలద్వారా ! ఇప్పుడు మన విజ్ఞానంతో వెనక్కి చూస్తే తెలుస్తుంది. వాళ్ళు స్ప్రేద్వారా చల్లింది మొక్కల వివిధ జాతి విత్తనాలని. అలా మరి నూరేళ్ళు గడిచాక చూస్తే మేఘాలలోని తడితో ఈ విత్తనాలు మొలిచి క్రమంగా పెద్దపెద్ద వృక్షాలుగా పెరిగి బలిసి పచ్చని ఆకులతో భూగోళంపైనంతా కప్పేశాయి సూర్యరశ్మి కూడా చొరకుండా !"

"ఇలా జరిగినట్టు మీ టిబెటన్ మతగ్రంథాలలో ఎక్కడైనా రాసి వుందా ?" — అన్న వైష్ణవ పండితకుటుంబంలో జన్మించిన శ్రీనివాస చక్రవర్తి ప్రశ్నవిని 'లామా' మహాశయుడు భళ్ళున ఎగతాళిగా నవ్వాడు.

"చక్రవర్తీ ! నువ్వేనా ఈప్రశ్న వేస్తోంది ? మీ బ్రాహ్మణులు పురాణాలు చదువుతూవుంటారే ! వినలేదా ?"

"విన్నాను 'లామా' మహాశయా ! అందులో మీరు చెప్పే కథంతా లేదే ?"

"ఎందుకు లేదు ? మీరు **"భాగవతం"** రోజూ పురాణంగా చెబుతూంటారుగదా గుడిలో మీ తాతగారి టైమునుంచీ ?" ఈసారి త్రుళ్ళిపడ్డం చక్రవర్తి వొంతైంది 'లామా' పురోహితుడి భయంకర విజ్ఞానానికి ఆశ్చర్యబోవడంతో !

"ఔను ! **'భాగవతం'** మేము ఎక్కువగా చదువుతాం !"

"మీకు సంస్కృతం వచ్చుననుకుంటా !"

"ఏదో కొంచెం పరిచయంవున్నది". ఈసారి కొంచెం జంకుతూనే సమాధానమిచ్చాడు చక్రవర్తి.

"ఐతే వినండి ! — మీ భాగవతంలో 'ప్రాచేతసులు' అనే మానవ జాతికి పూర్వీకుల కాలంలో ఈ భూమ్మీద పెద్దపెద్ద వృక్షాలు ఎన్నో ఆకాశానికి పెరిగి సూర్యరశ్మిని కూడా కప్పేశాయని లేదూ !"

"ఔను వున్నది".

"మీ భాగవతంలో మానవజాతి సృష్టి ఎక్కడా భగవంతుడే చేసినట్టు లేదుగదా ! తాళాలపనిని తాళాలు బాగుచేసేవాడే చేస్తాడు — భగవంతుడు చేయడుగదా ? అలాగే ! 'మానవసృష్టి'ని భగవంతుడు చేయ్యలేదు !"

"లేదా !" — తెల్లబోతూ అడిగాడు చక్రవర్తి !

"మీ దేవుడు విష్ణుభగవానుడు బ్రహ్మదేవుడనే సృష్టికర్తను సృష్టించాడు భగవంతుడు ! కాని, మనిషిని సృష్టించినవాడు మనవంటి మనుష్యులే !"

"ఏమిటి ? మనవంటి మనుష్యులా ? ఆశ్చర్యంగావుందే !"

"**ప్రజాపతులు** — అన్న పేరు వినలేదూ ? 'దక్షప్రజాపతీ' పులస్త్య బ్రహ్మ బ్రహ్మమానస పుత్రులు, సనత్కుమారుడూ, దశబ్రహ్మలకథా !... ఇలా !"

"ఔనవును ! వాళ్ళందరూ దివ్యపురుషులు !"

"కాదు ! '**ప్రజాపతులు !**' అంటే మానవజాతిని సృష్టించిన విజ్ఞానవేత్తలు!" అన్నాడు 'లామా' దృఢంగా.

"మరి... మీరు... ఇతర గ్రహమండలాలనుంచీ అంతరిక్షయానంలో ప్రయాణించిన జీవులంటున్నారుగా !"

"............"

"కంగారుపడకండి ! మీరు చదివింది జీర్ణించుకోలేదు — అంతే! మీ పురాణాలలో అంతా స్పష్టంగానే వున్నది. మానవజాతిని సృష్టించిన శాస్త్రజ్ఞులే ఈ "**ప్రజాపతు**"లు ! ఇందులో కొందరు భూమియొక్క ఉపరితలంలో అంతరిక్షానికి అవతలిభాగాన సంచరించేవారనీ, వారు విమానాలలో ప్రయాణించారనీ లేదూ...? '**ఉపరిచర–వసువు**' అనీ, దక్ష-ప్రజాపతి, కర్దమప్రజాపతి, ఇంకా ఆయన భార్య దేవహూతి, 'శతరూపా' అంటే వందల రూపాలను సృష్టించే "క్లోనింగ్" వంటి విద్య !"

"ఏమిటో మీరు చెపుతూంటే ఆశ్చర్యంగా మాలో ఏదో మబ్బుతెర విడిపోయినట్టు మా పురాణాలన్నీ కొత్తగా — ఒక 'సైన్సు' వెలుగులో కనిపిస్తున్నాయి చిత్రంగా !"

'చిత్రం' ఏమీలేదు ! మిత్రులారా మనం పురాణాలనగానే వాళ్ళను మనకంటే చిన్నచేసి ఆలోచిస్తాం. నిజంగా మనమే చిన్నవాళ్ళం ! అప్పటి సైన్సుకి మనమే ఇంకా ఇప్పటి సైన్సుతో పోలిస్తే మరుగుజ్జుల్లా ఎదగనే లేదు ! నిజం చెప్పండి ! ఏదేశపు సైంటిస్టుగానీ తన మెదడుతోనే — విమానాన్ని నడపగలడా ?"

'లామా' మహాశయుడు పరిహాసంగా అడిగాడు సూటిగా ! సిగ్గుతో తలదించుకున్నాం మాలో సైంటిస్టులం ఐనప్పటికీ, అస్సలు అలాంటి ఆలోచనే మాకు రానందుకు ! అసలు ఏదో 'సైంటిస్టులం' అనుకునే

మాకంటే ఈ 'లామా' మహాశయుడే నిజమైన 'సైంటిస్టు'-అంటే సైన్సు దృక్పథం గల ఆలోచనావేత్త అనుకుంటూ !

తెల్లబోయిన మా ముఖాలవంక చూసి 'లామా' మహాశయుడు, ఇంకా ఇలా అన్నాడు :

“సరే ! ఈ పురాణాల విషయం ఇంతటితో వదిలేయ్యండి ! ఆ 'అంతరిక్షం'-నుంచి వచ్చిన “జీవులే” భూమ్మీద వాతావరణాన్ని, మొక్కల సాయంతో సూర్యరశ్మి సహకారంతో — అంతటా ప్రాణవాయువుతో నింపేశారు ! అందువల్లనే ఇపుడు మనం ఇలా ఊపిరితో 'ప్రాణవాయువు'ను పీల్చి ఇలా జీవించగలుగుతున్నామంటే — ఈ “వాతావరణం” అంతా, ఆనాడు వారు ఏర్పరచినదే ! అదే — ఈ “ప్రజాపతులు” “**ఉపరిచరవసువు**” అనబడే అంతరిక్ష విమానంలో ఉపరితలంలో “చర” అంటే చరించే — అంతరిక్ష నావికుడు !

అలా ప్రారంభించిన “మానవ-సృష్టి” ఈ హిమాలయంలోనే ఒక రూపం ధరించింది 'మనిషి' ఆకారంలో — క్లోనింగ్ వంటి జీవకణాలను రకరకాలుగా మార్చే ఓ సైన్సు ప్రక్రియతో ! ఇలా మొట్టమొదటి మనిషి ఆకారంతో రెండు కళ్ళూ, రెండు కాళ్ళూ, చేతులు, ఇంద్రియాలూ ఇలా ఏర్పాటుతో ఒక “ప్లాను” గీసి నిర్మాణం చేసినవారే **“మనువులు”**. మనువు అంటే — మానవుడి ఆకారాన్ని సృష్టించిన శాస్త్రజ్ఞులు అని అర్థం తీసుకోండి. మీకు ఏబాధ వుండదు” అన్నాడు లామా మహాశయుడు. జీవకణాలతో జన్యుపరిశోధనలద్వారా జంతువులయొక్క శరీర నిర్మాణం దేవతలయొక్క మేధాసంపత్తినీ — రెంటినీ కలుపుతూ సృష్టిం

చారు ఈనాటి మానవుడిని. అందుకే మనిషి ఇప్పటికీ — మనస్సులో దేవతలస్థాయిలోని ఆలోచనలతో — శరీరంలో జంతువులస్థాయిలోని కామక్రోధాలతోనూ...

— ఇప్పటికీ ఈరెండింటితో కొట్టుకు చస్తున్నాడు మనిషి — చెక్కభజన చేసినట్టు !! అర్థంగావటంలేదుటయ్యా ?'' అన్నాడు లామా మహాశయుడు.

III

“సంగ్రహంగా ఒక్కమాటలో చెప్పాలంటే ఇప్పటి మానవుడు భూమి మీద జంతువులనుండీ పరిణామంతో పుట్టలేదు ! అతడు విశ్వాంతరాళం నుండి కాంతిని మించిన వేగంతో ప్రయాణించే **'దేవతలు'** అనబడే విమానాలలో ప్రయాణించే **'బుద్ధిజీవుల'** సైన్సు ప్రక్రియలద్వారా ఇప్పటి 'క్లోనింగ్'-వంటి విధానంతో మనిషియొక్క జీవకణాలు సృష్టించబడ్డాయి ! మొదట్లో చేసిన ప్రయోగం ఫలితంగా పుట్టిన మానవజాతి తక్కువ బుద్ధిబలంతోనూ, ఎక్కువ శరీరబలంతోనూ వుండేవారు ! మీరడిగిన ప్రశ్నకు సమాధానం ఇక్కడ లభిస్తుంది. ప్రాచీన టిబెటన్‌లో వాయవ్య దిశగా గనక ప్రయాణిస్తే ఎత్తైన హిమాలయపర్వత పీఠభూములనుంచి, ఇప్పటి “హిందూ-ఖుష్” కనుమలద్వారా వెళితే ఎత్తైన గుహలవంటి మకరతోరణాలతో ఆదిమమానవుడి “నమూనా”-విగ్రహాలు కనిపిస్తాయి ! అవి సుమారు 20-అడుగుల ఎత్తువుండి 'మానవజాతి — ప్రథమసృష్టికి చెందిన రూపాలు అక్కడ దాచబడ్డాయి — 'బామియా' (Bamiya) అనేచోట గుహలలో !

ఆతరువాతగా జరిగిన ప్రక్రియల ఫలితంగా తయారైన మానవ జాతి 15 నుండి 12 అడుగుల ఎత్తుండేవారు ! మూడవ ప్రయోగం ఫలితంగా సృష్టి ఐవచ్చిన మానవజాతి ఇప్పటి ప్రస్తుతం జీవిస్తున్న మానవులకి పూర్వీకులు !! ఈ గుహలలో వుండే శాసనాలు చదివితే అపుడు నేచెప్పిన మొదటివిషయం — మానవసృష్టి ఈ హిమాలయ పర్వతాలలో జరిగిందన్న సంగతి రూఢిఅవుతుంది. దీనికి గుర్తులుగా కొన్ని చిన్నమణులు ఇప్పటికీ కనిపిస్తాయి. మానవ మేధస్సును సృష్టించిన కలశంవంటి పాత్రలో జీవకణాలు పెంచానన్నానే ఆ కలశంపేరే "బ్రహ్మ కపాలం !" అంటే బ్రహ్మదేవుడు మానవజాతియొక్క మేధస్సును రూపొం దించిన పవిత్రక్షేత్రమే ఈ 'బ్రహ్మకపాలం !' 'బ్రహ్మ' అనగా మేధస్సు అన్న సంగతి మీకు తెలుసుగదా ?" — అన్నాడు 'లామా' మహాశయుడు.

" 'కలశం'లో "సృష్టి"-చేశారంటున్నారే ! దీనికేమైనా సాక్ష్యాధారాలు లభిస్తాయా మన ప్రాచీన మతాలలో ఎక్కడైనా?" — అంటూ ప్రశ్నిం చాడు జగదీశ్చంద్రబోస్.

"జగదీశబాబూ ! మీరూ, సాంప్రదాయ పరాయణులైన బెంగాలీ బ్రాహ్మణులుగదా ! మీలో అనేక శుభకార్యాలలో పురోహితులు పూజలు నిర్వహిస్తారుగదా మీకు తెలిసేవుంటుంది ! అందులో మొదటిగా చేసే పనేంటి ?" — అన్నాడు 'లామా'...

"కలశపూజ" అంటాం దీన్ని !!! అంటే గుండ్రని వెండిపాత్రనుగాని పంచలోహపు పాత్రగాని "కలశం"గా పెట్టి అందులో జలం నిండుగా పోసి ఆ కలశాన్ని పూజిస్తాం !" అన్నాడు.

“మీకు సంస్కృతమంత్రాలకు అర్థం తెలుసునుకదా ? — ఆ కలశపూజలో కలశాన్ని ఏమని పూజిస్తారు. సృష్టికి సంక్షేపరూపమైన ‘కుంభాకార’ రూపంలోని “కలశం” అనిగదూ !

“అవును ఈ విశ్వమే ఒక కలశాకారంగా సృష్టి జరిగిందనీ ఆ మంత్రాలకి అర్థం ! ఆ కలశంయొక్క ముఖంలో విష్ణువూ కంఠంలో రుద్రుడు, గర్భంలో సమస్తమైన సముద్రాలు, పవిత్రజలాలు ప్రాణ చైతన్యంతో నింపినట్టు సరిపోల్చి అందులో నవధాన్యాల విత్తనాలన్నీ వేసి — వనమూలికలుకూడా కలశంలో వేసి “కలశ-పూజ” చేస్తాం ! చందనంపొడి గూడా వేస్తాం !” అన్నాడు జగదీశ్చంద్రబోస్.

ఆ కలశమే ఇపుడు సైన్సుపరిభాషలో గుండ్రని ‘గాజుసీసా’గా పిలిచే గుండ్రని ‘రౌండ్-ప్లాస్క్” వంటి సీసా ! ఒకమాదిరి రకం పెద్ద ‘సెంటు-సీసా’ వంటిది, అనుకోవచ్చు ! అందులో పరిశుద్ధమైన నీళ్ళుపోసి జీవకణాలను అంటే పురుషబీజాలనూ స్త్రీ జీవకణాలనూ వేసి క్లోనింగ్ వంటి ప్రక్రియతో మానవజీవుల పిండాలను ముందరగా ఇలా కలశంలో సృష్టించారు. ఆతరువాత దాన్ని గర్భాశయంలో ప్రవేశపెట్టి పెంచి పోషించారు. తద్వారా క్రమంగా మానవసృష్టి ఏర్పడింది” మీ “భారతం” అన్న గ్రంథంలోనూ వ్యాసమహర్షి గాంధారి గర్భపిండాన్ని నూరు కలశాల్లో పెంచాడని వ్రాసివుందిగదా? — అన్నాడు ‘లామా !’

“మరి వివాహవ్యవస్థ ఎప్పుడు ఏర్పడింది? తెలివిగా ప్రశ్నించానని కాస్తగర్వంగా అడిగాడు నోటోవిచ్ రాయబారి.

“అప్పుడు వివాహంతో పనేమిటి ?” తిరిగి ఎదురుప్రశ్న వేశాడు

లామా! నోరుతెరిచి ఆశ్చర్యంతో కళ్ళార్పకుండా చూడటం మావంత య్యింది. "మరి వివాహం లేకుండా ఎలాగ ?" — అందరం ప్రశ్నించాం.

"ఆగండాగండి ! — అప్పటి ప్రథమ మానవజాతికి స్త్రీ పురుష భేదం లేదు — అంటే ఒకేశరీరంతో స్త్రీయొక్క అవయవాలూ, పురుషావయవాలు కలిసివుండేవి."

"దానికి ఋజువేమిటి ?"

"మీ హిందువుల దేవాలయంలోకి వెళ్ళిచూడండి. శివాలయంలో ఏమి కనిపిస్తుంది ? శివలింగం, పానవట్టం అంటే అర్థం స్త్రీపురుష భేదం కలిసి ఒకేశరీరంతో ఏర్పడిన జీవరాశి అనిగదా".

"అదెలా అనుకుంటాం. శివలింగం రాతితో చేసిన మతచిహ్నాం కావచ్చు" అన్నాడు.

"పోనీ అలా అనుకున్నా — మీ శివుడు అర్థనారీశ్వరుడు గదా ? సగభాగం పార్వతిగా మిగిలినభాగం శివుడిగా అంటే సైన్సు పరిభాషలో అర్థం ఏమిటి ? మీరు జీవశాస్త్ర పండితులుగదా. మీరు చెప్పండి జగదీశ్‌బాబూ ! ఇప్పటికీ వృక్షశాస్త్రములో పురుషావయవాలు, గర్భాశయం ఏర్పడివుండలేదా ?

అంతేగాక వానపాములు, ఇంకా ప్రాథమిక ప్రాణికోటిలో జీవరాశి అంతా స్త్రీ పురుష భేదాలు కలిగిన జంట-శరీరాలతోనేగదా సృష్టించ బడింది ? ఇది మీ జంతుశాస్త్రజ్ఞులకే తెలుసు.

అదే మానవజాతికి కూడా ప్రారంభంలో ఏర్పడివుండేది. ఇదే

కథలరూపంలో పురాణాలలో ముందుగా శివపార్వతులు కలిసి అర్థనారీశ్వరుడుగా ఆతరువాత దక్షయజ్ఞం మన్మధుని భస్మంచెయ్యగా, ఆతరువాత శివుడు రుద్రుడిగా పార్వతి ఉమాదేవిగా స్త్రీపురుషులుగా విడి-విడిగా జన్మించడం జరగలేదా ? ఇదంతా సైన్సు సత్యాలను కథల రూపంలో అందించిన నీతికథలని మీకు తెలియదా ?" అన్నాడు లామా !

మాలోని మిగతా సైంటిస్టులందరం విస్తుపోవడం మావంతయ్యింది. కేవలం మతఛాంధసులైన పురోహితులైన లామా అనుకున్న ఈ బౌద్ధ గురువుకున్న విజ్ఞానాన్ని చూసి ఆశ్చర్య పోవలసివచ్చింది.

"ఆవిధంగా మానవజాతి మొదటిదశలో స్త్రీపురుష లింగబేధం ఏర్పడకుండా జరిగింది. అందుచేత వివాహవ్యవస్థ ప్రసక్తే లేదు."

"ఆతరువాత యుగంలో స్త్రీపురుషుల శరీరాలు వేరై సృష్టి మొదలైంది. ఇదే మన్మధుడి బాణంతో శివపార్వతుల కళ్యాణంగాధలోని అర్థం ! సరే ఈ విషయాన్ని ఇంతటితో వదిలేద్దాం.

మీరడిగిన అసలు ప్రశ్నకి వద్దాం. ఈ హిమాలయాలలో వింతలూ, విశేషాలు గురించి అడిగారు. ఇక్కడ జీవించే శిలలువుంటాయి — సాలగ్రామాలు అంటారు.

"అంతేనా ! స్పటికములు గూర్చి స్ఫటిక శివలింగాలు గూర్చి వినలేదా?"

"విన్నాం ! చూశాంకూడా ! మహారాష్ట్రలోని దత్తపీఠాలలో ఒకచోట అడుగున్నర ఎత్తుగల స్పటికంతో సహజంగా తయారైన శివలింగం వున్నది. అలానే కాశీలోనూ మరెక్కడో స్పటికంలో చెక్కిన శ్రీచక్రం —

అనబడే శ్రీయంత్రం వున్నదట" అన్నాడు.

"అదెక్కడవున్నదో మీకు తెలియదా ?" అన్నాడు లామా చోగ్యాల్ ! అందరం భయంగా అపరాధపరిశోధకుడు ఛార్లెస్‌బెల్‌వంక చూశాం ! దీనితో సాహసయాత్ర గుట్టు బయటపడుతుందేమోనన్న భయంతో.

ఇంతలో బయట కాపలావున్న గుర్ఖాల బాకాలు భం — 'భం' అని మోగించటంతో తెల్లవారుతున్నదని గ్రహించి కంగారుగా అందరం లేచిపోయాం !

లామా మహాశయుడు పెద్దగా నవ్వాడు, మా కంగారు గుర్తించినట్టు "వెతకబోయే రహస్యాలు ముందుగానే అడగడం దేనికి ? చూడడమే మేలుకదా !" — అంటూ ఆనాటి చర్చను అకస్మాత్తుగా ముగిస్తూ తాను కూర్చున్న సోఫాలోంచి లేచాడు.

ఆయనతోటే అందరం లేవక తప్పలేదు. ఆనాటి చర్చ అంతటితో ముగిసింది.

"అయ్యో ! తెలీకుండానే రాత్రి అంతా మేలుకొని మిమ్మల్ని కూడా మాట్లాడించాం ముసలివాడైన మన లామా పురోహితుడిని" — అనుకుంటూ.

కాని ఆయనకేమీ అలాంటి బడలిక కనిపించలేదు. ఏమీ జరగనట్టే తటాలున లేచి తన స్నానం, జపం, పూజ నిమిత్తం తన గుడారానికి వెళ్ళిపోయాడు, మావైపు తిరిగి చూడనైనా చూడకుండా !

⁂

32

పద్మంలో మణి - స్పటిక పర్వతం !

దారిపొడుగునా రాత్రి కురిసిన మంచుతో దట్టంగా మేం నడిచే మార్గం కూరుకొనిపోయి ఉన్నది. అతికష్టంమీద ముందుకు సాగాల్సి వస్తోంది. మా కుడి, ఎడమప్రక్కల ఎత్తైన పర్వతాలు కంటిచూపు ఆనే సరిహద్దుదాకా ఆకాశంలోకి నిటారుగా పెరిగిపోయివున్నాయి. అవి మంచుపర్వతాలు కావడంచేత నడిమధ్యగా నాగటిచాలు వంటి సన్నని కాలువ వంటి మార్గంగుండా నడిచి మేము వెళ్ళాల్సివస్తోంది. అదంతా రాత్రి మంచుకురిసి ఉప్పురాళ్ళ పొడివలే పేరుకుపోయివుండటంచేత మాముందు 5, 6 అడుగుల ఎత్తున మంచుతో పేరుకుపోయింది — మార్గమంతా !

చాలాచోట్ల శ్రమపడి పొడుగాటి రైల్లో బొగ్గువేసే — పారలవంటి మంచు పారలతో త్రవ్వి ఎడమవైపుకి, కుడివైపుకి దూరంగా విసిరివేస్తూ మాదారిని శుభ్రంచేసుకుంటూ నడవాల్సివచ్చింది. అందువల్ల మా ప్రయాణం అతినెమ్మదిగా సాగుతోంది. దానికితోడు నిటారుగా ఎత్తుమీదకి ఎక్కుతూ మెరకదారి వెంట నడవటం ఆయాసం కలిగిస్తే శ్వాస అందకుండా మరింత ప్రయాసపడుతున్నాం అందరం. అలా ఒకగంటదాకా నేలమీద మంచు తవ్వుకుంటూ ప్రయాణంచేసి అలసటగా ఒకరి ముఖాలు ఒకరుచూస్తూ నిలబడ్డాం — ఆశ్చర్యంగా !

మా ముక్కులలోని శ్వాస తెల్లటి పొగమంచు వంటి రంగుతో — రైలింజన్‌లోని ఆవిరిలాగా గుప్పుగుప్పుమని — చలివాతావరణం కావడంచేత మేమంతా సెగలు, పొగలు కక్కుతూ ఉన్నాం శ్రమతో ! ఆస్థితిలో మమ్మల్ని చూస్తే మాకే నవ్వు వచ్చింది. కుడివైపు తిరిగి నోటోవిచ్‌వంక చూస్తే నిగనిగలాడే అతని నల్లనిగెడ్డం తెల్లగా మంచుతో కప్పబడి క్రిష్టమస్‌తాత లాగ నెరిసినట్లు కనిపించాడు, కనుబొమ్మలమీద కూడా మంచుతో — నేనూ అలాగే ఉండివుంటాను ! — కాకపోతే ఇంకాస్త భయంకరంగా ! ముందుకు చూస్తే చార్లెస్ బెల్ పెట్టుకున్న ఎండకళ్ళద్దాలమీద మంచు పొడిగారాలి పేరుకొని పోయింది. అతడు ఒక భూతంలా కనిపిస్తున్నాడు వింతగొలిపేలాగా ! వెనుకగా నడుస్తున్న నికొలాస్ వీపుమీద 5-6 కిలోల మంచుపొడి కురిసి అతడు ఒకచిన్న మంచుశిఖరంలా ఉన్నాడు. అందరం భళ్ళున నవ్వుకున్నాం, ఒక్కొక్కళ్ళను చూస్తే ఇంకొకళ్ళకు నవ్వువచ్చింది. టైము 10-30 దాటుతుంది. సూర్యుడు కుడివైపు కోణంలో సూదిలాంటి పదునైన మంచుశిఖరంపైనించి

వెలుగుతూ, సూర్యకాంతిలోని ఇంద్రధనస్సు లాంటి ఏడురంగుల కాంతి చక్రంలో ఎంతో వింతగొలుపుతున్నాడు.

"ఇక సూర్యుడు ఉదయించాడు, పర్వాలేదు. ఇంక ఈ మంచు కరుగుతుంది, మన మార్గం కొంత తేలిక అవుతుంది" అన్నాడు ప్రొఫెసర్ రే లంకాష్టర్.

"సూర్యుడు ఎంత ఆలస్యంగా ఉదయిస్తాడో — అంత త్వరగానే అస్తమిస్తాడు ఎత్తైన కొండలచాటుకు వెళ్ళి ! దాంతో ఈ లోయ అంతా నీలం, సిరారంగు చీకటితో దారి కనిపించకుండాపోతుంది. చలి మరింత వణికించేస్తుంది. మంచుసంగతి అనుకోకుండా ఉంటేనే మంచిది" — అంటూ భావనగర్ మహారాజ్ భళ్ళున నవ్వాడు. మా అందరి నడక చురుగ్గా సాగించాలని నిర్ణయించుకున్నాము. దానికి ముందుగా ఆగి రెండునిముషాలు విశ్రాంతి తీసుకొని వేడి వేడి కాఫీ ఫ్లాస్కులోంచి ప్లాస్టిక్‌మగ్గులో పోసుకుని ఆత్రంగా త్రాగేస్తున్నాం, వేడి చల్లారిపోకుండా !

కడుపులోకి వెచ్చగా కాఫీ ద్రావకం ప్రవహించగానే చురుకు అందుకుంది మాలో ! మూడుగంటలు శ్రమపడి మేము నడుస్తున్న ఆ రెండు కొండల మధ్యవున్న లోయచివరికి వచ్చేశాం.

కుడివైపుగా మాదారి మలుపుతిరిగింది. విశాలమైన మైదానంవంటి ఓ ప్రదేశం కనిపించింది. ఆశ్చర్యపోయాం ! ఒక వెయ్యిగజాలు ముందుకీ, 2000 గజాలు కుడి, ఎడమవైపులకూ, ఎవరో శుభ్రంగా పారతో మంచును చెక్కినట్లు బల్లపరుపుగావుండి ఎటుచూసినా ఈ మైదానం చివరగా ఎదురుగుండా — ఒక నిటారుగా నిలబెట్టిన పిరమిడ్ ఆకారంలో,



“కైలాసం” వెండికొండ! శివనివాసంగా యోగులు ప్రదక్షిణాలు చేసే పుణ్యశిఖరం!

ముక్కోణాకారంలా — ఒక శిఖరం కనిపించింది.

“ఆగండి ! మన యాత్రలో దాదాపు ఆఖరి మజిలీకి చేరుకుంటున్నాం. ఇదే మనకి కావలసిన మైదానం, జాగ్రత్తగా పరిశీలిస్తే కుడివైపున ఒకచిన్న ధ్యాన బుద్ధవిగ్రహంకలిగిన చిన్న దేవాలయం కనిపిస్తుంది” అన్నాడు నోటోవిచ్.

“ఆ ఎదురుగుండా వున్న పర్వతం చూడు ! అది మన ఫోటోలలో కనిపించే ఈజిప్ట్లోని పిరమిడ్ ఆకారంగా మంచు ఎలా కురిసిందో !” అంటూ ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు జగదీష్ చంద్రబోస్. మా వెనకాలే వస్తున్న చార్లెస్ బెల్ గుప్పుగుప్పుమని పొగ పీలుస్తున్న పైపును ఆర్పివేసి ఛటుక్కున తన ప్రక్కజేబులో పెట్టుకున్నాడు.

“వాట్ మిస్టర్ చార్లెస్ బెల్ ! మీరు ముఖ్యమైన పని పడినపుడు పైపును వెలిగిస్తారే ? ఇప్పుడు పైపును ఆర్పివేస్తున్నారేమిటి ?” అంటూ ప్రశ్నించాము మా సాహసయాత్రీకులం. వెంటనే సమాధానం చెప్పకుండా తన కోటుజేబులోంచి బైనాక్యులర్స్ తీసి ఎదురుగా ఉన్న శిఖరాన్ని పరిశీలించాడు.

“మైగాడ్ ! అది మంచుపర్వత శిఖరం కాదు — మనం రోజూ చూడాలని కలలుగనే **స్పటిక–పర్వతం** అదే !” అన్నాడు ఉద్రేకపడుతూ. చార్లెస్ బెల్ పొగపీలుస్తున్న పైపును ఎందుకు ఆర్పివేశాడో — ఇప్పుడు అర్థమైంది మాకు.

“అరే ఇంత దగ్గరకు వచ్చేశామా స్పటిక పర్వతానికి మనం, అంటే వెంటనే చేరుకుంటామన్నమాట” అన్నాడు ఔస్పెన్స్కీ ఉత్సాహంతో.

అలా మన కంటికి కనిపిస్తుందిగాని కనీసం 15–20 కిలోమీటర్లు అయినా నడవాల్సివుంటుంది, ఆ స్పటికపర్వతం పాదపీఠం చేరుకోటానికి !

"బాబోయ్ ! ఇంకా అంత దూరమే !" — అంతా ఏకకంఠంతో ఆశ్చర్యపోయాం, చూడటానికి ఎంత దగ్గరగా కనిపిస్తుందో ఆ శిఖరం. అప్పుడు గుర్తుకు వచ్చిందికూడా మేము 28,000 అడుగుల ఎత్తుకుపైన — అతి నిర్మలమైన ధూళి, దుమ్మూలేని వాతావరణంలో వుండబట్టి ఎంతోదూరంగా ఉన్న వస్తువులు కూడా ఆ హిమాలయ వాతావరణంలో దగ్గరగా వున్నట్టు కనిపిస్తాయని !

మరో గంటప్రయాణం కాస్త సాఫీగా సాగింది. ఈసారి మా కుడి ఎడమవైపుల పర్వతాలు లేవు — విశాలమైన మైదానం ! చుట్టూరా కనుచూపు అనే దూరంలో కోసుగా సోగలుతేరిన తామరపద్మం రేకల వంటి శిఖరాలతో చుట్టూరా గుండ్రని ప్రహరీగోడ కట్టినట్లు పర్వత శిఖరాలు తీర్చిదిద్దినట్లు కనిపించాయి — ఒక మహాపద్మం చుట్టూవున్న రేకులులాగా !

"ఓం మణి పద్మహుం" — అంటూ మాతోపాటే నడచివస్తున్న లామా దొర్జీ చోగ్యాల్ మహాశయుడు తటాలున ఆ మంచుమైదానంమీద సాష్టాంగపడి — స్పటికపర్వతానికి భక్తితో తలవంచి నమస్కరించాడు. అందరం ఒక్కసారిగా త్రుళ్ళిపడ్డాం ! మా తలలో ఏదో మెరుపు మెరిసినట్లు విద్యుత్‌వలె వెలిగింది — మరుక్షణమే మా మనస్సులలో భాసించింది ఆ చుట్టూరా ఏర్పడిన పర్వతశిఖరాల ఆకారం — దాని మధ్యనే వున్న స్పటికపర్వత శిఖరం !! — ఇదే కదా? ఆ మంత్రానికి అర్థం ! అనుకుంటూ.

"లామాదోర్జీ గురుదేవా ! తటాలున మీరు ఇలా సాగిలపడి మొక్కి — ఈ మంత్రాన్ని ఇక్కడిలా పఠించారే ! అందుకు ఏదో ప్రత్యేకమైన అర్థం, సందర్భం ఏదైనా వున్నాయా ? దయచేసి మాకు వివరంగా తెలియజెప్పండి" అంటూ భక్తితో ప్రార్థనాపూర్వకంగా ప్రశ్నించాను నేను. మిగతా సాహసయాత్రీకుల బృందం అందరమూ చూపులతోనే అదే ప్రశ్నను అడుగుతున్నట్టుగా తలలు పంకించి వింటున్నాం సమాధానంకోసం.

లామా-మహాశయుడు వెంటనే సమాధానం చెప్పకుండా లేచి నిలబడి ఎదురుగా ఉన్న స్ఫటికపర్వతంవైపు తిరిగి చేతిలోని జపమాలను పైకెత్తి తన రెండు కనుబొమ్మల మధ్యన ఆనించి ఆతర్వాత హృదయానికి తాకించి — మళ్ళీ దాన్ని పైకెత్తి తన శిరస్సుపైన ఆనించి — ఇలా మూడుసార్లు అదే మంత్రం జపిస్తూ చేతితో సూర్యనమస్కారం వంటి తాంత్రిక-యోగముద్రలు పట్టి ధ్యానించాడు. ఆపైనగాని ఆయన మాతో మాట్లాడలేదు. చివరికి తన్మయంనుంచి భక్త్యావేశంనుంచీ నెమ్మదిగా తేరుకుంటూ ఇలాఅన్నాడు :

II

"మీరు గతంలో టిబెట్ గురించీ ఈ హిమాలయపర్వతాలలోని వింతలూ, ఆధ్యాత్మిక రహస్యాలగురించి అనేక పుస్తకాలు, చదివేవుంటారు ఈయాత్ర చేపట్టేముందే ! అందులో తప్పకుండా ఈ మంత్రం —

"ఓం–మణి–పద్మ–హూం"!

అన్న పవిత్ర లామాగురువులు నిత్యం జపంచేసే మంత్రం

గురించి కూడా చదివేవుంటారు. ఇది భవిష్యత్తులో అంటే ఈ "కలి యుగం" చిట్టచివరగా దశావతారాలలో వచ్చే అవతారమూర్తి పవిత్రస్థలం "శంబల" గురించిన — రహస్య సంకేతాలను తెలిపే మంత్రం ! దీని అర్థం కూడా ఏ కాస్త సంస్కృతం తెలిసినవాళ్ళకయినా తేలికగా అర్థం ఔతుంది.

'ఓం' అనగా విశ్వం అంతా వ్యాపించి ఉన్న ఆత్మశక్తి లేక పర తత్వానికి గుర్తు ! అది, సృష్టి ప్రారంభంలో తనంతట తానుగా పుట్టిన ప్రణవ మంత్రం. ఇందులో త్రికాలాలు అంటే రాబోయే భవిష్యత్తూ జరిగిపోయిన కాలమూ, ఇప్పుడు నడుస్తున్న వర్తమాన కాలమూ – ఈ మూడింటిని కలిపే **'శాశ్వతకాలము'** అనబడే బ్రహ్మ ఆయుష్షు లేక బ్రహ్మకల్పం అంతటా నిలిచివుండేదే — ఈ ఓం !

ఇకపోతే **"మణిపద్మ-హుం"** అన్న మంత్రంలో **'మణి'** అనగా నిర్మలంగా కాంతిని ఇటునుంచి అటు ప్రసరించేలాగ పరిశుద్ధిపొందిన ఆత్మ అని అర్థం ! అది ఈ శంబలప్రభువు కేంద్రస్థావరమైన ఈ స్ఫటిక పర్వతాన్ని సూచిస్తుంది ! అదే మీకు ఎదురుగా కనిపించే ఈ ముక్కోణంలా నిలబడివున్న ఈజిప్టులోని పిరమిడ్ల వంటి స్ఫటికపర్వత శిఖరం !! అదే ఈ మంత్రంలోని 'మణి'కి రహస్యగుర్తు ! 'మణిపద్మ' అంటే పద్మములోని మణి — అంటే వెయ్యిరేఖలుగల తామర రేకులమధ్యన వుండే 'బొడ్డు' లాంటి "స్ఫటికమణి" పీఠం — అని రహస్యార్థం ! అదే ఈ స్ఫటికపర్వతం చుట్టూ గుండ్రంగా తామరపువ్వు రేకలవలే "పద్మాకారం"లో ఏర్పడివున్న పర్వత శిఖరాలు !!

ఇదే ప్రాచీనశాస్త్రాలలోను పురాణాలలో 'సృష్టికర్త' అయిన భగవంతుడు ఈ సృష్టిని ప్రారంభించేముందు — వెయ్యిరేకల తామర-పద్మంలో కూర్చుని "సృష్టి" చేశాడన్న రహస్యమైన ఆధ్యాత్మిక సంకేతం — ఈ పర్వత పంక్తుల మధ్యన పద్మంలాగవున్న ఈ హిమాలయ పర్వతాల మధ్యనవున్న స్ఫటికద్వీపంలో (దీనినే మణిద్వీపం అనికూడా అంటారు) కేంద్రంలో వున్న 'స్ఫటిక-సింహాసనం'! దీనిమీదనుంచే మానవజాతి అతి ప్రాచీనచరిత్రలో భూమ్మీద 'మనిషి'గా సృష్టించబడిన రహస్యాన్ని సూచిస్తుంది! అదే మన ప్రయాణాలలో మీరు అడిగిన ప్రశ్నలకు వ్యంగ్యంగా సమాధానం చెప్పానే — మానవసృష్టి హిమాలయాలలో జరిగిందని — ఇంతకుముందే చెప్పలేదూ!



'శంఖ-నిధి'

"అబ్బా! మైగాడ్! ఎక్కడినుండి ఎక్కడికి లింకుపెట్టారు. ఈ సమన్వయం అద్భుతమైన నాటకంలోకన్నా, గూఢచార నవలకన్నా చిత్రమైంది, అద్భుతమైనది!" అంటూ తన రెండుచేతులతో మూడుసార్లు చప్పట్లుకొట్టి ఆశ్చర్యంతో, ప్రశంసించాడు చార్లెస్ బెల్!

“ఇందుకే కదా ! మిమ్మల్ని ప్రపంచంలోకల్లా ఆశ్చర్యం కలిగించే నిగూఢ రహస్యాలను చేధించే 'డిటెక్టివ్ చక్రవర్తి' అంటారు ! గతంలో మీరు 'చార్లెస్ బెల్ గూఢచార కథల'లో షెర్లాక్‌హోమ్స్‌గా చూపిన రహస్యాలను పీఠముడి విప్పినట్లు విడగొట్టి గొప్ప తర్కంతో కూడిన విశ్లేషణ !”

“అసలు మీరు మీ ఇంగ్లండులో మాయమై ఎక్కడో మారు మూలలోవున్న ఈ భారతదేశంలోని హిమాలయ పర్వతాలకు మీ సాహస యాత్రను చేపట్టింది — ఈ శంబల గురించేకదా ! ఎలాగో ఎప్పుడో తెలుసుకునివున్నారు మీరు ఈ ప్రపంచంలోని రహస్య స్థావరమైన ఈ స్ఫటికపర్వతం గురించీ — అక్కడి **"స్ఫటిక శ్రీచక్ర మందిరం"** గురించి ! అవునా ? మిష్టరు చార్లెస్ బెల్‌గారూ” అంటూ లామా దోర్జీ చోగ్యాల్ ఆనందబాష్పాలతో చార్లెస్ బెల్‌ని అభినందించాడు. అందరూ విస్తుపోతూ ఆశ్చర్యంగా చూస్తూవుండగా లామాదోర్జీ తటాలున చార్లెస్ బెల్‌ను గట్టిగా హత్తుకుని కౌగలించుకున్నాడు — ఆశ్చర్యంతో, ఆత్మీయతతో.

“అభినందనలూ, శుభాకాంక్షలకు సమయంతర్వాత ఇంకా చాలా వున్నది. ఇప్పుడు ముందుగా మనం చేరుకోవలసింది ఆ స్ఫటికపర్వతానికి దారి ఎలాగో చూడండి ! త్వరలోనే సూర్యాస్తమానం కానున్నది.” అంటూ అనుభవంతో కాకలుతీరిన నికోలాస్ రోరిఖ్‌తో రష్యన్ రాయబారి అలెగ్జాండర్ నోటోవిచ్‌కూడా కలిసి ఏకకంఠంతో హెచ్చరించాడు.

“అదిగో ! ఆ ఎదురుగా కనిపించే మంచుమైదానం దాటివెళ్ళాలి — మనం! చకచకా నడిస్తే మూడు నాలుగు గంటల్లో అక్కడికి మనం

చేరుకోవచ్చు !" అన్నాడు వృక్షశాస్త్రజ్ఞుడు జగదీష్ చంద్రబోస్. స్ఫటికపర్వతానికి ఎదురుగావున్న మైదానంవైపు చూపిస్తూ! మిగతా సాహసయాత్ర మిత్రబృందం గుంపుగా ముందుకు కదిలేలోగా "ఆగండి ఎక్కడికి పరిగెత్తుకుపోతున్నారు ? ఇది ఏమన్నా మంచుమైదానం అనుకున్నారా ఏమిటి ? పంచదార పొడిలాంటి మంచులో నిట్టనిలువునా పీకలదాకా ఊబిలాగ బురద-మంచులోకి కూరుకుపోతారు — జాగ్రత్త ! అంటూ లామాదోర్జీ చోగ్యాల్ తన జపంచేసుకునే యోగదండం అడ్డుపెట్టి వారిని ఆపుతూ ఆందోళనగా అరిచాడు. ఆ హెచ్చరికకు కరెంటుషాకువలే ఆశ్చర్యపడి తటాలున ఆగిపోయాం అంతా

— "ఏమిటి ? అది మంచుమైదానం కాదా ? మరేమిటి ? ఏమిటి మీరుచెప్పేది ?" అంటూ ఆందోళనగా ప్రశ్నించాం. లామాదోర్జీ చోగ్యాల్ సావధానంగా తన రెండుచేతులను ఆకాశంపైకి ప్రార్థనలాగ ఎత్తి ఇలా అన్నాడు.

"ఇది — ఒక ప్రవహించే నది !" ఇది, శీతాకాలంగనక నీరు పైన మాత్రమే గడ్డకట్టి ఒక మంచు-పొరలా ఏర్పడి ఇలా పైకి చూడటానికి 'మైదానం'లా కనిపిస్తున్నది ! కాలుపెట్టగానే మంచుపెళ్ళ అద్దంపెంకులాగ పగిలి అడుగుపొరలో వేగంగా ప్రవహిస్తున్న మంచుకన్నా చల్లని నదీ ప్రవాహంలో పడి కొట్టుకుపోతాం — గంటకి 90 మైళ్ళ వేగంతో ! క్షణాలమీద ఈ పర్వతపులోయనుంచి క్రిందకిదూకే జలపాతంలో కలిసి నేరుగా వెళ్లి సముద్రంలో కలవడానికి ఎంతోసేపు పట్టదు !" అన్నాడు. దాంతో ఎక్కడికక్కడ అందరం భయంతో బిగుసుకుపోయాం లామాదోర్జీ చోగ్యాల్ మాటలతో.

"ఓరి భగవంతుడా ! ఇది నిజంగా మంచుమైదానమే అనుకున్నాను సుమా ! ఒక్కక్షణం మీరు హెచ్చరించడం గనక ఆలస్యమైతే ఈపాటికి పరిగెత్తేసే వాళ్ళం ! బాబోయ్ !! నాకు పెద్దల ఆశీస్సులూ, అనుగ్రహం వుండబట్టి బతికాను'' అంటూ అంత చలిలోనూ దిగచెమటలు పోసి, ఆయాసపడుతూ అన్నాడు శ్రీనివాసచక్రవర్తి.

ఇప్పుడిహ మనం ముందుకువెళ్ళే మార్గం చూడండి — ఈ నదిని దాటేదెలా ? పడవలు దొరుకుతాయా ?" అన్నాడు అలెగ్జాండర్ నోటోవిచ్ దిగులుగా మొఖంపెట్టి

"ఇక్కడ హిమాలయపర్వతాల శిఖరాలపైన 26 వేల అడుగుల ఎత్తులో వీళ్ళకి పడవలు కట్టడానికి ఎవరూ సిద్ధంగా వుండరని అందరికీ తెలుసుగనక — నిస్సహాయంగా లామా దోర్జీ చోగ్యాల్ వైపు చూడటం మా అందరివంతూ అయింది.

"మనం ఈ నదిని దాటడం అసంభవం ! మన టిబెటన్ భాషలో ఇది ప్రాచీన వేద-కాలంలోని **సరస్వతీ** నది ! దీనిని దాటినవాడు ఈ ప్రపంచంయొక్క మాయను దాటినట్టే ! — ఇక అవతల చూచేది బ్రహ్మజ్ఞానమే "అంటే స్ఫటిక పర్వతం బ్రహ్మస్థానమే అన్నాడు" లామా !

"మరేమిటి దారి? — ఎలావెళ్ళాలి? త్వరగా చెప్పండి మహాశయా! మీకు పుణ్యంవుంటుంది" అంటూ జగదీష్‌బాబు, మేఘనాథ్ సాహ, శ్రీనివాస చక్రవర్తి, పాటియాలా మహారాజా అంతా చుట్టూరా గుంపుగ చేరి ఒక్కసారే ప్రశ్నించారు !

"ఈ నదిని — దాటలేము" అవతలికి పోవడానికి ఒక్కటే ఒక్క

మార్గం వుంది ! అది భూమిలోపల అడుగున ఈ నదీప్రవాహానికింకా అట్టడుగు లోయనుండి అవతలివైపుకి దాటాలి ! మన బట్టలుకూడా తడవకుండా దాటివెళ్ళాలి !"

"అదెలా సాధ్యం ? నదిని దాటాలంటే నీళ్ళు తగలకుండా ఎలా ?" ప్రొఫెసర్ ప్రశ్నించాడు.

"ఆగండి ! నిదానించండి ! నేను ఇదివరకు చెప్పిన విశేషాలను గుర్తుతెచ్చుకోండి. ఇక్కడే భూమి అడుగున రంధ్రం చేసుకుని బిలం లాగ — అంటే ఎలుక కన్నంవలే సొరంగ ద్వారంగుండా ప్రయాణించాలి ! ఆ బిలద్వారం ఎప్పుడూ మూసుకునివుంటుంది ఒక పెద్ద బండరాయితో!! అది సంవత్సరంలో ఒక్కరోజునే — అంటే సూర్యుడు మేషరాశిలోకి ప్రవేశించిన పదవరోజునే ఈ పైనున్న మంచు కరిగి — భూగర్భంలోకి ప్రవేశించే ఆ సొరంగ ద్వారబంధం కనిపిస్తుంది. దానిగుండా ప్రయాణిస్తే మనకి ఎదురుగా కనిపించే నదీప్రవాహం అడుగున నూరు అడుగులు లోతుగావున్న భూగర్భ బిలంలోంచి నడిచి అవతలకి చేరుకుంటాం. అలా చేరుకుంటే అక్కడ ఆ సొరంగం తెరుచుకుని — గుహద్వారం సరిగ్గా స్ఫటికపర్వతం ముందరకు తీసుకొనివెళుతుంది !" అంటూ లామా చెబుతూవుంటే శరవేగంతో ఒక కాగితంపైన ప్లాన్‌లాగ గీతలుగీసి చిత్రం వేశాడు గూఢచారి చార్లెస్ బెల్.

అప్పటికే సూర్యాస్తమానం అయ్యింది. ఇక్కడి చీకటి నీలం, గులాబిరంగు, ఊదారంగు క్రీనీడతో హిమాలయపర్వత కొండ పక్కగా వ్యాపిస్తూ — చరియలు ఒక అద్భుతమైన రంగుల కలగా మారి — రాత్రి కావడాన్ని సూచిస్తూ క్షణక్షణానికి రంగులు మారిపోసాగాయి.

"చచ్చాంరా దేవుడా ! ఇక రాత్రి చీకటికూడా పడుతోంది." ఇక్కడ మనకు బస ఆకాశమే — మనకీ మేఘాలక్రిందనే మకాం" అంటూ కూలబడ్డాడు నిరాశతో శ్రీనివాస చక్రవర్తి.

"అధైర్యపడకండి ! మనం ఈ మార్గంలో ఎడమవైపుకు మళ్ళితే ఒక ఫర్లాంగు దాటినతర్వాత ఎత్తైన సూదిగావుండే ఓ పర్వతశిఖరం కనిపిస్తుంది".

"కనిపిస్తే ? ఇంత చలిలో కొండమీద ఎలావుంటాం ? చలికి బిగిసి చస్తాం !" అన్నాడు జగదీష్‌బాబు.

"కొండమీద నిద్రచెయ్యడం కాదయ్యా ! దిగులుపడకు. నేచెప్పే కాస్త ప్రశాంతంగా విను" అంటూ నికోలాస్ రోరిఖ్స్ వారించాడు.

"ఈ పర్వత పాదపీఠంకింద — ఒకచిన్న గుహవంటి ద్వారం వెనుకకుపోతే వెనకవైపున అవతలివైపు తెరచుకుంటుంది. అందులోం గుహలోకి — గుహఅంటే ఒకపెద్ద హాలులాగ బల్లలాగావుంటుంది కాని లోపల ఎంతో వెచ్చగా వుంటుంది. అంతా పర్వతంకదా ! తెల్లవా దాకా మనకి ఇదే చక్కటి రక్షణ ఇచ్చే మకాం" అంటూ దా చూపించాడు లామా మహాశయుడు. తాను ఇతరులకు దారిచూపిస్తూ — ముందుగా నడుస్తూ.

అలా ఒక గంటసేపు నడిచి ఎడంవైపు మలుపుతిరిగి అర్ధచంద్రా కారంగా ప్రదక్షిణంచేస్తూ వెళ్ళి ఎత్తైన గుడిసెలాంటి పర్వతాన్ని చూశాము అది గుడిమీద గోపురంలాగ సూదిగావున్న శిఖరం. దానికి తూర్పు ఉత్తరాల మధ్యగా ఒక గుహవంటి ద్వారంవుంది. ఆ ద్వారబంధంలో

ప్రవేశించగానే ఎదురుగా అడ్డుగోడ వంటి రాయి నిలబడివుంది.

పాత గుడ్డపీలిక చుట్టి నూనెతో తడిపి కాగడావంటిది వెలిగించాడు లామా ! దాని వెలుగులో గాలించగా సరిగ్గా నేలలోకి వెళ్ళి దిగే నేలమాళిగ వంటి సొరంగంలోకి మెట్లు నిటారుగా క్రిందకు దిగుతూ — కనిపించాయి !

బైటి చలికి జంకుతూ శ్రీనివాసచక్రవర్తి లోపలికి పరిగెత్తబోయాడు. తటాలున అతడిని చొక్కాపట్టుకుని ఆపారు మిగతా మిత్రులు !

“ఆగండి ! పర్వతంలోపల గుహ అనగానే లోపలికి వెళ్ళిపోవటమేనా ? — ఇది నిర్మానుష్యప్రదేశం. ఇందులో పాములుగాని, గబ్బిలాలు గాని” — అంటూ వాక్యం పూర్తిచేసేలోగానే “దెయ్యాలు, భూతాలు కూడానా ?” అంటూ ఎగిరి గంతేశాడు చార్లెస్ బెల్ !

“అలాంటివి ఏవీ ఇక్కడ వుండకపోవచ్చు. కాని గుహలలో నివశించే సాధువులు తపస్సుచేసుకుంటూ వుంటారు. వారి నిశ్శబ్దానికి భంగం కలిగించకూడదు. పాములు వంటి విషజంతువులు కూడా వుండవచ్చు. అందువల్ల మనం జాగ్రత్తగా వుండాలి !” అంటూ నిచ్చెన వంటి నిటారుమెట్లుదిగి పర్వతగర్భంలోకి ప్రవేశించాము — ఆరాత్రి అక్కడే మకాంచేయాలని నిశ్చయించుకుని.

◆

33

"సిద్ధుల-కొండ" లోపల!

"ఏమిటీ ? ఈ మంచుతో గడ్డకట్టిన నదీప్రవాహం అడుగునుంచి మనం సొరంగమార్గంలో ప్రయాణించి — అవతలికి చేరుకోవాలా ? మరి అలాగయితే ఈ సొరంగంలోకి ప్రవేశించే బిలద్వారం అంటే భూగర్భంలోకి దిగేమార్గం — ఈ కనిపించే నేలమాళిగలోకి ఈ మెట్లు దిగుతూ నిటారుగా వెళ్ళాలా ? అలా ఎంతదూరం వెళ్ళాల్సివుంటుందో — ఎంతసేపు పట్టవచ్చునంటారు ?" — అంటూ ఒకరినొకరం ఆసక్తితో ప్రశ్నల వర్షం కురిపించడం మొదలయ్యింది — కాలక్షేపానికి ! అందరమూ కొండ లోపలికి ప్రవేశించి, ఒక పెద్ద గుడిసెలాగా లోపల గుల్లగా వున్న — ఈ పర్వతంలోనే ఈ రాత్రి గడపాల్సి వుంటుందా ? అలాగైతే — మరి కాలక్షేపం ఎలా ?

"ఈ కొండగుహలో మనం వంటలూ, వార్పులు చేసుకునే అవకాశం లేదే ? — అలా చేస్తే ఇక్కడి పవిత్రతను పాడుచేసినవారమౌతామేమో ? — ఏంచేయాలో ఎటూ పాలుపోవడంలేదు" అన్నాడు శ్రీనివాస చక్రవర్తి ఆశ్చర్యంగా ఆ పర్వతం లోపలి పైకప్పువంక చూస్తూ —

"వింతగా వున్నదే ! ఇంత పెద్ద కొండలోపల — అంతా తొలిచేసినట్టు ఒక పెద్దహాలులాగా కల్యాణమండపంలాగా — ఇంత ఖాళీస్థలం వున్నదని బయటనుంచి చూసేవారికి ఈ కొండలోని ఈ రహస్యబిలం వున్నదని కూడా తెలిసే మార్గమేలేదు ! ఎన్నెన్ని చిత్రాలో ఈ హిమాలయాలలో !" అంటూ జార్లాపడి నేలమీద అలసట తీసుకుంటున్న శ్రీనివాస చక్రవర్తితో తనలో తానే అనుకుంటున్నట్టుగా పైకేఅన్నాడు లామాదోర్జీ చోగ్యాల్ ఆలాపనగా !

"మా టిబెటన్ లామాలకి — ఒకరోజు భోజనం తినకుండా ఉపవాసం చేయటం వెన్నతో పెట్టిన విద్య ! ఎందుకంటే లామాసరీలో మాశిక్షణలో పీకలదాకా భుజించే భోజనంకంటే ఆహారనియమానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తాం ! ఎక్కువగా లామా బ్రహ్మచారులకు జావల వంటి ద్రవాహారమే ఇస్తాం ! పౌర్ణమి అమావాస్యలవంటి పర్వదినాలలో ఒక్కపూటే భోజనంగాని లేక రెండుపూటలు ఉపవాసంగాని ఆ పర్వదినం యొక్క పవిత్రతనుబట్టి వుంటుంది. కాబట్టి నాకేం బాధలేదు — ఒకరోజు భోజనంలేకుండా ఉపవాసం చేయ్యాలంటే !" — అంటూ తన మనస్సులో మాట పైకే అనేశాడు, లామాదోర్జీ చోగ్యాల్ మహాశయుడు. దాంతో ఒక చెరువులో కొండరాయి పడితే అలలు చెలరేగినట్టు అందరి మనస్సు

లోనూ కంగారు, ఆందోళనా ! 'ఒకరాత్రి ఉపవాసమా ! అందులోనూ చచ్చీ చెడీ మంచుకొండలమీద ప్రయాణించి అలిసిపోయిన ఈ జీవులకి ఇక రాత్రికూడా భోజనంకూడా లేకపోతే రేపు మన పరిస్థితి ఎలా వుంటుందో ఏమో ? అనుకుంటూ ఎవరికి తోచినట్టు వారు తలోరకంగా మాట్లాడుకో సాగాం ! ఇంతలో లామా చోగ్యాల్ మహాశయుడు లేచి ఆ హాలు వంటి విశాలమైన కొండగుహలోకి వెళ్ళి పరిక్షగా చూసి — "ఇక్కడో హోమగుండం కనిపిస్తున్నది ! అంటే ఇక్కడ ఋషీశ్వరులు రహస్యంగా బయటిప్రపంచానికి తెలియకుండా యజ్ఞయాగాలు జరిపే పవిత్రస్థలమిది !" అంటూ ఆ హోమగుండానికి ప్రక్కగా అరుగుమీద పెట్టిన భోషాణం వంటి ఓ చెక్కపెట్టెను తెరిచాడు.

అందులోకి ఆశ్యర్యంగా చూస్తూ — "ఓహో ! నేను ఊహించింది యదార్థమే ! ఇవి యజ్ఞం చేసినపుడు మిగిలిన ప్రసాదాలు ! బార్లీగింజల తోనూ, గోధమలతోనూ వేయించి చేసిన పేలాలు, హోమంచేయగా మిగిలిన నెయ్యికూడా తీసి, ఇక్కడొక చిన్న మట్టిపిడత వంటి పాత్రలో దాచివుంచారు. మీలో ఆకలికి తట్టుకోలేనివారు ఈ ప్రసాదం తిని ఈ రాత్రికి కాలక్షేపం చేయవచ్చు" అంటూ అందరికీ వినపడేలాగా కేకవేసి చెప్పిన మాటలు శ్రీనివాసచక్రవర్తి చెవులకు అమృతవర్షంలా అనిపించాయి. బడలికగా నిస్సత్తువగా నేలమీద జార్లాపడి విశ్రాంతి తీసుకుంటున్న వాడల్లా తటాలున లేచికూర్చున్నాడు. "ఏమిటీ ! యజ్ఞం చేసిన ప్రసాదమా ! ఆశ్చర్యంగా వున్నదే ! దేవతలు మనకోసమే పెట్టివుంచి నట్టుగా ఈ ప్రసాదం మనకిక్కడ లభించడం దైవసహాయంగా నాకు తోస్తున్నది పైగా ఇలాంటి పవిత్ర ప్రసాదం మనం స్వీకరించకపోవడం

ఇక్కడ యజ్ఞంచేసిన పెద్దలకు అవమానం, అపచారం కూడా" — అంటూ లామావద్దకు నడిచాడు.

ఆ చెక్కపెట్టెలోంచి పది పదిహేను దోసిళ్ళు బార్లీపేలాలను ఇంకా ఇతర ప్రసాద వస్తువులను తీసి అందరికి తలా కొంచెం ప్రసాదంగా ఇచ్చాడు. ఇష్టంగా వాళ్ళు హోమంచేసిన శేషంగావున్న నెయ్యిని కూడా అరగించారు. తలావొకరివద్దవున్న మంచినీళ్ళబాటిల్ తీసి కడుపునిండా నీరుతాగారు. మరికొద్దిసేపట్లో ఒళ్ళు తెలియకుండా నిద్రపోయారు మిగతా సభ్యులందరూ ! ఒక్క లామాదూర్జీ చోగ్యాల్ మహాశయుడు మాత్రం ఒక గుప్పెడు పేలాలు తిని ఆ హోమగుండంవద్దనే పద్మాసనంలో కూర్చుని కుడిచేతిలో జపమాల తిప్పుతూ జపధ్యానములు చేస్తున్నాడు శ్రద్ధగా !

అలా ఒక గంటసేపు గడిచింది ! కొండగుహలో లేత నీలపుకాంతి పొగలాగా ఒక మబ్బులాగా హోమగుండంపైన ఏర్పడింది. అది సాంబ్రాణి పొగ గుహలో పైన పోగుబడినట్టే కనిపించింది. అది లేత నీలపుకాంతితో మొదలై క్రమంగా ఒక వెలుగు-మబ్బులా వెలుతురుతో ప్రకాశించ సాగింది. ఆశ్చర్యంగా దానివంకే చూస్తూ లామా మహాశయుడు తన జపధ్యానాలని మరింత ఏకాగ్రతతో కొనసాగించాడు. ఈసారి నెమ్మదిగా మంద్రస్వరంతో ఒక వీణానాదంలాగా మొదలుపెట్టి లామాల మూల మంత్రాన్ని **'ఓం మణి పద్మహుం'** అంటూ జపించసాగాడు. అలా మరొక అరగంట గడిచేసరికీ హోమగుండంపైన లామాకి ఎదురుగా వెలుగుతున్న మబ్బులా పొగరూపంలో ఒక ఆకారం కనిపించింది.

అస్పష్టంగా మబ్బులాగా రూపురేఖలు అల్లుకుపోయివున్నాయి. పొగ రాజుకున్నట్టే తలచుట్టూ జడలుకట్టిన జుట్టుముడితో ఆజానుబాహుడైన

ఒక ఋషి రూపంగా ఏర్పడింది. ఆశ్చర్యంగా దానివంకే చూస్తూ శ్రద్ధ భక్తులతో జపధ్యానాలు మరింత తీవ్రంగా చేశాడు లామా ! మరిక్కొ నిమిషాలలో తన రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ తలవం లేచి నిలబడ్డాడు లామా మహాశయుడు. ఈసారి పొగమంచులాంటి ఆకారం నిష్పష్టంగా ఒక ఋషిరూపం ధరించి ఏర్పడసాగింది తెలుపు నలుపు కలిసిన బూడిద రంగులో ! గుండ్రటి భుజాలు, లావుగా ఏనుగ తొండం లాంటి పొడవైన చేతులు, బొద్దుగా పసిబిడ్డశరీరంలాగా బలిసి రొమ్ములు, పూర్ణకుంభం లాంటి గుండ్రనిబొజ్జ, చిందరవందరగా ధరించి మోకాళ్ళపైకి ఎగదోపుకున్న పంచె, రెండుపాదాలకూ పాదుకలు ధరించి వున్నాయి. ఎడమ చంకలో గుండ్రంగాచుట్టిన జింకచర్మం, కుడిచేతిల కమండలువూ, కుడి చంకలో యోగదండం స్పష్టంగా కనిపించసాగాయి గుబురుగా పెరిగిన పీచువంటి గడ్డమూ, జడలు కట్టిన సింహం జూలు వలే వెనక్కి మెడల మీదుగా భూజాలపైకి వ్యాపించిన జడలు ! కంఠంలో నిమ్మకాయలంతేసి రుద్రాక్షల మాల ! రొమ్ముపైన పొట్టమీద నామం ధరించివున్నాడు. నుదుట దీపారాధన వెలుగుతున్నట్టు మూడవకన్ను బంగారుకాంతితో వెలిగిపోతున్నది.

నెమ్మదిగా తుమ్మెదనాదంలా ఆయనలోంచి ఓంకారనాదం పైకిలేచి తారస్థాయిలోంచి మంద్రంలోకి కిందకి పైకీ — గంగానదిలోని అల లాగా ప్రణవం ఆలాపించబడుతూంటే జపం చేస్తున్నవాడల్లా ఆశ్చర్యంతో తటాలున లేచి నిలబడ్డాడు లామా చోగ్యాల్ మహాశయుడు. కళ్ళవెంట ఆనందభాష్పాలు పొంగిరాగా ఉద్రేకంతో ఆవేశంతో తొణికే కంఠంతో ప్రార్థిస్తూన్నట్టుగా — రెండుచేతులు ఎత్తి తలపై నమస్కరిస్తూ గట్టిగా



మంచులా గడ్డకట్టిన నదిమధ్య **సిద్ధుల కొండ!**

ఎలుగెత్తి పైకే అన్నాడు.

“నమో నమః ! **వ్యాస మహామునులకు** — నమస్కారములు !” తల పంకించినట్టు నుదుటిపైకి ఒంగిన జుట్టుముడితో కుడిచేయి పైకెత్తి “శాంతి ! శాంతిః ! తథాస్తు !” అంటూ దీవించినట్టు తంబూరా ఆలాపన వంటి ధ్వని వినిపించింది. ఈసారి నేలమీద పడుకునివున్న మిత్రులలో కొందరు తుళ్ళిపడి లేచి కూర్చున్నారు. ముందుగా నికోలాస్ రోరిఖ్ తన బూట్లు తీసేసి నిలబడ్డాడు. అతడి వెంటనే చార్లెస్ బెల్ లేచి నించున్నాడు, పైపును దూరంగా విసిరేసి !

II

జగదీష్ చంద్రబోస్, మేఘనాధ్ సాహా మోకాళ్ళమీద కూర్చుని భయభక్తులతో వంగి నమస్కరిస్తున్నారు. ఇక శ్రీనివాసచక్రవర్తి సరేసరి — ఆనందంతో కన్నీళ్ళు పొంగిరాగా దుఃఖిస్తూ ఎక్కిళ్ళు వస్తూఉంటే ఆపుకోలేనంత భక్తి, ప్రేమ కలిగిన ఆవేశంలో సాష్టాంగపడి ముమ్మారు నమస్కరించాడు. టపటపా రెండు లెంపలూ వేసుకొని తను చెవులు తానే పట్టుకొని “భరధ్వాజస గోత్రే” అంటూ తన ప్రవరను చెప్పుకున్నాడు. ఆ హోమగుండం పైన పొగమబ్బులా అలా ప్రత్యక్షమైన వ్యాసభగవానునినుంచి సుగంధపరిమళాలు వెలువడ్డాయి ! ఆపైన జల్లులాగా అందరిపైనా గులకరాళ్ళు గుచ్చుకున్నట్లు చురుక్కునా వర్షం జల్లులా పడ్డాయి. ఆశ్చర్యంతో తేరిపారచూస్తే అవి మంత్రాక్షతలు !

“అరే !!! ఎవ్వరూ చల్లలేదు ! ఎక్కడినుంచి వచ్చిపడ్డాయి ఇన్ని

అక్షింతలు మనందరిమీదా ?" అనుకుంటూ, క్రిందపడినవి ఏరుకొని భద్రంగా పొట్లం కట్టుకున్నారు — ఎవరికి అందినవి వారు జాగ్రత్త చేసుకుంటూ ! తీరా ఆశ్చర్యంతో పైకిచూస్తే ఎవరూ చల్లినవి కావు. పైకిచూస్తే ఆకాశంలోంచి, వాటంతట అవే వానజల్లులాగా ఆశీస్సులుగ కురిశాయి — దోసెడు పారిజాతపుష్పాలు ఘుమఘుమా పరిమళిస్తూ — గుహలో అన్నివైపులా వెళ్ళిపడ్డాయి.

అలా చూస్తూండగానే ఆ పొగమబ్బు గుండ్రంగా సుడిగుండంలా ప్రదక్షిణంగా తిరుగుతూ మేఘంలా మారిపోయింది. హోమగుండంనుంచి వచ్చిన పొగ ఆ హోమగుండంలోకే వెళ్ళి లీనమై మాయమైపోయింది.

అందరూ ఆశ్చర్యంగా చుట్టూ చూస్తే అప్పటికే లేత నీలపు కాంతులు కొండగుహ గోడలనుంచి లోపలికి ప్రకాశిస్తున్నాయి — తెల్లవారేముందు బ్రహ్మ ముహూర్తకాలం అని సూచిస్తూ !

నెమ్మదిగా ఒక గంటసేపటిలో ఒక్కొక్కరే మేలుకోసాగారు. ఒకటి రెండు గంటలలో ఒకమూలగా ఎత్తైన అరుగుమీద గ్యాస్‌స్టౌ వెలిగించి వేడినీళ్ళు మరిగించి, పొగలుకక్కే టీని పాలపొడితో కలిపి తయారు చేశాడు. మద్రాసీ పరిమళంతో గుబాళించే వేడి టీని అందరికీ తలామగ్గు పోశాడు శ్రీనివాస చక్రవర్తి. అందరూ కృతజ్ఞతతో వెచ్చని టీని త్రాగి కాళ్ళు, చేతులు చైతన్యంతో, శక్తితో ఉత్తేజమై — ఎవరి మటుకు వాళ్ళు రానున్న ఇంకోరోజు ప్రయాణానికి సిద్ధపడుతున్నారు.

* * *

34

"నదిక్రింద సొరంగంలో" !!

అందరం ఎవరి డ్రస్సులు, మంచుకోట్లు, టోపీలూ వాళ్లు ధరించి గుహద్వారం విడిచి ఒకలైనులో నిలబడ్డాం. "ఇప్పుడిక మనం తెల్లవారే దాకా ఇక్కడ కాలాన్ని వృథాచేస్తూ గుహాముఖద్వారంకోసం వెతకాలి" — అంటూ పర్వతం బైటికివచ్చి కుడివైపుగా మళ్ళీ ప్రదక్షిణంగా ఒకమైలు నడిచి, కొండని దాటివచ్చేశాం ! అందరూ భక్తితో వెనక్కితిరిగి కృతజ్ఞతా పూర్వకంగా రాత్రి వెచ్చగా ఆశ్రయం ఇచ్చిన ఆ కొండగుహ వైపు తిరిగి నమస్కరించి — చూసి ఒక్కసారిగా తుళ్ళిపడ్డాం !

"ఏమిటిది ? మహాశ్చర్యంగా వుందే !" — అంటూ విస్తుపోయాడు డేగ కన్నులతో ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చార్లెస్ బెల్ ! దాంతో అందరూ

అటువైపుచూసి తుళ్ళిపడ్డాం — "అరె ! తీరాచూస్తే రాత్రి మనమంద సుఖంగా బసచేసి, వెచ్చగా నిద్రచేసిన ఆ కొండలోపలి గుహ అసలు నిజంగా ఇక్కడ లేనేలేదా ? మరి మనమంతా చూసిందేమిటి మనకు హోమగుండం వద్ద దొరికిన పేలాల ప్రసాదం మాటేమిటి ?

పోనీ ఇవన్నీ అబద్ధం అనుకున్నా — కొండకూడా మాయే కావచ్చ గాని నేను కళ్ళతో స్పష్టంగా చూసిన ఋషీశ్వరులు 'మాయ' కాదే ఆయన సాక్షాత్తూ **"వ్యాస భగవానుడు !"**

ఈ 'కలియుగం' ప్రారంభం కాకముందునుంచీ 'చిరంజీవి'గ భూమిపైనే తన తపోమయ శరీరంతో నిలిచివున్న "చిరంజీవుడు !!! ఆయన దర్శనం ఎన్నటికీ మరువలేము" అనుకుంటూ — ఆ పర్వత మాయమైన ఖాళీ జాగావేపుగా తిరిగి చేతులెత్తి నమస్కరించాడు జగదీ చంద్రబోసు !

"అదిగో ! మనం వెళ్ళాల్సింది ఆ కుడివైపు కనిపించే గ్రామదేవ గుడివంటి దేవాలయం ముందుకే !" — అంటూ చార్లెస్ బెల్ ఆవేశంగ ముందుకు దారితీస్తూ నడిచాడు. "ఆశ్చర్యంగావుందే ! నిన్నరాత్రి, మన గ్రామదేవత వంటిది ఎక్కడా కనిపించలేదే ! మనకి ఎవ్వరికీ కూ ఎంత వెతికినా కనిపించని — ఈ గుడి !! ఈ దేవాలయం మ ఇక్కడే వుందే ! పదండి ! పోదాం అంటూ, పరుగువంటి నడక అందరూ తమ కాన్వాస్ బ్యాగులు, మంచుగొడ్డళ్ళు, ఆక్సిజన్‌డబ్బాల మోసుకుంటూ నడుస్తున్నాం. ఒక అరగంటసేపట్లో అంతా మంచుగ ఘనీభవించిన నదివొడ్డుకి చేరుకున్నాం. కుడివైపున ఎత్తుగా ఎర్రమట్టి

ఓ అరుగులాంటిది అర్ధచంద్రాకారంగా ఒక కోటగోడలా ఏర్పడివున్నది — ఆ గుడిచుట్టూ ! అందుకే వెనకవైపునుంచి చూస్తే — అది కేవలం ఓ మట్టిదిబ్బలాగే కనిపిస్తుంది. గుడిగాని, దాని ఆకారంగానీ ఏమీ కనిపించవు” అనుకున్నాం ఆశ్చర్యంగా !

గుడితలుపులు మూసుకొనివున్నాయి, బరువైన టేకుచెక్క కంటే బరువైన — గుగ్గిలం చెట్టు కలపతో చెక్కబడివున్నది, ఆ ద్వారం ! ద్వారబంధంపైన రెండు ఏనుగులూ, మధ్యలో పద్మం, దానిలో పద్మాసనంలో కూర్చున్న లక్ష్మీదేవి విగ్రహమూ చెక్కబడివున్నాయి. లక్ష్మీదేవి రెండుచేతులలో విరబూసిన తామర పద్మాలు ! ఒకటి కుడిప్రక్కగా, మరొకటి ఎడమప్రక్కగా, ముందుకాళ్ళను పైకెత్తి ఆనందంతో ఘీంకరిస్తున్న — రెండు తెల్లఏనుగులు తమ తొండాలతో పాలను ధారగా పోస్తూ అభిషేకిస్తున్నాయి. ద్వారబంధం మధ్యగా చెక్కతలుపు బంధించబడివున్నది. తలుపుమీద మంచు అడుగున్నర మందంగా గాజురాళ్ళవలే దిమ్మ కట్టుకొనిపోయి, పేరుకొనివున్నది !

“బహుశా రాత్రి కురిసిన మంచు — చలికి బిగుసుకు పోయి ఈ ద్వారాన్నిలా బంధించేసివుండాలి. మనమిప్పుడు పారలతో గాని, గడ్డపారలతోగాని, ఈ మంచును తవ్వితీస్తే — ఈ ద్వారం తెరుచుకుంటుందా ?” అనుకుంటూ సాహసయాత్రీకులలో ఇద్దరం —ముందుకు వచ్చి ద్వారబంధానికి రెండువైపులా పరిశీలించసాగాం ! రెండు తలుపులు మూసివున్నా ద్వారం ఆకారం — కుడి ఎడమవైపులలో ఉబ్బెత్తుగా వొంగి ఒక వడ్లగింజవలే విచిత్రంగా వున్నాయి.

"ఈ ద్వారంయొక్క రహస్య శిల్పం ఎంతో చిత్రంగావున్నదే !" — అన్నాడు చార్లెస్ బెల్ — తన కోటుజేబులోంచి భూతద్దం తీసి లెన్స్‌ద్వారా పరిశీలిస్తూ చూసి !

"ఇప్పుడీ మంచుగడ్డలను తవ్వి తలుపు తీయడానికి మనకి – కొన్ని గంటలైనా పట్టవచ్చునేమో ?" అన్నాడు అలెగ్జాండర్ నోటోవిచ్, అడుగున్నర మందంగావున్న గాజురాళ్ళవంటి మంచు శిలలను పరిశీలిస్తూ !

"మీకు నేను ముందే చెప్పానుకదా? ఈ ద్వారం అలా తెరుచుకోదు ! మా టిబెటన్ పంచాంగ గణితం ప్రకారం టిబెటన్ సంవత్సరం మొదలుపెట్టేది ఇంగ్లీషువారి క్యాలెండర్ ప్రకారంచూస్తే — ఫిబ్రవరి 5-వ తేదీన ! ఐదువేల సంవత్సరాల క్రితం ఇప్పటి ఈ '**కలియుగం**' ప్రారంభించింది కూడా — సరిగ్గా ఆరోజునే ! కాలగమనంవల్ల మన భూగోళం తిరిగే ఉత్తర, దక్షిణ ధృవాల దిశ ఒకప్రక్కగా వాలి వొంగిపోయి వుంది. డెబ్భైరెండు సంవత్సరాలకు ఒక డిగ్రీ 1° చొప్పున పెరిగిపోతూ ఖగోళంయొక్క ఈ వొంపు ఇప్పుడు 72° కు చేరుకుంది ! అంటే 18 ఫిబ్రవరి నుంచి 72 రోజులు లెఖ్ఖిస్తే ఏప్రిల్ 21వ తేదీకి ఇది సరిపోతుంది — ఆరోజే సూర్యుడు మేషరాశిలోకి ప్రవేశిస్తాడు. ఈ మేషం అగ్నిరాశి గనుక సరిగ్గా ఈరోజు పగలు పదకొండున్నర గంటలకే సూర్యకిరణాలు అకస్మాత్తుగా వేడెక్కుతాయి ! — అదే గుర్తు మనకి !!

"సరిగ్గా అదే నిముషంలో ఎండవేడికి ఈ మంచు కరిగి ఈ ద్వారబంధం తెలుపులు తెరిచేందుకు వీలు కలుగుతుంది, అందాకా వేచి

వుండాలి !" అని లామాదోర్జీ చోగ్యాల్ తన పురాతన తాళపత్రాలను తీసి దానిలో వున్న తాళపత్ర గ్రంథంలోంచి చదువుతూ ! **"కలియుగ ప్రారంభంలో సూర్యుడు ప్రవేశించిన మేషరాశియొక్క మొదటి డిగ్రీలోకి** మన ఈకాలంలో ఈరోజే ప్రవేశిస్తాడు" అంటూ ఆకాశంవంక చూశాడు. సమయం పదిగంటలు దాటుతోంది.

ఎండకూడా ఏటవాలుగా బంగారుకాంతితో దేవాలయద్వారంమీద పడి — అది గర్భాలయంలోకి వెళ్లి, తెల్లని కిరణంగా వెలుగుతోంది ఆశ్చర్యంగా ! అది చూడగానే లామా-దోర్జీ చోగ్యాల్ కంగారుగా గుడి తలుపులు తెరిచి చందనమూ, కస్తూరి కలిపిన టిబెటన్ అగరువత్తులు వెలిగించి గుండ్రంగా తిప్పి ధూపం సమర్పించాడు. రాత్రి హోమగుండం దగ్గర సేకరించిన నువ్వులనూనె, నెయ్యి కర్పూరంతో వెలిగించి దీపారాధన చేశాడు. భక్తితో చేతులు జోడించి తనకు ఇష్టమైన గురుమంత్రం —

"ఓం మణిపద్మ హుం"

— అని సరిగ్గా నూటఎనిమిదిసార్లు జపించాడు.

అంతే ! ఒక మహాశ్చర్యం కనిపించింది. సూర్యకిరణం — వెళ్లి ఏటవాలుగా గుడి ద్వారబంధంలోకి ప్రకాశిస్తూ — బుద్ధుడి విగ్రహంవున్న అరుగుమీద పడింది !! మరో అరగంటకు సూర్యుని పొద్దు అటు వాలగానే అదే సూర్యకిరణం క్రమంగా పైకి పైకి — పాకిపోతూ గుడి లోని బుద్ధవిగ్రహం అరచేతిపైన పడింది — సరిగ్గా నిమ్మకాయంత సైజులో !

అలా బంగారుకాంతులతో పడిన సూర్యకిరణాలు బుద్ధవిగ్రహం

యొక్క అరచేతిలో పడి, వెలిగి క్రమంగా సూర్యుని పొద్దుతోపాటు క్రిందకు వాలి — ప్రాకుతూ వెళ్లి, ‘‘భూమి-స్పర్శముద్ర’’తో వున్న బుద్ధుని విగ్రహం చేతికింద నేలను తాకుతూ గుండ్రని బిందువులాగా మధ్యగా చేరింది. దాంతో లామామహాశయుడు ఒక్కసారిగా — మంత్రాన్ని మరింత హోరుగా జపిస్తూ గుడి పునాది పీఠంవద్దకు పరుగెత్తాడు! ఇంతలోగా సూర్యకిరణం వెలుగుతూ వెళ్లి గుడిమెట్లు దిగి పొద్దుతో కుడివైపుగా వాలి అక్కడవున్న ఓ ప్రాచీన మఱ్ఱిచెట్టువేళ్ళు పాకివున్న దిశగా పోయింది !

అక్కడ మోకాళ్ళమీద కూర్చుని గట్టిగా శ్వాసపీల్చి రెండుచేతులూ ద్వారానికి ఒక కోణంలో అదిమిపట్టి **“ఓం !”** అంటూ ఒక్కతోపు తోశాడు.

అంతే! పెద్ద ఉరుమువంటి శబ్దంతో గర్జనలాంటి ధ్వని వినిపించి — ఆచోట ఒక బండరాయి గరగరా ఐమూలగా తెరుచుకుంటూ లోపలికి తిరిగి, వాలి ఓ ఎత్తైన ద్వారబంధాన్ని బయల్పరచింది! అందరూ హడావుడిగా లోపలికి పరుగెత్తబోయేలోగా — లామాదోర్జీ చోగ్యాల్ ఆదుర్దాగా అరుస్తూ ‘‘ఆగండి ! ఆగండి ! ఎవ్వరూ లోపలికి దూరకండి! మళ్ళీ ఆ తలుపు బరువుకు ద్వారం మళ్లీ ఇప్పుడే మూసుకుపోతుంది! దాంతో అందులోనే మీరూ బంధించబడి మరణిస్తారు’’ — అంటూ, ‘‘ఇప్పుడు అందరూ మోయగల్గినంత కొండరాళ్ళను తెచ్చి తెరుచుకున్న ద్వారబంధం వద్ద అడ్డంగా పెట్టండి. అప్పుడే ద్వారం మళ్ళీ మూసుకు పోకుండా తెరిచే వుంటుంది !’’ — అన్నాడు !

భయంతో ఎగిరి గంతేశాము అంతా ! మెరుపులా పరుగెత్తి ఎవరు మోయగలిగినంత పెద్ద బండరాళ్లను వాళ్ళు మోసుకొనివచ్చి అలా



మంచులా **"గడ్డ-కట్టిన నది"** (కుడివైపుగా)

తెరుచుకున్న రాతిద్వారంవద్ద గడపలో తలుపుకు అడ్డంగాపెట్టాం — ఈసారి గట్టిగా తోసినా ఆ తలుపు మూసుకొనిపోకుండా !

"మనం ఇప్పుడు ఏంచేయాలి ?" అన్నాము అంతా ఒకే కంఠంతో లామాదోర్జీ చోగ్యాల్‌వైపు తిరిగి !

"లోపల గాలి వుందోలేదో ముందే చూసుకొని, ప్రాణవాయువు లేకుంటే ప్రవేశించినవారి ప్రాణం గాలిలో కలిసిపోతుంది ! అందుకని ఎవరిచేతిలో వాళ్లకి ఒక కాగడా వుండాలి ! అలా కాగడాలేనివాళ్ళు గుహ బయటే వేచివుండాలి" అన్నాడు హెచ్చరికగా !

అలెగ్జాండర్ నోటోవిచ్ తన లెదర్‌బ్యాగ్‌లో నుంచి ఓ గుండ్రటి రూళ్ళకర్రతీసి జేబురుమాల చుట్టి తన కారులో వాడే పెట్రోలుతో దాన్ని తడిపి పొట్టి కాగడావంటిది తయారుచేశాడు. నికోలస్ రోరిఖ్స్ తన మంచు గొడ్డలికర్రను తిరగేసి పట్టుకొని తన జేబురుమాలును చుట్టి కాగడా సిద్ధంచేశాడు. చార్లెస్ బెల్ తన పెద్దటార్చిలైటు తీసి ఐదు వందల వోల్టుల వెలుతురుతో ప్రకాశించే లైటు వెలిగించి దాన్ని ఫోకస్ చేస్తే తెల్లటి సూర్యరశ్మిలాంటి దాని కాంతి ఓ గడకర్రలా ఫోకస్‌తో వంద గజాల దూరందాకా వెళ్లిపడి గుహను వెలిగించే టార్చిలైటు వెలిగించాడు.

ఇలా ఎవరికి చేతనైనవాటితో వారు సిద్ధమయ్యారు. అపుడు లామా దోర్జీ చోగ్యాల్ తాను రోజూ భోజనంచేసే కొబ్బరిపెంకు చిప్పను నేతితో నింపి దాంట్లో గుడ్డలతోచేసిన ఓ లావుపాటి వొత్తివేసి ఆ చిప్పకు పెరుగుపిడతకి ఉట్టివేసిన తాళ్ళ మాదిరిగా "ఉగ్గం" (చిక్కం) లా కట్టి చేతితో పట్టుకొని ఏవో మంత్రాలు చదువుతూ గుహ ముఖద్వారంకి

రెండువైపులా అక్షింతలు చల్లి మంత్రించాడు !"

"ఇవి మనకి కొండగుహ లోపల వ్యాసమహర్షి అనుగ్రహించి ఇచ్చిన మంత్రాక్షతలు ! ఇవి మనకు కంటికి కనిపించే ప్రమాదాలనుండి, కనిపించని దుష్టశక్తులనుంచీ, యక్షిణీ తాంత్రిక ప్రయోగాలనుంచీకూడా రక్షణ కల్పిస్తాయి" అంటూ మెట్లవెంబడి లోపలికి విసిరాడు. స్పష్టమైన స్వరంతో వేదమంత్రాలు చదివి గుహమెట్లు నెమ్మదిగా దిగసాగాడు. ఆయన పాదుకలచప్పుళ్లు టక టకామని గుహ అంతా ప్రతిధ్వనిస్తూ మారుమ్రోగాయి.

లామా వెనుకనే కుడివైపున అలెగ్జాండర్ నోటోవిచ్, ఎడమవైపున చార్లెస్ బెల్, ఆ వెనకాతలే మిగతామిత్రులూ, అలా మూడువరుసలుగా నెమ్మదిగా గుహ మెట్లుదిగుతూ సొరంగంలోకి నడవసాగారు.

సొరంగం లోపల విపరీతమైన చలిగా ఉంది ! కాని, ఆశ్చర్యం! మేము ఊహించినంత చీకటిగాలేదు ! ఎక్కడినుంచో మసక వెలుతురు పెంకుటింటి కప్పులమీద కిటికీలోంచి ఎండ లోపలికి పడినట్టు నేరుగా సూర్యుడు వెలుగుతూ గుహలోపలికి ప్రకాశించుతున్నాడు. పొద్దుతో సూర్యుని వెలుగు కూడా మూలకు తిరిగి గుహలో ప్రదక్షిణంగా సూర్య బింబం — మధ్యాహ్నం కాగానే — మళ్లీ ఎడమవైపుకి తిరిగి అదే విధంగా అర్ధచంద్రాకారంగా వెలుగుతూ గుహ మిగతాభాగాన్నికూడా వెలిగించాయి ! అలా ఆ గుహలో అనేకచోట్ల కిటికీల వంటి రంధ్రాలు ఎంతో జ్యోతిషం తెలిసిన, గణితంలో కోణాలుకొలిచి, కొండరాళ్ళతో పెట్టిన కిటికీలవంటి కన్నాల ఏర్పాటుకు అందరూ విస్తుపోయారు.

"ఎవరో గొప్ప శిల్పులు ! సిద్ధహస్తులైనవారే ఈ ద్వారబంధాన్నీ, ఈ కిటికీలనూ కూడా ఏర్పాటుచేశారు" అన్నాడు ఆశ్చర్యపోతూ అలెగ్జాండర్ నాటోవిచ్ !

"అంతేకాదు ! ఆ శిల్పాలు, సూర్యకిరణాలు వెలిగే కోణం ఖచ్చితంగా కొలిచే మందిరాన్ని నిర్మించినవాడు పంచాంగ గణితంతెలిసిన ఖగోళశాస్త్రజ్ఞుడు, జ్యోతిష పండితుడూ, కూడా అయివుండాలి !" అన్నాడు చార్లెస్ బెల్ విస్తుపోతూ ఆ కిటికీలవంకే చూస్తూ !

"అంతేకాదు మహాశయా ! ఐదువేల సంవత్సరాల తరువాత రాగల ఈకాలంలో సూర్యకిరణాలు వంగే కోణంను కూడా కొలిచే '**భవిష్యత్ తెలిసిన**' ఋషులవంటి మహాత్ములెవరో ఈ గుహలోని కిటికీలూ, గుహ ద్వారం ఇలా ఏర్పాటుచేశారు మన ఊహకే అందకుండా !

"అన్నిటికన్నా చిత్రం — సరిగ్గా సూర్యుడు మేషరాశిలో ప్రవేశించినపుడే ఆ వేడికిరణాలు తగిలి మంచు కరిగి ఈ సొరంగద్వారం కూడా తెరుచుకోవడానికి అనుకూలంగా మలచారు" అన్నాడు నికోలాస్ రోరిఖ్ ఆశ్చర్యపోతూ !

రష్యన్ పరిశోధకుడు 'ఔస్పెన్‌స్కీ' — లేచి తన టేపుతో సొరంగం మెట్లమీదనుంచి, సూర్యకిరణాలు పడే దిక్కువరకూ కొలతలుతీసుకొని చక చకా లెక్కలుకట్టి ఆశ్చర్యపోతూ — "ఇక్కడి కొలతలూ, ఈ గుహల ద్వారాల కోణాలూ, చెక్కిన మహాత్ములు ఎవరో — ఈజిప్టులోని పిరమిడ్‌లు కట్టిన ఖగోళ-గణితాన్ని తూచా తప్పకుండా అనుసరించారు ! అంటే ఏమిటి ? ఇక్కడి టిబెట్‌లోనూ, ఈజిప్టులోని పిరమిడ్‌లలోని

ఖగోళగణితాన్ని తెలిసిన **"పరమ-గురువులు"** మాత్రమే ఈ పని చేయగలరు ! ఈ గణితాన్ని సాధించగలరు” అన్నాడు ఆశ్చర్యంగా !

“ఎందుకంటే ఈజిప్టులోని ‘పిరమిడ్’లో నిర్మాణంచేసినవన్నీ ఆశ్చర్యంగా ఈ గణితంతో ఖచ్చితంగా సరిపోతున్నవి ! ఈ గుహలోని సూర్యరశ్మి కిరణాల కొలతలుకూడా — సరిగ్గా అలానే పడుతున్నాయి !”

అన్నాడు ఔస్పెన్ స్కీ విస్తుపోతూ.

“దీనికి కారణం ఈజిప్టులోని పిరమిడ్‌లు కట్టిన ‘పరమ గురువులూ’ — ఈ గుహలోని మంచు పర్వత ద్వారాన్ని ఏర్పరచిన ‘మహర్షులూ’ ఒక్కరేనని మనం తెలుసుకోవాలి !” — అన్నాడు లామా దోర్జీ-చోగ్యాల్.

“ఏమిటి ? ఈజిప్టులోని “ఫారో”ల కాలంనాటి కొలతలు — ఇక్కడ మీ టిబెట్‌లోని ఈ లామాలకి కూడా తెలుసునంటారా ? అదెలా సాధ్యం ? ఎన్నో వేలమైళ్ళదూరం ప్రయాణంచేస్తే గాని “ఈజిప్టు”కు చేరుకోలేరు ! పైగా ఆరోజులలో విమానాలు కూడా లేవు” — అన్నాడు వెంటనే మేఘనాధ్.

“ఇంతే కాదు నేనింకో మహాశ్చర్యం చెప్పనా ? ఇది వింటే మీ ఊపిరే ఆగిపోతుంది !! అదేమిటంటే నేనిప్పుడు “ఈజిప్టు”లో వున్న గొప్ప “పిరమిడ్” గురించి చెప్పానే — అలాంటివి ఇంకా మా టిబెట్‌లోనూ చాలావున్నాయి” — లామాదోర్జీ చోగ్యాల్ బాంబుపేల్చినట్టు !

— “ఏమిటి ? చాలా వున్నాయా ? ఆశ్చర్యంగావున్నదే ! ఈజిప్టులోని ‘పిరమిడ్స్’ లాంటి పిరమిడ్‌లు టిబెట్‌లోనూ వున్నాయంటే దీని అర్థమేమిటి ?” అన్నాడు ఔస్పెన్‌స్కీ, మరింత విస్తుపోతూ.

“అంటే ! — దాని అర్థమొక్కటే ! ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉండేది — ఈ పరమగురువుల “జ్ఞానం”! అది ఈనాటి యంత్రాల మీద ఆధారపడ్డ సైన్సువంటి విజ్ఞానంకాదు ! నా మూడవకన్ను తెరిపించిన తాషీ-లామా మాదేశపు పరమగురువు ‘దలైలామా’ ఇంకా మనమిప్పుడు దర్శించిన ‘సిద్ధగురువులందరికీ గురువైన **శ్రీవేదవ్యాస మహర్షి** ఈ శరీరంతోనే ఎగిరి ‘ఆకాశయానం’తో ఎంతదూరమైనా ఈ భౌతికశరీరంతోనే వెళతారు — ఈజిప్టువరకూ అన్నమాటేమిటి భూగోళాన్ని అంతా కూడా చుట్టిరాగలరు క్షణాలమీద ! దానికితోడు సూక్ష్మశరీరంతో ప్రయాణం చేయడం — మందబుద్ధినైన నాకే వచ్చునుగదా ? మరి వారికెందుకు రాదు ?

కాబట్టి ఒకే విజ్ఞానం ఇటు యోగాన్ని అటు జ్యోతిషాన్నీ, ఇటు మంత్రశాస్త్రాన్ని, అటు వాస్తుశాస్త్రాన్నీ, ఇటు స్పటికాలమీద కాంతికిరణాల ప్రసారాలయొక్క ప్రభావాన్నీ — అన్నీ తెలిసి ఆ తేజస్సు మనస్సుమీద, మెదడుమీదా ప్రసరించి బ్రహ్మ-జ్ఞానాన్ని తెలుసుకునే అతీంద్రియ ‘సిద్ధి’ని విద్యుత్తులైటు వంటి వెలుగునూ — వెలిగించగలదనీ ఎరిగిన అలాంటి వారి “బ్రహ్మ-జ్ఞానమే” ప్రపంచమంతటా ఒకప్పుడు వ్యాపించి వుండేది ఆనాటి ‘ఆదికాలం’లో ! అదే ఈనాటి ప్రపంచంలోని అన్ని ప్రాచీన మతాల మూలగ్రంథాలన్నిటికీ ఆధారం” అన్నాడు లామా.

“దీనికి ఋజువేమిటి ?” అన్నాడు దుడుకుగా భావనగర్ మహారాజా.

“దానికి ఋజువు కావాలంటే ప్రపంచంలోని అన్నిమతాలూ కలిపి

మీరు విశ్లేషించాలి — సైన్సు విజ్ఞానంతో ! అప్పుడు మైలురాళ్ళ వంటి కొన్నిసత్యాలు సమానంగా అన్ని దేశాలలోని మతాలవెనకా దాగివున్నాయే — ఆ సత్యాలే కనిపిస్తాయి !!!

ఉదాహరణకు ఏడురోజుల — **'వారం'** ! ఇది ప్రపంచంలో అన్ని మతాలలోనూ ఉన్నదిగదా ? అందరివీ — ఏడురోజుల వారాలే! అందరికీ వారాధిపతులూ అవే గ్రహాలు ! — అదే ఇంద్రధనుస్సులోని రంగుల వరుసలోనే అవి ఏర్పడివున్నాయిగదా ! అదీ ఇప్పటి మీ "సైన్సు"లో కూడా కనుగొన్న సత్యం — ఏడురంగులూ కలిసి తెల్లని కాంతిలో ఉన్నాయనిగదా ?

అలాగే తొమ్మిది (9) అంకెలు, ఒక సున్నా ! ఇంకా అక్షరాల్లో అందరికీ 'అ'-కారమే మొదటిది ! ఇలా చెప్పుకుంటూపోతే ఇంకా చాలావున్నాయి ఆలోచించి చూస్తే మీకే తెలుస్తుంది !!! టిబెట్‌లో కూడా ఈ పిరమిడ్‌లు ఎలావున్నాయోనని మీరేం విస్తుపోనక్కరలేదు !" అన్నారు లామా దోర్జీ-చోగ్యాల్ మహాశయుడు మెరుపువేగంతో !

ఆయన అత్యద్భుతమైన సమయస్ఫూర్తికీ, సమన్వయ దృష్టికీ మాలోని సైంటిస్టులతోసహా అందరం ఆశ్చర్యంతో నోరుతెరిచాం !

"ఇది ఈజిప్పులోని అతి ప్రాచీనమైన 'రాశి-చక్రం' ! దీన్ని — **"డెండెరా రాశిచక్రం" (Dendera Zodiac)** అంటారు, మీరు !! ఈజిప్ట్‌లో 3200 B.C. కంటె పూర్వమే చెక్కిన ఈ రాసులూ, నక్షత్రాలు తెలిసిన ఖగోళశాస్త్రవేత్తలైన, పండితులెవరో ఈ కిటికీలను కూడా చెక్కివుండాలి! ఎందుకంటే ఇప్పుడీ నక్షత్రాలూ లేవు ! ఆకాశంలో **ఈ రాసులూ**

కనిపించవు ! దానికి తోడు రాశిచక్రంలోని రాసులన్నీ చిందర వందరగా ఇప్పటి క్రమానికి **వ్యతిరేకంగా** — ఏర్పడివున్నాయి" అన్నాడు 'ఔస్పెన్స్కీ'.

'వెలికోవిస్కీ' తటాలున ముందుకువచ్చి ఆ కొలతలు చూసి — విస్తుపోతూ "ఆశ్చర్యం ! సరిగ్గా ఈ రాశిచక్రం — గతంలో ఈ భూమ్మీద జరిగిన **'మహాప్రళయం' కాలానికి ముందు** ఇలా వుండేది ! ఇక్కడకూడా సరిగ్గా అలాగే చెక్కారు !! అక్కడ ఈజిప్టులోని రాశిచక్రం — మూడు సార్లు ఇలా గిరగిరా తిరిగిపోయింది ! దానినిబట్టి చూస్తే ఇది క్రీస్తు పూర్వం 50,000 B.C. నాటి ప్రళయానికి ముందుగా వుండిన రాశిచక్రం" అన్నాడు.

"అదెట్లా చెప్పగలరు ? ఈ గుహలో ప్రళయం గురించి ఏమైనా రాసివున్నదా ?" — అంటూ ప్రశ్నించాడు "చార్లెస్ బెల్" ! అందరూ ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టారు — "ఏమిటి ? **ప్రళయమా ?**" అంటూ !

"ఈజిప్టు ప్రాచీన చరిత్రలో కొన్ని లక్షల సంవత్సరాల క్రితం ఈ భూమికి అడ్డంగావొచ్చి ఆకాశంలోంచి — వేరేగ్రహం లాంటిది ఢీకొనే లాగా వేగంగా వొచ్చి, భూమి ప్రక్కనుంచే దూసుకుపోయింది ! దాని ప్రచండమైన వేగానికి మన భూగోళం తిరగడమే గల్లంతుపడి — పూర్తిగా మారిపోయింది ! ఒక్కసారిగా భూమి ఉత్తర-దక్షిణ ధృవాలు తల్లక్రిందులైనాయి ! దానితో తూర్పు పడమరగానూ, పడమర తూర్పుగానూ — తిరగబడిపోయాయి."

"అప్పటిదాకా టిబెట్ ఒక సముద్రతీరంగా వుండేది ! ఆ ప్రళయం తరువాత ఏర్పడ్డ — భూకంపాలు, అగ్నిపర్వతాలు చెలరేగి కొండలు, రాళ్ళు కరిగి — ఆ వేడికి బెల్లంలాగా కొండ మెత్తబడి పాకంపట్టినట్లు

బండరాళ్లు కరిగి 'లావా'గా ప్రవహించి అగ్నిపర్వతాలు పేలి భూమిమీద ఆ ఒత్తిడికి హిమాలయ పర్వతాలు ఇప్పుడున్న "ఎవరెస్ట్ శిఖరం" వున్నంత ఎత్తుకు ఒక్కసారిగా లేచిపోయాయి ! దాంతో టిబెట్ ఒక్కసారిగా ఇప్పటి ఈ ఎత్తుకు పెరిగిపోయి మంచుకొండలతో కప్పిన చలిప్రదేశంగా, ఓ పీఠభూమిగా మారిపోయింది ఆ **ప్రళయం** తర్వాతే !" — అనగానే

"ఇదంతా మీ టిబెట్‌లోని ప్రాచీన పురాణాలలో రాసివుందా ?" అంటూ ప్రశ్నించాడు సైంటిస్ట్ జగదీష్‌చంద్రబోసు.

"పురాణాలలో రాసివుండటం మాత్రమే కాదు ! నేను మీకు ఇదివరకే చెప్పానుకదా? మా గురుదేవులు "తాషీలామా" వారి అనుగ్రహంతో !" నాకు మూడవ కన్ను తెరిచినపుడు కాలంలో వెనకకు ప్రయాణించి నేచూసిన ఆ "కాలజ్ఞానం"లో ఈ భూమ్మీద జరిగిన ప్రళయాలు — ముఖ్యంగా గత "మహాప్రళయం" కూడా (చూ. **ప్రపంచంయొక్క బాల్యం**) ఎంతో స్పష్టంగా చూశాను !

"అరె ! మాట్లాడుతూనే మనం ఈ సొరంగంలోంచి పూర్తిగా ప్రయాణించి — అది దాటికూడా పోయాము అవతలి ఒడ్డుకి ! పైనించి చుక్కలు చుక్కలుగా తడినీటి బిందువులు పడినా — మనపైన ఒక మంచు నది ప్రవహిస్తుందని కూడా — మనకి గుర్తుకు రాలేదు" అన్నాడు ఆశ్చర్యంతో 'చార్లెస్ బెల్.

"ఇదంతా మహాత్ముడైన **వేదవ్యాసమహర్షి** దివ్యానుగ్రహ ప్రభావమే! మనం స్పటికపర్వత ద్వారం — త్వరగా చేరుకోగలమన్న నమ్మకం నాకిప్పుడు వుంది" అన్నాడు — లామా దోర్జీ-చోగ్యాల్.



అలా వాళ్ళు మాట్లాడుకుంటూవుండగానే సారంగంలోకి ప్రవేశించే గుహ ముఖద్వారంలోంచి **"ఓం"** అంటూ ఖంగుమనే కంచుగంట వంటి శబ్దం గుహంతా ప్రతిధ్వనిస్తూ — ఎవరో పర్వతమంతటి శరీరం గల మహాపురుషులు శ్వాసంతనీ దమ్ముపట్టి గుహలోంచి ఓంకారాన్ని చేస్తున్నాడా అన్నంత స్వరంతో ధ్వనించింది ఆ ప్రణవనాదం !! ముందు అది, నెమ్మదిగా ప్రారంభించి క్రమంగా ఒక తరంగం లాగా వ్యాపించి సంగీతంలో ఆలాపనకంటే నెమ్మదిగా — నిశ్శబ్దంలోకి వెళ్లి కరిగి పోయింది !

మేమంతా ఆశ్చర్యంతోనూ, భయంతోనూ తుళ్ళిపడి ఒకరివంక ఒకరు చూసుకున్నాం చార్లెస్ బెల్ — నికోలాస్ రోరిఖ్స్‌తోసహా ఇతర సభ్యులందరూ ! అందరం కలిసి మాఆశ్చర్యానికి సమాధానంకోసం లామాదోర్జీ-చోగ్యాల్ వంక భయంతోనూచ ఆశ్చర్యంతోనూ చూశాం — ఒక ప్రశ్నార్థకంగా ముఖంపెట్టి ! వీళ్ళకి మాటలు పెగలడంలేదని గ్రహించి ప్రశ్న అడగడానికి కూడా ధైర్యం కూడదీసుకోవాల్సి వస్తోందని వాళ్ళు వశంతప్పిన ఆశ్చర్యం, భయం కలిసిన అద్భుతమైన అనుభూతిని వ్యక్తం చేస్తున్నదని గ్రహించిన లామాదోర్జీ — ఇలా అన్నాడు !

"ఇది కాలపురుషుని హృదయంలోని — గుహవంటిది ! ఇది ఈ ధ్వని, ఆకాశంలోంచి పుట్టే ఓంకారం ! మా ముసలిలామా గురువులు తాషీలామావంటి పీఠాధిపతుల విశ్వాసం ఏమిటంటే ఇలాంటి ఓంకారం పుట్టేది హిమాలయాలలోంచే !! గతంలో ఇలా పుట్టే — ఈ సృష్టి **ప్రారంభించింది** "బ్రహ్మకల్పం" ఆదిలో ! ప్రణవంనుంచి అన్నీ సృష్టి కాబడ్డాయని — వేదాలలోని మంత్రాలకు నిదర్శనంగా ఇప్పటికీ ఇలా

వినిపిస్తూనే వుంటుంది !" అంటూ గుహవైపుతిరిగి వందనపూర్వకంగ నమస్కరించాడు !

వెంటనే తన పూజా దస్త్రం విప్పి రెండు టిబెటన్ అగరువొత్తుల వెలిగించి ధూపం సమర్పిస్తూ గుండ్రంగా తిప్పి గుహకు రెండువైపుల గుచ్చాడు! ఆపైన గుహ ముఖద్వారంవద్ద తాను భక్తితో తటాలు సాష్టాంగపడి నమస్కరించాడు ! అప్పటిదాకా బెంబేలుపడ్డట్టు నిలబ మా మిగతాసభ్యులంతా మారు మాట్లాడకుండా నేలపై సాగిలప లామాతో పాటే నమస్కరించాం చచ్చినట్టు !

మరుక్షణంలోనే అందరం గుహలో ప్రవేశించాం! ఇంతలో ఉరుము తున్నట్టు భయంకరమైన ధ్వని ఒక రధచక్రం రాతి రధంతో చేసిన కొండరాళ్ళపై ఎక్కడో పరిగెత్తుతున్నట్టు ధ్వని వినిపించింది ! ఆశ్చర్యంగ అందరం పైకి చూసేలోగా లామా ఇలా అందుకున్నాడు.

"ఇవి పైన గర్జించే ఉరుములు కాదు ! **శంబల గుర్రాల** దెక్క చప్పుళ్లు !!"

"మీరేం కంగారుపడకండి! ఇక్కడేమీ భూతాలూ, పిశాచాలు లేవ మనం బ్రతిమాలి ఆహ్వానించినా రాలేవు ! భయంతో వణికిపోతా శంబల అన్న — ఈపేరు చెపితేనే !" అన్నాడు లామా మహాశయుడ

దాంతో — అందరికీ భక్తి, విశ్వాసం కలిగింది ఓ వెచ్చటి స్ప లాగా !

⁂

35

గంగ-పుట్టిన "పాద-తీర్ధం"!

ఆటవిడుపుగా విశ్రాంతి తీసుకున్నాక మా సాహసయాత్రాబృందం ఆలస్యం అయిపోతున్నదన్న బెంగతో అతివేగంగా నడక సాగించాము. ఈసారి దారి ఎత్తుపల్లాలుగా మంచుశిఖరాలపై ప్రయాణించకుండా విశాలమైన మంచుమైదానంలోంచి అర్ధచంద్రాకారంగా ఒక కళాయిపాత్రలా పల్లంగావున్న తళతళా వెండిలా మెరిసే మంచులోయలో నడుస్తుంటే గలగలా నీళ్ళు ప్రవహిస్తున్న శబ్దం దగ్గరగా వినిపించింది ! కాని కుడి ఎడమలకు చూస్తే కనుచూపుమేరలో ఎక్కడా సెలయేళ్ళుగాని, వాగులు, వంకలూ వంటివిగాని — కనిపించనే లేదు. మరి, ఈ నీళ్ళశబ్దం ఎక్కడ నుంచీ వస్తోందా ? అని ఆశ్చర్యపోతున్న మా చూపులకు సమాధానంగా లామా చోగ్యాల్ మహాశయుడు చిరునవ్వుతో ఇలా అన్నాడు.

"ఇది 'గౌముఖ్' అనే హిమాలయాలలోకల్లా పవిత్రాతి పవిత్రమైన గంగానది పుట్టిన చోటు ! కిందాపైనా దట్టంగా ఓ పర్వతంలా మంచు ఏర్పడి దాని మధ్యలో సొరంగంలోంచి పొగలుకక్కుతూ ఉడుకు నీళ్ళు ప్రవహిస్తూ — ఆవు ఆత్రంగా గుటకలువేస్తూ నీళ్ళు తాగుతున్నట్టు శబ్దం వస్తుంది గనక — ప్రాచీన ఋషులు, లామాలూ, ఈ ప్రదేశానికి **'గౌముఖ్'** అనగా **'ఆవుయొక్క ముఖము'** అన్న పేరుతో భక్తితో పిలుస్తారు. ఇక్కడ పుట్టిన గంగ తెల్లటి మంచునేలలో వజ్రంలాగ నీలంగా ప్రవహిస్తూ నిర్మలంగా ఎక్కడా భూమికి స్పర్శలేకుండా స్ఫటిక నిర్మలమైన జలంతో పారుతూ వుంటుంది.

"ఈ నీళ్ళు తాగితే ఇంతవరకూ గతజన్మలలో చేసిన చెడుకర్మలూ, పాపములు, రోగాలూ, దోషాలూ, అన్నీ — సమస్తమూ నశించిపోతాయని కొన్ని వేల సంవత్సరాలుగా వస్తున్న ప్రతీతి !" అంటూ తటాలున కుడివైపు తిరిగి ఆవు ముఖంవంటి సన్నని బిలంలోంచి గోరువెచ్చటి నీళ్ళు మంచుపైన పడి అతి చల్లగా మారి ప్రవహిస్తూంటే లామాదోర్జీ భక్తిశ్రద్ధలతో మోకాళ్ళమీద సాగిలపడి దోసెడునీళ్ళు తలపైన కుమ్మరించుకున్నాడు. అందరమూ ఆయనను అనుసరించి అలాగే చేశాము. మరో రెండు దోసిళ్ళు ఆ పవిత్రజలంతో కళ్ళు, చెవులు, చేతులు, పాదాలు కడుక్కుని నోరు పుక్కిలించి — ఆపైన పరిశుద్ధమైన ఆ జలం మూడు దోసిళ్ళు తాగాము.

అలా ఆ మంచుకరిగిన నీళ్ళు తాగామో లేదో మా గుండెలలో చల్లగా ప్రశాంతమైన శక్తీ, విద్యుత్తువంటి కరెంటూ, ప్రవహించినట్లయ్యింది ! ముఖమూ చేతులూ పొడితువ్వాలుతో తుడుచుకుని –

గాఢంగా ఊపిరితీసుకున్నాము. ఒక్కసారిగా మా శరీరం బరువంతా దిగిపోయినట్టయింది. మాకు ‘శరీరం’ అసలు వున్నదా ? లేదా ! అన్నంతగా తేలికపడిపోయింది ఒళ్ళంతా ఆశ్చర్యంగా !!

మరుక్షణమే కడుపులో బొడ్డువద్దనుంచి ఓ సుడిగుండంవంటి చక్రంలాగా ఏదో తిరుగుతున్నట్టు కరెంటు వంటి స్పందన కలిగి శరీరం ముందుకీ వెనక్కీ మత్తునిద్రలో జోగుతున్నట్టు ఊగిపోసాగింది. దాంతో మా మనస్సు అటు మెలుకువ కాకుండానూ ఇటు పూర్తి నిద్రాకాని ‘ధ్యానస్థితి’లో నిలబడిపోయింది ఏ ఆలోచనా లేకుండా ! ఆశ్చర్యం ! మా మనస్సు మాకే వింతగా తోచింది — మనస్సు అలా నీలాకాశంలా, నిర్మలంగా, ఖాళీగా, శాంతిగా ఏ ఆలోచనాలేకుండా అంత నిశ్చలంగా వుండటంతో — పట్టరాని ఆశ్చర్యం కలిగింది ! అసలు అలాంటి స్థితి వుంటుందంటేనే ఎవరు చెప్పినా నమ్మలేము ఇపుడు మాకే నిజంగా అలాంటి ‘భావాతీత-స్థితి’ కలిగింది ! మరుక్షణంలోనే మా కళ్ళు మూతలు పడ్డాయి.

ఇంతలో మా శరీరం, తలా అంతా గాజులాగా స్ఫటికంలా అయినట్టూ, మా శరీరంలోని రక్తనాళాలు అవయవాలు గాజుతో చేసిన ఓ పేపర్ వైట్‌లాగా ఇటునుంచి అటు కనిపిస్తున్నట్టుగా మా దృష్టికి మాకే అనిపించింది ! ఇది భ్రాంతా ! నిజమా ! లేక యదార్థ ప్రపంచానికి పైన తేలుతుంటే ఓ, జ్ఞాన-భూమికా ?

అని ఇలా ఆశ్యర్యపడుతుండగానే మా తలలోని రక్తనాళాలు మాకే కనిపించాయి — ముందుగా గాజుగొట్టంలాగా తలలో రక్తం ప్రవహిస్తు

న్నట్టు ! మరుక్షణమే అవి సైజులో పెరిగిపోయి పెద్ద పెద్ద నదుల్లాగా వెలుగుతూ రక్తనాళాలలోని రక్తం గలగలా రొదచేసుకుంటూ నదీప్రవాహ వేగంతో పరిగెత్తుతోంది !

ఆశ్చర్యపడేలోపలే తలంతా నిండి అల్లుకుపోయిన రక్తనాళాలు వందల వేల నదులుగా సెలయేళ్ళుగా గలగలా రొదచేస్తూ మాతలలోనే పరుగులెత్తుతున్న అనుభూతి కలిగింది. ఆ హోరు" ఎక్కువై — చెవులలో ఘోషపెట్టే సముద్రం హోరులాగా వున్నట్టుండి అలలు ఎగిరిపడుతున్నట్టు ఆగి — ఆగి నిశ్శబ్దం మళ్ళీ రొద ! మళ్ళీ హోరు ! — రక్తం అంతా సముద్రంలాగా పొంగి తల గుండ్రంగా భూమిలాగా సముద్రాలన్నీ మా తలలోనే పొంగుతూ వెనక్కిపోతూ 'ఆటు-పోటు'ల్లా దర్శనమిచ్చాయి. ఇదేదో మా 'తలతిప్పు' అనుకుని కళ్ళుమూసుకున్న వికారమేమో అంటూ భయపడి మెడపైకెత్తి తల నిటారుగా పెట్టి కూర్చుంటే చెవులలో 'ఓం' — అని 'భం' — అని శంఖధ్వని మరుక్షణంలో 'భం' 'భం' అని దిక్కులు మారుమోగేలా ప్రతిధ్వనించింది.

అదుగో !! "**శంబల-శంఖం !** విన్నారా ?" అంటూ లామా దోర్జీ కంఠస్వరం ఎక్కడో దూరంగా కొన్ని మైళ్ళ అవతలనుంచీ వినిపించినట్టు వినిపిస్తోంది.

ఇంతలో మా కళ్ళలోంచి నిప్పురవ్వలు జిగేల్‌మని మెరుస్త ఛట్ ఫట్‌మని రాలుతూ నక్షత్రాలు దీపావళి కాకరపూవొత్తుల్లో రవ్వల్లాగ పూలులాగా పూలుగా బయటికి చిమ్మాయి, ఆ నక్షత్రాలు — నక్షత్రాల లోంచి గ్రహాలు — గ్రహాలలోంచి గ్రహమండలాలూ, రక్తనాళాలనిండ

నదులూ ప్రవహిస్తూ మెదడు పైభాగం అంతా నీలాకాశంలా నక్షత్రాలతో నిండి పోయి — ఈ సమస్త విశ్వమూ మా తలలోనే కనిపించింది.

తల-అంతా 'విశ్వమే!' :

"అయ్యో ! తలలో నక్షత్రమండలాలా ? ఏమిటిది ? గెలాక్సీలా ! నాలోంచే గ్రహాలు తిరుగుతూ పోతూ కనిపిస్తే — ఏదో కళ్ళుతిరిగిన వికారంలా 'భ్రాంతి' కలిగింది !

ఇంతలో చార్లెస్ బెల్ చెవులల్లో మాటలు — స్కాట్ల్లెండ్‌లోని తనభార్య "సెల్‌ఫోన్‌లో తనతో మాట్లాడినట్టూ — అతని చెవుల్లో నోరుపెట్టి అరుస్తూ ఆమె నాకోసం మాట్లాడాలని అంటున్నది! ఆమె ప్రసవించిందట ! మగబిడ్డ ! అంటోంది" అంటూ తన మాటలకు తానే తుళ్ళిపడి చార్లెస్ బెల్ —"ఇదంతా ఈ చల్లని పవిత్రజలంతో మనం ముఖం కడుక్కున్న ఫలితం !"

"కాలం — దూరం — విశ్వం — మనలోని ప్రాణం — అన్నీ కలిసిపోయి అంతా 'సంగ్రహం'గా అయిపోయి నా తలలోనే తాండవం చేస్తున్నాయి ! నిజంగానే నాభార్య నాతో సెల్‌ఫోన్‌లో మాట్లాడాలని అరుస్తూ ప్రయత్నిస్తోందా ? అయ్యో ! మరి నా 'సెల్‌ఫోన్' — డార్జిలింగ్ లోనే విడిచిపెట్టి వచ్చానుగదా ? — బ్యాటరీ అయిపోతే !" — అంటూ విస్తుపోయాడు.

"ఆశ్చర్యపోకండి గూఢచారి మహాశయా ! ఇక్కడి "శంబల" నీళ్ళు 'కాలజ్ఞానాన్నీ' ఈ విశాల విశ్వంయొక్క దూరాన్నీ — జయించగలవు ! మీ ఆత్మయొక్క శక్తి పెరిగి — మీకే ఆశ్చర్యం కలిగిస్తుంది. అంతటి

'దైవత్వం వున్నదా?' అని ! ఇక్కడగనక ఇంకా కొద్దిరోజులుంటే ప్రతిరోజు 'స్పటిక-పర్వతం' దర్శనం, చల్లని గోముఖ జలంలో ప్రవహించే గంగా స్నానంతోనూ మీ మనస్సు పూర్తిగా స్థంభిస్తుంది ! యోగంతో – "మనోనాశం" అయిపోతుందని చదవలేదా ?

వయస్సు-స్థంభన అంటే ఏమిటి ? — అంటే మీరు ఎప్పటికీ ఇదే వయస్సులో నిలిచిపోతారు ! ఎన్ని సంవత్సరాలయినా అంతే వయస్సుంటుంది — మీ శరీరానికి ! బంధుత్వాలన్నీ పూర్తిగా మరపుకొస్తాయి. మీకు ఎవరూ లేనట్టూ ! ప్రపంచంలో మీరొక్కరే వున్నట్టూ ! ఆ "మీరు" అనబడే ఆ **"నేను"** తోనే, ఈ ప్రపంచమంతా నిండిపోయినట్టూ ప్రపంచ జాతులూ, దేశాలూ, అందులోని ప్రజలూ — అందరు మీ కడుపులోంచి బియ్యపు గింజలలా వచ్చిన మీబిడ్డలు కుటుంబంలా కనిపిస్తుంది ! ఈ విశ్వమంతా మన కుటుంబంలా ! మనలో వారికోసం ప్రేమ, దిగులు బెంగ పుట్టుకొస్తాయి. ఇక్కడేవుంటే **'మోక్షం'** కూడా మానేసి — మీరు ఒక కన్నతల్లిలా వారికోసం పిల్లాడికోసం తల్లి త సుఖాలు అన్నీ త్యాగం చేసినట్టూ — ఇక వాడే తన 'జీవితం' అయిపోయినట్టూ — ఇలా మోక్షం కూడా మాని ఈ భూమ్మీదే వుండిపోతారు. ప్రజల ముక్తికోసం పాటుపడుతూ ! అసలు 'తన' ముక్తి ధ్యాసే మరి పోయి — 'తాను' అన్న భావాన్నే మరిచిపోతారు చివరికి ! ఈ పవిత్ర జలాల ప్రభావం "అంతటిది !"

ఇదంతా **"శంబల"-ప్రభువు** సన్నిధియొక్క పరమ పవిత్ర ప్రభావ లోని దివ్యశక్తిలో ఒక్క ఆవగింజంత — నిప్పురవ్వ మాత్రమే ! ఆయ ప్రత్యక్షంగా గనక ఈ ప్రపంచంలోకి వస్తే మన ఊహలుకూడా పట్టవ

మంచులోపూసే "బ్రహ్మకమలం"

ఆశ్చర్యానికి" — అన్నాడు లామా దోర్జీ చోగ్యాల్ మహాశయుడు.

మాలో కలిగిన దివ్యానుభవానికి అందరం విస్తుపోతూ **'పవిత్రత'** — అంటే ఏమిటో మొదటిసారిగా జీవితంలో తెలుసుకున్న పసిపిల్లవాడిలా 'లామా'-మహాశయుడి వెంట నడిచాం — తల్లివెంట నడిచే పసిపిల్లాడిలా ! మౌనంగా !

⁂

36

మంచు కోతి !

అలా ధర్మరాజు వెనకాలే నడచివెడుతున్న విశ్వాసంగల కుక్కపిల్లలా మా సాహసయాత్రా బృందం అంతా ఆశ్చర్యంతో మౌనంగా తలలు వొంచుకొని నడకసాగిస్తున్నాం !

నడుస్తున్నామన్నమాటేగాని మాలో ప్రతీ ఒక్కరికీ లోలోపలే గొప్ప అంతర్మధనం జరుగుతోంది — అసలీ హిమాలయాలలోవున్న ఈ అద్భుతశక్తి ఏమిటి ? మామూలు ఇనుపముక్కను సూదంటురాయిగా మార్చి కరెంటుప్రవహించే తీగలా స్పందించేలా ఇక్కడి వాతావరణం నిర్మలమైన మంచుకరిగిన నీళ్లూ — అబ్బా ! 'అసలేమిటి మన జీవితం ?' మన జీవితానికి అర్థమేమిటి? బయటి ప్రపంచంలో నిత్యం మనం బ్రతికే "ఫ్యాను"లా గిర్రునతిరిగే అర్థంలేని నిత్యజీవితంలో కాలయాపనేనా ? జీవితమంటే ! — మరణం ఎదురుగుండావచ్చి కోర్టు నుండి వచ్చే సమన్‌లాగా మనలను పిలిచేదాకా ?

అసలు మన జీవితంలో ఇంతవరకూ సాధించిందేమిటి ? ఈ శరీరంతో, భోజనము, నిద్ర, సుఖదుఃఖాలు, రాత్రిపగలు తిరిగే కాలంతో వయస్సుమళ్లి ముసలితనం వచ్చి ఆకులు రాలిన చెట్టు మోడుబారినట్టే ముసలితనంతో ఎండిపోతూ నిస్సారంగా చచ్చేదాకా కాలాన్ని భారంగా మోస్తూ అర్థంతెలీకుండా బతకటమేనా ? జీవితమంటే ! ఓహో ఇంకోపక్క తలలోనే ప్రపంచమంతా చూపించే ఈ పరిశుద్ధ జలంతో తల్లిలా తాకే గంగామాత ! — అవి కేవలం నీళ్ళేనా ? ఎంతటి ప్రభావం వాటికి ! కాలాన్నీ, దూరాన్నీ, శరీరం పరిమితినీ జయించే అద్భుతశక్తి — కేవలం ఒక్కసారి తలమీద ఆనీళ్ళు పోసుకుంటేనే ఇంత అద్భుతంగా కనిపించిందే ! — అవి నిజంగా శివ పరమాత్ముని జటా జూటంనుంచి ప్రవహించిన శక్తివల్లనేనా ? — లేక విష్ణుభగవానుని పాదములనుండి పుట్టిన ఆకాశగంగ పవిత్రతయొక్క శక్తిదా ? ఇవి తప్ప వేరే ఏమీ కారణం కనిపించదే ? — ఇంతటి అద్భుతమైన ప్రభావం ఆ జలంలో వుండటానికి !

ఇలా ఆలోచిస్తూనే సెలయేరులా ప్రవహించే గోముఖం ప్రవాహాన్ని దాటి సన్నటి రోడ్డువంటి దారివెంబడి నడకసాగించాం ! రోడ్డుకి కుడి ఎడమ వైపుల కొండచరియలు ఏటవాలుగా పెరిగిపోయిన ఆకుపచ్చని చెట్లతో నిండివున్నాయి. అవి మామూలు చెట్లవలే కాక — ఆకులులేని దేవదారు వృక్షాలు. నిటారుగా పెరిగి, ఒక బల్లెం ఆకారంలో సూటిగా పెరిగిన చెట్లవరస !

దట్టమైన ఆకుపచ్చని అడవిలాంటి తోటంతా మరింత చల్లగా కనిపించింది. వింత వింత పక్షులు విచిత్రంగా కూస్తూ కుడివైపునుంచి

గుండ్రంగా తిరుగుతూ — మా తలలవైపుగా ప్రదక్షిణంగా ఎగిరి పోయాయి ! ఎక్కడినుంచో ఓ చల్లని గాలి ! ఏదో వింతైన పరిమళంతో ఘుమ ఘుమా వీచింది !! మరుక్షణంలో ఎడమపక్కనుంచి బాగా మగ్గిన అరటిపండ్ల పరిమళం ఘుమఘుమా మా ముక్కులను అదరగొట్టింది! ఆ వాసనకు మాఅందరికీ నోటివెంటా నీళ్ళుకారి నోరూరింది — ఎన్నాళ్ళయ్యిందోకదా ? మనప్రాంతపు అరటిపళ్ళు తిని ! అనుకున్నాం, అప్రయత్నంగానే !

ఎడమవైపునుంచి నెమళ్ళు, జింకలు గుంపులు గుంపులుగా అరుస్తూ కుడివైపుగా పరిగెత్తిపోతున్నాయి. ఇంతలో ఒక వింత పరిమళం పారిజాతపు పూలవంటిది ఎత్తైన కొండచరియమీంచి మావైపు వీచ సాగింది.

"చూశారా ! ఆ విచిత్ర పరిమళం దేనిదనుకున్నారు ? మీలో ఎవరైనా చెప్పగలరా !" అంటూ లామా దోర్జి చోగ్యాల్ ఈసారి తానే మమ్మల్ని సూటిగా ప్రశ్నించారు.

"అదేదో సుగంధపుష్పాల పరిమళంలా వున్నది గురుదేవా!" అన్నాడు జగదీశ్ చంద్రబోస్, వృక్షశాస్త్రజ్ఞుడు కాబట్టి !

"అది పూల పరిమళంలా వున్నదని అందరికీ తెలుసు ! అసలా పరిమళం ఎలావస్తుంది, ఎందుకువస్తోందీ చెప్పగలరా ?"

"మాకేంతెలుసు ?" అన్నాం అందరం ఒకే కంఠంతో.

"ఇది ఒక హిమాలయాలలో మాత్రమే పెరిగే మంచులోంచి పుష్పించే **'మంచు-కమలం'** సువాసన ! 'సౌగంధికం' అంటారు ! ఇది

పన్నెండేళ్ళకొక్కసారి మంచుకొండపైన మంచులోంచి పొడుచుకొనివచ్చి శిఖరంలాగా మొలుస్తుంది. ఆపైన ఏడు-నెలలు ఆ మొగ్గ ఎదిగి — చివరికి సూర్యుడు మేషరాశిలోకి ప్రవేశించిన వసంతకాలంలో పుష్పిస్తుంది ! అరచేతులు రెండూ దగ్గరగా పెట్టినంత వెడల్పుగా — పెద్ద తామర పుష్పంలా విచ్చుకుంటుంది ! దీనికోసం ఎంతోమంది యోగులు, సాధువులు పడిగాపులు పడి ఎదురు చూస్తారు. ఇక్కడివాళ్ళు దీన్ని **'బ్రహ్మ-కమలం'** (సౌగంధికం) అంటారు".

"బ్రహ్మ-కమలమా ? ఆపేరెప్పుడూ వినలేదే ?" అన్నాం అందరం — ఒక్క జగదీశ్చంద్రబోస్ తప్ప ! ఆయన ఆలోచనగా ముఖంపెట్టి —

"ఎప్పుడో నా చిన్నతనంలో జర్మన్ "బోటనీ సైంటిస్టు"లు వృక్షశాస్త్రజ్ఞులతో కలిసి అరుదైన మందు మొక్కలకోసం విచిత్రమైన ఓషధుల కోసం ఒక **'బొటానికల్ టూర్'** వెళ్ళాము. అప్పుడు హిమాలయాలలో నివసించే టిబెటన్ మందుమొక్కలు ఏరే లామా వల్ల వీటి గురించి విన్నాను. అతడు ఎంతో అద్భుతంగా చెప్పాడు కాని దాన్ని చూడటం మాత్రం కుదరలేదు. అవి ఎప్పుడో అరుదుగాగాని పుష్పించవు ! అని మాత్రం విన్నాను గురుదేవా ! ఇప్పుడా బ్రహ్మకమలం మనకి కనిపిస్తుందా !" అన్నాడు లామావైపు తిరిగి ఆశ్చర్యంగా ! లామా మహాశయుడు కుడివైపుగా తిరిగి కొండశిఖరంవైపు చేతులెత్తి నమస్కరిస్తూ ఇలా అన్నాడు.

— "అదే పవిత్రాతి పవిత్రమైన **సౌగంధిక** కమలం ! మీ మహాభారత కథలో చదవలేదూ ? ఘుమ ఘుమా పరిమళించే పుష్పంఒకటి

— ద్రౌపదీదేవి ప్రక్కన గాలికి ఎగిరివచ్చి పడ్డదనీ — ఆమె అలాంటి పుష్పాలు కావాలని భీముడిని కోరడం ! దానికోసం భీముడు హిమాలయాలలోని అరణ్యాలు గాలించడమూ !... గుర్తుకువస్తోందా — ఆ కథ ?'' అన్నాడు.

దాంతో శ్రీనివాస చక్రవర్తి సంతోషంతో ఎగిరి గంతేశాడు !

"ఆహా ! అదే **"సౌగంధిక"** పుష్పంగదా ? దివ్యపరిమళాలను వెదజల్లుతుంది. దానినే బ్రహ్మకమలం అంటారా ? నాకు తెలియదే ! నాకు తెలిసిందల్లా సౌగంధిక పుష్పాల వనం ఒకటి హిమాలయాలలో ఎక్కడో మామూలు మనుష్యలకు కనిపించని కొండచరియలలో దాగివుందని !

"ఔనౌను ! — అంతే కాదండోయ్ ! ఇంకొకటి కూడా ఇప్పుడు గుర్తుకువస్తోంది, సౌగంధికపుష్పం పేరు వినగానే ! ఆ పుష్పాలు లభించే చోటనే మహావీరుడు — **ఆంజనేయుడు** భీముడికి ముసలికోతిలా దర్శనమిచ్చాడు'' అంటూ భయం భయంగా అటూ ఇటూ చూశాడు కొండచరియలవైపు.

అందరం అక్కడి ప్రకృతి క్షణక్షణానికీ విచిత్రంగా మారిపోవడం గమనించాం ! నెమళ్ళు, రొదచేస్తూ కుడివైపునుండీ ఎడమవైపుకి పరిగెత్తాయి ! లేళ్ళు ఆశ్చర్యంగా బెదురుగా పైకి, గెంతుతున్నాయి — వెనకాలనుంచి ఎవరో తరుముకు వస్తున్నట్టు !! ఇంతలోనే కుడివైపు దేవదారుచెట్లు పదిహేను, ఇరవై అడుగులఎత్తుకు పెరిగినవి గుబురుగా జల జలా ఊగిపోతూ ఎవరో బలంగా కదిలిస్తున్నట్టు చెట్లకొమ్మలను విదిలిస్తున్నట్టుగా పెద్ద శబ్దంతో అలికిడి వినిపిస్తే అందరం కరెంట్‌షాక్

కొట్టినట్టు అటేచూస్తూ, ఆగిపోయాం !

మరుక్షణమే ఏదో వింతవాసన గుప్పున వ్యాపించింది. అందరం లామా మహాశయుడి ముఖంవంక చూశాం — భయంగా ఆశ్చర్యంగా ! ఈసారి లామా ముఖంకూడా మారిపోతూ భయంగానూ, కంగారుగానూ కనిపించింది మాకే వింతగా !

“విన్నారా ఆ అలికిడి ! అది ఎప్పుడో అరుదుగా కనిపించే **‘మంచు కోతి !’** మీ ఇంగ్లీషులో దాన్ని **“యేతీ”** (Yeti) అంటారు. దానిని చూసిన వారే లేరు బయటి ప్రపంచంలో ! ఇక్కడ మా టిబెటన్‌లు కూడా మా పూర్వీకుల తరంలో తొంభైఏళ్ళ ముసలి లామాలు మాత్రం చూడగలిగారట ! అదీ దూరంనుంచే !

“ఇక్కడి లామాల విశ్వాసం ప్రకారం ‘యేటి’ (Yeti) మనిషీకాదు, కోతికాదు. నర-వానరం ! అంటే ఇంగ్లీషులో **ఏప్-మాన్** (Ape-man అంటారే ! — సుమారు ఇరవై అడుగుల ఎత్తువరకూ పెరుగుతుంది బలంగా వున్న శరీరం, దట్టమైన ఆకుపచ్చరంగు బొచ్చుతో వింతగ అరుస్తూ అడవి జంతువులను భయపెట్టి అదిలిస్తుంది. ఈ కనిపించే సందడంతా అలాగే వుంది. ఇపుడేం చేద్దాం ? ఈ పరిస్థితిలో దానికి ఎదురువెళ్ళడం మంచిది కాదు.” అన్నాడు లామా.

మరుక్షణంలో ఓ వింతదృశ్యం ! మా అందరికీ ఊపిరి ఆగిపోయేటంత ఆశ్చర్యం ! పదిహేను ఇరవై అడుగుల ఎత్తుగావున్న మనిషిలాంటి కోతి ! ముందుకువొంగి నడుస్తోంది ! చేతులు నేలకి తగిలేటంత పొడుగ్గా వున్నాయి ఆజానుబాహువుగా !! తల గుండ్రంగా రెండు-మూడడుగుల

చుట్టుకొలతతో పెద్ద గుమ్మడికాయంత వున్నది ! ఆ కోతి రొమ్మువద్దకూ, భూజాలవద్దకూ మాత్రమే చెట్లలోంచి పైకి లేచింది. కళ్ళు మాత్రం లేత తేనెరంగుతో కలిపిన పసుపువన్నెలో నిప్పురవ్వల్లా మెరుస్తున్నాయి !!!

మాకు, భయంతో గుండె పగిలినంత పనయ్యింది ! కుడివైపు నుంచి కొండచరియమీంచి దూకుతూ మా దారికి అడ్డంగావచ్చి — అది, ఎడమవైపుగా దిగి లోయలోకి అంతర్ధానమయ్యింది ! పొడవాటి సరుగుడూ, దేవదారుచెట్లు జవజవా తోటకూరకాడల్లాగా ఆ మహావానరం పరిగెత్తిన దిక్కుగా వెనకాలే ఇటూ అటూ ఊగిపోతూ సందడిగా కనిపించాయి ! అందరం ఆశ్చర్యం భయంతో కూడిన భక్తిభావంతో నిండిపోయాం.

"చూశారా ! అది కోతికాదు, యేటీకూడా కాదు. అది **ఆంజనేయ** స్వామి ! మాయారూపంతో సౌగంధిక పుష్పవనంలోనే కదా ? భీముడికి దర్శనమిచ్చాడు" అన్నాడు శ్రీనివాసచక్రవర్తి కన్నీళ్ళతో ఆవేశపడుతూ. "ఆ కోతి ముఖాన తెల్లటి 'V' అక్షరంలోని ఆకారంతో స్పష్టంగావున్న గుర్తుచూశారా ? అన్నాడు చార్లెస్ బెల్ బైనాక్యులర్స్‌తో ఆ మహావానరం పరిగెత్తిన దిక్కుగా చూస్తూ ! లామాదోర్జీ చోగ్యాల్ మాత్రం మౌనంగా ఏ కదలికలేకుండా శిల్పంలా వున్నాడు.

ఇలా ఎడంపక్కగా వచ్చిన అడవి గుబురులోంచి అలికిడి సందడి సర్దుకోగానే అకస్మాత్తుగా అడవిలోని పక్షుల కిలకిలారావాలన్నీ వెంటనే ఆగిపోయాయి ! మేం ఆదుర్దాగా ఆ దారివెంట పదడుగులు ముందుకు వేసి ఆశ్చర్యంతో నిలబడిపోయాం ! — మా ఎదురుగా మంచులో పాదాల గుర్తులు స్పష్టంగా అచ్చుపడి కనిపిస్తున్నాయి ! దగ్గరగావెళ్ళి



“సౌగంధిక” బ్రహ్మకమలంలో ‘పరమ-గురువు’
“హనుమాన్ బ్రహ్మ!”రామన్న - ‘కల్పం’ లో బ్రహ్మ! ఈయనే!!

తన చేతిలోని భూతద్దంతో నిశితంగా పరిశీలించాడు చార్లెస్ బెల్ — అసలుసిసలైన గూఢచారిలా !

జేబులోంచి టేపుతీసి కొలతలు తీసుకున్నాడు ఔస్పెన్స్కీ తన కళ్ళద్దాలు సర్దుకుంటూ ! ఆ కొలతలు చూసి విస్తుపోయి వెల్లకిలా పడినంత ఆశ్చర్యపోయాడు నికోలాస్ రోరిఖ్చ్ !! మా మిత్రుల కంగారు చూసి లామా మహాశయుడు ముందుకివెళ్లి వొంగిచూస్తే — అక్కడ అడుగున్నర పొడుగున్న పాదాల గుర్తులు స్పష్టంగా కనిపించాయి ! అవి మనిషి పాదాల గుర్తులమాదిరే గుండ్రని మడమ, పొడుగాటి పాదములకు, ఆరేసి వేళ్ళు — ఆశ్చర్యంగా కనిపించాయి.

మా వెనకాలే వచ్చిన లామా ఆ గుర్తులవంకచూస్తూ ఆశ్చర్యంగా మౌనంతో అలాగే వుండిపోయాడు మాకెవరికీకూడా నోటమాట రాలేదు. అందరం మతులుపోయినట్టున్నాం ! ఆతరువాత మేం ఎంత ప్రయత్నించినా ప్రశ్నించినా నోరువిప్పలేదు — ఆ విషయం గురించి లామా మహాశయుడు ! మాలో చాలామంది ఆశ్చర్యంగా, భయంగా, దిగులు కలిగిన అద్భుత భావంతో ఆ అనుభవాన్ని నెమరువేసుకుంటూ ఆ యాత్రలో చివరిమజిలీ చేరుకున్నాం !

అప్పటికే షేర్పాలు అక్కడికి మాకంటె ముందువెళ్ళి కాన్వాస్ గుడ్డతో గుడారాలు ఏర్పాటుచేసి — వంటలుచేయడం మొదలుపెట్టేసి, వున్నారు. వాళ్ళు మేం నడిచివచ్చిన కొండలోయకన్నా ఐదారువేల అడుగులు పల్లంలోవున్న కొండచరియకు చాటుగా ఈదురుగాలికి మరుగుగా వుండేలా గుడారాలు కట్టారు ఎంతో నేర్పుగా అర్ధచంద్రాకారంలా ! ఆ గుడారాలమధ్య వంటపొయ్యిలను చూడగానే మాకడుపులో

అగ్నిహోత్రం వెలిగించినట్లైంది ! అప్పటిదాకా ఆకలినే మరచిపోయామన్న — మాకు అప్పుడు గుర్తుకువచ్చింది !

"హిమాలయాలలో 'చిరంజీవులు'ంటారని నా చిన్నప్పుడు కథలుగా వినేవాణ్ణి ! తరువాత హైస్కూలులో చదివేరోజుల్లో చిరంజీవులలో ఒక్కరుగా వ్యాసమహర్షి, మార్కండేయులవారు, ఆంజనేయస్వామి, అశ్వద్ధామా, ఇంకా ఇప్పటికీవున్నారని ఈ **కలియుగాంతం** వరకూ వుంటారనీ చదివాం ! వుంటేమాత్రం వాళ్ళని చూసేదెలా? ఒకవేళ చూస్తేమాత్రం గుర్తుపట్టేదెలా ! వాళ్ళ అనుగ్రహంవుంటేనే వారిని గుర్తించగలం ! అది ముమ్మాటికీ సత్యమని ఈనాటి వానరమూర్తి ఋజువుచేశాడు.

ఆయన ఎవరైనప్పటికీ — నా మనస్సులో మాత్రం భక్తితో ఆంజనేయస్వామిగా తలచి అప్రయత్నంగా నా రెండుచేతేలూ జోడించాను.

"ఓ వీర హనుమంత !
నీ ముందు నేనెంత !"

— "ప్రభూ ! నా అజ్ఞానాన్ని మన్నించు ! భీముడంతటి మహావీరుడే నిన్ను గుర్తించలేదు !" అంటూ శ్రీనివాసచక్రవర్తి !

37

శంబల ప్రభువు !

అలా మేము 'గోముఖ్' జలప్రవాహంనుంచి బయలుదేరి కొంత దూరం నడిచేసరికి మామూలు మనుషులమయ్యాము. మా ఆలోచనలు, సందేహాలు, ప్రశ్నలు దీపప్పురుగుల్లా మళ్లీ ముసురుకోసాగాయి ! శ్రీనివాస చక్రవర్తి, లామాదోర్జీ వంకకు తిరిగి ఇలా ప్రశ్నించాడు — భయం

— భయంగానే !

“ఓ లామా గురుదేవా ! మనం 'శంబల-శంఖం' గురించీ, స్ఫటిక పర్వతం గురించీ గడ్డకట్టిన మంచు నదీప్రవాహం గురించీ, ఇలా మీనుంచి, ఎన్నో వింతలు, విశేషాలూ తెలుసుకున్నాంగదా ! వీటన్నిటినీ విన్నాక నాలో ఇంకో అనుమానం భూతంలా వెంటాడుతోంది. అడగమంటారా ?”

“అడగండి ! సందేహమెందుకు ?” అన్నాడు లామా మహాశయుడు.

"ఈ వింతలూ, విశేషాలూ, ఆశ్చర్యాలూ ఇవన్నీకలిసి ఒకే ఆలోచన వైపుకి మా మనస్సులను తీసుకువెళుతున్నాయి — అది.

'శంబల-ప్రభువు !' 'శంబల-ప్రభువు !' అన్న ఒకే ఒక్క ఆలోచనే మళ్లా మళ్ళా మాలో సుళ్లతిరుగుతున్నది ! ఎంతసేపటికీ ఇదే ఆలోచన! — అణచుకున్నకొద్దీ ఆ ఆలోచనే జపంలా మళ్ళీ మళ్ళీ మనస్సులో తిరుగుతోంది !

"శంబల-ప్రభువు" — వొస్తాడంటారే ? ప్రపంచ మతగ్రంథాలన్నింటిలోనూ ఆయన గురించిన వర్ణన ఒకేవిధంగా వున్నదిగదా? చివరకు 'బైబిలు'లోకూడా భగవంతుని అవతారం — 'ఒక తెల్లగుర్రం' మీద ఎక్కి వస్తాడనీ, ఆయన చేతిలో చంద్రవంకలా 'పదునైన ఖడ్గం, ఒకటి మెరుస్తూ వుంటుందనీ ఆయన దుర్మార్గులను లక్షలూ, కోట్లలో నశింపచేస్తారనీ — ఈ ప్రపంచమంతా ధర్మాన్ని స్థాపిస్తాడనీ — చదువుతాం; వింటున్నాం ! కాని, నాకేమీ అర్థంకావడంలేదు, నిజంగా ఆయన ఒక్క మనిషే, చేతిలో ఒక్క కత్తిమాత్రమే పట్టుకుని ఇన్ని కోట్లమందిని నరకడానికా ! ఆయన పైనుండి దిగివచ్చేది ?" నాకేదో అంతా గందరగోళంగా వుంది ! అసలు దీనికేదో వెనుక ఇంకొక నిగూఢమైన రహస్యార్థమో లేక ఏదో నిగూఢమైన ఆధ్యాత్మిక రహస్యమో, దేవరహస్యం వంటిదేదో ఈ భావన-వెనుక దాగివుంటుందేమో అని నా అనుమానం!

అది మీనుంచే వినాలని నా తాపత్రయం ! మీరు ఈ మంచుకొండలలో పుట్టిపెరిగినవాళ్ళు, ఇక్కడి కథలు, గాథలు, వింతలు, విశేషాలూ ఎన్నో తెలిసినవారు. అందులోనివి, మూఢనమ్మకాలు ఏవో,



Vajradhara Buddha

నమ్మలేని-నిజాలూ యదార్థ సత్యాలేవో తెలుసుకోగల అనుభవం తెలుసుకునే విచక్షణా మీకుంటాయని నానమ్మకం ! నిన్న **"మణి–పద్మ-హుమ్ !"** అన్న మంత్రానికి అర్థం మీరు చెప్పినది — 'పద్మంచుట్టూ తెల్లటి రేకలు అమర్చివున్నట్టుగా చుట్టూరా మంచు-పర్వతాలు చక్రంలా వుండే పీఠభూమి మధ్యగావున్న — **స్ఫటికపర్వతం !**' అనే ఈ **"మణి"**-గురించిన అర్థమే — ఆ పర్వతాలు అలాగే కళ్ళకు కనిపించగానే నాకు ఆశ్చర్యంతో మతిపోయింది !! అలాగే శంబలప్రభువు గురించిన నా ఈ సందేహాలు కూడా మీరే తీర్చరా ! దయతో !" అన్నాడు.

ముందు నడుస్తున్నవాడల్లా 'లామా-దోర్జీ చోగ్యాల్' మెరుపు మెరిసి నట్టు తటాలున వెనక్కితిరిగాడు.

"శ్రీనివాసప్రభూ ! నీకు మీపెద్దలు — నిజంగా సరైన పేరే పెట్టారయ్యా ! అందరిలాగా ఏవో చెత్తప్రశ్నలు అడగకుండా — ఇంత వరకూ ఎవరూ అడగని, ప్రశ్నించని "శంబలప్రభువు — చిహ్నాలగురించి" నీవే అడిగావు ! నాకెంతో ముచ్చటవేస్తోంది !! సంతోషంతో చెపుతాను. విను" అంటూ చక్రవర్తి పక్కకు చేరి — అతని పక్కనే నడుస్తూ తన జపమాలను వేగంగా తిప్పుతూనే చెప్పుకుపోతున్నాడు —

"శంబలప్రభువు చేతిలో తళతళా మెరిసే 'చంద్రవంక'-వంటి పదునైన "కత్తి"-అంటే తెల్లని ఒక కత్తి వుంటుందనిగదా ? మీరు విన్నది ! దానితో ఈ కలియుగంలోని పాపులను, కోట్లసంఖ్యలో నశింప జేస్తాడని కూడా విన్నారు ! ఔనా ? 'పాపులను నశింపజేయడం' — అంటే ఏమిటి ? దానికి ఒకేఒక వ్యక్తి పాతకాలపు కత్తితో ఎంతమందిని

నాశనం చెయ్యగలడు ? అదికాదు ! దీనికి నిజమైన అర్థం — అసలు మీ భగవద్గీతలోనే వుంది !" — అన్నాడు !

శ్రీనివాస చక్రవర్తి దాంతో తుళ్ళిపడ్డాడు ఒక్కసారిగా ! "ఏమిటి?" "**భగవద్గీత**"లోనా ? — నేనెప్పుడూ శంబలప్రభువు ప్రస్తావన గురించి అందులో ఏమీ చదవలేదే ?" అంటూ సందేహంగా తను చదివిన భగవద్గీతను గుర్తుకుచేసుకుంటూ అడిగాడు. లామా నిశ్చలంగా చూస్తూ — "భగవద్గీతలోని పదిహేనవ అధ్యాయంలో '**పురుషోత్తమ ప్రాప్తి !**' — అనగా 'పరమపురుషుడు' లభించే విధానం గురించి అప్పటి అవతార మూర్తిఐన శ్రీకృష్ణప్రభువు — "నీలోని పదునైన వివేకం, వైరాగ్యం అనే "ఖడ్గం" (కత్తి) తో నీచుట్టూ పెనవేసుకున్న అశ్వత్థం కొమ్మలవంటి సంసార-బంధనాల'ను ఖండించు !" అన్నాడు గదా ? గుర్తుకువచ్చిందా ! క్కడ చెప్పిన "పదునైన ఖడ్గమే" ఈ శంబలప్రభువు చేతిలోవుండే ఖడ్గం" ! అంటే కత్తి !

అంటే ఆధ్యాత్మిక పరిభాషలో "పదునైన-ఖడ్గం" ఏమిటి ? రుకైన-బుద్ధి'తో నిజమేదో అసత్యమేదో — కత్తితో నరికినట్టుగా వదీసి తెలుసుకోగల 'జ్ఞానమే' ఖడ్గం ! ఇదే 'శంబల-ప్రభువు' చేతిలోని ఢ్గం ! పదునైన కత్తి ! దీంతో "సత్యయుగం" స్థాపిస్తాడట ! — అంటే మిటి ? ఇది సత్యయుగంకి సరైన — "కాలం" రాగానే తటాలున నవుల తలలోని "**సత్య-పురుషుని**" స్థానమైన "**సహస్రార-దళ పద్మం**" ంచి తళక్కున మెరుపులా మెరిసి తెల్లని ఖడ్గంలా "జ్ఞానం" ప్రకా ంది మెదడులో ! ఇది ఒక 'యోగప్రక్రియ' ! దీనితో మనిషికివుండే



'శంబల ప్రభువు!'

([illegible] 'శ్వేతసైనికుల కాళ్లకు ఇంగ్లీషువాళ్ల బూట్లు వేలఏళ్ల క్రితమే చిత్రించివున్నాయిందులో!!!)

భ్రాంతి, లోభాలు, పిచ్చి పిచ్చి ఆశలూ, కామం, క్రోధం వంటి బలహీనతలమీద వుండే మమకారం — అన్నీపోతాయి ! దాంతో ప్రతీ మనిషిలోని — 'దుర్మార్గుడూ' నశిస్తాడు ! అంటే ఏమిటి ?

భగవంతుడు ఈవిధంగా అవతారంగా దిగి శంబలప్రభువు రూపంలో వచ్చినపుడు — అందరి మనస్సులలోకీ తన ఖడ్గంవంటి వివేకంతో జీవుడి లోపలవుండే 'పాప-పురుషుడి'ని సంహరిస్తాడు. ప్రతీ మనిషిలోనూ వున్న **'దుర్మార్గత'**ను చంపివేస్తే — దుర్మార్గులందరినీ చంపేసినట్టే కదా ! అలాకాక ఊరికే యుద్ధంలో సైనికుడిలా ఎదుటివాడి శరీరాన్ని మాత్రమే చంపి ప్రాణాలుమాత్రమే తీసేస్తే వాడు మరణిస్తూ పట్టరాని క్రోధంతో, ద్వేషంతోనూ వాడిలోని 'జీవాత్మ' బయటికి వస్తుంది. గనుక మళ్లీ అలాగే పుడతాడు. అలా దుర్మార్గులు పెరిగిపోతారు హింస ద్వారా !

కాని శంబలప్రభువు — తన ఆత్మలోని భగవత్ శక్తివల్ల మానవుడిలోని — 'దుర్మార్గుడు' అంటే "పాపపురుషుడి"ని సంహరిస్తాడు — అంటే లోపలినుంచే నశింపజేస్తాడు ! అపుడు "మానవజాతి — నిర్మలమౌతుంది" అని భాగవతంలో శుకయోగీంద్రుడు చెప్పినదికూడా — ఇదేకదా ! ప్రపంచం మొత్తం సమాజం దుర్మార్గతలేని వ్యక్తులతో నిండిపోయి నిర్మలంగా వెలుగుతుందని — అర్థం ! అప్పుడు మానవజాతి అంతరాత్మ స్ఫటికంలా నిర్మలమవుతుందిగదా ? అదే మనలోవున్న **'స్ఫటిక-పర్వతం'** — అంటే పద్మంలో **'మణి !'**

అలాంటి నిర్మల స్ఫటికంలాంటి ఆత్మస్థితికి అద్దంపట్టే "శ్రీ-యంత్ర"మే

అనగా మంత్రశాస్త్రంలోని శ్రీచక్రమే — మేరుప్రస్తార యంత్రం వంటిదై — ఈ స్ఫటికపర్వతం !" అంటూ లామా దోర్జీ, తన ప్రసంగాన్ని ముగి చాడు.

శ్రీనివాస చక్రవర్తితోపాటు వింటున్న అందరి మనస్సులూ, ఒక్క సారిగా తెరుచుకున్నాయి — అలానే ఆశ్చర్యంతో అందరినోళ్ళూ తెరుచ కున్నాయి, లామాయొక్క ఈ అద్భుత విశ్లేషణాశక్తికీ, ఆధ్యాత్మిక సూక్ష్మ దృష్టికీ ! శ్రీనివాస చక్రవర్తి సంతోషంతో పొంగిపోతూ మళ్ళీ ఇల అడిగాడు.

"లామాగురుదేవా ! శంబలప్రభువు భూమ్మీదకి ఎప్పుడు అవత రిస్తాడు ? ఆయన నిజంగా ఒకమనిషి రూపంలో శరీరం ధరించి ప్రప చానికి కనిపిస్తాడా ?" అంటే ఆ ప్రశ్నవిని — ఆశ్చర్యపోయినట్టు అత వంక చూశాడు లామాదోర్జీ చోగ్యాల్ !

"అసలు — నీకా సందేహం ఎందుకువచ్చింది ? పూర్వం భ వంతుడి అవతారాలు ఒక రూపం ధరించి రాలేదా ? బుద్ధభగవాను రూపంలోనూ ధర్మావతారుడైన రామచంద్రప్రభువు రూపంలోనూ, అల భగవంతునికి శంబలప్రభువు రూపంలోనూ అవతరించడానికి వ ఇబ్బంది ఏముంటుంది ?

'ఇహపోతే, ఆయన ఎప్పుడు అవతరిస్తాడో !' — అన్నది ఇక్క లామాలకు పరమ గురువులైన 'తాషీ-లామా'ల వంటివారికి దలైలామ లకీ — అందరికీ తెలుసు ! కానీ ఎవ్వరూ నోరువిప్పరు !!! పై ఏమీ తెలియనట్టు మనల్నే అడుగుతారు — "ఏమిటీ ? భగవంతు

అవతారమా ! ఎప్పుడు వస్తుంది ?" అని ! ఎందుకంటే అది ఒక దేవ రహస్యం ! అతిజాగ్రత్తగా గుప్తంగా ఉంచబడిన పరమ రహస్యం ! అలా రహస్యంగా వుంచాల్సిన అవసరం ఏమిటని మీలాంటివారికి సందేహం కూడా కలగవచ్చు !"

"ఎప్పుడెప్పుడైతే ఈ భూమ్మీదకి భగవంతుని అవతారాలు దిగి వస్తాయో — అప్పుడప్పుడల్లా భగవంతుని శక్తిని వ్యతిరేకించే **'ఆసురీ-శక్తులు'** కూడా పుట్టుకునివస్తాయి — సూర్యుడు ఉదయించే ముందు చీకటి పేరుకునివున్నట్టే !

అంతేగాక భూమియొక్క ఆకర్షణశక్తి పదార్థంయొక్క "తమోగుణం" — అంటే నిద్రావస్థలాంటి 'చీకటి-గుణం' కలిగిన సోమరితనం, స్వార్థం కలిసిన — ఒకానొక దైవతత్వాన్ని వ్యతిరేకించే పొగరుబోతు లక్షణం ! దీనికి ప్రతిరూపాలే భగవంతుని అవతారం వచ్చినపుడల్లా — ెలుతురు దీపంక్రిందా, వెనకాలే చీకటివున్నట్టుగానే పుట్టుకొస్తారు !

అలాంటివే శ్రీకృష్ణప్రభువు అవతారం వచ్చినపుడుకూడా కంసుడు, రకాసురుడు, దుర్యోధనుడు వంటి ఆసురీశక్తులు ఆయనని వీలైతే శనం చేయ్యాలని అవకాశంకోసం కాచుక్కూచునేవారుకదూ ? రామావ రంలో రావణుడూ ఇలా ప్రతీసారీ వెలుతురు వెలిగినపుడు దానివెనక డ-పడినట్టే — ఇది, ప్రకృతిలోని సహజలక్షణం !

అలాంటి 'దుష్ట-శక్తుల'వల్ల పసిబిడ్డల్లాంటి దేవతాత్మల వంటి ాయకులకు కష్టం కలగరాదని దేవతలు, వారి జననం గురించి ంగా వుంచుతారు. నిజానికి అవి — అలావుండటమే మంచిది !

మనం అవన్నీ ముందే తెలుసుకునిమాత్రం చేసేదీ ఏముంది ? — ఏమీ లేదు !" అన్నాడు లామా మహాశయుడు.

వెంటనే భావనగర్ మహారాజు అడిగాడు "భగవంతుని అవతారం ఎక్కడ జన్మిస్తాడో ఎప్పుడు జన్మిస్తాడో మనకు తెలియకపోతే — మనకి వారి అనుగ్రహం లభించేదెలాగ ?"

సమాధానంగా లామా — భళ్ళున నవ్వాడు. దానికి మహారాజుకి కోపంకూడా వచ్చింది. లామా ఇలా వివరించాడు.

"భగవంతుని అవతారంయొక్క అనుగ్రహం మనమీద ప్రసరించడానికి కావలసింది — మనకి ఆయన అడ్రస్సూ, వివరాలూ తెలియాల్సిన పనేమీలేదు ! ఎందుకంటే 'దైవానుగ్రహం' మన నుంచి కాదు ప్రసరించేది ! ఆయననుంచి !! వారి దృష్టి మనమీద పడ్డప్పుడేగాని అవతారమూర్తి ఎక్కడపుట్టాడో తెలుసుకుని మనంవెళ్ళి తలుపుతట్టి తెలుసుకునేది తెచ్చుకునేదీ కాదు 'అనుగ్రహం !' అందుకే పూర్వ ఋషీశ్వరులు, లామాలు తరచూ చెపుతూవుండేవారు.

"ఈ కలియుగం చీకటిరాత్రి వంటిది ! ప్రతిమనిషీ చెయ్యగలిగినదల్లా తన ఇంటిలో దీపంపెట్టినట్టు తన గుండెల్లో భక్తినీ, వినయవిధేయతనూ, నిస్వార్థతనూ దీపంలా వెలిగిస్తే చాలు ! ఒక చీకటిరాత్రిలో పర్వతంమీద అంతా చీకటిమయంగా వున్నపుడు ఎక్కడో ఒక గుడిసెలో పెట్టిన దీపంవల్ల — ఆ గుడిసె ఎక్కడవున్నదో దూరానవాళ్ళకి కూడా తెలుస్తుంది ! అలాంటిదే ప్రతీఒక్కళ్ళ గుండెల్లోనూ వెలిగించుకునే — 'దీపం !' ఆ దీపంయొక్క వెలుగే అవతారమూర్తి దృష్టిని మనలోపలి

దీపారాధనవైపు ఆకర్షిస్తుంది.

అనగా తాత్పర్యం ఏమిటంటే మనం చేయ్యవలసిందేమిటో మనం ఆలోచించుకుంటే చాలు, అవతారమూర్తికి మనమేమీ సాయం చేయవలసిన పనిలేదు ! మనకి మనం సాయం చేసుకోవాలి ! అంటే భగవంతునికీ మనకీవున్న అడ్డుగోడ తొలగించడమే !" అంటూ లామా తన జపమాలను వేగంగా తిప్పుతూ నడవసాగాడు.

ఈరోజు మా సాహసయాత్రలో అట్టె కష్టమైన పర్వతశిఖరాలు ఎక్కాల్సిన శ్రమలేనట్టే పవిత్ర గంగానదీ పుట్టుకస్థానం లభించినట్టే ఎన్నో ఆధ్యాత్మిక సందేహాలూ ఇట్టే చీకటి విడిపోయినట్టు తొలగిపోయాయి — మా ఈ అతిముఖ్యమైన ప్రయాణం మజిలీలో !

* * *

38

“ధర్మ”-శరీరుడు !

గురుదేవా ! లామామహాశయా ! ‘శంబల-ప్రభువు’ అవతరించి “ధర్మాన్ని” ఉద్ధరిస్తాడంటారే ? ఏమిటా ‘ధర్మం ?’ ధర్మం — అన్న మాటకు అర్థమేమిటి ? మనిషి నిత్యజీవితంలో “ధర్మాన్ని ఆచరించాలంటే చెయ్యాల్సిందేమిటి ? మనమేం చేయాలి !

‘సాధన’-అంటే ఏమిటి ? దేనికోసం సాధనచేయాలి ? హిమాలయాలలోని మంచుకొండలమీద అనాదిగా సత్యయుగకాలంనుంచీ జీవిత లక్ష్యంగా ‘ధర్మాన్ని’ లక్ష్యంగా ఎంచుకొని సత్యాన్ని ధ్యానిస్తూ, పుణ్యాన్నే జీవిస్తూ, తపస్సునే జీవితంగా జీవించే ‘ధర్మప్రభువుల’ సంగతి ఏమిటి ? ఇంతవరకూ మేము మీతో కాలినడకనే ఈ యాత్రచేశాం. కొండలూ, లోయలూ, మంచుపర్వతాలూ చివరకు స్పటికపర్వతాన్నికూడా — మా అదృష్టంవల్ల మీ దయతో చూడగలిగాము !

ఇప్పుడీ "ధర్మయాత్ర"లో ఈ టిబెట్, నేపాల్, శంబల వంటి పుణ్యక్షేత్రాలలో ప్రపంచానికి సూర్యరశ్మిలాగా ప్రజ్వలించే జ్ఞానంయొక్క స్వరూపస్వభావాలేమిటి ? — మావంటి అజ్ఞానులైన మానవులకు తెలిసేలాగా వివరించండి" అంటూ అర్థించారు — ముందుగా శ్రీనివాస చక్రవర్తి, ఆతరువాత జగదీశ్ చంద్రబోస్, మేఘనాధ్ సాహాలతోపాటు చార్లెస్ బెల్, నికోలాస్ రోరిఖ్బ్, అలెగ్జాండర్ నోటోవిచ్ రేలంకాస్టర్ వంటి సైంటిస్టులు కూడా జతకలిపి.

అందరి "శ్రద్ధ" గమనించాక వారి 'ఆసక్తి' కేవలం ఏదో తమాషా కోసమో లేక వినోదంకోసమో అడిగిన ప్రశ్నకాదని నిర్ధారించుకున్నాక లామామహాశయుడు పద్మాసనంలో ఉత్తరదిశగా తిరిగికూర్చుని ఇలా అన్నారు — "మీరు ధర్మప్రవచనం చేయమని నన్ను కోరుతున్నారు ! ముందుగా మీరు తొడుక్కున్న బూట్లూ, దుమ్ముకొట్టుకున్న చర్మం కోటింగులూ తీసివేసి శుచిగా తూర్పుముఖంగా కూర్చుని వినండి ! అప్పుడు చెబుతాను !! పవిత్రంగా తయారుచేసిన పాయసాన్ని మురికి కాలువలోని నీళ్ళతోనిండిన కుండలో పోస్తే — ఏం ప్రయోజనం ! అలాగే పవిత్రమైన "విజ్ఞానాన్ని" పరిశుద్ధమైన మనస్సుతోనూ, శుచిగా ఉన్న శరీరంతోనూ "ఆస్వాదించాలి" ! — అంటే అమృతాన్ని రుచి చూస్తున్నట్టు కొద్దికొద్దిగా చప్పరిస్తూ రుచిగా అనుభవించాలి — ఆత్మకు పట్టేలాగా ఆప్యాయంగా !!" అనగానే మావారందరూ నిమిషాలమీద స్నానాలుచేసేసి లామామహాశయుడు చెప్పినట్టు శుచిగా కూర్చున్నారు — అందరూ ఒక అర్థచంద్రాకారంగా, తూర్పువైపు ముఖంచేసి, వారికి ఎదురుగా కూర్చున్న లామాదోర్జీ చోగ్యాల్ మహాశయుడు కళ్ళుమూసుకొని తన గుండెల్నిండా

ప్రాణాయామంతో శ్వాసపీల్చి శంఖంవంటి తన కంఠస్వరంతో "ఓం!" అనే శబ్దాన్ని తన శ్వాస పూర్తయ్యేదాకా ఉచ్చరించాడు. ఆపైన కొన్ని నిముషాలు నిశ్చలంగా ఏదో ధ్యానించి తన జపమాలను మధ్యవేలితోన ఉంగరంవేలితోనూ తిప్పుతూ చూపుడువేలును 'ఉపదేశ-ముద్ర'లో పట్టి — ఇలా ప్రారంభించాడు !

"ధర్మం"-అంటే ఏమిటనికదూ ? మీరు ప్రశ్నించింది ? — వినండి ! "ధర్మం" అనేమాట ఎంతో పురాతనమైనది ! వేదాలకంటె కూడా అతి ప్రాచీనమైంది !

ఈ కలియుగం ప్రారంభించకముందు సుమారు వందయేళ్ళ పూర్వమే ఈ మంచుపర్వతాలలో గంగపుట్టినచోట గుహలోకూర్చుని మునులకు చక్రవర్తివంటివాడైన 'వేదవ్యాసఋషి' ధ్యానించాడు. ఆయన తపస్సులో గోచరించినదే 'ధర్మం' అనే జ్ఞానజ్యోతి ! సంస్కృతంలో "ధర్మం" అనేమాటకు అర్థం 'ఈ ప్రపంచాన్ని ధరించివుండేది ! అని. "ధరించి" — అంటే మనలోవున్న ప్రాణం, మనలోని 'ఆత్మ' మనసు ఈ నాలుగూ కలిసి శరీరాన్ని ఎలా ధరించివున్నాయో — సరిగ్గా అదే విధంగా ఈ సమస్తవిశ్వాన్నీ ప్రాణంలాగా సజీవంగా జీవించివుండేలాగ 'ధరించి' వుండేదే 'ధర్మం' !

ఇకపోతే — రెండవఅర్థం **'ధరతీతిధర్మః'** — అంటే ఈ భూమి మనందరికీ ఆధారభూతమైనది కనుక 'ధరణి' ! అలాగే సమస్త ప్రాణికోటినీ మనుష్యుడినుంచి చీమదాకా అందరినీ ధరించిన 'ధరిత్రి'లా ధరించి వుండేదే 'ధర్మం !' ఈ ధర్మానికి సత్యమూ, శౌచమూ, దయా, త్యాగమూ,



చక్రం (ధర్మ-చక్రం 'కాలచక్రం')



కలశం పూర్ణకుంభం



పారిజాతం







శంఖం



ఏకచ్ఛత్రం



శాంతీ అన్న ఐదు మూలస్తంభాలూ మన శరీరాన్ని మనసు, ప్రాణమూ, ఆత్మ, బుద్ధి ఎలా ధరించివున్నాయో అలాగ నిలబెట్టి పోషించి జీవించే లాగా 'సజీవంగా' నిలిపివుంచేది ! ఎవరైతే తమజీవితాన్ని ఈ నాలుగు సత్యాల్నీ ఆచరణలో — ఆచరిస్తూ జీవిస్తూవుంటారో అలాంటి మహా పురుషులను "ధర్మాత్మ"లని అంటారు. అంటే వాళ్ళ ఆత్మయే ధర్మ స్వరూపమని, వాళ్ళకు సహజంగానే కావలసిన జ్ఞానాన్ని వాళ్ళ ఆత్మయే బోధిస్తుందని తాత్పర్యం — 'ధర్మ-ఆత్మ'కులంటే !

టిబెటన్‌భాషలో ధర్మం అనే పదానికి 'ఛో'-అన్న మాటతో ఉచ్ఛరిస్తారు "తత్"-అన్నట్టు ! టిబెటన్ చరిత్రలో అనాదికాలంలో బుద్ధదేవుడు ఉపదేశించిన ఈ "ధర్మం"యొక్క ఆచరణవిధానాన్ని ఒక యోగసాధన లాగా ఉపదేశించిన 'ధర్మచక్రప్రవర్తన' అనే 'తాంత్రిక-యోగప్రక్రియ' ను ముందుగా ఆయన శిష్యులలో సమర్థుడైన — గురుపద్మసంభవుడు టిబెట్‌కు దివ్యసందేశంగా అందించాడు ! అదే ఈ మంచుకొండల్లోని జీవులకు అందిన 'ధర్మసందేశం' — ప్రాణంవంటిది !

'ధర్మచక్రం'–"కర్మచక్రం" :–

ఈ ధర్మాన్ని కేవలం ఆలోచనద్వారా లేక తర్కంవల్లా — అదీ కాకపోతే మీ 'సైన్సు'లోలాగా "తప్పులుచేస్తూ — దిద్దుకుంటూ" (Trial and Error) అన్న పద్ధతిలో గ్రహించడానికి వీలుకాదు! దీనిని ఆత్మలోనే గ్రహించాలి ! ఎందుకంటే ఆత్మయొక్క స్వరూపం ఆకాశంలాగా అతినిర్మలంగా, అతిసున్నితంగా మిక్కిలి కోమలంగా వుంటుంది గాలి కన్నా సుకుమారమైనది ఆత్మప్రవృత్తి. కేవలం తడికాళ్ళకే పొడిఇసుక



'ధర్మ-చక్రం'

అంటినట్టు — పరిశుద్ధమైన ఆత్మకే ధర్మం అంటుతుంది. అందుకని ధర్మంగా జీవించే మహాత్ములకే ఆత్మలో ధర్మం సాక్షాత్కరించిన ధర్మాత్ములుగా, ధర్మరాజులుగా ప్రపంచానికి సూర్యుడు ఎండవేడిమి ప్రసాదించినట్టు జీవితాలలో వెలుగును అందిస్తారు. అలా అందించినది తరతరాలుగా నశించిపోకుండా కాపాడే సిద్ధగురువులే ఈ ప్రపంచంలో ఋషీశ్వరులూ, దలైలామాలు, తాషీలామాలు వంటి అనేకమంది ! వారందరికీ రహస్యంగా మంచుకొండలమధ్య దాగివున్న స్ఫటికపర్వతంలోని శంబలప్రభువు తపస్సూ, శక్తీ, జ్ఞానమూ, బలమూ రైలు నడవడానికి విద్యుత్తుకరెంటులాగా నడిపిస్తాయి.

అందుకే ప్రపంచంలో ఎప్పుడు ధర్మం అడుగంటిపోతుందో, అధర్మం పెచ్చుపెరిగి ధర్మాన్ని నాశనంచేయాలని ప్రయత్నంచేస్తుందో, ఎప్పుడైతే

ఈ ప్రపంచంలో పసిపిల్లలకూ, అమాయకులకూ, తపస్సుచేసుకునేవాళ్ళ మంచినీళ్ళకీ, నిజానికీ, నిజాయితీకి స్థానంలేకుండాపోతుందో — ఎప్ప డెప్పుడైతే ఈవిధంగా బ్రతికేవారికి జీవితం నరకప్రాయంగా చేయాల్న దుర్మార్గులు చూస్తారో అప్పుడు ఈధర్మాన్ని రక్షించడానికి ఈ భూమిపై అవతరిస్తాడు ధర్మప్రభువు" అనగానే ఇలా ప్రశ్నించారు.

"ఎవరీ అవతరించే ధర్మప్రభువు ?" అంటూ వింటున్నవారిల చాలామంది.

"అవతరించేది ఎవరని అనుకుంటున్నారు ? "కొందరు, మీభాష చెప్పాలంటే శ్రీరాముడనో, శ్రీకృష్ణుడో, మరికొందరు ఏసుక్రీస్తుఅనో ఇం కొందరు బుద్ధదేవుడనో ఇలా రకరకాలుగా ఊహిస్తారే — వాళ్ళ పే వెనుక దాగివున్న శక్తి, వారి శరీరంలోపల చొక్కాధరించినట్టు మనస్సు ప్రాణాన్నీ ధరించి జన్మించేదెవరో — అది ఒక్కరే !"

"ఆయనకు పేరులేదు అనామకుడు ! అంటే నామం, రూప లేనివాడు. సత్యమే ఆయనయొక్క స్వరూపం. అందుకని సత్యపురుష అని అంటారు. హిందువులు ఆయనను నారాయణుడనీ, విష్ణుభగవా డనీ, శ్రీసత్యన్నారాయణస్వామిఅనీ గౌరవంతో భక్తితో ఎవరిప్రేమక తగినట్టు ఎవరి రుచినిబట్టి వారు పేరుపెట్టి పిలుచుకుంటారు. మ కొందరు బాలక్రిష్ణుడిగానో, బాలసుబ్రహ్మణ్యుడిగానో భావించి పూజిస్తా ఈ అనామయపురుషుడు ఒకే అక్షరంగల పేరుతో — 'ఓం' అ ప్రణవస్వరూపుడు. ఈయనను మొట్టమొదటగా గ్రహించి ఉపాసించి పరబ్రహ్మయే ఆదిబుషి. తరువాతకాలంలో తన మోక్షాన్నికూడా వి

పెట్టి ప్రపంచంలో మానవులకోసం మళ్ళీమళ్ళీ జన్మిస్తూ ఈ సత్యాన్ని బోధించేవాడు నారాయణఋషి! మన కలియుగంలో మూడువేల సంవత్సరాలకు పూర్వం ఆయన గురుపద్మసంభవుడిగా అవతరించాడు. ఆతరువాత శివాజీప్రభువు రూపంలోనూ, స్వామి వివేకానందునిగానూ ఇలా అనేకసార్లు అనేకపేర్లతో అవతరించి తన కార్యాన్ని తనుచేస్తూ వున్నాడు. ఆయన విషయం ఆయన చూసుకుంటాడు, అంతటితో వదిలేద్దాం.

ఇక మనవిషయం చూసుకుందాం. ధర్మం లేక చ్యో అనే టిబెటన్ శబ్దం నీతి, నియమం, న్యాయం, శ్రద్ధ, నిష్ఠ అన్నీ మెట్లుమెట్లుగా ఎక్కుతూ పైకివెళ్ళవలసిన ఒక నిచ్చెనవంటి మార్గం! ధర్మమనేది మార్గం – ఆ మార్గం చేరే గమ్యంకూడా ధర్మమే. ఈ ధర్మాన్ని ఆచరించే వాడికి లాభంఏమిటి అంటే వారి అంతరాత్మే లాభం. అంటే మనిషిచేసిన అనేక చెడుకర్మల ఫలితంగా పాపాలవల్ల, చెడు ఆలోచించడం వల్లా, చెడ్డ అలవాట్లవల్ల మనలోని జీవుడు మసిపూసిన వెండిపాత్రలాగా వుంటాడు. దానిని తపస్సుతోనూ కఠినసాధనా నిష్టలతోనూ తోమి తళతళా మెరిసే లాగా చేసి నిర్మలమైన మనస్సుతో ప్రాణాయామం, ధ్యానం, యోగం వంటి ఎనిమిదిమెట్ల నిచ్చెన ఎక్కుతూపోతే మనగుండెలోనే ఒక పెద్ద అఖండజ్యోతి వెల్గిన ధర్మం కలుగుతుంది. ఆ జ్యోతి, ఆ వెలుగు ఎక్కడిదోకాదు — మన ఆత్మయే. మనమే ఆ జ్యోతి. మన స్వరూపమే జ్ఞానం. మనలోని బలమే ధర్మం. నిత్యజీవితంలో నిజాయితీగా జీవించే పట్టుదలే నిష్ఠ. ఇటువంటి మార్గాన్ని 'చ్యో' అంటారు.

దీనిని సంగ్రహంగా చెప్పాలంటే ప్రతివారూ ఆచరించవలసిన

నియమాలు ఇలావుంటాయి. ఇతరులకు అపకారం, హాని ఏమరుపాట్ల కూడా కలుగకుండా జీవించగల్గడం. ఇది మొదట్లో సాధ్యపడదు అడుగడుగునా మన స్వార్థం అడ్డంవస్తుంది — 'ఎదుటివాడికి హానికల్గి మంచిదా ? నాకే అపకారం జరిగితే మంచిదో !' అన్న ధర్మాధర్మ సంఘర్షణ కలుగుతూవుంటుంది. ఇదే 'కురుపాండవయుద్ధం' అంటార మీ భారతదేశంలో. త్యాగంతోనూ, పట్టుదలతోనూ, ఘర్షణను జయించి జీవితాన్ని ధర్మంవైపుకు చుక్కానిపట్టి నీటిప్రవాహానికెదురుగా పడవన నడిపినట్లే — ఈదుకుంటూపోతే కొంతకాలానికి ధర్మప్రవాహంవైపుక చేరుకుంటాం. అప్పుడు ధర్మంయొక్క వేగమే మనల్ని ముందుకుతోస్త ప్రవాహవేగం నావను నెట్టినట్టు మనల్ని ఈ జీవితగమ్యంవైపు ఈ ప్రపంచానికి ఆధారమైన ధర్మనిష్ఠవైపు జీవితాన్ని లాక్కునివెళ్తుంది మన ఎట్టిప్రయత్నమూ లేకుండానే !

ఇలా నదిలోని వేగంతో ప్రవహించే ప్రవాహానికి చేరడాన్ని బౌ మతంలో 'శ్రోతాపత్తి' అంటారు ! శ్రోతస్సు అంటే నది 'ప్రవాహం' అందులో చేరినవారు గాలికి కొట్టుకుపోయే ఎండుటాకులా, వారి ధర్మమే ముందుకు తోసుకువెళ్తుంది 'అధర్మం'లో పడిపోకుండా. అప్పటి దాకా తానే కష్టించి కృషి, శ్రమ, సాధన చెయ్యాలి ! అలాంటివారి "ఉపాసకు"లంటారు. ఇలా కొన్నిదశలుగా మనిషి ఆధ్యాత్మికంగ ఎదుగుతూపోతే — క్రమేణా ఒకపువ్వు గర్భం ఫలించి పిందెగామా కాయరూపం ధరించగానే దాని రేకులూ, కేసరాలు రంగురంగు ఆకర్షణలూ అన్నీ రాలిపోతాయి — అనవసర-భాగాలుగా ! అలా మన జీవితంకూడా ఫలవత్తరం కావడం మొదలుకాగానే మనలో

అనవసరభాగాలుగా ఊడిపోతాయి — ఇట్లా, సంసారమూ, ధనమూ, స్వార్థమూ, కోరికలూ, సుఖం, దుఃఖం వంటివి ! ఒకదశలో వాటిని బలవంతంగా ప్రయత్నంచేసి వదిలించుకోవాల్సివస్తుంది — కర్మసంకెళ్ళు త్రుంచివేయడానికి ! దానినే 'సన్యాసం'-అంటారు.

అలాగ జీవితాన్నుంచి తప్పించుకోవడానికి ధర్మాన్ని శరణుపొందే వారిని 'అవధూతలు' అంటారు. అలాంటి ధర్మాన్ని గ్రహించగల్గుతారు. అప్పుడు వారిని "జ్ఞానులు" అంటారు ! ఆతరువాత ధర్మాన్ని నిత్యం ఆచరించగలరు ! వారిని 'ఋషులు' అంటారు. మరికొంత పుణ్యం గడించాక వారే ధర్మస్వరూపులుగా, ధర్మరాజులుగా మారిపోతారు ! సాధనలో చివరిదశలోకి చేరిన ఇలాంటివారు మళ్ళీ జన్మించనవసరం లేకుండా — కర్మలనుంచీ, జన్మంనుంచీ శాశ్వతవిముక్తిని పొందుతారు. అట్లాంటివారిని 'నిర్వాణి' లేదా నైర్వాణికులు అంటారు. వారినే మునీశ్వరులు అంటారు.

ఇలాంటి ధర్మంకోసం జీవించేవారికోసమే పైనుంచి "ధర్మప్రభువు" దిగివస్తాడు అవతారంగా, అనేకరూపాలలో ! ఆయనయే "శంబల ప్రభువు !" కనబడే ప్రపంచానికి ఆయన ఒక్కడే ప్రభువు ! జ్ఞానప్రదాత ! ప్రపంచంలో జ్ఞానానికి మూలస్థానమైన స్ఫటికపర్వతానికి చక్రవర్తి ! ధర్మాన్ని సత్యాన్ని చక్రంలా ప్రవర్తింపచేస్తాడు కనుక ఆయనను ధర్మ చక్రవర్తి అంటారు.

మిత్రులారా ! సోదరులారా ! నాకు తెలిసినంతవరకూ సంగ్రహంగా ఇదీ ధర్మస్వరూపం ! ఇదే "శంబలప్రభువు అవతారం ఎందుకు

వస్తుందీ ?" — అంటే కారణం !" అంటూ ముగించాడు లామాదోర్జ మహాశయుడు తన కన్నులలో ఆనందభాష్పాలు జాలువారుతుండగా — నక్షత్రాల్లాంటి కళ్ళతో మావైపుచూస్తూ !

⁂

39

"తెల్ల-గుఱ్ఱం" - అర్థం !

"గురుదేవా ! లామా మహాశయా ! మీరు చేసిన అద్భుతమైన విశ్లేషణ ద్వారా 'శంబల-ప్రభువు' అవతారం గురించిన రహస్యాలను ఎంతో దయతో విశదీకరించి మాకు వినిపించారు ! ఇప్పటిదాకా మేమంతా కూడా అజ్ఞానంతో ఆలోచించే అనేకమంది పామరజనంమాదిరిగానే **'శంబల-ప్రభువు'** ఈ భూమ్మీద దుర్మార్గులందర్నీ ఒక-కత్తితోనే నరికి చంపుతాడని అనుకునేవాళ్ళం ! ఈ భూమ్మీద దుర్మార్గులందరినీ "నశింపు చేస్తాడంటే" — తమరు విశ్లేషించిన రహస్యార్థం నిశేషంగా మా మనస్సులోని అజ్ఞానం, అపోహలనూ పోగొట్టింది !

"అలాగే నాకు ఇంకొక సందేహం !" — అనగానే లామా దోర్జీ చోగ్యాల్ —

"నిస్సందేహంగా అడగండి. నాకు తెలిసినంతవరకూ 'దేవ రహస్యాలు' కాకుండా, నేచెప్పగలిగినవన్నీ నాశక్తికి సాధ్యమైనంతవరకు ఏమాత్రం దాచకుండా వివరిస్తాను" అన్నాడు.

దానికి ప్రఖ్యాత రష్యన్ చిత్రకారుడు ఆధ్యాత్మిక రహస్యాలగురించి పరిశోధనచేసిన విజ్ఞానీ ఐన నికొలాస్ రోరిఖ్బ్ ఇలా అడిగాడు.

"లామా గురుదేవా ! శంబలప్రభువు అవతరించటం గురించిన ప్రాచీన భవిష్యగ్రంథాలన్నిటిలోనూ ఆయన ఒక **'తెల్ల–గుఱ్ఱం'** మీద ఎక్కివస్తాడని చెబుతున్నాయిగదా ? ఇది మాకు మామూలు గుఱ్ఱమని తోచదు ! ఎందుకంటే ప్రపంచంలోని మతగ్రంథాలన్నింటిలోనూ ఒకే విధంగా వివరించబడిన భగవంతుని అవతారం గురించిన వర్ణన ఇలా వుంది — ఒక "తెల్లగుఱ్ఱం" ఆకాశంలో తెరతీసినట్టుగా పారవిచ్చుకోగానే అతితెల్లగా కనిపిస్తుందనీ ఆయన 'ఆకాశంనుంచి' దిగివస్తాడనీ వర్ణించారు !

ఇది మామూలు "గుఱ్ఱం"కాదని మా అల్పబుద్ధికే తోస్తోందిగదా! మరి ఈ 'గుఱ్ఱం' అనేమాటకి అర్థం ఏమిటి? దయచేసి మా సందేహాలు తీర్చండి ! సంశయాల్ని నివారించండి" అన్నాడు ఎంతో ఆసక్తితో శ్రద్ధగా ప్రార్థిస్తున్నట్టే ప్రశ్నిస్తూ !

లామా 'దోర్జీ-చోగ్యాల్' ఇంతవరకూ ఎప్పుడూ లేనంతగా మౌనంలోకి వెళ్ళిపోయి — అలా కొన్ని నిమిషాలు గాఢమైన ఏకాగ్రతలోకి తన మనస్సును మళ్ళించి, ఒకరకమైన ధ్యానంలోకివెళ్ళినట్టు కనిపించారు మాకళ్ళకి ! ఈసారి ఆయన చేతిలోని జపమాలకూడా ఆగిపోయింది –

ఆశ్చర్యంగా ! ఇంతలో తటాలున ఆకాశంలో మబ్బు తెరతీసినట్టు ఎడమిచ్చి తెల్లటి వెండిలాంటి కాంతితో సూర్యకిరణాలు లామా నుదుటిపై రెండు కనుబొమ్మలమధ్యా ప్రతిఫలించగా — పచ్చని శరీర కాంతితో మెరిసిపోయే దోర్జీ చోగ్యాల్ చర్మం — చూడటానికి ఓ కంచువిగ్రహంలా మెరుస్తోంది ఆ ఎండలో ! అలా ఎంతసేపు ఆయన ధ్యానంలో వుండిపోయారో మాకే ఆశ్చర్యంవేసింది — ఆయన ఊపిరి తీసుకోవటంలేదని గమనించగానే !

ఆయన బాహ్యస్మృతిలోకి వస్తూనే వీణానాదంవంటి ఖంగుమనే కంచు గంటలాంటి శ్రావ్యమైన కంఠంతో ఓంకారం చేస్తూంటే — ఆయన కనురెప్పలనుంచి నీటిబిందువులు ముత్యాలహారంనుండి తెగిపడ్డ ముత్యాల్లా జలజలా, క్రిందకి జారాయి ! మాకెంతో ఆశ్చర్యం వేసింది ! మేమేమైనా తప్పుగా మాట్లాడామా ? అడగకూడని దేదైనా ప్రశ్నించామా ? లేక, ఆయనకు ఏమైనా బాధ కలిగించామా ? ఈ కన్నీరేమిటి ? అనుకుంటూండగానే — ఆయనే నోరువిప్పి ఇలా సమాధాన మిచ్చారు.

ఈప్రశ్న మీరు అనుకున్నంత తేలికైనది, ఏమాత్రమూ కాదు ! శంబల ప్రభువు అవతారం గురించి బౌద్ధగ్రంథాలలో ఇప్పటి 15-వ తాషీలామా గురు పరంపరలోని పరమగురు పీఠపరంపరలో మనం వెనక్కి గనక వెళితే — నాలుగవ తాషీలామాగారొక మహాయోగి ! ఆయన జీవితంలో చాలాభాగం తాను బైటికివచ్చి ఎవరికీ కనిపించే వారుకాదు. అప్పటి తమ 'లామాసరీ' ఆశ్రమంలో మఠాధిపతిగా తన పీఠంలోనే ఏకాంతంగా గడిపేవారు, కేవలం జపధ్యానములూ, మౌనంతోనూ !

ఆయనో గొప్ప సిద్ధగురువనీ — తాషీలామాలందరిలోకీ వారే చాలా గొప్ప యోగీశ్వరుడనీ ఇప్పటికీ మా టిబెటన్ లామాలు అందరూ నమ్ముతారు ! ఆయన తన దివ్యదృష్టితో రాబోయే "శంబల ప్రభువు" అవతారంగురించిన చూసిన చిత్రపటాలు "గొప్ప గొప్ప చిత్రకారులతో చిత్రింపించి తాను చెప్పినట్టుగా బొమ్మలుగీయించి వాటిని పటాలుకూడా కట్టించి రహస్యంగా దాచివుంచారు. అవి — ఇప్పటికీ వున్నాయి !"

"అవి శంబలప్రభువు అవతరించినప్పుడు ఆయన చేసే ముప్పై రెండు (32)-దివ్యలీలల మహిమలగురించిన చిత్రాలు !"

ఒకసారి టిబెట్‌లోని 'డ్రేపాంగ్' లామాసరీపీఠంలోని పీఠాధిపతులు, దలైలామా పీఠంవద్ద నిత్యపూజలు, హారతులూ, జపాలుచేసే తొంబైయేళ్ళ ముసలిలామాలూ, టిబెట్‌లోని ఒక ఎత్తైన మంచుపర్వతంపైన ఒక ధ్యానమందిరం కట్టారు ! అది పూర్తికావడానికి దాదాపు రెండు పుష్కరాల కాలంపట్టింది. అందులోని ప్రతీ శిల్పమూ, ప్రతి నగిషీ బొమ్మా, తాషీలామా పీఠాధిపతులే స్వయంగా చెప్పి చేయించిపెట్టించారు — గొప్ప సమర్థులైన శిల్పులచేత.

"చివరికి పూజాస్థానమైన పీఠస్థానంలోని, ధ్యానమందిరం పూర్తికా వచ్చింది. దానిని తెరవడానికి, ప్రారంభానికీ శుభముహూర్తంకూడా ఆయనే చెప్పారు. బృహస్పతి, శుక్రుడు, పూర్ణచంద్రుడు, బుధుడు, సూర్యుడూ — అన్నీ ఒక ప్రత్యేకమైన రాశిలోకివచ్చే విశేషమైన 'గ్రహకూటమి' వచ్చినపుడే అది తెరవాలని !

ఆ 'లామాసరీ'లోని పీఠాధిపతులందరూ కలిసి అప్పుడే వారిని

ప్రార్థించగా ఆయన అతికష్టంమీద అంగీకరించారు — తానే స్వయంగా వచ్చి పూజామందిరం లోపలికివెళ్ళి దీపాలు వెలిగించి 'ప్రాణప్రతిష్ఠ' చేస్తానని ! కాని, ఆ మందిరం కట్టడం పూర్తికాకముందే ఆయన శరీరాన్ని విడిచిపెట్టారు యోగసమాధిలో ! దాంతో టిబెట్‌లోని లామాలు, తాషీ లామాలు, 'తుల్కూ'లూ, అవధూతలవంటివారంతా ఎంతో నిరాశ పొందారు — 'ఆధ్యాత్మికత' అంటేనే సందేహం కలిగేటంత పెద్ద నిరుత్సాహం కలిగించింది తాషీలామాగారి మరణం వారికి !

కాని, మా గురుదేవులైన 'డ్రెపాంగ్' లామాసరీ పీఠాధిపతిగారు ఏమాత్రం నిరుత్సాహపడలేదు. "ఒరేయ్ ! లామాబ్రహ్మచారీ మింగ్యోర్ దోండప్ ఎందుకురా ! నువ్వింత నిరుత్సాహపడుతున్నావు ? ఆయన శరీరం వదిలేశారని అధైర్యపడుతున్నావా ? ఆయన వాక్కు, ఎన్నటికీ అసత్యం కాదు ! అది తప్పక జరిగితీరుతుంది !" అని ధృవీకరించారు.

అప్పటికి నాకు పన్నెండు పదమూడు సంవత్సరాల వయస్సు మాత్రమే ! నాకు చాలా ఆశ్చర్యంకలిగింది వారి మాటలకు ! ఆయన శరీరమే విడిచిపెట్టారుగదా ? పైగా ఆ శరీరాన్ని సమాధికూడా చేశారు గదా ? ఇంకా ఆయన "ప్రారంభోత్సవానికి" వచ్చి ఎలాగ ప్రాణప్రతిష్ఠ చేస్తారు ?" అనుకున్నాను.

అక్కడి 'లామాసరీ'లోని ఆచారంప్రకారం తాషీలామా గురుదేవుల "పాదుక"లను అంటే ఆయన పాదాలకు నిత్యం ధరించే స్ఫటికంతో చేసిన పాదుకల్ని ఆయనకు మారుగా నిత్యం పూజించేవారు ! వాటిని ఆయన పాదయాత్రకు మారుగా ఒక పల్లకీలో ఉత్సవంగా ఊరేగించే

వారు, మేళతాళాలతో ! వాటికే నిత్యమూ ధూప, దీప, నైవేద్యమిచ్చేవారు — ఆయన నిజంగా బ్రతికివున్నట్టుగానే !"

"ఇలావుండగా ఆ ప్రార్థనా మందిరంలోని పూజాపీఠం నిర్మాణం కూడా పూర్తయ్యింది ! తాషీలామా గురుదేవులు చెప్పిన 'అపూర్వ-గ్రహస్థితి' కలిగిన శుభముహూర్తంకూడా సకాలంలో వచ్చింది ! "ఇప్పుడెలాగ ? తాషీలామా గురుదేవులే స్వయంగా పూజాపీఠంలో దీపారాధన వెలిగించి "ప్రాణప్రతిష్ఠ" చేసి దాన్ని ఆవిష్కరిస్తామన్నారే ! — అనుకుంటూ అందరమూ వారి మఠానికి వెళ్ళి ఆయన జీవించివుండగా విశ్రాంతి తీసుకునే 'పవళింపుసేవ' జరిగే పడకగదివద్దకి పల్లకీని తీసుకునివెళ్ళాం! ద్వారం బయట, శంఖాలు, డోలు, మద్దెల, బాకాలు ఊది వైభవంగా గంటలుమోగిస్తూ కర్పూర హారతులిచ్చారు.

ఆశ్చర్యం ! — సరిగ్గా ఆయన మఠం తలుపులు వాటంతట అవే తెరుచుకున్నాయి ! వారి గదిలోంచి తాషీలామా గురుదేవులే పూర్తిగా శరీరంతో బయటకి ఒక మహారాజులా నడిచివచ్చి — ఆ పల్లకీలో కూర్చున్నారు ! మాకందరికీ మతులుపోయాయి ! ఆయన ఎడమచేతిలో వెండి పొన్నుకర్ర "యోగ-దండం" ధరించి, తన కుడిచేతితో పల్లకీని, "బయలుదేరమ"ని సంజ్ఞచేశారు !!!"

"ఆశ్చర్యంతో మేమందరమూ బ్రహ్మరథంపట్టేశాము దాదాపు నూటఎనిమిదిమందిమి లామాలం — ఆ పల్లకీని మోస్తూ ఊరేగింపుగా బయలుదేరి క్రొత్త 'పూజామందిరం' ముందుగా దించాము !"

"పల్లకీ తెర తొలగించుకుని తాషీలామా గురుదేవులు ఒక మహా

రాజులాగ ఠీవిగా పల్లకీలోంచి దిగి నేరుగా నడిచివెళ్ళి ఆ పూజా మందిరంలోకి ప్రవేశించారు — కుడి ఎడమవైపులో నుంచున్న మా అందరివైపు అనుగ్రహంగా చూస్తూ చిరునవ్వుతో కుడిచేతితో ఆశీర్వదిస్తూ మరీవెళ్ళారు, ఎవ్వరికీ అనుమానం కలగకుండా జీవించివున్నప్పటిలాగే !!

"మరుక్షణమే శంఖం ధ్వనిచేస్తూ బాజాభజంత్రీలు మారుమ్రోగుతుంటే 'ప్రాణప్రతిష్ఠ' చేసే సమయానికి జ్యోతులు ఆశ్చర్యంగా వాటంతట అవే దీపపు సెమ్మాలలో అంతటా వెలిగాయి ! కాని — తాషీలామా గురుదేవులుమాత్రం ఎంతసేపటికీ ఆ పూజామందిరంలోంచి బయటకు రాలేదు ! అలా దాదాపు ఒక గంటసేపు అందరం — బయటే వేచివుండి, చివరకు ధైర్యంచేసి మాలోని కొందరు 'లామా'లు — లోపలికిపోయి చూస్తే ఏముంది ? — అక్కడ ఎవ్వరూ లేరు ! పూజామందిరమంతా ఖాళీగా వుంది !

తాషీలామా గురుదేవులు వెలిగించిన దీపారాధనలు మాత్రం బంగారురంగు జ్వాలలతో దేదీప్యమానంగా వెలుగుతున్నాయి ! అంతటా చందనమూ, కస్తూరి అగరువత్తుల పరిమళం ఎవ్వరూ ధూపం వెలిగించకుండానే ఘుమఘుమా పరిమళిస్తోంది ! బైట ఎండకాస్తున్నప్పటికీ సన్నటి వాన పూలజల్లువంటి 'అమృతజల్లు'గా వర్షించింది ! ఆయనను ఆనాటి నుంచీ ఈనాటివరకూ ఎవ్వరూ మళ్ళీ ఎవ్వరూ శరీరంతో చూడలేదు.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఆయన చిత్రింపించిన **"శంబల ప్రభువు"** చిత్రాలలో పరమాశ్చర్యమైన విషయం ఏమిటంటే — శంబల ప్రభువు దుష్టులను శిక్షించే బొమ్మలో ఆయన గుఱ్ఱం

చుట్టూ అనేకమంది విదేశీయులను చిత్రించారు ! ఆశ్చర్యంగా వాళ్ళ కాళ్ళకు విదేశీబూట్లు, మేజోళ్లూ, తలకు యూరోపియన్ టోపీలూ (Hats) ధరించి వారి చేతులలో తుపాకులు పట్టుకుని నిలబడివున్నారు ! ఆశ్చర్యం ! — అప్పటికి తుపాకులుగాని, బూట్లు, మేజోళ్ళూ ధరించిన విదేశీయులనుగానీ, ఎవ్వరికీ తెలిసే సావకాశమే లేదు ! ఎందుకంటే యూరప్ చరిత్రే అప్పటికింకా అసలు — ప్రారంభమే కాలేదు, ఈ బొమ్మలువేసిన పదిహేనువంద (1500) ల సంవత్సరాలదాకా ! ఆతరువాత గానీ యూరపు జాతుల చరిత్ర ప్రారంభించలేదు. అంటే — అంతకుముందే "భవిష్యత్తు"లో రాగల విదేశీయులనూ, వాళ్ళ డ్రస్సులూ, టోపీలు, బూట్లు, తుపాకులతోసహా చిత్రకారులచేత తాషీలామా గురుదేవులే విశదంగా వర్ణిస్తూ బొమ్మలు వేయించారు ! నాకే పట్టలేని ఆశ్చర్యం కలుగుతోంది అది తలచుకుంటేనే.

"ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే ఆయన చివరిరోజుల్లో ఒక రహస్యగ్రంథాన్ని తాటిఆకులమీద రాశారు తాళపత్రగ్రంథం శైలిలో, **'శంబలప్రభుని అద్భుత యాత్ర'** అని ఆగ్రంథం పేరు ! అందులో ఆయన స్వయంగా శంబలప్రభువు ధరించే "కత్తి" గురించీ శంబలప్రభువు దగ్గరవుండే "చింతామణి శిల" గురించి ఇంకా ఎన్నో వింతలు, విశేషాలు రాసివున్నాయి ! ఆ గ్రంథం పరమరహస్యమని — ఎవ్వరికీ చూపించరు ! ముసలి లామాలు కూడా ఎవ్వరూ ఇంతవరకూ కూడా ఆ గ్రంథాన్ని తెరిచి చూడలేదు. అది తెరిచి చదివే టైము వచ్చి — భవిష్యత్తులో ఆ భవిష్యాలన్నీ జరిగే కాలం దగ్గరికి వచ్చినప్పుడు — ఆయనే ప్రత్యక్షమై ఆ గ్రంథాన్ని చదివి వినిపిస్తారుట !

ఇంకా మాగురుదేవులు “డ్రెపాంగ్” లామాసరీ ఆశ్రమ పీఠాధిపతి శ్రీషీలామాగారు చెప్పగావిన్నాను — శంబలప్రభువు ఎక్కివచ్చే గుఱ్ఱం గురించి ! “గుఱ్ఱం అంటే అది మామూలుగా గడ్డితిని, నీళ్ళుతాగే మామూలు గుఱ్ఱంలాంటిది కాదనీ, అది ఒక “దివ్య-శక్తి”కి చిహ్నామనీ !

ప్రాచీన భవిష్యగ్రంథాలలో మూడురకాల గుఱ్ఱాల్ని వర్ణించారు ! అందులో ఒకటి “తెల్లని శంఖంవంటి” శంబలప్రభువుతో అవతరించే గుఱ్ఱము ! ఇది శుద్ధ సత్యజ్ఞానము, సాత్వికులైన యోగుల ఆత్మశక్తికి గుర్తు ! రెండవది ఎఱ్ఱని గుఱ్ఱము ! దీనిని “అశ్వమేధాశ్వం” అంటారు. ఇది రాజరికానికీ, ప్రపంచ సార్వభౌమత్వానికీ గుర్తు ! దీని వీపున ధరించే ‘జీను’పైన పొడుగాటి గొడుగు — తెల్లటి కర్పూరం రంగుతో వున్న ఛత్రంనకు ముత్యాలు కట్టివుంటాయి ! ఇంక మూడవది నల్లగుఱ్ఱము. ఇది ప్రపంచంలో నడుస్తున్న ఈ “కలియుగం” లోని పాపాలూ, అజ్ఞానం, చీకటికీ గుర్తు ! దీనిపై కలియుగానికి రూపమైన **“కలిపురుషుడు”** వస్తాడు సైతాన్ అవతారంగా ! ఇంక నాలుగవది — ఆఖరుది తెలుపూ-నలుపూ కలిసిన మచ్చలగుఱ్ఱం ! దీని నాలుగుకాళ్ళకు నాలుగురకాల అందెలు వుంటాయి ! ఒక చెవి నలుపూ, ఒక చెవి తెలుపు రంగులో నలుపు-తెలుపు వెంట్రుకలు కలిసిపోయిన — మిరియాలపొడి రంగులో వుంటాయి ! ఇది కలియుగమూ, సత్యయుగముల “సంధి” “యుగ సంధి” కాలానికి గుర్తు ! దీనినిబట్టి ఎవరికి ఎంత అర్థమైతే అంత అర్థమౌతుంది.”

ఇంకొక సూచన — ‘గుఱ్ఱం’ అనే మాటకు సంస్కృతంలో “అశ్వం” అని అర్థము. అదే శ్రీరాముడు అశ్వమేధయాగములోను, ధర్మరాజు

చేసిన యజ్ఞంలోని యజ్ఞాశ్వమూ ఇదే !

వేదంలో "అశ్వం" అనగా అగ్ని ! రెండు రావి సమిధలుగా మోదుగ కర్రలతోకాని చేసిన "ఆరణి"తో మధిస్తే పుట్టే "అగ్ని"యే – ఈ అశ్వము !! అలాగే మహాయోగులు జపం చేసేటప్పుడు పైదవ క్రిందిదవడల మధ్య బీజాక్షరముల రాపిడివల్ల పుట్టే 'కరెంటు' వం శక్తిపేరూ అశ్వమే !

మెదడును వెన్నెముక కలుసుకునే చోట చివరి వెన్నుపూసని కూ **"అశ్వం"** అంటారు ! ఇదికూడా గుఱ్ఱం ఆకారంలోనే ఉండబట్టి ! అ ఆశ్చర్యపోకండి ! — లంకాస్టర్ మహాశయా ! మీ సైంటిస్టులు కూ మెదడులోని ఈభాగానికి 'హిప్పోక్యేంపస్' (Hippocampus) అం "గుఱ్ఱం" అనే అర్థం వచ్చే పేరేపెట్టారుగాని ఎందుకో మీకు తెలియదు

మొత్తానికి అశ్వం అంటే రెండు మేఘాలమధ్య పుట్టే పిడుగువం అణుశక్తి ! దీనినే బయట **'శంబల–ప్రభువు'** వాహనంగా వర్ణించే 'అశ్వ అంటే ఆకాశంలో పుట్టే ఒకానొక 'దివ్యశక్తి !'

అయితే ఇది మామూలుగా మీ సైన్సుకు తెలిసిన విద్యుత్తో మ ఇతర శక్తీ కాదు ! యోగులూ, సిద్ధపురుషులలో వుండే అణుధార్మి శక్తి వంటి ప్రచండశక్తి ! ఇది ప్రపంచాన్ని నశింపుచేసే శక్తి కలిగినది! కాని ఇది యోగశక్తి కాబట్టి — అది శంబలప్రభువు ప్రయోగిం దుష్టులపైనే పనిచేస్తుంది ! ఇది ఆకాశంలో పిడుగులా మెరుపు వేగం పరిగెడుతూ పాములా మెలికలుగా జరజరా పాకిపోయే అద్భుతశక్తి ఇ దీనినే అశ్వం అనిచెప్పారు.

అయ్యా ! మా, పీఠాధిపతి తాషీలామా గురుదేవులవల్ల నాకు తెలిసింది — ఇంతవరకే ! మీరందరూ బాగా చదువుకున్నవారిలా కనిపిస్తున్నారు ! పరిశోధనా సైంటిస్టులు !! దీనిపై పరిశోధించగలరు. నేనా ఒక పామరుడైన లామాసరీలోని మామూలు పూజారిని మాత్రమే ! నేను. దలైలామాను కాను, తేషూలామానూ కాను !" అన్నాడు ఆనంద భాష్పాలతో ఆశ్చర్యంగా వింటూన్న మాతో లామా దోర్జీ చోగ్యాల్.

ఆయన మాటలు వింటున్న మాకు ఇంక మాట్లాడటానికి ఏమీ మిగలలేదు ! ఆలోచనలు ఆగిపోయాయి ! తలకుమించిన విషయం ఇది !

* * *

40

శంబల ఎక్కడ ?

ప్రపంచంలోని మతగురువులందరూ — గౌతమబుద్ధుడు, ప్ర జోరాస్టరు, యవనుల శాసనకర్త మోసెస్ ప్రవక్త, ఏసుక్రీస్తుగా యూరప్ ప్రచారంకాబడిన **'యోగి ఈశా'** మతగురువు, ఇంకా సిక్కు మతగురు గురునానక్ మహాశయుడు ఇంకా అనేకులు రహస్యమార్గాలద్వా హిమాలయాలలో ప్రయాణించి శంబలప్రభువు పాదముద్రలను దర్శిం భక్తితో పూజలను సమర్పించినట్టు టిబెట్, నేపాల్, భూటాన్, సిక్కింల వున్న పర్వతాలలో ప్రతీ గొర్రెలకాపరులు సైతం కథలు కథలు చెప్పుకుంటారు — "శంబలప్రభువు ! శంబలప్రభువు !!" అంటూ ఇప్పటి

టిబెటన్ భాషలో **'రిగ్డెన్‌గ్యాపో'** అని పిలిచే శంబలప్రభువే మ యాన బౌద్ధమతంలో మైత్రేయ బుద్ధుడుగా భవిష్యత్తులో రాను అవతారమూర్తిగా భవిష్యత్ కాలజ్ఞానగ్రంథాలలో వర్ణించివున్నది -

ఆయనగూర్చే ! ఆయన ఎవరు ? ఎక్కడ పుడతాడు ? ఈ ప్రపంచాన్ని మొత్తం మార్చివేయడానికి — ఆయన ఏంచేస్తాడు ? ఆ ప్రపంచ ప్రభువును గురించి తెలిపే నాడీగ్రంథాల వంటి భవిష్యత్ కాలజ్ఞాన గ్రంథాలు హిమాలయ పర్వతాలలో తాళపత్రగ్రంథాలలో భద్రపరచబడి లామాసరీలలోనూ పీఠాధిపతులచేత ఇప్పటికీ సంరక్షించబడుతున్నాయి.

ఇందులోని విషయాలు వాటికి ఉద్దేశించబడిన నిర్ణీతసమయం రాకముందే బహిర్గతం చేయటం గొప్పనేరం ! చాలాపెద్ద అపచారం ! అని భావిస్తారు టిబెట్‌లోని లామాలు, బౌద్ధమత భిక్షువులు, మంగోలియాలోని చెంఘిజ్‌ఖాన్ మతానికి చెందిన తురేనియా మతస్థులు అందరూ ఆ ప్రపంచప్రభువుయొక్క రాకకోసం ఎదురుచూస్తున్నారు.

ఇంతకీ శంబలప్రభువు గ్రామం అని టిబెట్‌లోని గొర్రెలకాపరులు పిలిచే ఆ దివ్యపురుషుడు హిమాలయపర్వతాలలో — కైలాసశిఖరానికి ఈశాన్యంగా పవిత్ర గంగానదికి పుట్టకస్థానమైన “గౌముఖ్” మంచు జలపాతానికి ఈశాన్యంగా పర్వతశిఖరాలమధ్య ఒకపెట్టని కోటవలే రక్షించబడుతూ వున్నది ఒక మారుమూల హిమాలయపర్వతగ్రామం ! దానిపేరే ‘శంబల’ !

ఈ ‘శంబల’ గ్రామం హిమాలయపర్వతాలలో ఎక్కడవున్నదో తెలుసుకోవాలని రష్యన్, జర్మన్, బ్రిటీష్ రహస్య పరిశోధకబృందాలు 1810 నుంచి 1940 వరకూ రహస్యంగా పరిశోధిస్తూనే వున్నాయి. ఆ రహస్య పరిశోధనల నివేదికలుకూడా యూరప్‌లోని లైబ్రరీలలోనూ క్రైస్తవ మతాధిపతులు, రోమన్ కేథలిక్ పీఠాధిపతి పోప్‌పీఠం అయిన



వాటికన్ నగరంలోని "రహస్య గ్రంథాలయంలో" ఇప్పటికీ దాచబ వున్నాయి. చాలామంది పోప్ పీఠాధిపతులకు కూడా ఈ నివేదికలగూ తెలుసు. హిమాలయపర్వతాలలో యోగి ఈశా పర్యటనగురించి కూడ వారికి తెలుసు. రహస్య కాగితాలలోని విలువైన సమాచారం యూరో

యన్ దేశాల పోలీసుశాఖవారు, మిషనరీలవంటి సంస్థలూ అనేకమందిని నోరువిప్పకుండా తాళంవేశారు. అయినప్పటికీ విదేశాలలోని రహస్య గ్రంథాలపై పరిశోధనచేసేవారికి శంబలనుగూర్చిన అనేక రహస్యాలు ఆశ్చర్యంలో ముంచెత్తేవి ఎన్నోవున్నాయి. వాటికోసమే ఇంగ్లండ్ మొత్తానికి ఎటువంటి రహస్యమైనా సాధించగల గొప్ప అపరాధ పరిశోధకుడు, గూఢచారిఅయిన చార్లెస్ బెల్ ఈ హిమాలయ సాహసబృందం వెనుక వుండి నడిపించే రహస్యం — ప్లానుప్రకారం ఈయన బ్రిటీష్ ప్రభుత్వానికి ఒక రహస్యనివేదిక కూడా పంపించాడు.

ఇంకా లండన్‌లోని గూఢచారి పోలీసువ్యవస్థ స్కాట్‌లాండ్‌యార్డ్ వారితోకూడా రహస్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. కాని, టిబెట్‌లోని బుద్ధదేవుని అవతారమైన దలైలామా ప్రభుత్వం అనుమానించటంవలన అనేక రహస్య నివేదికలు మధ్యలోనే అటకాయించబడి ఇప్పటికీ టిబెట్‌లోని లామాసరీలలోనూ, బౌద్ధమఠాలలోనూ వుంచబడ్డాయి. ఇవి ఇప్పటి దలైలామాకంటే పూర్వీకుడైన పదమూడవ దలైలామా నిర్యాణం లేక మరణించేముందు సుమారు 1933 ప్రాంతంలో భద్రంచేయబడ్డాయి. ఈ పదమూడవ దలైలామా గొప్ప యోగి, తాంత్రికుడు, భవిష్యద్రష్ట ! టిబెట్‌కు జరగబోయే రక్తపాతము — చైనా దండయాత్ర, ఎంతోమంది మతగురువులు, వేలాదిమంది ప్రజలు చిత్రహింసలకు గురికావడము, వేల సంవత్సరాలనాటి పురాతన తాళపత్రగ్రంథాలు తగలపెట్టబడటము — అన్నీ భవిష్యత్తులో ముందే దర్శించాడాయన.

“ఇనుప పక్షి ఆకాశాన ఎగురుతూ టిబెట్ వచ్చినదే గుర్తు — టిబెట్‌కు కష్టకాలం ఆరంభమవుతుందని ! విదేశీయులు తెల్లవాళ్ళు

కోతులవంటి వానరముఖం కలిగినవారు (అంటూ వర్ణించబడిన యూ పియస్ జాతివారు) ఆవుమాంసం తింటూ మధ్యము, వ్యభిచారము ఇష్టారాజ్యంగా చేస్తూ పవిత్ర టిబెట్‌మీద కాలుపెట్టటమే కష్టకాలానికి మొదలు. ఘోరమైన కలియుగం చివరి అంతర్దశ ఆరంభమౌతుంది. ప్రపంచయుద్ధాలలో కోట్లాదిమంది జనాన్ని నశింపచేసి భూమిని రక్తపాతంతో తడుపుతారు. ఎక్కడా ఎవరికీ మనశ్శాంతి వుండదు. కుటుంబాలను రక్షణవుండదు! ఒకమతాన్ని ఒకమతం ద్వేషించుకుంటూ, హింసించుకుంటూ ఇళ్ళు, ఊళ్ళూ తగలబెట్టుకుంటూ, మంచివారిని చిత్రహింసలు పెట్టటం వంటివి పెరిగిపోతాయి ఎక్కడచూసినా.

“ప్రపంచమంతటా అమాయకులు, భగవంతుడినే నమ్ముకున్నవారు, పవిత్రంగా జీవిస్తూ, స్వార్థంలేకుండా జీవించే సాధువులూ, కన్నీళ్లతో విలపించేకాలం రానున్నది! ప్రపంచమంతా ఈ బాధలు తట్టుకోలేక గోలుగోలున విలపిస్తూ —

“భగవంతుడా! నువ్వేదిక్కు! రక్షించు! రక్షించు!! అంటూ ప్రతీ వారూ విలపించినప్పుడే శంబలప్రభువు భూమికివస్తాడు! అదే ప్రపంచానికి శుభవార్త!” అంటూ పదమూడవ దలైలామా చెప్పిన భవిష్యాలు ఇప్పటికీ టిబెట్‌లోని దలైలామా ప్రభుత్వం రహస్యగ్రంథాలయాలలో భద్రపరచబడివున్నాయి అంటూ ఆపాడు చార్లెస్ బెల్.

“ఎక్కడండీ! మీరుచెప్పే ఆ ‘శంబల’?” — వారాలతరబడి కాళ్ళు పీక్కుపోయేలాగ మంచుకొండలు ఎక్కుతూ, దిగుతూ నడుస్తున్న సాహ యాత్ర బృందంలోంచి నికోలస్ రోరిఖ్ మహాశయుడు బాధాకరమై

ఆర్తనాదంవంటి పొలికేకపెట్టాడు. ఆయన అరచిన కేక హిమాలయ పర్వతాలలోని లోయఅంతా ప్రతిధ్వనించింది సమాధానంగా !

"ఎవరిని అడుగుతున్నారు మీరు ? ఇక్కడ సమాధానం చెప్పటానికి ఎవరున్నారు మీప్రశ్నకు" అంటూ తన పైపును గట్టిగా దమ్ములాగి పొగపీల్చి వదిలాడు గూఢచారచక్రవర్తి అయిన చార్లెస్ బెల్ వింతగా చూస్తూ !

"ఇది మనం తవ్వి తెలుసుకోవలసిన రహస్యంకదా ! తొందర పడకండి. ముందుగా మనం ఆ స్ఫటికపర్వతం ఎక్కడవుందో వెతికి పట్టుకోవాలి అన్నీ దానితోనే ముడిపడివున్నాయి" అంటూ.

ఒక గుడారంలో టేబుల్‌మీద తన ఎదురుగా పరిచివున్న పర్వతాల చిత్రపటాన్ని పరిశీలిస్తూ అన్నాడు చార్లెస్ బెల్ మహాశయుడు !

41

స్ఫటిక-పర్వతంలోకి దారి!

మా హిమాలయపర్వత యాత్రలో మిగతా మూడురోజులూ కార్యక్రమం ఒకటేలా నడిచింది — ఉదయాన్నే లేవటం. కాలకృత్యాల తరువాత పింగాణీ మగ్గులో వేడి వేడి “హిమాలయన్”-టీ-తో పాటు కడుపునిండా ఫలహారం సేవించి, అది అరిగేదాకా మధ్యాహ్నంవరకూ మంచుకొండలు ఎక్కడం, దిగడం — మధ్యలో కన్నులుమిరుమిట్లు గొలిపే వెలుతురుతో ఎండగానో, లేక చీకట్లు కమ్ముకువచ్చి మేఘాలు ధారాపాతంగా వర్షించడమో — సాయంత్రానికల్లా ఒకచోట “క్యాంపు” చేసుకుని కాస్సేపు విశ్రాంతి, రాత్రి వేడిగా భోజనము, మంచుకొండల మీంచి వీచే చలిగాలికి రక్షణగా వెచ్చటి ఉన్నిరగ్గుల్లో ఒళ్ళుమరచి నిద్రపోవటం — దానికే సరిపోయేది మాశక్తి అంతా ! మిగతా దేనికీ ఓపికేవుండేదిగాదు.

దీనికి ఒక ప్రత్యేక కారణంకూడా వుండవచ్చని తోస్తోంది. హిమాలయపర్వతాలలో — ముందుకి ప్రయాణించినకొద్దీ పదివేల అడుగులఎత్తును దాటినప్పటినుంచీ గాలి తక్కువైపోతుంది. దానితోపాటు ఆయాసమూ, ఊపిరి అందకపోవటం మొదలవుతాయి. ఎత్తుకువెళ్ళేకొద్దీ వాతావరణంలో ప్రాణవాయువు తగ్గుతుంది, గాలివొత్తిడి కూడా పడిపోతుంది. దాంతో శరీరంలో రక్తనాళాలలో ప్రవహించే రక్తపోటు హెచ్చిపోతుంది. దానికితోడు విపరీతమైన శ్రమపడి నిటారుగా ఎత్తుకి ఎక్కాల్సిరావటంవల్ల గుండెకొట్టుకోవటం కష్టంగా ఇంజను పంపింగుచేసినట్టు రక్తాన్ని తోడవలసిరావటంతో త్వరగా నీరసం, నిస్త్రాణా, బడలిక పెరిగిపోతాయి. ఇవన్నీ కలిసి అలసి డస్సిపోయిన మా కడుపులో వేడివేడిగా కాస్త భోజనంపడేసరికి మరే విషయాలమీదా, బుర్ర పనిచేయదు. చాలా మందికి వెంటనే నిద్ర ముంచుకువస్తుంది ! లేకపోతే నాలాంటివాళ్ళకు ఏదో హిమాలయాల గురించిన పుస్తకాలో, టిబెట్‌చరిత్ర యాత్రాదర్శిని వంటి పుస్తకాలో చదువుతూ పడుకోవటం — ఇలా గడిచిపోయింది ఈ మూడు నాలుగురోజులూ !

ఆతరువాత దొరికింది కాస్త విశ్రాంతి, విరామం. అందరూ ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయం మా యాత్రలో కాస్త ఒకరోజు ఆటవిడుపుగా శెలవుదినం అంటే విశ్రాంతిగా గడపాలని ! ప్రయాణం, సాహసయాత్ర అన్నీ నిలిపివేసి ఇరవైనాలుగు గంటలు చిల్లరదెబ్బలు, గాయాలు, కీళ్ళనొప్పులు వంటి శరీరబాధలకు అమృతాంజనం వంటివి మర్ధనాచేసి ఎండలోకూచుని విశ్రాంతిగా గడపడం. దానికితోడు పేరుకుపోయిన మురికిబట్టలను ఉతికి శుభ్రంచేసుకోవటం, మా మంచు ప్రయాణంలో

అవసరమయ్యే పరికరాలు మంచుగొడ్డలి, మంచుఇసుకలో నడిచే బూట్లూ, తుపాకీలకి కాస్త చిల్లర రిపేర్లు చేసుకోవటం శుభ్రంచేసుకోవటం! అలా శరీరానికి విశ్రాంతి ఎప్పుడైతే లభిస్తుందో మనస్సుకు అప్పుడే పని తగులుతుంది.

సాయంకాలం నీరెండ వెచ్చగా తగులుతూంటే కప్పులలో వేడివేడి డార్జిలింగ్ టీ యాలకులపాడితో దమ్ముచేసినది చప్పరిస్తూ మా మిత్ర బృందం అంతా విశ్రాంతిగా సమావేశమయ్యాము.

అందులో ఎవరు మొదలుపెట్టారో తెలియదు చర్చ ! ఎవరో ప్రశ్నించారు ఉన్నట్టుండి...

"స్ఫటికపర్వతం" అన్నపేరుతో ఈ హిమాలయాలలో రహస్య ఆధ్యాత్మిక కేంద్రంవంటిది ఎక్కడవున్నదో దయచేసి మీకు తెలిసిన రహస్యాలు చెప్పండి ! మీరే మాకు మార్గదర్శకులు — కేవలం కొండలలో నడిచే సాహసయాత్రలో కాలినడకలో మాత్రమేకాదు నిజంగా ఆధ్యాత్మికంగా మీనుంచి ఎన్నో తెలుసుకోవలసిన ఆధ్యాత్మికరహస్యాలు, గాథలు, దైవరహస్యాలు ఈ దేవతాస్థానమైన హిమాలయాలలో ఎన్నో వుండివుంటాయి. అవి మీలాంటివారు మాకు దయచేసి చెప్పకపోతే — ఇక మాకు తెలిసే మార్గమేముంటుంది ?" అంటూ ఒక దీపారాధ వత్తిని సన్నగా దీపంలా వెలిగించినట్టు చర్చను ప్రారంభించింది - ఎవరో సరిగ్గా గుర్తులేదుగాని మరుక్షణమే అందరం అత్యంత ఆసక్తికరమైన ఆ చర్చలో తలమునకలుగా మునిగిపోయాం. అందరమూ తలొకటి మాట్లాడుతూ గోలగోలగా చెప్పసాగారు. ఒక్కసారే ! చివరికి

అతికష్టంమీద అదుపుచేస్తే మేము అడగవలసిన ప్రశ్నలు ఒక్కొక్కరినే వేయ్యమని ప్రశ్నలు ఒకటి తరువాత ఇంకొకప్రశ్న అడగాలని నిశ్చయించాం !

మొదటిప్రశ్నకు సమాధానంగా నెమ్మదిగా ఆకాశంవంక చూస్తూ ఏదో అగాధమైన విషయాన్ని గుర్తుచేసుకుంటున్నట్టు తన సమాధానం మొదలుపెడుతున్న లామా గురుదేవులు —

"స్ఫటికపర్వతం అంటే మీఉద్దేశం ఏమిటి ? తాజ్‌మహల్ లాగ ఎవరైనా మహారాజో లేక మతగురువో ఈ హిమాలయాలలో నిర్మించిన స్థూపం లాంటిదనా ? లేక అసలు స్ఫటికపర్వతమంటే మీకున్న అభిప్రాయం ఏమిటి సాహసయాత్రికమహాశయా ?"

"నాకు తెలిసింది మీకు విశదంగా చెబుతాను. భూగర్భశాస్త్రజ్ఞులు రాళ్ళను రకరకాలైనవి పరిశీలించి గాజులాగ ఇటునుంచి అటువైపుకు నిర్మలంగా కాంతిని ప్రసరింపచేసే రాళ్ళను స్ఫటికం అంటారు. దానినే సైన్సు పరిభాషలో భూగర్భశాస్త్రజ్ఞులు 'క్వార్ట్జ్' (Quartz) అనే రసాయనశిల భూమిలో సహజంగానే గడ్డకట్టి ఏర్పడుతుంది పారదర్శకంగా ! ఇలా సహజంగా దొరికే స్ఫటికాలు గాజురాళ్ళవలేకాక, తళుక్కున మెరుస్తాయి — చీకట్లో కూడా ! ఇలాంటి రాళ్ళతో తరచూ సాధువులూ, యోగులూ జపంచేసే పూసలతో స్ఫటిక జపమాలను తయారుచేస్తారు. ఇలాంటి స్ఫటిక జపమాలలో ప్రత్యేకమైన శక్తి కరెంటువంటిది దాగివుంటుందని మన పూర్వీకుల నమ్మకం ! ఇలాంటి దాన్ని స్ఫటికం అంటారు. కాని స్ఫటికపర్వతం అంటారా? — అబ్బో ! అది చాలా పెద్దమాట !" అంటూ

లామా ఆశ్చర్యంగా గౌరవంతోనూ తన రెండుచేతులూ ఆకాశంవైపు మర్యాద సూచకంగా పైకెత్తాడు — నుదురుకు ఆనించుకుంటూ! ఈ ప్రశ్నకి సమాధానం పూర్తిగా వినకుండానే మాలో బుద్ధి స్థిరంలేని ఇంకొకరు ప్రశ్నలు అడగటమే ఒక దురదవంటి వ్యాపకంగా ఇంకొకప్రశ్న విశిరాడు "అసలీ స్ఫటిక జపమాలలు నిజమేనంటారా లేక గాజురాజు రాళ్ళతో మందుసీసాలు తయారుచేసినట్లు బల్లమీద కాగితాలు ఎగిరి పోకుండాపెట్టే పేపరుబరువులాంటి గాజువస్తువేనా?" అన్నాడు పాటియాలా యువరాజా, ఆధ్యాత్మిక విషయాలలో తనకు పరిపాకంలేని తేలికప్రశ్నలతో.

"అసలు నిజమైన స్ఫటికాలకు — గాజురాళ్ళకూ తేడా తెలుసుకోవటం ఎలాగ?" మీలాంటి అనుభవజ్ఞులనుంచి వినాలని ఎప్పటినుంచో కోరికగా వున్నది" — అన్నాడు మొదటిప్రశ్నకు సమాధానం పూర్తికాకుండానే. ఇంతలో మళ్లీ ఇంకొకరు అడిగారు.

లామా పురోహితుడు కాస్త అసహనంగా నుదురుచిట్లించి చిరాకుగా చూస్తూ పైకిమాత్రం సౌమ్యంగా అన్నాడు తనని తాను నిగ్రహించుకుంటూ — "మీలో ఒకప్రశ్నకు సమాధానం పూర్తిగా వినే ఓపిక వున్నవారికే నేను కష్టపడి సమాధానంకోసం వెతుకులాడటం అవసరంకదా!"

దానితో అందరూ చప్పగా చల్లారిపోయారు తమ తప్పును గుర్తించినట్లుగా ఫీలవుతూ!

"స్ఫటికానికీ, రంగురాళ్ళకూ తేడా తెలియనివాడు లేతబుర్ర అనుకోవాలి. అంటే నాభావం — జీవితంలో అనుభవం, సాధన, పెద్దలకు

సేవ చేసే అవకాశం కలిగి — విన్న ప్రతివిషయాన్ని లోతుగా ఆలోచించే నిదానం కలిగిన వ్యక్తికే జీవితంలో పరిపాకం లభిస్తుంది. అదెలాగంటే — మనం బజార్లో కొబ్బరిబోండాం కొట్టించి నీళ్ళు తాగుతున్నాం. అందులో లేతకొబ్బరి లభిస్తుంది. అలాగే టెంకాయ ముదిరితే కొబ్బరినూనె తీసే ఎండుకొబ్బరి లభిస్తుంది. అలాగే 'కురిడీ' కూడా తయారువుతుంది. మన తలలోని మెదడూఅంతే! "కురిడీ"–కాయ పెంకుకు అంటుకోకుండా — కాయలోనే వుంటూనే విడిగావున్నట్టే, శరీరంలోనే వుంటూ దానికి అంటకుండా 'వైరాగ్యం'గా జీవిస్తాడు — జీవించివుండగానే 'ముక్తి' పొందిన — "జీవన్ముక్తుడు !" ఆలోచన తగినంత ముదిరితేనే, మనిషి మెదడు, మనస్సుకూడా ముదురుతాయి అనుభవంతో ! అనుభవంలేని వారు నిదానంగా ఆలోచించరు. లోతుగా ఆలోచించే స్వభావం వుండాలి ! అలాంటివారికే ఇలాంటి ఆధ్యాత్మిక విషయాలపై చర్చ అర్థమవుతుంది ఉపకరించటం అలావుంచి !

చివాట్లువేస్తున్నట్లు మెత్తగానే విమర్శనగా అంటూ ఇలా అందుకున్నాడు సమాధానం.

"ముందుగా చిన్నప్రశ్నతో మొదలుపెడదాం" —

"స్ఫటికానికి, గాజురాయికి తేడాఏమిటి ?"

"స్ఫటికం సజీవమైంది — గాజురాయి ప్రాణంలేనిది, నిర్జీవం ! అంటే స్ఫటికంలో ఒక కరెంటువంటి అయస్కాంతశక్తి, ఆకర్షణీయమైన తేజస్సూ, దాగివుంటాయి.

"అదెలా తెలుస్తుంది ?"

మళ్ళీ ఓ తెలివితక్కువప్రశ్న ! అందరం చిరాకుగానూ, అసహనంతోనూ చూశాం అతడివంక. ఆ వ్యక్తి తలదించుకున్నాడు (పేర్లు ఇవ్వటం లేదు !)

“స్ఫటికంతో చేసిన పూసలు చీకట్లో కూర్చుని ఒకదానికి ఇంకొకటి గట్టిగా తాకించితే నిప్పురవ్వలు చిటపటగా కనిపిస్తాయి. ఇది మొదటి గుర్తు. స్ఫటికం సజీవం అన్నానుకదా ? ఇది రెండవగుర్తు — అంటే స్ఫటికంలో ప్రాణంవుంటుంది సాలగ్రామ శిలమాదిరిగా. రంధ్రంచేసి కన్నంపాడవని స్ఫటికం ప్రాణశక్తితో గుండ్రంగా తిరుగుతుంది సాలగ్రామ శిలమాదిరిగా. గాజురాళ్ళలో ఇలాంటి సజీవమైన శక్తివుండదు ! ఎందుకంటే గాజు నిప్పులోకాల్చిన ఇసుకను కరిగించి — రసాయనికంగా తయారుచేసిన నిర్జీవమైన పదార్థం కాబట్టి !

స్ఫటికంలో ఇంకొక రహస్యంకూడా దాగివుంది. సజీవమైన స్ఫటికశిలనుంచి అయస్కాంత తరంగాల వంటి — ఆధ్యాత్మిక తరంగాలు రేడియేషన్ లాంటి అప్రకాశమైన కాంతికిరణాలు ప్రసరించినట్లు ఆకాశంలోకి వ్యాపిస్తాయి.

అందుకే ఈ స్ఫటికానికి మనిషి మెదడుమీద, మనస్సుపైన మన శరీరంలోని ప్రాణశక్తిమీదా గొప్ప విద్యుత్ వంటి ప్రభావం కలిగివుంటుంది. అందుకే వైద్యశాస్త్రంలో కూడా డాక్టర్లు కేన్సర్ వంటి అసాధ్యమైన రోగాల చికిత్సకోసం ఈ స్ఫటికశిలలను ఉపయోగిస్తున్నారు. ఈ సంగతి మన ప్రాచీన ఋషులకు, యోగులకు, అనేక వేలసంవత్సరాల క్రితమే తెలిసిన రహస్యం. అందుకే స్ఫటికాలను పూజావస్తువులుగా భావించారు.”



"మంచు- సొరంగం" "స్ఫటిక-పర్వతానికి" దారి

"మీలో చాలామంది చూసేవుంటారు. స్ఫటికంతో చేసిన శివలింగాలు, గణపతి విగ్రహాల... వంటి పవిత్ర పూజావస్తువులు అనేక శంకర పీఠాలలోకూడా అభిషేకించి పూజిస్తారు. వాటినుంచి జ్ఞానశక్తి తరంగాలు మన శరీరంపై ప్రవహించి, ప్రాణశక్తి ప్రసారాన్ని ఉత్తేజపరచి శరీరానికి శక్తివంటిది ప్రసారంచేస్తుంది.

నియమనిష్ఠలు పాటించేవారికీ, మధ్యమాంసాలు, స్త్రీవ్యసనం లేనివారికి, యోగులకు బ్రహ్మనిష్ఠాగరిష్ఠులకూ, ఈ స్ఫటికాలు ఆత్మని ఉత్తేజపరచి జ్ఞానశక్తిని, ఆధ్యాత్మిక సాధననూ, ప్రకోపింపచేస్తాయి ! అందుకనే హిమాలయాలలోని అనేక లామాసరీలలోనూ, టిబెటన్, మంగోలియన్, జపనీస్, చైనా దేశాలలోనూ స్ఫటికాలను పూజించి గౌరవిస్తారు. నమస్కరిస్తారు. ఎందుకంటే స్ఫటికం — ఆధ్యాత్మిక కేంద్రం !

ఒక స్ఫటిక జపమాలలోని స్ఫటిక పూసకే అంత శక్తివుంటే ప్రపంచంలోకల్లా ఎత్తైన హిమాలయపర్వతాలలో సహజంగా స్ఫటికంతో ఏర్పడిన **స్ఫటిక పర్వతం** గనక వుండివుంటే — ఇక చెప్పేదేముంది !

"లామా మహాశయా ! ఒకచిన్న ప్రశ్న అడగవచ్చా ?" అంటూ అలెగ్జాండర్ నోటోవిచ్ సౌమ్యంగా అడిగాడు.

"అడగండీ !" అన్నాడు సౌమ్యంగా లామా !

స్ఫటికం, స్ఫటికపర్వతం వాటిలోని గాజు వంటి లక్షణంవల్లనే మనిషి వాటిని విలువైన వస్తువులుగా భావిస్తున్నాడా ? అసలీ స్ఫటికంలో విశిష్టత ఇంకేమైనావుందా ? వేదాంతపరంగా — ఆధ్యాత్మికపరంగానూ !

"స్ఫటికం" — కాంతిని ప్రసారంచేస్తుంది, తనలోంచి ! అందు స్ఫటికం నిర్మలత్వానికి, స్వచ్ఛతకూ గుర్తు ! మనస్సు నిర్మలమైతే అ జ్ఞానానికి సూచనకదా !

"మనస్సు నిర్మలమైతే ఆతరువాత నిశ్చలమౌతుంది.

అదెలాగంటే నీళ్లు, స్ఫటికంలాగే నిర్మలం ! కానీ చంచలం అంటే క్షణంసేపుకూడా గాలికి కదలకుండా, అలలు లేకుండా నిశ్శబ్దంగ వుండలేవు."

"అలా నిత్యం కదిలే నీటివంటిది మనస్సు ! మనస్సు నిర్మలమై నిశ్చలం అవుతుంది. నిశ్చలము, నిర్మలము అయినదే స్ఫటికము అందుకే స్ఫటికం చంచలంకాదు నీళ్ళవలే ! అంటే స్ఫటికం 'అచలం — కాలానికి చలించదు ! కాలంలో మారదు ! నిశ్చల-సమాధి స్థితి చేరిన **బుద్ధి** — స్ఫటికంతో సమానం; అందుకే స్ఫటిక శివలింగాని అంత ప్రత్యేకత.

"మంచులింగం — అమరత్వానికి ఎలాంటిగుర్తో, అమరనాధు గుహలో శ్రావణపూర్ణిమనాడే "మంచు-లింగం" ఎలా ఏర్పడుతోందో, అ యోగసమాధికి గుర్తు. ఆధ్యాత్మికసాధనకు సూచిక. అందుకే కర్కాట రాశిలో వచ్చే పౌర్ణమినాడు — శ్రావణపౌర్ణమిరోజున ఈ హిమాలయా లోని అమరనాధుని గుహలో మంచులింగం సహజంగానే ఏర్పడుతుం శ్రావణపౌర్ణమి పోగానే అది కరిగిపోతుంది ! అంటే ఏమిటి దానిఅర్థం భగవంతుని అవతారం. ప్రపంచంలో ఎప్పుడో అరుదుగాగాని ఈ భూమీ అవతరించదు. మళ్ళీ ఆధ్యాత్మికసాధన తగ్గిపోగానే అది మంచులిం లాగ కరిగిపోతుంది — అమరనాధుని గుహలోని మంచులింగంలా

కాని మన 'స్ఫటిక లింగం' అలా కరిగిపోదు! స్థిరంగా శాశ్వతత్వాన్ని పొందిన ఆత్మసాక్షాత్కారానికి సూచనగా — ఆత్మయొక్క నిర్మలత్వానికి గుర్తు! అదేవిధంగా 'శ్రీచక్రం' — శక్తికి చిహ్నం! ప్రత్యేకించి స్ఫటిక శ్రీచక్రం — శుద్ధజ్ఞానంతో ఏర్పడిన శుద్ధ శక్తిస్వరూపిణియగు జగన్మాతకు సూచిక !! — అదే ఘనీభవించిన పరాశక్తి! అంటే పారదర్శకమైన నిర్మలమైన శక్తి !! అటు జ్ఞానశక్తిలోవున్న నిర్మలత్వమూ, ఇటు క్రియాశక్తికి వున్న సామర్థ్యమూ రెండూ కలిగి — శక్తిలో సామాన్యంగా వుండే దోషాలైన అహంకారము, గర్వము లేనట్టి, దైవత్వము! కాబట్టి శుద్ధశక్తి స్వరూపమైన ఆది-పరాశక్తికి చిహ్నం!

అదలావుంచండి; అచలం అనగా చలనంలేనిది నిశ్చలం — అంటే, దానికి **కొండ** అనికూడా అర్థం. పర్వాలు కలిగిందిగనక పర్వతం. కాలచక్రంలో పౌర్ణమి, అమావాస్యలే పర్వాలు! అదేవిధంగా సముద్రంలో ఏర్పడే ఆటుపోట్లు కూడా పర్వాలే కదా!

కాలానికి ధర్మం, అధర్మం ఆటుపోట్ల వంటివి. పర్వములు కలిగినదే పర్వతము. ఇలాంటి పర్వతమే స్ఫటికం; అంటే కాలంలో శుద్ధిచేయబడి, జ్ఞానంతో ఘనీభవించి, నిర్మలమైన ప్రేమ, శుద్ధజ్ఞానము రెండూ ఐక్యమైతే అదే దైవప్రేమ. ఈ ప్రపంచంలో యుద్ధాలూ, రక్తపాతాలూ, స్వార్థము, హింస నిర్మూలించి నిర్మలమైన దైవప్రేమను చుకుంటేనే — 'స్ఫటికపర్వతం' ఎక్కడవున్నదో మనకి ఆచూకీ లభించే లం వచ్చినట్టు.

"అదే శుద్ధ **సత్యయుగం** లోని సత్యకాలం యొక్క అంతర్దశ!"

— ఇది, రాబోయే కలియుగాంతం తరువాత వస్తుంది !" అంటూ ప్రసంగిస్తున్న లామాకు అడ్డుతగిలారు మాలో ఎవరో !

"అది, పరమాత్మ భూమ్మీదకి వచ్చేకాలమా ?" — గర్వంతో మ అందరి వంక చూశాడు తానే చాలా తెలివైనప్రశ్న అడిగాననుకుంటూ!

"ఐతే పరమాత్మ — భూమ్మీద లేడా ? వున్నాడు ! కాని మనుషుల్లో డబ్బుపై కాపీనం, స్వార్థం వున్నంతకాలమూ, ఆయన మనకి కనిపించే — కనిపించడు ! అంటే ప్రపంచమంతటా శాంతి రావాలి.

శంబల అనేమాటకు సంస్కృతంలో **'శం'** అంటే శాంతి — 'బల' అనగా బలం — అంటే శాంతియే ఆత్మబలం ! ఈరెండూ మనిషిలో ఆవిష్కరించినప్పుడు

శం+బల = శంబల
శం+కర = శంకర అన్నట్టు

శాంతియే బలం — ఆత్మకి ! అక్కడేవుంటుంది భూమ్మీద దైవశక్తి! మనస్సు ఆలోచనలు లేకుండా నిర్మల స్ఫటికంలా ఘనీభవించినప్పు మానవుడి ఆత్మలో దైవశక్తి వెలుగుతుంది. అదేవిధంగా జ్ఞానంతో బుద్ధి ఐక్యమైతే — అదే స్ఫటిక శ్రీచక్రం !

అంటే మామూలు మాటల్లో చెప్పాలంటే నిర్మలమైన నిశ్చల సమాధి వంటి 'దైవత్వం' ఈ భూమిమీదకి దిగినప్పుడే — అచలంగా అదృశ్యరూపంలో వున్నది ప్రత్యక్షంగా కనిపించే కాలంవస్తే — అప్పుడు కనిపిస్తుంది స్ఫటికపర్వతం. ఇదే శాంతితో కలిగే బలం — శంబలకు ద్వారం ! కలియుగాంతానికి అంత్యభూమి !"

"మరి ఈ స్ఫటికపర్వతానికి చేరుకునే రహస్యగుహనుండి లోపలికి ప్రవేశించే ద్వారం ఎలా కనుక్కోవడం ?" — అడిగాడు నికోలాస్ రోరిఖ్.

మళ్ళీ ప్రశాంతంగా చెప్పటం మొదలుపెట్టారు లామా !

శంబలకు పోయే దారి :

"యోగశాస్త్రం ప్రకారం మన శరీరం ఈ విశాల విశ్వానికి ప్రతిరూపం ! మన శరీరంలో మూడు ముఖ్యమైన కేంద్రాలు వున్నాయి.

(1) ఒకటి ఆలోచనలకు స్థానమైన మెదడు, ఇది, **మనస్సుకు** నివాసం.

(2) రెండవది **ప్రాణానికి** శరీరంలోని రక్తస్పందనకి మూలస్థానమైన గుండెకాయ లేక **హృదయం**.

(3) మూడవది ఆహారము జీర్ణంకావటం, సృష్టికార్యం జరగటం అనేవి జరిగే **మూలాధార** స్థానము.

వాటినే మన వేదకాలపు ఋషులు ఒకటి కైలాసగిరి పర్వతం అన్నారు ! అంటే శిరస్సు — ఇదే మనస్సుకి స్థానము కాబట్టి మానస సరోవరానికి పుట్టినిల్లు.

"కైలాసం తు శిరస్థానం
ముఖం కేదార నామకం..."

అలానే **"నాసిక్"**-క్షేత్రం మన నాసికాగ్రం.

రెండవది హృదయస్థానం **అమరనాథ** గుహ ! ఇక్కడ మంచు లింగము హృదయంలోని ఆత్మజ్యోతియే మూర్తికట్టి వెలిగే జ్యోతిర్లింగము. ఈ ఆత్మదర్శనమిచ్చే హృదయగుహాయే అమరనాథగుహ.


సహస్రారం
బదరీనాద్
శ్రీశైలం
నాసిక (నాసిక్)
కేదారనాథ్
అమరనాథ్
గుహ
జ్యోతి
కాంచీపురం (వడ్డాణం) స్థానం
కామకోటి
(కామకళాక్షేత్రం)
మూలస్థానం = ముల్తాన్‌నగరం

శరీరంలో - పుణ్యక్షేత్రాలు

ఇక మూడవది **'నర-నారాయణ'** స్థానమైన బదరీనాథ్! అదే మూలాధారము. ఇక్కడనుంచే మలమూత్ర విసర్జన, మానవునికి సృష్టి కార్యక్రమముల — కామకోటికేంద్రము! ఈరెండూ ఒకేతాడునుండి

పుట్టిన రెండుకొసలు నరనారాయణులవలే ఒకటి వేడినీటి జలపాతంగాను, రెండవది మంచుకరిగిన చన్నీటి జలపాతంగాను — ఒకటి నరుడు, రెండవది నారాయణుడు ! ఒకటి జీవుడు — రెండవది పరమాత్మ !!

ఇవి కేవలం కొన్నిమాత్రమే చెప్పే ఈ విశ్వం మన శరీరానికి ప్రతిరూపమని చెప్పే ఉదాహరణలు.

ఐతే ఇందులో చిత్రం ఒకటి వున్నది — మనకి బుద్ధినిచ్చే కేంద్రం శరీరంలో ఎక్కడా కనబడదు. అలాగే మనశరీరంలో ప్రాణం ఎక్కడ పుడుతుంది, ఎక్కడవున్నది ప్రత్యేకంగా చెప్పబడలేదు. శరీరమంతా రక్తం ప్రవహించినట్టే, ప్రాణం, శ్వాస, వేడి శరీరమంతా వ్యాపించి సూర్య, చంద్ర నాడులరూపం శుక్ల, కృష్ణపక్షాల కాలచక్రం రూపంలో కనబడుతుంది !

నిజానికి మోక్షం కలిగించేది నిర్మలజ్ఞానం మాత్రమే. ఈ నిర్మల జ్ఞానానికి చిహ్నామే స్ఫటిక పర్వతము. ఇది శిరస్సులో నడినెత్తినవుండే సహస్రారానికి, హిమాలయశిఖరాలలోని సహస్రారకేంద్రం వంటిదైన శంబలకు దారి చూపించే మార్గం ! — యోగులు ధ్యానం చేసే కేంద్రంగా రెండుకళ్ళ మధ్యగావున్న భ్రూమధ్యంనుండి నిటారుగా పైకి ప్రయాణించి తల శిఖరానవున్న సహస్రారానికి పోయే దారే — శంబలకి పోయే రహస్యమార్గం. సహస్రారచక్రంలో వెలిగే నవరత్నాల కాంతులను వెదజల్లే వెలుగే, స్ఫటిక పర్వతంమీద పడి వెలిగే శంబలప్రభుని దివ్య కాంతులు — జ్ఞానకిరణాలు !

ఇది తెలుసుకున్నప్పుడే 'కల్క్యావతారం' భూమికి ఎప్పుడువచ్చేద, అంటే మనిషిలో జంతు లక్షణాలతోపాటు, దైవలక్షణాలు, దానవత్వంలో మానవత్వం లేక మానవత్వంలో దైవత్వంలా కనిపిస్తాయి — శరీరంలో! వెన్నునుండి నిటారుగా పైకి — గొంతునుండి నోటిలోనికి తూర్పుగాను, గొంతులోంచి శ్వాసనాళం వెనకగా తలనుంచి రెండుకళ్ళమధ్యకి చేరుకునే కాలవ — గంగా యమునలు కలిసి ప్రయాణించే, విష్ణు-రుద్ర-ప్రయాగల సంగమ స్థానం !


బదరీనాధ్
సహస్రారం
ముక్తినాధ్
భ్రూమధ్యం
(స్ఫటికపర్వతం)
ప్రయాగ
కొండనాలిక (ఖేచరి)
అలకాపురి
శ్వాస
నాసిక్
కేదార్‌నాధ్
"ముఖం
కేదారనామకం !"

దీనినిబట్టి బుద్ధిమంతుడైనవాడు తన బుద్ధిని ఉపయోగించి శంబలకుమార్గం కనిపెట్టాలి. మన శరీరంలో ప్రయాణించే దిక్కులే బయట హిమాలయపర్వతాలలోనూ వుంటాయి ! అదే దిక్కులకి మన మంతా ప్రయాణిస్తాము. అయితే దీనికి దగ్గర మార్గాలున్నాయి — వాటికే సద్యోముక్తి, క్రమముక్తి అనిపేరు. అనేకజన్మలలో క్రమంగా సాధించే ముక్తి — క్రమముక్తి ! అలాకాక ఒకేజన్మలో ఒక్కసారిగా సాధించే ముక్తి సద్యోముక్తి అని ఇలా “రెండురకాల — మార్గాలు” అంటూ ఆ యోగి-లామా మహాశయుడు తన ఆధ్యాత్మిక ప్రసంగాన్ని హిమాలయ పర్వతాలలో దాగిన శంబలమార్గానికి ముడిపెట్టి జటిలంగా ఘాటుగా ఉపన్యసించాడు.

అయితే మాలో చాలామంది, కేవలం భోజనం, నిద్రల గురించి మాత్రమే ఆలోచించే పామరులు గనక ఈ యోగమార్గ రహస్యాలను పట్టుకోవడం మావల్ల సాధ్యంకానిపనిగా భావిస్తూ కనీసం ఈ యోగి చెప్పిన గుర్తులు జ్ఞాపకం పెట్టుకుని మా టేబుల్‌పైన పరచిన మేప్‌ను హిమాలయపర్వతాలలో లోయలను, కొండచరియలను చూపే మేప్ సహాయంతో దీనిని అన్వయించి ఏలోయలో ఏనదిప్రక్కనుండి ఏదిక్కు గుండా వెళ్ళాలో — అందరం కలిసి చర్చించటానికి మా గుడారాలలో మీటింగ్‌పెట్టాలని నిశ్చయించుకున్నాము.

పగలంతా బరువైన మా సామానులు మోసుకుంటూ హిమాలయ పాదపీఠంలో లోయలు, కొండలు దాటుకుంటూ నడిచొచ్చిన ప్రయాణ బడలికలోవున్న మేము సాయంత్రం చలిగాలి తగలకుండా వెచ్చగా

వుండేలా వేసిన మా గుడారాలలో మీటింగ్ పెట్టుకుని చర్చించాలని నిశ్చయించుకున్నాము.

“సంస్కృతంలో — గుహ అంటే హృదయంలోని **‘ఆత్మగుహ’**! ఆత్మలో వెలిగే జ్యోతియే గుహుడు — లేక **‘గుహేశుడు’** అనబడే పరమాత్మ. వేదాలలో చెప్పినట్టు భగవంతునిగా ప్రతీజీవి హృదయం లోనూ వెలిగే జ్యోతి —

“యో వేదః నిహితం గుహాయాం”

— అంటే ఎవరైతే మనుషుల హృదయ గుహలో రహస్యంగా ప్రతిష్ఠించబడి స్ఫటికంలా వెలుగుతున్నాడో — వాడినే తెలుసుకో! వాడినే చేరుకో !”

అన్నారు. కాబట్టి స్ఫటికపర్వతానికి రహస్య ద్వారంకూడా — అలానే మనలోంచే వెతుక్కుని — ప్రార్థనాభావంతో అన్వేషిస్తే ఆపైన మన అదృష్టం, ఆపైన పరమాత్మ దయవుంటే తప్పక కనిపిస్తుంది బిలద్వారానికి దారి !”

అంటూ చివాలున లేచాడు లామా మహాశయుడు — చర్చను అకస్మాత్తుగా కట్‌చేస్తూ — “నాకు సాయంకాలం సంధ్యకు, ధ్యానానికి సమయం మించిపోతోంది” అంటూ !

దాంతో ఆనాటి చర్చకు తెరపడింది.

* * *

42

తుఫానులు రాకుండా-హోమం !

ఆరాత్రికి వేరే ఇతర గ్రామస్థులెవ్వరినీ ఇబ్బందిపెట్టకూడదని నిర్ణయించుకున్నాం అందరం ! వెంటనే ఆకొండచరియకు దిగువగా మా గుడారాన్ని నిమిషాలమీద గొడుగులా పరచి గట్టిగా మోకుతాళ్ళతో బిగించి కట్టాము. మర్నాడు పొద్దున్నే చీకటితో ప్రయాణం కావలసివున్నందున రాత్రిభోజనం బరువుగా చేయకుండా తేలికపాటి ఫలహారంతో సరిపెట్టాలని మాబృందంలో అందరం నిర్ణయించుకున్నాం ! ఏంచేస్తే బాగుంటుంది? అని మేము తర్కించేలోపునే మాతోవచ్చిన షేర్పాలు పెద్దగాడి పొయ్యిలాంటిది తవ్వి అడుగున్నరఎత్తు మంట వెలిగించారు. మూటగట్టిన డబ్బాలలోంచి గోధుమపిండినీ వేడినీళ్ళతో చక్కెరతో సోడాఉప్పును కలిపి

రబ్బరుతో పిసికి ముద్దచేశారు అరచేతులతోనే మర్దనాచేస్తూ! మేం వినోదంగా చూస్తుండగానే పెద్దసైజు నిమ్మకాయంతసైజు ముద్దలు అరచేతితో నొక్కి అప్పడంలా తట్టి క్షణంలో దాన్ని నిప్పులపైన కాల్చిన వేడివేడి చపాతీలు పొగలుకక్కుతుంటే పింగాణీ బేసిన్‌లోపెట్టి ఒక గుండ్రని టేబుల్‌పైన మాముందుంచారు. మిగతా వంటవాళ్ళు వేడిగా బంగాళదుంపలు ఉడికించి జారుగా పులుసువంటి కూర టమోటాలు కలిపి రుచిగా తయారుచేశారు. అదే మాకు భోజనం, ఫలహారం!! వేడిగానూ, రుచిగానూవున్న ఆ చపాతీలు కూరతో కలిపి ఒక్కొక్కళ్ళూ కడుపునిండా లాగించాము గోరువెచ్చటి ఉడుకునీళ్ళతో చేతులుకడుక్కొని! పింగాణీమగ్గులలో పొంగుతున్న పాలుపోసి అందరికీ అందించారు. అంతే నిమిషాలమీద అందరం కంబళీలకింద దూరి వెచ్చగా గురకలువేస్తూ నిదురించాం! అసలు ఎప్పుడు తెల్లవారిందోకూడా మాకు తెలీదు వేడి వేడి టీపోసిన మగ్గులు మాచేతులకు అందించేదాకా!

ఆరోజు మాతో పరుగుపందెం వేసినట్టు సూర్యుడు మాకన్నా ముందే ఉదయించాడు. తళాతళా చలిమంటలాంటి వేడివేడి సూర్య కిరణాలు మా వీపులమీద తగిలిస్తూ చురుకువేసినట్టు! గంటలోగా అందరం ప్రయాణానికి సిద్ధపడ్డాం!

మాపనివాళ్ళు ఆదుర్దాగా గుడారపు తాళ్ళుపీకి మాటెంట్‌ను ఎత్తి వేస్తుంటే మామధ్యలోంచి చార్లెస్ బెల్ గొంతు బొంగురుగా వినిపిస్తోంది.

"లామామహాశయా! రాత్రిమీరు మాకుచేసిన హామీని మరచి పోలేదుగా! దాని విషయం ఏం చేస్తారు? అన్నాడు. రాత్రి చలిగాలికీ వడగండ్లవానకు జలుబుతో గొంతుపట్టేసినట్టుగా మాట్లాడుతూ.

"దేన్నిగురించి మీరడిగేది ?" లామామహాశయుడు ప్రశ్నించాడు.

"అప్పుడే మరిచిపోయారా ? మన ప్రయాణానికి మంచివాతావరణం కావాలిగదా ! ఇక్కడ ఎవరన్నా తాంత్రికలామా వున్నాడేమో వాకబు చేయిస్తారా ? ఖర్చు ఎంతైనా పరవాలేదు. మన ప్రయాణం సాఫీగా సాగాలి ఏలాంటి మంచుతుఫానులు, వడగండ్లవానలూ లేకుండా ! నిజానికి 'ఇది ఎలా సాధ్యము స్వయంగా చూడాలని మాకు ఆసక్తిగా వున్నది !"

దానికి సమాధానం ఏమీ చెప్పకుండా లామా పక్కకివెళ్ళి మా గుడారాన్ని తాళ్ళువిప్పుతున్న కూలీలతో టిబెటన్ భాషలో ఏదో మాట్లాడాడు. వాళ్ళు ఆశ్చర్యంగా ఆయనవంక చూస్తూ కళ్ళు వెడల్పుగా చేసి నమస్కారం పెడుతున్నట్టు దోసెడుపడితే ఐదు వందరూపాయలనోట్లు వారిచేతిలో గిరాటువేసాడు. అంతే ! అరగంటలో మాపనివాళ్ళు గుడారాలు పూర్తిగా ఎత్తివేసి మా మకాములు ఖాళీచేసేలోగా మమ్మల్ని ఆ కూలీ వాండ్లు ఒక భూటాన్ దేవాలయానికి తీసుకొనివెళ్ళారు. అది పదడుగుల కంటే ఎత్తులేదు, నలుచదరంగా కట్టబడివున్నది, ఒక తులసికోటలాగా ! దానిమధ్యలో రెండున్నర అడుగులఎత్తు అరుగు నిర్మించివున్నది. ఆ అరుగుమధ్యన నలుచదరంగా ఒక హోమగుండంవంటిది ఎర్రటి ఇటుకతో కట్టబడివున్నది. దానిచుట్టూ ఆంజనేయస్వామి విగ్రహానికి పూసినట్టు ఎర్రటి సింధూరంరంగు ఆముదంతో కలిసి పట్టించారు, ఎర్రగా మెరుస్తోంది ! ముగ్గులతో పసుపు కుంకుమలతో అలంకరించబడివున్నదా హోమగుండం. దానికి పడమటిదిక్కుగా పంచలోహాలతో చేసిన మూడు అడుగుల ఎత్తుగల దీపారాధనసమ్మెలో అఖండదీపం వెలుగుతోంది.

ఆ మందిరం అంతా సాంబ్రాణివాసనలతో టిబెటన్ అగరుబత్తుల పరిమళంతో ఒక పవిత్ర పూజాస్థలంగా చూస్తూనే తెలిసిపోతోంది, దానిముందర పద్మాసనంలో కూర్చునివున్నాడు. పొట్టిగా, లావుగా కుదిమట్టంగా వున్న పూజారివంటి లామాబ్రాహ్మణుడు ! అతడు బ్రాహ్మణుల పూజలు, లామాల తాలూకు హోమాలు రెండూ చేసేవాడిలాగా కనిపించాడు.

మాతో వచ్చిన లామా భూటానీభాషలో అతివేగంగా మాట్లాడాడు, మాకు ఒక్కమాటకూడా అర్థంకాకుండా ! చేతిలో ఐదు వందరూపాయల నోట్లు పడగానే ఆ పూజారి ముఖం ఆనందంతో వెలిగిపోయింది. తన పంచెబొందీలో దోపుకున్న ఒక రేకుడబ్బీ తీసి పొగాకుతో కలిపి తమలపాకు కిళ్లీగా చుట్టి ఉత్సాహంగా నమలసాగాడు. గుప్పున జరదావాసన ఎర్రటి తాంబూలంరంగు మాకందరకూ ఘాటుగా తగిలింది. ఇంతలో అతడు పొడుగాటి కర్రలవంటి గరిటెలులాగావున్న హోమంచేసే పరికరాలు తీసి ప్రక్కనపెట్టాడు. ఇంతలో నౌకరుతెచ్చిన నెయ్యి, నవధాన్యాలు, పూజాకుంకుమ, పసుపు సిద్ధంచేసుకున్నాడు. పక్కనేవున్న గంటతీసి గట్టిగా మోగిస్తూ సొట్టలుపడ్డ పాత రాగిపాత్రలోంచి తీర్థం ఆచమించాడు. మీతో వచ్చిన టిబెటన్ లామా అయనతో వేగంగా మాట్లాడేస్తున్నాడు. తన చూపుడువేలు ఆకాశంవైపు చూపిస్తూ గుండ్రంగా చక్రంలా తిప్పుతూ ఆయన పైకిచూసి నవ్వి ఇష్టంగా తలవూపినట్టు అంగీకారసూచకంగా తన పీఠంపైన కూర్చున్నాడు.

ఏంజరుగుతోందో మేం గమనించేలోగా అందరం ఒక్కసారిగా తుళ్ళిపడ్డాం.

'భం' 'భం' అంటూ భయంకరంగా మావీపు వెనకాలనుంచి మోగిన శబ్దానికి వెనక్కితిరిగి చూస్తే తెలిసింది ఆ పూజారి శంఖం పూరించాడని — భూతాలు, గాలిసంబంధమైన దుష్టశక్తులను పారద్రోలే కుడివైపు తిరిగిన దక్షిణావర్త శంఖంతో. క్షణకాలం ప్రాణాయామంచేసి హోమగుండంలో కర్పూరంగడ్డ తీసి జ్వాలగా వెలిగించాడు. చిన్నచితుకుల మంట పెద్దదిచేసి పెద్ద కట్టెలు సమిధలువేస్తూ జ్వాలను అడుగున్నర ఎత్తుకు ప్రజ్వలింపజేశాడు. చేతిలో అక్షింతలు తీసుకొని తీర్థంతో సంప్రోక్షించి ప్రదక్షిణంగా తనచుట్టూ హోమగుండంచుట్టూ చల్లాడు. వెలుగుతున్న జ్వాలలోకి గరిటెల వంటి హోమంచేసే శృక్శృవాలు ముంచి నేతితో హోమంచేశాడు. సరిగ్గా పదిహేనుసార్లే ! అంతే ! అదికూడా నవ ధాన్యాలు తొమ్మిది రెండేసిసార్లు అగ్నిలో హోమంచేశాడు. పటికబెల్లం గడ్డ, టెంకాయ నైవేద్యమిచ్చి నిమ్మకాయలు కోసి నాలుగుదిక్కులా విసిరివేశాడు. ఆశ్చర్యపోయేలోగా తటాలున నిలబడి తనపళ్ళెంలోని కుంకుమతో మా నుదుట నిలువుగా బొట్టుదిద్దాడు.

"ఇక భయంలేదు మనకి ధైర్యంగా వెళ్ళవచ్చు అంటున్నాడు పూజారిమహారాజు" అన్నాడు లామా మా అందరివంకా చూస్తూ !

"ఏమిటి దీంతోనే తుఫానులు, గాలివానలు, వడగండ్లవానలు ఆగిపోతాయా ? ఏమిటీ ?" అన్నారు సాహసయాత్రీక బృందంలోని ఒకరిద్దరు తప్ప అందరూ ! మాతోవచ్చిన లామా సమాధానం చెప్పేలోగా పూజారిమహారాజు అందరినీ తోసుకుంటూ ముందుకువచ్చాడు. ఆయన కళ్ళు ఎర్రబడి క్రోధంతో జేగురించినట్టు కనిపించాయి. మాఅందరి

చేతులలో చందనము తన వేళ్ళతోరాసి దోసెడుపట్టు ఆకాశంవైపుకి అన్నాడు మాకు తెలియని భూటానీ భాషలో ! లామామిత్రులు అనువాదం చేస్తే తెలిసింది ఆశ్చర్యంగా అందరం ఆకాశంవంక చూస్తూ రెండు చేతులూ పట్టాము ! మరుక్షణమే హోమగుండంపైన ఖాళీస్థలంలోంచి మాచేతులలో ధారగా పసుపురాసిన బియ్యం అక్షింతలుగా పడ్డాయి. ఏదో అదృశ్యశక్తులు చల్లుతున్నట్టుగా — చూస్తే ఆకాశంలో ఏమీలేవు ! కాని అక్షింతలు, కుంకుమ మాఅందరి దోసిట్లో అలా రెండునిమిషాల పాటు ధారగా వచ్చిపడింది. మాకు మతిపోయినంతపనయింది, మాకు కళ్ళ ఎదుటే చూపిస్తున్న ఈ మంత్రసిద్ధికీ మహిమకూ !

ఆతరువాత మూడురోజులవరకూ మా ప్రయాణంలో ఏ బాధ కలుగలేదు వాతావరణంవల్ల ! ప్రశాంతంగా ఎండకాసింది. చల్లటిగాలి సౌమ్యంగా విసిరింది. మబ్బులుగానీ, వానజల్లుగాని, మంచుతుఫాను గాని మచ్చుకు కూడా కనిపించలేదు, ఆ మూడురోజులూ.

మావెనుకే భూటానీభాషలో పూజారి మహారాజు అన్నమాటలు –

“అనవసరంగా కష్టపడ్డారు, మీరంతా ! నాతో చెప్పివుంటే ఒక వెయ్యిరూపాయలతోనే ఈ తాంత్రికహోమంచేసి గాలిలోని దేవతలనూ వాతావరణ శక్తులనూ శాంతింపజేసేవాడను. మంచుదెయ్యాలను దిగ్బంధం చేసి పెట్టేవాడిని మీకు ఏబాధా కలుగకుండా” అంటూ మావేపు ఆశీర్వదిస్తున్నట్టుగా చేతులూపసాగాడు ముందుకి ప్రయాణంగా సాగిపోతున్న మావెనకాలే !

హోమం చేయడం మాత్రం గంటసేపన్నా పట్టలేదుగాని — అలా

హోమంతో పంచభూతాలను అదుపుచేయడం మేము జీర్ణించుకోలేని ఆశ్చర్యం రాత్రీపగలూ మెదడుని తొలిచేసింది ! ఎంత బుర్రపగలగొట్టుకున్నా మాకది ఎలా సాధ్యమయ్యిందో మాకసలు అర్థముకాలేదు.

"ఏమిటో ! ఈ హిమాలయాలలో అన్నీ వింతలే !" అనుకుంటూ ప్రయాణం చేశాము.

◆

43

ప్రపంచం-భవిష్యత్తు తెలిపే - 'నాడీగ్రంథం' ! - "పురాణ సంహిత !"

అప్పటికే పొద్దు వాలిపోయింది ! సూర్యుడు పడమరకి చేరుకునీ చేరుకోగానే ఎత్తైన మంచుశిఖరాలవెనక్కి దిగిపోతాయి ! దాంతో – వాతావరణమంతా ఒక్కసారిగా మంచుగడ్డలా చల్లగా చలి-వొణికించేస్తూ బిగుసుకు పోసాగింది ! అప్పుడు గుర్తుకువొచ్చింది "స్పటిక-పర్వతం" — సూర్యకాంతిలోని వేడినీకూడా గ్రహించి దాన్ని మనమీదకి ప్రతిఫ

ించడమే కాక సూర్యుడి ఎండయొక్క వేడిమినికూడా ఒక భూతఅద్దం లాగా దాన్ని మరింత వెచ్చగాచేసి గ్రహించి ఆప్రాంతాన్నంతా వేడినికూడా ప్రసారంచేస్తూ చలినుండి కాపాడిందనీ !

అంతేగాదు ! ఇప్పుడా చలి పెరిగిపోవడంతో — అదే స్పటిక-పర్వతం మళ్లా అదేవిధంగా చలినికూడా ఆకర్షించి మరింత తీవ్రంగాచేసి పగటి వేడికిరణానికి బదులు ఇప్పుడు 'చలి-కిరణా'లను మరింత 'ఫోకస్'-చేస్తున్నట్టుగా మాపైన ప్రసరించసాగింది — మేం తట్టుకోలేనంత చలిగా.

అలా ఓగంట దాటేసరికి మా సాహసబృందంలో ఇక ఎవరికీ ధైర్యం లేకపోయింది. "ఇంతఎత్తునవున్న ఈ స్ఫటిక పర్వతం చరియలో మనమీరాత్రి ఈ చలికి తట్టుకొని తెల్లారేదాకా — అసలు బ్రతికి వుంటామా ? అనే ఆశకూడా అడుగంటి పోసాగింది !

భయంభయంగా మేము ఒకరి వంక వొకరం చూసుకుంటూ దిక్కుతెలియక బిక్కముఖాలతో దిగులుపడసాగాం ! మాలో ఎవ్వరూ ఒక్క మాటకూడా పైకి మాట్లాడటానికి సాహసించకపోయినా — అందరం ఒకరి భయాలను ఇంకొకరు వ్యక్తం' చేయ్యసాగాము ! మా పరిస్థితిని గమనించిన 'లామా' దోర్జీ చోగ్యాల్ మహాశయుడు ఇహ ఊరుకోలేక ఇలా అన్నాడు :

"మిత్రులారా ! మనమందరం ఇప్పుడొక గొప్ప విషమ పరిస్థితిలో చిక్కుకున్నాం ! ఈ 'స్పటిక-పర్వతం' చేరుకోగానే సమస్య అంతా తీరినట్టే అనుకుంటే ఎలా ? ఇల్లు అలికినవెంటనే పండక్కాదుగదా ! ఇప్పుడీ చలిని తట్టుకునే మార్గంకోసం వెతకడం ఒక్కటే కాదు ! మనం చేయ

వలసిన పని — ఇక్కడ ఇంకొకటని మిగిలిపోయున్నది — అదిన్నూ పూర్తిచేస్తే మన ఈ 'పావన-యాత్ర' సఫలీకృతమైనట్లే !' అన్నాడు తన జపమాలను వేగంగా తిప్పుతూ !

'చెప్పే మహాశయా ! ఏమిటి మీ ఆదేశం ? మాకు త్వరగా సెలవియ్యండి స్వామీ !' — అన్నాం, అందరం ఒకే కంఠంతో ! ఆయన ఏమి చెప్పతారోనని ఆత్రుతతో ! ఓ రెండుమూడు నిముషాలు మౌనంగా వుండి ఆపైన ఇలా ప్రారంభించారు.

'ఇక్కడ ఈ '**స్ఫటిక-శ్రీచక్రం**' మేరు ప్రస్తారమంటే ఆకారంలో నిర్మాణమైవుండటాన్ని గమనించారుగదా ? అందులో నిటారుగా పైకి కనపడే 'స్ఫటిక-పర్వతం' — ఒక పిరమిడ్ ఆకారంలో వున్నట్లే అలా తలక్రిందులుగా 'బోర్లించిన-పిరమిడ్' ఆకారంలోవున్న ఖాళీ పెట్టె — అంటే ఒక కోనేరులా లేక 'పుష్కరిణి' ఆకారంలో మెట్లు మెట్లుగా అడుగుక్కి దిగుతూ పోవాలి మనం ! ఇలా పద్నాలుగు-మెట్లూ దిగుతూ వెళ్ళి ఆ '**పుష్కరిణి**' అడుగుకు చేరుకోవాలి !'

'అదెంతపని గురుదేవా ! క్షణాలమీద మేమామెట్లన్నీ దిగుతాం !' అన్నాడు శ్రీనివాస చక్రవర్తి ఉత్సాహంగా ! తల అడ్డంగా తిప్పారు 'లామా-దోగ్యాల్' మహాశయుడు. 'మిత్రులారా ! ఇది మీరనుకున్నంత తేలిక పని కాదు ! ఈ '**స్ఫటిక-శ్రీచక్రాన్ని**' నిర్మించిన మహాత్ములెవరో అడుక్కి దిగే ఈ కోనేరువంటి పుష్కరిణిలోతుకి దిగే మెట్లలాగా 'క్రమంగా దిగే'-ఆకారంతో నిర్మాణించేస్తూ, ఆ — 'కోనేరు' లోకి దిగే ప్రతీమెట్టూ ఎడమవైపు నుంచి ప్రదక్షిణంచేస్తూ కిందకి దిగి, పిరమిడ్‌లా ఒక స్ఫటి

ణంగా చుట్టివచ్చేలాగ దిగాకే మళ్లీ దానికిందవున్న తర్వాతమెట్టుకి దారి దొరుకుతుంది ! అలా అడ్డుగోడలా ఒక పిట్టగోడను కూడా నిర్మాణం చేశారు ! ఇది ఒక 'వైకుంఠపాళి' లోని చిక్కుప్రశ్నదారి వంటి — దారి !

అంటే — 'తలక్రిందులుగా' నిర్మాణంకాబడ్డ "పిరమిడ్" ఆకారంలో వున్న ఈ 'పుష్కరిణి' లోపలికి ప్రదక్షిణంగా మెట్లన్నీ దిగుతూ వెళ్ళాలంటే — ప్రతీమెట్టూ దిగేవారు ప్రదక్షిణంగా తిరుగుతూనే దిగాలి ! అలా — 14 సార్లు ఈ పధ్నాలుగు మెట్లూ దిగుతూవెళ్ళాలి ! చివరగా, అట్టడుగున వున్న ఓ బోర్లించిన 'త్రిభుజం' వంటి '**బిందు**' స్థానానికి చేరతాం ! అక్కడినుంచి ఒక నలుపలకల చదరంలాంటి "గది" వుంటుంది ! దానిలోంచి 'దక్షిణ ముఖంగా' వెళ్ళే 'ద్వారం' తెరుచుకుని మనంగనక దాంట్లోకి ప్రవేశిస్తే అక్కడ ఒక 'సారంగ-మార్గం' కనబడుతుంది !

ఆ 'సారంగమార్గం' — మన వెన్నెముకలోని, రహస్యంగా ఏర్పడి వున్న **"సుషుమ్నా-నాడి"** వంటి బ్రహ్మజ్ఞానానికి చేర్చే **"బ్రహ్మరంధ్రం"** వంటి దారి ! కాబట్టి దారి మనకే తెలుస్తుంది !

ఈ కోనేరువంటి 'బోర్లించిన-పిరమిడ్' ఆకారంలోవున్న పుష్కరిణి అడుగునుంచి ఈ రహస్య సారంగమార్గంగుండా మనం ప్రయాణిస్తే అక్కడ వేడిగా పొగలు సెగలు గక్కుతూ 'బుడ-బుడ' మని ఉడుకుతూండే 'వేడినీటి-బుగ్గ'లు కనిపిస్తాయి ! అది ఒక — హిమాలయాల అడుగున భూగర్భంలోవున్న అగ్నిపర్వతాల వేడికి మంచుకొండల మంచు కరిగి సలసలా మరుగుతున్న **"వేడినీటి-పుష్కరిణి"** వంటి చెరువు ! అక్కడికి చేరుకోగలిగితే మిగతా సంగతుల విషయం ఎలావున్నా ఈ చలినుంచి మనం వెచ్చగా ఈరాత్రిని గడపగలుగుతాం !

అక్కడినుంచి అసలైన "స్పటిక-మేరుప్రస్థారం" యంత్రం వుండే — 12 అడుగుల చదరంగావుండే మూల "గర్భాలయం" లోకి దా దొరుకుతుంది ! అక్కడే మనకి ఈ మన సాహసయాత్రకు ఫలితమూ — మనం చేరుకోవలసిన గమ్యమూ దొరుకుతుంది ! నేను ఇంతకంటే చెప్పగలిగేదేమీ లేదు. ఆతరువాత మీఇష్టం !" అంటూ ముగించాడు లామా.

అప్పటికే రాత్రి ముదిరి మంచుకొండలన్నీ లేతనీలం రంగు మారి ఊదారంగుతో గాఢనిద్రలోని మనస్సులాగా — చీకటిలో అస్పష్టంగా తెల్లగా వెలుగుతున్నాయి ! ఆకాశంలో దట్టపు సిరావంటి నల్లని మఖమల్ తెర పరచినట్టు చుట్టూరా ప్రహరీగోడవలే వున్న 'మంచుపర్వతాల' శిఖరాల మధ్యనుంచి ఒక రంధ్రంలా ఆకాశం అష్టదళపద్మం ఆకారంలో కనిపించింది! దానిమధ్యగా వెన్నముద్దలాగా తెల్లటి లేతనీలపు కాంతితో వెలుగుతూ శుక్రగ్రహం ధగ ధగా ప్రకాశిస్తోంది !

మిగతా ఆకాశం అంతా వజ్రాలపొడి చల్లినట్టు నక్షత్రాలు దట్టంగా అలుముకుని పంచదార అద్దినట్టుగా మెరుస్తున్నాయి — సూదుల్లాంటి కిరణాలతో ఏడు రంగుల కాంతులుచిమ్ముతూ ! ఆ దృశ్యం ఎంత మనోహరంగావున్నా — చలి మా మాంసం తినేసి ఎముకలను నమిలి నరాలను పట్టి తెంపి గుంజుతున్నట్టుగా బాధిస్తోంది ! మా పాదాలు మంచుతో చలికి ఒక టన్ను బరువున్నట్టుగా 'ఫీలై' అడుగుతీసి అడుగు వేయలేకపోతున్నాం !!

ఇక ఆలస్యం చేస్తే లాభంలేదని స్పటికపర్వతం అడుగున 'కోనేరు' లావున్న ఆ మెట్లవెంబడే క్రిందికి ఓ గుడిప్రాకారంలా చుట్టూరా

'ఘరచెంబు' లోని మరల్లా ప్రదక్షిణం చేస్తూ కిందికి దిగుతూ పోయాం ! అది కొన్నిగంటలు పట్టింది ! ఆ శ్రమకి మా శరీరం వేడెక్కి చెమటతో తడిసిపోయింది. చివరకు ఎలాగయితేనేం, ఆ కోనేరు అట్టడుగున వున్న 'త్రికోణాన్ని' చేరుకుని వీలైనంత హడావిడిగా అట్టడుగున — చదరంగా వున్న ఓ గదిలోకి ప్రవేశించాం !

ఆ గది సరిగ్గా 12-అడుగుల వెడల్పూ 12 అడుగుల ఎత్తూ 12 అడుగుల పొడవూగల 'ఆరుముఖాల' పెట్టె వలే — కట్టబడివున్నది ! దాని గోడలు చీకటికంటే నల్లగా తళతళా మెరిసే నల్లటి చలువరాతితో పాలిష్‌చేయబడి వున్నాయి. అంత లోతున అలాంటి నల్లటి చలువ రాయితో ఆ గోడలను తాపడంచేయడం ఎందుకా ? అని ఆలోచిస్తే పైనున్న నక్షత్రాలలో శిఖరంపైన వెలిగే 'శీర్ష-నక్షత్రం' — సరిగ్గా ఆ నల్లని చలురాయిమీద అద్దంలాగా ప్రతిఫలించి చెరువులో చంద్రుడిలా దాని ప్రతిబింబం నల్లటి ఫలకంమీద పడి, కనిపిస్తోంది ! అదేదో ఖగోళ గణితంతో లెఖ్ఖించి కట్టినట్టుగా అనిపించింది ! కాని అదేమిటో తెలుసుకునే ఆసక్తిగానీ అర్థంచేసుకోగల శక్తిగాని అప్పుడు మాకులేదు !

అలా ముందుగా 'లామా-దోర్జీ చోగ్యాల్ నడుస్తుంటే వెనకాలే మేమంతా చకచకా అడుగులు వేసుకుంటూ 'సారంగ-మార్గం' ద్వారా ప్రయాణించి అగ్నిపర్వతం గర్భంలో బుడ బుడా ఉడుకుతూవున్న వేడినీళ్ళ 'నీటి-బుగ్గ' వద్దకు చేరుకున్నాం ! దాంతో అందరం ఒక్కసారిగా ఎంతో హాయిగా ఊపిరిపీల్చుకున్నాం ఆ వెచ్చటి 'స్పర్శ'-యొక్క సుఖానికి! కాళ్ళూ, చేతులూ, ముఖంలో ఆ వెచ్చటి నీళ్లవేడికి రక్త-

స్పర్శ కలిగించి, మళ్ళీ ప్రాణంతో బ్రతికినవాడిలాగా మాప్రాణం ఎంతో హాయిగావున్నది.

ఇంతలోనే 'ఉన్నానంటూ' మాకడుపులో ఆకలి దంచేస్తోంది! ఎలుకలు పరిగెత్తినట్టు కాదు — మా పేగులను ఆ ఎలుకలే కరిచి తింటున్నట్టుంది ! ఆ ఉడుకు నీళ్ళల్లో అందరం హాయిగా స్నానంచేసి మా బూట్లూ, యూనిఫారంలూ తీసేసి ఆ వెచ్చటి నీళ్ళల్లో శరీరాన్ని కాపడం పెట్టినట్టు మైమరచి ఆ నీళ్ళల్లోకి దిగి ఓలలాడాం !

"ఇక్కడ ఎక్కువ సేపువుంటే ఈ గంధకపు పొగ ఘాటుకి కొన్ని గంటల్లోనే మనమంతా స్పృహతప్పి పడిపోతాం !" అన్న లామా మహశయుడి ఉరుమువంటి కంఠం మమ్మల్ని అందర్నీ తుళ్ళిపడేలా చేసింది భయంతో !

"గంధకం పొగ" అంటారేమిటి మహాశయా ?" — అంటూ అందరం ఏకకంఠంతో ప్రశ్నించాం ఆందోళనగా !

"మీరు అడిగారు గనక చెపుతాను. ఈ ఉడుకునీళ్ళ కుండం యొక్క రహస్యం ! ఒకానొకప్పుడు — అంటే కొన్ని లక్షల సంవత్సరాలకి పూర్వమే — బహుశా కొన్ని కోట్ల సంవత్సరాలకి పూర్వమేకావచ్చుకూడా — ఈ హిమాలయపర్వతాలు ఇలా ఆకాశాన్నంటే ఎత్తుకి పెరిగిపోక ముందు — ఇదంతా ఒక అగ్నిపర్వతం ! భూగర్భం లోని ప్రళయాగ్ని జ్వాలలు దాంట్లో నిత్యం చెలరేగుతూ ఆకాశాన్నంటుతూ ఎర్రగా మండి పోయేవి ! అవి, మన టిబెట్ సముద్రతీరంగావుండే రోజులై వుండాలి!

ఆతరువాత జరిగిన "గ్రహాలు ఢీకొన్న" గ్రహ-ప్రళయంలో ఆ వేడికి పాలు పొంగినట్టుగా గులకరాళ్ళు కొండరాళ్లూ కరిగి లావా ఎత్తుగా

ఓ అలలాగ భూమిపైకి లేచి ఇప్పటి హిమాలయపర్వత శిఖరాలుగా గట్టిపడి, ఆకాశాన్నంటుతూ ఇలా పెరిగాయి !

సరిగ్గా అదే సమయంలో — మీ దక్షిణ భారతదేశంలో ఆకాశాన్నంటే అంత ఎత్తులో చుక్కలను కూడా కప్పేస్తూ ఒక పర్వత శిఖరం వుండేది ! అదే 'వింధ్యపర్వతం' ! జరిగిన ఆ ప్రళయానికి ఆకాశంలోని 'అగస్త్య-నక్షత్రం' తటాలున భూమధ్యరేఖకి అవతలికి మళ్ళి — దక్షిణం వైపుగా వాలింది ! దానివల్ల భూమియొక్క ఉత్తర ధృవం కుడివైపుకు వొంగి భూమి ఏటవాలుగా తిరుగుతూవుంటుంది — ఇప్పటికీ !

ఆవిధంగా వింధ్య పర్వతం అగస్త్యునిచేత అణిచివేయబడి హిమాలయపర్వతాలు పైకి-ఎత్తుగా పెరిగిపోయాయి ! అంత ఎత్తుకు పెరిగినందువల్లనే చలి పెరిగి — అవి మంచుతో కప్పబడిన పర్వతాలుగా ఇప్పటికీ "హిమాలయ" పర్వతాలుగా రూపుదిద్దుకున్నాయి !"

"సరిగ్గా అదే ఆ ప్రళయ కాలంలోని అగ్నిపర్వతాలలోని ఉడుకు నీళ్ళే ఇప్పుడీ "వేడినీళ్ళ కుండం"లోని ఉడుకునీళ్ళు !! అందువల్లనే ఇవి గంధకం కరిగిన మంటతో వేడిగా మరుగుతూ వుండడంవల్లనే వేడీ, ఆవిరీ, గంధకపు వాసనా అన్నీ కలిసి ఈ వెచ్చటి ఈ వాతావరణాన్ని కలిగిస్తున్నాయి ! ఇక్కడగనక మనం ఈ నీళ్లలో ఎక్కువసేపుంటే ఈ గంధకపు వాయువు పీల్చినందువల్ల మనకి స్పృహతప్పిపోయి — తెలివి తప్పిపోతాం స్మారకం లేకుండా ! అందుకని మనం ఈ ప్రదేశంలోనుంచి త్వరగా బైటపడి మన యాత్రని కొనసాగించాలి !" అన్నాడు లామా-దోర్జీ !

మా సాహసయాత్రాబృందం అంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని విన్నాం, లామా మహాశయుడు చెప్పిన ప్రతీమాటా ! “ఇప్పుడు మన మంతా ఎటువెళ్ళాలో త్వరగా చెప్పండి మహాశయా !” అంటూ – అరుస్తూ న్నట్టుగా ప్రార్థించాం ! — బడలికనూ ఆకలినీ తట్టుకొనలేక !

‘ఈ వేడినీటి-కుండం’ చుట్టూరా సుమారు 10 అడుగులు ఓ అరుగు వంటిది గుండ్రంగా నిర్మించబడివున్నది. దాని అడుగున తూర్పు ముఖంగా వెళ్ళే గొట్టంవంటి ‘తూము’లోంచి ఉడుకునీళ్ళు ‘గలగల’ శబ్దంతో ప్రవహిస్తూ ఎటోవెళ్ళిపోతున్నాయి కొండలోకి ! అంటే ఆ వేడినీటికుండంలోకి ప్రవేశించిన నీళ్ళు ఆ కుండంలో గుండ్రంగా సుళ్ళు తిరిగి, తూర్పుగావుండే ‘తూము’లోంచి మరెక్కడికో ప్రవహిస్తోందన్నమాట — అనుకుంటూ ఆ తూముపైన వున్న ఎత్తైన గోడను సమీపించగానే లామా తనచేత్తో — ఒక ముక్కోణంగావున్న రాతిని లోపలికి నెట్టాడు ! అది ఒక ‘కాలింగ్-బెల్ స్విచ్‌లాగా, లోపలికి అణగారి — ఓ బరువైన పెద్ద రాతిగోడ-ద్వారం తెరుచుకుంది !

దానిగుండా లోపలికి ప్రవేశించాం అంతా ! ఒక ఫర్లాంగుదూరం వెళ్ళేసరికి తళతళా వెలిగిపోతున్న దీపాల వంటి కాంతితో ఏడు-రంగుల **‘గాజుగోడల-గది’** వంటిది కనపడింది ! దాని అడుగున నేల ‘అష్టదళ పద్మం’లాగ చెక్కబడివున్నది ! చుట్టూ ప్రహరీగోడకూడా అష్టకోణాలతోనే అమర్చబడివున్నది ! పైన కప్పుకూడా పద్మంలా ఎనిమిది-పలకలుగా పేర్చబడివున్నది. ఏడురంగుల స్పటికాలతో తాపిన గోడలలోంచి ఎంతో వెలుతురు పది ట్యూబ్‌లైట్లు వెలిగించినంత కాంతి ఆ లోపల ఎలా వస్తుందో మాకు అర్థంకాలేదు !

ఆ గదిలోకి ప్రవేశించగానే గంధపు-చెక్కతో చేసిన ఒకపెద్ద భోషాణం వంటి పెట్టె కనపడింది !

లామా మహాశయుడు ఏనుగుతొండంలా వున్న దాని గడియను గట్టిగా పైకెత్తాడు ! గర గరమనే పెద్దశబ్దంతో ఆ భోషాణంమూత తెరుచుకుంది! అది చాలా బరువుగా వుండటంవల్ల — మేం మరి నలుగురం అరచేతులతో బలంగా ధట్టించి పైకెత్తితేనే — అది తెరుచుకోలేదు ! ఆశ్చర్యం !! ఆ భోషాణంనిండా రంగురంగుల సిల్కుగుడ్డలలో చుట్టిన 'దస్త్రాల' వంటివి, కనిపించాయి! అవేమిటో లామా మహాశయుడిని అడుగుదామనుకుంటుండగానే ఆయనే ఆకట్టలలో పైదాన్ని తీసి మాకు చూపించాడు. అందరం ఆశ్చర్యపోయాం ! అవి ప్రాచీన తాళపత్ర గ్రంథాలు !! ఆశ్చర్యంగా లామా దోర్జీ చోగ్యాల్‌వైపు చూశాం — ప్రశ్నార్థకంగా !

“ఇదేమిటి ? అనిగదూ ఆశ్చర్యపడుతున్నారు ? ఇందులో **'ప్రపంచ-చరిత్ర'** అంతా — ఇప్పటిదాకా జరిగింది ఈ తాళపత్రాలపైన స్ఫటికపర్వతం నిర్మించిన 'మహర్షుల' చేత అతిపురాతన — **“పురాణ సంహిత”** అనే గ్రంథంగా రాయబడివున్నది. ఇది వేదాలకంటే బహు పురాతనమైనది !

“ఇందులో ఏముంటుంది గురుదేవా ?” అన్నాం అంతా ఏక కంఠంతో.

“ఇందులో మానవజాతి పుట్టకముందు కాలంలోని ఈ భూగోళం మీద జరిగిన కథంతా రాయబడివున్నదని — నేనిదివరకే మీకు చెప్ప

లేదూ ? అంతరిక్షంలోంచి భూగోళంమీదకి 'విమానాల' లో వచ్చిన "ప్రజాపతుల" వల్ల మానవ-సృష్టి ఎలా ప్రారంభించబడిందో ? దాన్ని ఇంకా వివరంగా పూర్తి సైన్సు వివరాలతో ఈ గ్రంథాలలో రాయబడి వున్నాయి ! అలాంటివి 18-సంపుటాలుగా "సృష్టి" ప్రారంభంనుంచి ఇప్పటిదాకా జరిగిన చరిత్ర యావత్తూ ఎలా జరిగిందో అలా, రికార్డు చేయబడివున్నది ఈ గ్రంథాలలో !

ఇకపోతే ఆ — కుడిచేతివైపుగావున్న ఈ 'తాళపత్ర-గ్రంథం'లో రాగల **'భవిష్యత్తు'** మొత్తం ఎప్పుడెప్పుడు ఏం జరుగబోతోందో అంతా "కాలజ్ఞానం"లా దివ్యదృష్టితో చూసిన భవిష్యత్తు — అంతా వుంది !" అన్నాడు లామా మహాశయుడు.

"ఈ భవిష్యత్తు ఎప్పటిదాకా రానున్న కాలంలోకి రాశారు గురుదేవా ?" అన్నాడు శ్రీనివాస చక్రవర్తి ఆసక్తిగా !

"ఇది రెండు భాగాలుగా రాయబడివున్నది! అందులో (1) మొదటి భాగం ఈ "కలియుగం" ప్రారంభంనుంచి అంటే శ్రీకృష్ణప్రభువు అవతారం చాలించినప్పటినుండీ మొదలై ఈ 21వ శతాబ్దం చివరివరకూ రాయబడి వున్నది ! ఇదంతా "గత-చరిత్ర" క్రిందే లెఖ్ఖ, మహర్షుల దృష్టిలో !"

"ఇకపోతే (2) రెండోభాగంలో మిగతా ఐదు తాళపత్రగ్రంథాలలోనూ అంటే తాటాకుల పుస్తకాలలో రానున్న ఐదువేల (5000) సంవత్సరాలల్లోనూ జరగబోయే "భవిష్యత్తు" అంతాకూడా విశదంగా రాసి వున్నది ! దీనిని **"సంహిత !"** అంటారు. అంటే "కూర్చబడినది" అని అర్థం !

ఈ 'సంహిత'లో మొదటి భాగంలో దేశాలు దేశాల భవిష్యత్తూ, ప్రపంచయుద్ధాలు, కరువులు, కాటకాలు, జననష్టం, తోకచుక్కలూ, భూకంపాలు, మహాత్ముల అవతారాల వంటివన్నీ, ప్రపంచం మొత్తానికి సంబంధించినవి వుంటాయి.

ఇకపోతే ఈ (2) రెండవగ్రంథంలో ముఖ్యమైంది — **"జాతక కాండ"** అంటే 'నాడీ-గ్రంథం' వంటిది. ఇందులో ఈ కలియుగంలో పుట్టబోయే జీవుల జాతకాలు, వాటిపేర్లు, నక్షత్రాలు, తల్లిదండ్రుల పేర్లదగ్గరనుంచీ మూడు జన్మల వరకూ రాబోయే తరాల వారి జాతకాల భవిష్యత్తు అన్నీ రాయబడివుంటాయి. "ఇవేనా ? **నాడీగ్రంథాలంటే ?**"

"గురుదేవా ఈ గ్రంథాలను చూస్తే అడుగున్నర మందమే వున్నాయి కదా ! అంటే కొన్ని వందలపేజీలో, వేలపేజీల్లో వుండవచ్చు. మరి ప్రపంచంలో పుట్టే జనాలసంఖ్య కోట్ల లోనో లేక వేలకోట్లలోనో వుంటుంది కదా ! అంతమంది జాతకాలు ఈ కాస్తగ్రంథంలోనే రాసిపెట్టడం ఎలా సాధ్యం ?" అంటూ తన అనుమానాన్ని వెళ్ళబెట్టాడు ఖగోళపరిశోధకుడు ఔస్పెన్స్కీ.

"అదా మీ సందేహం ? అంటే ఇందులో పుట్టినవాళ్ళు అంటే బాల్యంలోనే పుట్టి చనిపోయే, బాలారిష్టంగలవారి జాతకాలు రాయరు ! అలాగే జ్యోతిషం అంటే నమ్మకంలేనివాళ్ళు, నాడీగ్రంథాల దగ్గరకు రాలేని దురదృష్టజాతకుల జాతకాలు రాయరు.

మరి ఎవరి జాతకాలు రాస్తారంటే ఎవరికైతే భక్తివిశ్వాసాలు, దైవచింతన, పాపభీతి కలిగి దేవుళ్ళు, దేవతలు, ఋషులు, ధర్మం, పాపం,

పుణ్యం అన్న విషయాలమీద నమ్మకంవుండి, నైతికమైన నడకా, వుంటాయో అలాంటివారి జాతకాలు మాత్రమే ఇందులోవుంటాయి.

ఇప్పటికే ఇందులోవే, వెయ్యిదాకా గ్రంథాలు మీ భారతదేశంలో అనేక రాష్ట్రాలలోకి తరలి వెళ్ళిపోయాయి. ఇహ ఇక్కడ ఈ హిమాలయాల ప్రాంతాలలోకి రాగల పుణ్య-జీవుల జాతకాలుమాత్రమే ఇక్కడ మిగిలివుంటాయి" అన్నాడు లామా.

"ఐతే ఇందులోని మన జాతకాలుచెప్పే ఫలితాలు చదువుకోవడం ఎలా ? ఎవరి జాతకం ఎక్కడ లభిస్తుందో తెలిసేదెలా ?"

లామా మహాశయుడు దీర్ఘంగా ఊపిరిపీల్చుకొని ఇలా ప్రారంభించారు.

ప్రతి మనిషికీ — కుడిచేతికి బొటనవేలిముద్ర వుంటుంది. అందులో తల వెంట్రుకలవంటి సన్నని రేఖలుంటాయి. ఆ రేఖలను లెఖ్ఖించిచూస్తే వారి జీవిత రహస్యాలన్నీ అందులోనే వుంటాయి. అంటే చేతి రేఖల సంఖ్యను 60-తో భాగిస్తే ప్రభవనుంచీ 60-ఏళ్లలో వీడు పుట్టిన సంవత్సరం వస్తుంది. అదే 24-గంటలతో భాగిస్తే జననకాల గడియా, 12-తో నెలా, 27తో నక్షత్రమూ వస్తాయి ! వారు వేలిముద్ర తీసి లెఖ్ఖించే సమయానికి లగ్నం కడితే వారి జన్మలగ్నం వస్తుంది ! జీవితం గురించి ప్రశ్నించే జాతకంతీసే సమయానికి ఆరోజున వున్న సమయానికి వున్న గోచారం తీసి ఫలితాలను తీసి దానినిబట్టి సమీప భవిష్యత్తు రాసివుంటుంది. ఇలాంటి "భవిష్యత్-శాస్త్రాల" జన్మభూమి వంటిది — అంటే ఆధ్యాత్మిక జ్ఞానానికే జన్మభూమివంటిది ఈ 'శంబల'!

"ఇందులోని ఈ రహస్య తాళపత్ర గ్రంథాలలో భూమిమీదకు పుట్టే ప్రతివాడి జాతకాలూ భూమ్మీదకి వచ్చే అవతారాలు వంటి అందరి విషయాలుకూడా రాయబడివుంటాయా ?" — రోరిఖ్స్.

"అవన్నీ ఈ గ్రంథాలలో వెతికితే లభిస్తాయా గురుదేవా ?" — అన్నాం !

"లభించవు !"

"ఎందుకని ?"

"ఎందుకంటే — ఈ గ్రంథాలు రాసినవారు సిద్ధపురుషులు ! ఏవైతే దేవరహస్యాలూ, బ్రహ్మజ్ఞాన రహస్యాలు, స్వార్థపరుల చేతిలో పడకూడని ఆధ్యాత్మిక రహస్యాలు ఏవివుంటాయో అవి రాసిపెట్టిన గ్రంథాలవంక వారు తీవ్రంగా ఒక టార్చిలైటు వంటి దృష్టితో చూస్తారు. మరుక్షణమే ఆ గ్రంథం మాయమై పోయి హారతి కర్పూరంలా గాలిలో హరించుకుపోయిందీ !

దానికి సరిగ్గా ఎవరికి లభించాలో వాళ్ళు లభించే టైముకు వాళ్లు అక్కడికి వచ్చినపుడే, అవి నీటిఆవిరి నుంచీ వడగండ్లు గడ్డకట్టినట్టుగా — ఈ రహస్యగ్రంథాలు సాక్షాత్కరించి — ప్రత్యక్షమై కనిపిస్తాయి !

ఇక మీరు ఆ విషయాన్ని వదిలేయండి !! ఇక్కడనే ఒక చిన్న బౌద్ధదేవాలయం వున్నది. అక్కడ తెల్లవారుజామున సుప్రభాత పూజ కావస్తున్నది. మీరుగనక చురుగ్గా నడిస్తే మీకడుపులోని ఆకలి తీరే ప్రసాదం లభించవచ్చు !" అన్నాడు లామా మహాశయుడు.

మంచి ఆకలిమీదున్న మాకు మరో ఆహ్వానం అక్కర లేకుండానే ఆ తాళపత్రాల భోషాణం మూసివేసి మోకాళ్ళమీద వంగి నమస్కారంచేసి పరుగులాంటి నడకలతో ప్రసాదంకోసం పరిగెత్తాం !

◆

44

‘శ్వేతద్వీపం’ – సిద్ధుల తపోభూమి !

అక్కడ, ఎటుచూసినా తెల్లని మంచుకొండలు ! నీరెండకి తళతళా కరిగించిన వెండిలా మెరిసిపోతున్నాయి. కళ్ళు జిగేలుమనేలా, సూర్యుడి కిరణాలు కళ్ళల్లోకి పొడిచేలాగ ప్రతిఫలిస్తూ మంచురాళ్ళు అక్కడక్కడ స్ఫటికాల్లాగ మెరుస్తున్నాయి !

తెల్లని ఆ మంచు మైదానంవెనకాతల ఆకాశం ముదురు నీలం రంగుతో కొట్టవచ్చినట్లు ఒక నీలం సిల్కుతెరలా కనిపిస్తోంది, దుమ్ము లేని ఈ హిమాలయపర్వతాలలోని నిర్మల వాతావరణంలో ! ఎంత దూరాన్నుంచి చూసినా శిఖరాలూ, లోయలూ స్పష్టంగా కనుచూపుకు అందుతున్నాయి. ఎండలో తెల్లగామెరిసే ఆ నిర్జన మంచు మైదానంలో

వెండిపళ్ళెంలో పొదిగిన నీలం కెంపులాగ నిర్మలం అయిన నీళ్ళతోవున్న **'మానస-సరస్సు'** దూరానికే మెరుస్తోంది నీలంగా ! నీలినీడలున్న ఆ సరస్సులోంచి అమాయకుడి మనస్సులాగ — అడుగున నేలంతా కన బడుతోంది.

ఆ వాతావరణం అంతా ఎటుచూసినా ఒక స్వచ్ఛతా, నిర్మలతా, నిశ్శబ్దతా, ప్రశాంతీ గూడుకట్టుకొని రాజ్యం చేస్తున్నది. చుట్టూరా కనుచూపుమేర వరకూ ఎక్కడా మనుష్యసంచారం అనేది కనబడ మంచుఎడారి ! ప్రకృతి అంతా నిర్మలమై — ఒక అగాధమైన నిశ్శబ్దంలో మునిగి యోగనిద్రలో జోగుతున్న యోగి మనస్సులాగ — కాలం ఆ నట్టుగావున్నది ఆ నిశ్చలదృశ్యం.

ఆగి ఆగి హోరుగా వీచే ఆ చలిగాలిలో దూది మూటల్లా కొట్టుకు పోతున్న మంచు పింజలు ! ఆ మంచు ఈదురుగాలులు వాటి మార్గంలో వున్న, చుట్టూమొలిచిన చెట్ల కొమ్మలనుకూడా తెల్లగా మంచుతో కప్పేసి — ఆ కొమ్మలను అనేక రకరకాల ఆకారాలతో చిత్రమైన మంచు శిల్పాల్లాగ తొలిచేస్తున్నాయి !

ఆ తెల్లటి మంచు లోయ మీదికి చూస్తూ ఒక కొండగుహ‼ లోపలాబయటా అంతా మంచుతో పూతలా పూయబడివుంది. ఆ గుహ లోంచి నీలాకాశంలోకి చేసిన సొరంగంలాగ "కోలగా" మంచుపర్వతం మధ్యలోంచి తొలిచిన ఒక ద్వారం ! ఆ ద్వారంగుండా కనబడుతున్నది — బయటి నీలాకాశంలో త్రవ్విన నీలపు సొరంగంలాగ. గుహపైనుంచి నీటిబొట్లు చుక్కలు చుక్కలుగా రాలుతూ అలాగే — మధ్యలోనే

అవి మంచుకర్రలాగా అయిపోయి — పైన చాందినీలకు కట్టిన ముత్యాలులాగ, మణులలాగ మెరుస్తున్నాయి — అలా డజనుకుపైగా గుహపైనుండి వ్రేలాడుతున్న నీటిబిందువులే వజ్రాలలాగ తళుక్కుమంటున్నాయి !

అచ్చటి సరస్సులు కూడా చలికి పెరుగుతోడుకుపోయినట్టుగా గడ్డకట్టి పోయినాయి ! జలపాతాలు పైనుంచి పడుతున్నవి అలానే గడ్డగట్టుకుపోయి ఘనీభవించినాయి — హిమవంతుని తెల్లని గెడ్డంలా మంచుగానే మధ్యలోనే స్థంభించి గాలిలోనే నిశ్చలంగా నిలిచి — చూసేవారికే విచిత్రంగా కనిపిస్తున్నాయి ఏ కదలికాలేకుండా — బొమ్మ జలపాతాలులాగ !

అక్కడక్కడా కొన్ని గుహలు — వాటిమధ్యన ఆశ్రమ కుటీరాలు, కుటీరాలకు మధ్యగా నిలిచిన గోపురంపై గాలికి రెపరెపలాడే నారింజ రంగు జండాలు !! ఆరుబయట మంచుపైనే కూర్చుని ధ్యానిస్తూవున్న ఆజానుబాహులైన మునులు — నిరంతర ధ్యానసమాధిలో మునిగి వుండిపోయి ఊపిరిపీల్చటంకూడా ఏనాడో మరచిపోయి, అంతటి గాఢ తపస్సులో వున్నారు.

వారిలో కొందరు తెల్లని జడలుకట్టి కనుబొమ్మలుకూడా తెల్లగా నెరిసిన మహామునులు — అలా వేల సంవత్సరాలనుంచీ తపస్సు చేస్తూనేవున్నారు. అందులో కొందరు వెయ్యేళ్లవాళ్లూ, అయిదారువేల సంవత్సరాల వాళ్ళుకూడా వున్నారు. వారిలో కొందరికి వెయ్యి, రెండువేల ఏండ్లు, మరికొందరికి — ఎన్నేళ్లోకూడా ఎవరికీ తెలియదు. అలా

నిరంతర తపస్సులో ఎన్నియుగాలనుంచో ఉన్నారు !!! అందులో ఒకాయన — "మహావతార్-బాబాజీ" అంటారు — జీసస్‌కు గురువు ! 5000-ల ఏళ్లుంటాయి ! అలా కాలాన్నీ వయస్సునీ మరిచిపోయి నిరంతర తపస్సులో వున్నారెందరో !

ఇది సిద్ధుల తపోభూమి అయిన — **"శ్వేతద్వీపము"**. అది ఎల్లకాలం తెల్లటి మంచుతో కప్పబడివుండటం వల్ల దీనికి ఈ 'శ్వేతద్వీపం' అనే పేరు వచ్చిందని కొందరు భావిస్తున్నారు. కొందరు అచట "శుభ్ర మార్గానికి" చెందిన బ్రహ్మఋషులు ఏకోశానా వారిలోకి స్వార్థమూ, ఐహిక ఆలోచనలూ తగలని పరిశుద్ధ హృదయంతో, నిరంతరం సత్యాన్ని ఆరాధిస్తూన్న తెల్లని మనస్సులు కలిగిన, తొలివెలుగుల సిద్ధమునుల జ్ఞానవాటిక గనుకనే — దానికి **శ్వేతద్వీపం'** అనే పేరొచ్చిందని కొందరంటారు.

ఒక్కటి మాత్రం నిజం ! — ఇది ఈ భూమిమీద ఈ ప్రపంచానికంతటికీ పవిత్రప్రదేశం! మానవజాతికే పరిశుద్ధమైన ఆత్మవంటి స్థానం !! ప్రపంచంలో జరిగే సంఘటనలన్నింటినీ ఇక్కడనుంచే దివ్యదృష్టితో దర్శిస్తూ, వారి తీవ్రతపస్సుతో పదునుపెట్టబడిన మనస్సులతో జరుగుతున్న సంఘటనలనే తీర్చిదిద్దుతూ మానవ పరిణామాన్ని నడిపిస్తూ ప్రేమతో ప్రపంచాన్ని పరిపాలించే **'అంతరంగ-పరిపాలన'** కేంద్రం. ఇదే ప్రపంచానికంతటికీ ఆధ్యాత్మిక కేంద్రం.

వీరి పరిపాలన మన ప్రభుత్వాలలాగ బైటనుంచి పరిపాలించేది కాదు. మనస్సు ఇంద్రియాలను పాలిస్తూన్నట్టు — మన లోపలనుంచే



శంబలప్రభువూ – మహామునుల – 'మండలం' (కింద – 'కల్ప-వృక్షం').
ఆకాశంలో 'సిద్ధచారణ గంధర్వులు'.

మనస్సు, మనచేతలను, సంకల్పాలను లాగుతూ పరిపాలించినట్టే బైట ప్రపంచంలో జరిగేవాటిని పరిపాలించేవిధానం. అందుకే ఇది సృష్ట్యాది నుంచీ భూమ్మీద **"లోకగురువుల" — నివాసభూమి. జగత్తుకే ఆధ్యాత్మిక కేంద్రం.**

ఇలా లోపలనుంచే మానవజాతిని పరిపాలించే పరమగురువుల ఆధ్యాత్మిక పరిపాలనా కేంద్రము. లోకపాలకులైన పరమఋషిమండలి యొక్క నివాసభూమి "శ్వేతద్వీపం".

ప్రపంచంలో ధర్మరక్షణా — దుర్మార్గుల శిక్షకూ ఆధ్యాత్మికశక్తి ఎక్కడ అవసరంవచ్చినా అక్కడ ఆదేశాలలో జన్మించే జగద్గురువుల అవతారమూర్తులు ప్రవక్తలూ — అంతా ఇక్కడినుంచే పంపబడతారు. వారు పోయి ఆయాదేశాల్నిబట్టి వేరువేరు భాషలలో వేరుపేర్లతో — వారు జన్మించడం జరుగుతుంది. వాళ్ళే ఈ సనాతన ధర్మంయొక్క శాశ్వతసత్యాన్ని ప్రజలలో బోధించి తిరిగి మళ్ళీ అక్కడ ధర్మాన్ని స్థాపించటం జరుగుతుంది ! 'ధర్మపరిపాలన అంటే ఇదే' ! అదంతా జరుగుతున్నదీ — అది జరిపేదీ ఇక్కడినుంచే.

అంతేగాదు ! ఇది — ఈ భూమిమీదవున్న రహస్య ఆధ్యాత్మిక కేంద్రం !! ఇది — మనిషికి మెదడు ఎలాంటిదో అలాంటిదే ! మానవ జాతికి ఆత్మవంటి **'బ్రహ్మ ఋషి మండలి'** వీరే ! ఇతర లోకాలలోని, గ్రహమండలాలమీదా ఉన్న **'సిద్ధగురుమండలి'తో ఆలోచనలు రేడియోలా** దివ్యదృష్టితో **నిత్యం ప్రసారంచేసే దివ్యకేంద్రంకూడా — ఈ శ్వేతద్వీపమే'**!

ఆదికాలంలో మానవుడిని తెచ్చి, ఈ భూమిమీద నెలకొల్పినప్పుడు

— అతడికి కావలసినవన్నీ సమకూర్చి, మొట్టమొదటి మానవ కుటుంబంగా వారిని ఏర్పాటుచేసి, వారు క్రమక్రమంగా జంతుదశనుంచి మానవ పరిణామంలో పొందే వారికి అవసరమైనంత విజ్ఞానం ఆధ్యాత్మిక శిక్షణా ఇస్తూ — ఈనాడు మనుష్యుడిని ఈ స్థితికి తెచ్చినది ఈ ఆది గురువులే ! మానవజాతి వీరికి **శిష్యులుగా** ఇంతవరకూ పెంపొందించబడ్డారు. అందుకే ప్రపంచంలోని అన్నిమతాల స్థాపకులూ ఇక్కడినుంచే వెళ్ళి జన్మించి ఒకే ధర్మాన్ని ఆయాదేశంలోని కట్టుబొట్టూ భాషావంటి బైటి మార్పులకు తగినట్టుగా మలచి ఇలా ప్రతి వెయ్యిఏళ్ళలోనూ ఒకక్రొత్త **ఆధ్యాత్మిక 'తరంగాన్ని'** (**Wave of Consciousness**) ప్రపంచంలో సృష్టిస్తారు. ఆ పని నిర్వహించేది ఈ పరమగురువులే ! అలాంటి సత్యకాలపు ఋషుల **తెల్లని సిద్ధవాటిక** ఆ **"శంబల"** గ్రామం.

ఇప్పుడు **'కలియుగం'** అంతమై రానున్న **"సత్యయుగం"** మొదలుపెట్టే మధ్యకాలంలో — అవతారంగా ప్రపంచానికి దర్శనమిచ్చే **"కల్కి–భగవానుడు"** కూడా ఈ 'శంబల' గ్రామంలోనే జన్మిస్తాడు ! అలా అన్ని పురాణాలలోనూ స్పష్టంగా **వర్ణించినదీ ఈ సిద్ధభూమియే**. ఇదే ఆ సిద్ధుల నివాసభూమి.

ఆ సిద్ధాశ్రమం చుట్టూరా ఎత్తైన పెద్ద పెద్ద పర్వతపంక్తులు పైకి లేచి అన్నివైపులా పెట్టనిగోడలా చుట్టూరా చుట్టుకొని చూడడానికివీలు లేని లోయ ! దాని మధ్యగావున్నది. పైనుంచిచూస్తే ఆ చుట్టూరావున్న కొండలు ఎలాక్కనబడతాయంటే అవి ఒక తెల్లని తామరపూవు రేకుల మధ్యనవున్న బొడ్డు చుట్టూరా పద్మంలా చుట్టూ చక్రాకారంగా వ్యాపించి వుంటాయి. అలా వుండటంవల్లనే దీనికి మణిద్వీపమని కూడా పేరు పురాతన కాలంనుంచీ వుంది.

ఒక బ్రహ్మపద్మంలావుండేది — ఈ దివ్యతపోభూమి. ఇక్కడ ప్రతి ఏటా ఒకానొక ప్రత్యేక పూర్ణిమనాడు ప్రపంచంలోని పరమగురువులు అనేకమంది ఇక్కడ సమావేశమౌతారు. అప్పుడు చంద్రోదయ సమయంలో వారంతా గుండ్రంగా మండలాకారంగా నుంచుని ధ్యానిస్తారు. వీరికి మధ్యన లోపలగా — ఒక నక్షత్రాకారంలో నిలబడి, రెండవ మండలాకారంలో — ప్రార్థనలు చేస్తున్నవారు **'లోకపాలక వర్గం'** !

అందులో నిలుచున్నవారిలో నల్లని గెడ్డంతో వంపుతిరిగిన మీసాలతో రాజఠీవితో నిలుచున్న ఆజానుబాహుడైన వ్యక్తియే — **వైవస్వత మనువు** ! ఆయనచేతిలో ఒక స్ఫటికదండం రాజదండం వంటిది ధరించి — ఆయన లోకపాలకుడి అధికారానికి సూచనగా వున్నది.

ఆ 'స్ఫటిక-దండం' లోని సిద్ధి అద్భుతశక్తి అపారం ! ఊహించడం కష్టం. ఆయన తలమీద వెంట్రుకలు నల్లగా తళతళ మెరుస్తూ – వెడల్పాటినుదురు, పొడుగాటి కోటేరు ముక్కు రాజసం ఉట్టిపడే విశాలమైన గంభీరనేత్రాలు చూస్తే — ఆయన ఈ ఏడవ మానవజాతికి ఆదిపురుషుడని — ఇప్పటి **"మనువు"** అని చెప్పకచెబుతున్నాయి.

కొంచెం మధ్యగా ఆయన ప్రక్కన నిలబడినవారే — మైత్రేయ మహర్షి. వారే ఈ కలియుగం అంతం అయ్యేదాకా ప్రస్తుత మానవజాతికి ఆధ్యాత్మిక శిక్షణభారం వహించిన పరమగురువులు !

ఈయనే గౌతమబుద్ధునితర్వాత భూమికి లోకగురువుగా అవతరించబోయే — **"మైత్రేయబుద్ధుడు"** రానున్న కాలంలో ఎదురుచూచే బౌద్ధుడి అవతారమూర్తి !

వారివెనుక స్ఫటికంలాగ ఇటునుంచి అటు కనబడేలా శుద్ధ "జ్ఞాన-శరీరం" గలవ్యక్తి సన్నటి పొడుగాటి — తెల్లని జుట్టుముడీతో తెల్లని మంచులాంటి నెరసిన కనుబొమ్మలూ, సన్నగా జ్వాలవలే పొడుగ్గా వున్న గడ్డంతో నుదుట తెల్లని గీతలుగా కర్పూరనామంతో — ఆయనే నారదమహర్షి! దేవతలకు కూడా ఋషి-వారు.

నుదుట నాజూకుగా దిద్దిన నిలువుబొట్టు, మెడలో స్ఫటికాలూ, ముత్యాలూ తాపిన మాలతో వీణధరించి తనలోతానే తేలిపోతున్నట్లున్న సంపెంగ రేకులవంటి కనురెప్పలతో మహాభక్తిని స్రవించే ఆ కన్నులూ, వారే దేవర్షి నారదులవారని చెప్పకనే చెబుతున్నాయి.

వారివెనుక నిలబడ్డది వాల్మీకి, ప్రక్కగా పరాశరులవారూ, — ఆ వెనుక పొడుగాటి గడ్డాలూ మీసాలతో నల్లని శరీరంతో నిల్చున్నది — కుంభసంభవుడైన — అగస్త్యులవారు! ఇంకా ఎందరో సిద్ధగురువులు మండలాకారంగ అక్కడ నిల్చునివున్నారు. ఈనాడు జరగబోయే ఆధ్యాత్మిక "గురుమండలి" అద్భుత సమాగమంలో పాల్గొనటానికివచ్చిన మహామును లంతా కూడిన — యోగమండలి — అది.

అందరూ ఒకరొకరే వొచ్చి, వారివారి నిర్ణీత స్థానాలలో నిలుచున్నారు. యోగమిత్రమండలి సదస్సు అలా ఆరంభమయింది! ముందుగా అందరూ కలిసి సామూహిక ధ్యానం చేయడానికి సూచనగా, **ఓంకారం**-ప్రారంభమై అతినెమ్మదిగా సన్నగా వినిపించింది. ఆ నాదం నెమ్మదిగా పెరిగిపోతూ ఝుంకారంలా స్పష్టంగా అందరిలోంచీ ఒకే నాదంగా వస్తోంది.

అది వారి మనస్సులోంచే వస్తోందో, లేక — కంఠంలోంచే వొస్తోందో, చెప్పటానికే వీల్లేకుండా వుంది.

అలా వారందరూ కళ్ళుమూసుకుని — నిశ్చలధ్యానంలో తమను తాము మరచిపోయి ఆనందపారవశ్యంలో మునిగివున్నారు. అందరి లోంచీ ఒక్క 'ఓం'కారనాదమే వినవస్తోంది !

చూస్తుండగానే అందరు వ్యక్తులూ ఒక్కటిగా కలసిపోయి – ఒక్కటిగా లయమై సమాధిస్థితిలో మునిగిపోయారు. అలా నిల్చునివుండే ధ్యానించారు అందరు గురువులూ — అలా తీవ్రంగా ధ్యానంలో ఒకే శరీరంలోని అవయవాలలాగ మునిగిన ఋషిమండలి మధ్యగా ఒక విచిత్రం !!

వాళ్ళముందరగావున్న — చిన్న స్ఫటిక శిలావేదికమీద ఖాళీప్రదేశం మీదకి, వారి ఏకాగ్రత సూర్యకిరణాలలాగ ప్రసరించసాగింది. ప్రతిమహ లోంచి — ప్రసరించే తేజస్సూ ఆ మధ్యనున్న కేంద్రంలో గురికాసా అన్నిరంగులూ సూర్యుడి కిరణాలవలే ఆ మధ్యనున్న ఖాళీప్రదేశంపై కేంద్రీకరించాయి. అందరి శరీరాలను కలిపివుంచే ఆ యోగశక్తి అనేక తీగల వలలను కలిపే కరెంటు ముద్దలాగా వారిలోనించి ప్రసరించే శక్తి అందరినీ ఒకటిగా ఏకంచేసింది !

ఎదురుగా వారిముందు విచిత్రమైన లేత నీలంరంగుతో పొగమంచు లాంటి నీలితేజస్సు ఓవలయంగా ఏర్పడింది ! అది క్రమంగా ఊలుతో చేసిన బంతిలాగ గుండ్రటి తేజోరాశిగా పొగమంచుగోళంలాగ పెరిగి పెద్దదయింది.

అందరి మనస్సులోనుంచి వచ్చే, ఆ జ్ఞానకిరణాలు — ఒక గుర్రానికి తగిలించిన అనేక కళ్ళాలలాగ — ఆ తేజస్సుతో వారి ఆత్మలను కలిపివున్నాయి ! అందరి మనస్సులోంచి వచ్చిన జ్ఞానకిరణాలతో అలా

అభివృద్ధిపొందిన ఆ తేజం పెద్ద-ఓ పనసకాయంత ఆకారంలోకి పెరిగింది.

సన్నగా ఓంకారం ధ్యానం నడుస్తూనే వున్నది ! స్వరం నెమ్మదిగా లేస్తూపడుతూ వేదంలాగ ఉదాత్తంగానూ వస్తోంది.

అందులో ఎవరిలోంచి ఆ స్వరం వస్తోందో తెలియడంలేదు. అందరూ ఒకటిగా అయి అన్ని శరీరాలలో వున్న ఏకవ్యక్తిగా లయించిపోయి అందరి ఆత్మలు కలిసి 'ఏకాత్మ'-భావంతో చేసే 'సత్-గురువుల' **"సత్సంగం"**లా వుంది ! అలా ఒళ్ళుతెలియని సామూహిక ధ్యానంలో అందరూ తన్మయత్వంలో మునిగిపోయి వున్నారు పరమగురుమండలి అంతా — తమ వ్యక్తిత్వాలనే మరిచిపోయి !"

ఇంతలో అకస్మాత్తుగా ఆమధ్యనున్న చిన్న అరుగువంటి 'వేదిక' మీదుగా ఆజ్యోతి, నిలువెత్తు పెరిగి గుండ్రంగా కోలగావున్న ఒక తేజశ్చక్రంలా అయి, చూస్తువుండగానే — ఒక మానవాకారంధరించి క్రమక్రమంగా మేఘమే ఒక ఆకారం ధరించినట్టుగా, ఆమూర్తి దూదిపింజ వలే అస్పష్టమైన రూపురేఖలతో అయి, అందులోనుంచి తెల్లని గడ్డం, జడలూ, తెల్లని పంచ, కమండలము — చేతిలో ఒక జపమాల — స్ఫటికంలాగ తెల్లని శరీరమూ, జుట్టూ, అంతా స్ఫటికంలాగ ఒకేరంగులో ఒక కర్పూరం బొమ్మలాగై నిలిచిందావిగ్రహం.

"**లోకగురువు**" ! — అన్నమాటలు అందరి హృదయాలలోంచి వినిపించి — అందరిలోనూ ఒకే ఆలోచన. ఒక్కటే ఆనందం ఆనాడు అక్కడ గుమికూడిన పరమగురుమండలి లోని సిద్ధగురువులందరి గుండెల

లోనూ స్పష్టంగా తెల్లటి పూర్ణిమచంద్రుడు వెలగటం — స్పష్టంగా ధ్యానంలో ఎవరి గుండెలలో వాళ్ళు దర్శించారు ! దాన్ని హృదయంతో దర్శించటమే కాదు. ఆ చల్లని తియ్యని, ప్రేమ తేనెకలిపిన పాలవంటి అమృతపు రుచితో, వారికి గుండెలలోనే జ్ఞానంలో తడిసిన దయలా, తగిలింది ! అందరి శరీరాలు ఒక్కసారిగా పులకించినాయి ఆ అమృత స్పర్శకు.

దాంతో — అందరి మనస్సులూ ఒక్కసారిగా వెలిగాయి ! ఆనాటిది, ఓ అద్భుతమైన ఆ 'ఆత్మపూర్ణిమ' ! గురువును పూర్ణంగా హృదయంలో స్పర్శించినట్టుగా అనుభవించిన ఆనాటి పూర్ణిమయే అసలైన **గురుపూర్ణిమ !** లోకగురువే పూర్ణచంద్రునిగా ఆత్మలో దర్శనమిచ్చాడు.

అంతేకాదు కాలంలో రానున్న పన్నెండు "**పుష్కర**-సంవత్సరాల" లోనూ — రానున్న పన్నెండు సంవత్సరాలలో జరుగనున్న ప్రపంచ పరిస్థితుల్లో మార్పులు ఇంకా భూమిమీద జరిగే మార్పులూ, పరిణామాలూ అన్నీ వారికి చూపించబడినాయి — మాటలు లేకుండానే — కాంతిచిత్రంతోనే ! వారి మనస్సులు మాట్లాడుకున్నాయి — మాటలు అవసరం లేకుండా ! మనస్సులూ మనస్సులు ఆలోచనలను అందించుకున్నాయి — నోరుమెదపని అద్భుతసదస్సు అది. గురువుయొక్క మౌనమే సంభాషణగా ఆత్మలోంచి అనుభూతిగా సందేశం అందించటమే అయింది. అప్పుడు అందరూ కన్నులారా దర్శించారు ఆ లోకగురువు రూపాన్ని.

ఆతర్వాత క్రమంగా వారిమధ్యన ప్రత్యక్షమైన ఆ దివ్యమూర్తి శరీరంలోంచి అణువులు ఒక్కటొక్కటే ఎగిరిపోసాగాయి — అలా

చూస్తూండగానే ! శరీరంలోని అణువులు, ఒక సుడిగాలిలాంటి వాయుగుండంలో ధూళి రేణువుల్లాగ ఎగిరిపోయి — ఆరూపం కరిగిపోయి, పదార్థం విడిపోయి, మళ్లీ ఎప్పటిలా అక్కడ స్థలం ఖాళీగా అయింది. పరమగురువు ! ఎలా సంకల్పించి, గాలిలో అణువులను తన మనస్సుతో రప్పించుకొని అలా దాంతోనే శరీరం కట్టుకుని దర్శనంయిచ్చి, మళ్లీ అలానే అణువులన్నీ విడిపోగా అనంతాకాశంలోకి అదృశ్యం అయ్యారు — లోకగురువు !!!

ఇలాగే సిద్ధగురువులు **"నిర్మాణకాయం"**తో సంకల్పమే శరీరంగా ఎక్కడ కావాలంటే అక్కడ సాక్షాత్కరించే — **ఆధ్యాత్మిక ప్రక్రియ.** అణువుల కలయికతో ఏర్పడిన యోగమయ శరీరం అలానే కరిగిపోతుంది. అందుకే ఆ అణుశరీరానికి చావులేదు ! అందుకే వారు చిరంజీవులు. ప్రళయంలోకూడా ఇలానే అణువుల చేరికతో వారు ఎక్కడ కావాలంటే అక్కడ — ఏర్పడతారు సంకల్పంతోనే ! పదార్థాన్ని జయించిన మనస్సువారిది. అణువులను ఆజ్ఞాపించగలరు అందుకే.

ఇదే నిత్యం సృష్టిలోనేవుండి ప్రళయాలు వచ్చినా నశించని అణుశరీరాలు కలిగిన మహాత్ములూ, చిరంజీవులూ గత యుగాలలోని అవతారమూర్తులూ చలనంలేకుండా ఎలా నిలిచి వుండగలటంలోని రహస్య ప్రక్రియ !

పరమాణువులతో ఏర్పడినదే ఈ పదార్థంతో తయారైనదే ఈ ప్రపంచం అంతా. నీటిఆవిరిగా ఆకాశంలో తేలిపోతూ సంచరించే నీటి అణువులే మళ్లీ — ఆ నీళ్ళు గడ్డకట్టితే 'మంచు' ముక్కలా అయినప్పుడు వాటికొక గట్టిరూపం ఏర్పడినట్టే అణువుల కలయికవల్ల

ఏర్పడిన వారి శరీరాలుకూడా ఎక్కడ కావలిస్తే అక్కడ ఘనీభవించి కావలసిన 'ఆకారం' ధరిస్తాయి.

గాలిలాగ కంటికి కనిపించని నీటిఆవిరి గాలి ఒక్కసారిగా చల్లబడగానే అకస్మాత్తుగా గడ్డకట్టి 'వడగండ్లు'గా మారి, ఆకాశంలోంచి పడినట్టే — అదృశ్యమైవున్న సర్వవ్యాపకమైన సిద్ధగురువుల ఆత్మకూడా సంకల్పబలంతో ఒక తీవ్రమైన ఆకర్షణచక్రంతో సుడిగుండం ఏర్పరచుకుని అందులోకి గాలిలో తిరిగే అణువులన్నీ చేర్చి సుడిగాలిలో చిక్కుకున్న ధూళిరేణువులలాగ ఏర్పడతాయి. అలా ఏర్పడే శరీరాన్ని యోగపరిభాషలో "**నిర్మాణకాయం**" అంటారు !!! **ఇది అయోనిజ సంభవులకే సాధ్యం ! ఈ శరీరం తల్లి ప్రమేయం లేకుండా ఏర్పడిన జన్మకనుక అయోనిజం.**

శరీరం ఉంటేనేగదా చావు-పుట్టుకలు ? శరీరంలోని అణువులన్నీ గాలిలోకి తప్పుకుంటే, అందుకని ఇక — 'చావు' దేనికి వస్తుంది ? శరీరంలేని సిద్ధులకు మరణంలేదు ఇందుకే. అంతేకాదు శరీరంవుంటే దానికి బోలెడు బెడద ! ఒకచోటనుంచి ఇంకోచోటుకి దాన్నికూడా మోసుకుంటూ వెళ్లాలి — ఒక సామానో బెడ్డింగో తీసికెళ్లినట్టు ! ఆ శరీరమే లేనివాడు ఎక్కడికి వెళ్ళాలన్నా — టికెట్టు లేకుండా మనస్సుతో వెళ్ళగలడు. ఆ శరీరంవుంటే దాని పోషణా, దానికి తిండీ, పైన బట్టలూ, వాటికోసం ఉద్యోగాదులూ... ఇలాంటి శరీరంలేని వారికేవీ లేవుగదా ? శరీరంలోవున్న 'తాను' మనస్సుగా ఎక్కడికి వెళ్లాలని అనుకుని ఆ ప్రదేశాన్ని ఆలోచించగానే ఆలోచనతోనే వెళ్లి అక్కడ వుంటుంది. ఇప్పుడు మనస్సేగదా శరీరం ! దీనినే '**మనోమయ శరీరం**' అంటారు.

"అలా అనేకరకాల 'కరెంటు' శరీరాలతో సంచారంచేసేవారినే 'చిరంజీవులు' అంటారు. కాని వారి శరీరాలన్నీ ఒకే మాదిరివి కావు !"

"అలాంటి చిరంజీవులవర్గంలోని వారే అనేకులు మృత్యువును జయించి, శరీరాలు లేకుండా ఆత్మలుగా తిరుగుతూ వుంటారు అవసరం వచ్చినపుడు దర్శనం ఇస్తూ — ఆ పూర్ణిమనాడు సామూహిక ధ్యానంలో పాల్గొన్నారు !

"ఆనాటి పూర్ణిమ వైశాఖ శుద్ధ పూర్ణిమగా బుద్ధపూర్ణిమగా సిద్ధుల సంబుద్ధుల సామూహిక ధ్యానసమాధి పండుగగా నిలిచిపోయింది ! పరిపూర్ణజ్ఞానమే నిర్మలమైన స్ఫటికం వంటిది. ఇదే పూర్వశాస్త్రాలలో

"జ్ఞానానందమయం దేవం
నిర్మల స్ఫటికాకృతిం
ఆధారం సర్వవిద్యానాం
హయగ్రీవ ముపాస్మహే"

అన్న నిర్మల స్ఫటికాకృతిగా మనలో వెలిగే జ్ఞానజ్యోతియే బ్రహ్మానంద సమాధిలో చలించకుండా అచలంగా అంటే పర్వతంలాగా వుండే జ్ఞానసమాధియే హయగ్రీవమూర్తి స్వరూపంగా వేదాలు ప్రార్థించాయి !" – పిచ్చాపాటిగా లోకాభిరామాయణం మాట్లాడుతున్నట్టుగా ఈ విషయాలన్నీ అలవోకగా చెప్పుకుపోతున్నాడు లామా ద్యోర్జీ చోగ్యాల్ మహాశయుడు !

తన్మయత్వంతో వింటూ అనుసరించాము — సాహసయాత్రికుల బృందం అందరం ! కానిమాకు ఆతర్వాతగాని తెలియలేదు —

లామాదోర్జీ చోగ్యాల్ మహాశయుడు మమ్మల్ని ఏదో పైలోకాలలోకి తీసుకుపోయే విషయాలగురించి చెప్పుకుపోతూవుంటే మా దృష్టిని బయట ప్రయాణం ఎటువైపు నడిచివెళ్తున్నామో తెలియనీయకుండా మాకే దారి తెలియకుండా — దారితీశాడు ! అలా స్ఫటికమందిరాన్నీ, స్ఫటికపర్వతాన్ని చూపించేదారి — గడ్డకట్టిన నది అడుగున గుల్లగావున్న పర్వతంలోపలి మార్గంవైపుగా తీసుకువెళ్ళాడు !

అకస్మాత్తుగా ఆకాశం మబ్బులు విడిపోయి నీలంగా స్ఫటిక వజ్రంవంటి కాంతితో ప్రకాశిస్తోంది ! వెండివంటి తెల్లటి మధ్యాహ్న సూర్యకాంతి కళ్ళు మిరుమిట్లు గొలిపేలా చేసింది ! మా కాళ్ళకింద నలుగుతున్న మంచుపొరల మీంచి సూర్యకాంతి పడి కళ్ళు మిరుమిట్లు గొలిపేలా ప్రతిఫలించి మాకు ఎటు నడుస్తున్నామో తెలియకుండా వెండి వంటి కాంతిలోకి నడుస్తున్నట్లు ఒక విచిత్రమైన అనుభూతికలిగింది ! ఆ తర్వాత గాని తెలియలేదు మమ్మల్ని దోర్జీ చోగ్యాల్ మహాశయుడు **స్ఫటిక పర్వతం** వైపు దారితీయిస్తున్నాడని ! ఆయన మధ్యలో వెనక్కి తిరిగి —

“మిత్రులారా ! జరగబోయే భవిష్యత్తును ముందే దర్శించడం సాధ్యమా ? — అసాధ్యమా ? మీ అనుభవాల్ని పురస్కరించుకొని మీ సమాధానం చెప్పండి” అన్నాడు ! ఆయనవేసిన ఆ ఆకస్మిక ప్రశ్నకు తృళ్ళిపడి అంతా బయట ప్రపంచంలోకి వచ్చాము!

మాలో డిటెక్టివ్ మహాశయుడైన ఛార్లెస్ అనుమానంగా చూస్తూ — “గురుదేవా ! మీరీ ప్రశ్న మమ్మల్ని ఇప్పుడు ఎందుకు అడుగు

తున్నారు ? ఏకారణం లేకుండా మీరు అకస్మాత్తుగా ఈ ప్రసంగం తీసుకురారే?" అన్నాడు.

దానికి చోగ్యాల్ మహాశయుడు భళ్ళుమని నవ్వి శరీరమంతా భూకంపంలాగా కదిలిపోయేలాగా ఫకాలున నవ్వాడు. మళ్ళీ అంతలోనే తనను తాను తమాయించుకుని వెనకాలే వస్తున్న మావైపు తిరిగి

"ఏమీ లేదు ! మీకీ అనుమానం వొస్తుందని నాకు ముందే అనిపించింది ! ఎప్పుడో భవిష్యత్తులో జరగబోయే విషయాలను కళ్ళముందే చూసినట్టుగా దర్శించే కాలజ్ఞానం గురించి మనం ఇదివరకే ముచ్చటించుకున్నాం ! కాని అలాంటివి ప్రాచీన తాళపత్రాలపైన లేక రాతి శిలాశాసనాల రూపంలోకాని **"శంబల–భవిష్యాల"** రూపంలో రాసివుంటే చూస్తారా ?" అన్నాడు ! అంటూనే మా సమాధానం కోసం వేచివుండకుండానే చకచకా అడుగులువేస్తూ ముందుకు దారితీశాడు !

ఎందుకో ఆతర్వాత గాని మాకు తెలియలేదు !!

45

‘స్పటిక’ - పర్వతం !

మధ్యాహ్నపు సూర్యుడు — కరిగించిన వెండిలాగ కళ్ళు జిగేల్ మనే కాంతితో ప్రకాశిస్తూవుంటే ఎవరైనా ఒక కత్తెర తీసుకుని అందులోంచి ఆ బింబం మధ్యలోంచి సరిగ్గా ముక్కోణాకారంగా వుండే ఆ తేజస్సును కత్తిరించి మా ఎదురుగా నిలబెడితే ఎలావుంటుందో సరిగ్గా అలాగే మాఎట్టఎదుట గుహలో మాకళ్ళు జిగేల్‌మనే తేజస్సుతో తెల్లగా మిరుమిట్లుగొలిపే వెండిలాంటి తేజస్సుతో వెలిగిపోతోంది ! సూటిగా దానివైపు చూడలేక మాకళ్ళు చీకట్లు కమ్మినట్లై దృష్టి బూచులు బూచులుగా చెదిరిపోయింది !

“చూశారా ! అదే ‘స్ఫటిక-పర్వతం’ ! మధ్యాహ్నపు సూర్యకాంతిపడి ధవళాతిధవళంగా — అతి శుద్ధమైన తెల్లటి తేజస్సుతో వెలిగిపోతోంది ! అదే మీరు వెతుకుతున్న “స్ఫటిక-పర్వతం” — చూశారా ? కన్నులారా వీక్షించండి, మీకన్నుల కరువుతీరా ! ఇదే, జీవితమంతా మనం చూడా

లని కలలుకన్న మనందరి కలలపంట ! ఈ భూమిమ్మీద వేలకొద్దిమంది వుంటే అదృష్టవంతులలో ఏకొద్దిమందికో ఈ కళ్ళతో చూసే భాగ్యం కలిగింది, దివ్యజ్యోతి వంటి ఈ పర్వతాన్ని !" — అంటూ లామా దోర్జీ చోగ్యాల్ ఒక ఆవేశంతో గుండెలలో ఆనందం పొంగి పరవళ్ళుతొక్కుతూ వుంటే చెంపలమీద కన్నీరు ధారలుకట్టి కారుతూంటే తుడుచుకోకుండా అలాగే చూస్తూ ప్రార్థన చేస్తున్నట్టుగా చేతులెత్తి నమస్కరిస్తూ చెబుతున్నాడు.

"అది మీకు ఎదురుగా సుమారు మైలుదూరంలో వున్నది ! భూమ్మీంచి సుమారు ఇరవై-రెండువేల (22,000) అడుగుల ఎత్తుకు పైకి ఆకాశంలోకి పెరిగిపోయి, త్రిభుజాకారంతో నిలబడివున్నది."

"ఇది మీకంటికి ముక్కోణాకారంతో కనిపిస్తున్నదేగాని నిజానికి ఒక నలుపలకల చదరపు పీఠంపైన నిర్మాణంకాబడినట్లు — నాలుగు పలకలా నాలుగు త్రిభుజాలు అతికించినట్టు — త్రిభుజాలు నాలుగు దిక్కులకూ తిరిగివుండి, ఒక 'పిరమిడ్'-ఆకారంలో ఆకాశంలోకి చొచ్చుకుపోతూ మహాగంభీరంగా దర్శనమిచ్చింది !

మా అందరికీ ఒక్కసారిగా ఒళ్ళు జల్లుమన్నది, ఏదో వెయ్యి కిలోవాట్ల కరెంటువంటి శక్తి వరదలాగ మాగుండెల్లోకి, మెదడులోకి, నరాలగుండా ప్రవహించినట్లుగా పులకింతలు కలిగాయి ! మాలో ప్రతీ ఒక్కరూ రోమాలు శరీరమంతా నిక్కపొడిచి చూస్తున్నారు. అలా నిలబడి ఎంతసేపు చూశామో మాకే తెలియలేదు.

దాని వివరాలు ఆతరువాత నిదానంగా మా మార్గదర్శకుడు 'లామా దోర్జీ చోగ్యాల్' విశదీకరిస్తే తెలిసింది ! "ఇదే **'స్పటిక-పర్వతం'**



స్పటిక-పర్వత శిఖరం (వెనకగా)

— అనబడే మానవ మేధస్సుకే అందనంతటి ఎత్తుగా కల్పించే 'సంకల్పంతో' జరిగిన — వాస్తు-నిర్మాణం ! అనేక తాంత్రిక గణిత ఖగోళ-జ్యోతిష రహస్యాలెన్నో కలబోసిన — 'దివ్య-జ్ఞాన మందిరం' ఇది!

ఈ "స్ఫటిక-పర్వతం" నిలబడివున్న నలుచదరపు పీఠం — నాలుగువైపులా చుట్టుకొలతలు గనకచూస్తే పదమూడు (13) ఎకరాల విస్తీర్ణంలో కట్టబడివున్న ఈ స్పటికశిఖరానికి అడుగునవున్న 'అరుగు' వంటి వేదిక నూటఇరవై అడుగుల ఎత్తు !!

నాలుగువైపులా సమానంగా అతి తెల్లటి పాలరాయివంటి ధృడమైన శిలలచేత పునాదిలాగ పీఠంలా కట్టబడివున్నది. ఆ పీఠం పైనుంచి ఆకాశంలోకి చొచ్చుకునిపోతూ నాలుగు పలకల ముఖాలతో పైకి కోసుగా పెరిగిన శిఖరం — చిట్టచివరగా సూదిలా చెక్కబడిన

– స్ఫటికం ‘నవరత్నాల’లోని వజ్రంకంటే తీక్షణమైన తేజస్సుతో కళ్ళు జిగేల్‌మనేలాగ గడ్డకట్టిన పాదరసం రంగుతో మెరుస్తోంది !

అది రసబంధనంతో పాదరసాన్ని స్థంబింపచేసి అలా శిలలాగ త్రిభుజాకారంగా నాలుగు ముఖాలతో ఏర్పాటుచేసిన **‘శిఖరం’** స్ఫటిక పర్వతంపైన — మండుతున్న వెలుగులా కనిపిస్తోంది — ఓ ‘కార్తీక శిఖరదీపం’ లా ప్రకాశిస్తూ !

నాలుగు దిక్కులకూ ఆ నాలుగు ముఖాల ‘పిరమిడ్’ వంటి స్ఫటికరాయితో — మంచు గడ్డకట్టినట్టు పర్వతంలా ఏటవాలుగా సుమారు రెండువేల నూటఅరవై (2160) అడుగుల ఎత్తువున్నది ! దాని నాలుగు ముఖాలు సమానంగా నిర్మాణం చేయబడినాయి. అందులోని ఉత్తరముఖంమీద ఏటవాలుగా భూమికి ఇరవైమూడు 23^{0} డిగ్రీల కోణంలో తూర్పునుంచి పైకి ఎత్తున పెట్టబడిన — ఒకచిన్న ‘సూదిబెజ్జం’ వంటి రంధ్రం కనిపించింది జాగ్రత్తగా పరిశీలనగా చూస్తే !

మాలో గణితశాస్త్రం, ఖగోళం, జ్యోతిషం, సైన్సులలో సిద్ధహస్తుడూ, గొప్ప ఆసక్తికల రష్యన్ పరిశోధకుడూ, ‘ఔస్పెన్‌స్కీ’ ఆశ్చర్యంతో తెరిచిన కళ్ళువిప్పి, నోటమాటరాక తెరిచిన నోరుతో విస్తుపోతూ అలాగే నిలబడ్డాడు ! కొన్ని క్షణాలకు తేరుకుని — “గురుదేవా ! లామా మహాశయా! ఆ పిరమిడ్ వంటి కట్టడానికి ఉత్తరముఖాన వున్న సూదిబెజ్జం వంటి రంధ్రం పెట్టబడివున్నదికదా ! దాని ప్రయోజనం ఏమిటి ?” — అన్నాడు జేబులోంచి తన నోట్‌బుక్‌తీసి వివరాలు నోట్‌చేసుకుంటూ చకచకా ఆ స్ఫటిక పర్వతం ఆకారాన్ని రేఖాచిత్రంగా వేస్తూ.

దానికి లామా మహాశయుడు ప్రశ్న వేస్తూంటే మళ్లీ అతడే ఇలా సమాధానం చెప్పసాగాడు.

"అది ఏముఖంగా వున్నది ?"

అది సరిగ్గా ఉత్తరంవైపు తిరిగివున్నది గురుదేవా !

"భూమికి ఎంత ఎత్తులో వున్నది ?"

"సరిగ్గా భూమి ఆకాశం కలిసేరేఖకు — ఇరవైమూడు 23°- డిగ్రీల కోణంలో ఎత్తున ఏర్పడివున్నది.

"సరిగ్గా చూడండి ! అది ఉత్తరం తూర్పులకు నడిమధ్యన అంటే — ఈశాన్యదిక్కుగా భూమీ ఆకాశం కలిసే రేఖకు ఇరవైమూడు భాగల కోణంలో ఎత్తుమీదగా వుండే నక్షత్రం ఏది ?" ఔస్పెన్‌స్కీ తన జేబు లోంచి చిన్న నోట్‌బుక్ తీసి ఒక ఆకాశం మేప్ (Map) లాగ చిన్నగా అందులో ప్రింటుచేసివున్న నక్షత్రాల డిగ్రీలను కొలిచి — ఆశ్చర్యపోతూ అన్నాడు "అది ధృవనక్షత్రం గురుదేవా ! సరిగ్గా అదేఎత్తున ఈశాన్యంగా అదేకోణంతో ఈ పిరమిడ్ రంధ్రం కూడా నిర్మించబడి వున్నది."

"దానివల్ల కనిపించే విచిత్రం ఏమిటి ?"

"విచిత్రమా !" అంటూ తలపై టోపీని తీసి బుర్రగోక్కుని మళ్లీ టోపీ పెట్టుకుని "ఈ ధృవనక్షత్రానికి కుడివైపున — అంటే తూర్పుదిశగా సప్తమహాఋషుల మండలం ఉదయిస్తుంది ! అది పల్లకిలాగ అర్ధచంద్రాకారంగా ఆకాశంలో పన్నెండుగంటల స్థితికి వచ్చి — చివరకు వాయవ్యంగా అంటే పడమర ఉత్తరం మధ్యగా — అస్తమిస్తుంది మామూలుగా. కాని మనం ఇక్కడ హిమాలయాలమీద ఎంతో ఉత్తరంగా

ఉండబట్టి సప్తమహర్షులు అస్తమించరు ! పడమరవైపునుండి నేలవైపుకు దిగి అర్థరాత్రంతా నేలబారుగా ప్రయాణించి తిరిగి, తూర్పువైపుకు తిరుగుతూ గుండ్రంగా తూర్పు-ఉత్తరం వైపున ఈశాన్యంగా ఇరుసులా తిరుగుతుంది."

సప్తమహర్షి మండలం అంటే ఏమిటి? ఈ సప్తమహర్షి మండలం ఉత్తర దిక్కు వుండే ధ్రువనక్షత్రం చుట్టూ చక్రాకారంగా తిరుగుతుంది – అని. నాకున్న అతి తక్కువ జ్యోతిష పరిజ్ఞానంతో ఆలోచిస్తే ఈ స్ఫటికంతో నిర్మాణంకాబడ్డ పిరమిడ్ 26,000 వేల సంవత్సరాలకి ఒక్కసారి ఈ రాశిచక్రము దాటి అయనాంశల గతితో కొలతలు నమోదు చేసిన **జ్యోతిష యంత్రంగా** — ఇది ఎవరో మహానుభావులు అసాధ్యమైన ఖగోళ, జ్యోతిష పరిజ్ఞానం కలిగినవారు — అద్భుతమైన తపశ్శక్తితో భవిష్యజ్ఞానము కలిగి రానున్న కలియుగములోని ఆఖరిపాదం వరకూ – ఇంకా ఆపైన మరి రెండువేల నూటఅరవై సంవత్సరాలవరకు (2160) తిరిగే కాలచక్రానికి ఒక గడియారంలా దీనిని నిర్మించారు ! ఇంత శ్రమపడి ఇంతటి ఆగాధమైన జ్యోతిషపరిజ్ఞానంతో దీనిని పూర్వపు సిద్ధగురువులు ఎవరో — ఎందుకు నిర్మించివుంటారు ?"

లామా దోర్జీ చోగ్యాల్ మహాశయుడు చిరునవ్వుతో వింటూ స్ఫటిక పర్వతంవైపు కన్నార్పకుండా చూస్తూ తన చేతిలోని జపమాలను అతి వేగంగా తిప్పుతూ అతి నెమ్మదిగా మంద్రస్వరంతో ఇలా అన్నాడు — "అది ఏదో ఖగోళ, జ్యోతిష, తంత్రరహస్యాలతో నిర్మించబడ్డ రాశిచక్రము వంటి నిర్మాణం ! బహుశా రానున్న **అవతారమూర్తి గురించి** అంటే

శంబలకు, స్పటికపర్వతానికి లింకుగావుండే నిగూఢమైన దేవ రహస్యాలు ఈ స్పటిక నిర్మాణంలో బంధించబడివున్నవి — ఒక చిక్కుముడిలాగ.

మరుక్షణమే లామా మహాశయుడు తటాలున వెనక్కితిరిగి తన వెనక నుంచుని ఆనందభాష్పాలతో ఆ స్పటికపర్వతాన్ని చూస్తూ రెండు చేతులూ ఎత్తి నమస్కరించి తన్మయుడైవున్న శ్రీనివాస చక్రవర్తి వీపుమీద ప్రేమగా నిమురుతూ తన ముందుకు లాగి ఇలా అన్నాడు.

"చక్రవర్తీ ! నీవు పరిశుద్ధ వైష్ణవకుటుంబంలో జన్మించావు, వేదకాలం సాంప్రదాయంలో ! అందుకే నీకు మంత్రశాస్త్ర సాంప్రదాయం బాగా తెలుసు ! బయటకి స్పటికంతో నిర్మాణంకాబడ్డ ఈ స్పటికపర్వతం కట్టుబడిలో నీకేమయినా విచిత్రం గోచరిస్తోందా ? నీకు తోచింది తోచినట్టు నాకు చెప్పు !" — అన్నాడు లామా దోర్జీ !

శ్రీనివాస చక్రవర్తి కాసేపటికి నోరు పెగుల్చుకుని అతికష్టంమీద మాట్లాడగలిగాడు.

"గురుదేవా ! ఇది జ్యోతిష, ఖగోళ, తాంత్రిక రహస్యాలతో నిర్మాణం కాబడివున్న కట్టడంలా నాకు తోస్తున్నది ! అంటే ఏమిటో వివరంగా చెబుతాను."

"మా బ్రాహ్మణులు నిత్యం పూజిస్తారే. **'శ్రీచక్రం'** అనే యంత్రాన్ని! అది ముఖ్యంగా రెండురకాలు — ఒకటి త్రికోణాకారం కలిగిన గీతలతో త్రిభుజాకారంగా చిత్రించబడివుండేది శ్రీచక్రం అనే యంత్రం.

ఈ చక్రంలో కొన్ని త్రిభుజాలు తలక్రిందులుగాను, మరికొన్ని త్రిభుజాలు నిలువుగానూ నిలబడివుంటాయి. అలాంటి ప్లాన్ తీసుకొని,

స్ఫటికశిలతో తలక్రిందులుగా నిలబెట్టిన త్రికోణపుశిలలు నాలుగు దిక్కులా కలిగిన పిరమిడ్లవంటి కట్టడాలు ఒక్కదానిపై ఒక్కటి పేర్చి రెండు రకాలుగా కట్టారు. అలానే నిటారుగా నిలబడివున్న త్రికోణాకారంగా వున్న నాలుగు ముఖాలతో నిలబడి పిరమిడ్ల ఆకారంలో కొన్ని పలకలు ఒకదానిపై ఒకటి నిలబెట్టివున్నాయి. దానివల్ల ప్రతీ పిరమిడ్ వంటి ఆకృతీ — మెట్లు మెట్లుగా అంటే మా వైష్ణవ ఆగమశాస్త్రంలో దేవాలయంయొక్క 'విమానం'లాగ కట్టబడివున్నది ఈ మందిరం.

సరిగ్గా ఇలాంటి కొలతలే కలిగివున్న ఈ పిరమిడ్‌లకు నాలుగు దిక్కులకూ రకరకాల దేవతల శిల్పాలు అంటిస్తే — అది సరిగ్గా మా దక్షిణ భారతదేశంలోని **"తిరుమల"** అనే పుణ్యక్షేత్రంలో **"శ్రీనివాస ప్రభువు"** అనబడే భగవంతుడి దేవాలయంపైన వుండే ఆలయ విమానశిఖరంలా కనిపిస్తున్నది !" అంటూ కరెంటుషాక్ కొట్టినట్టు తుళ్ళిపడి చేతులు దులిపేస్తూ ఆశ్చర్యంగా అన్నాడిలా ! "అది తిరుమల వేంకటేశ్వరప్రభువు ఆలయ విమానపు గోపురశిఖరంలా వున్నదే ! మాపూర్వికులు చెప్పిన దేవాలయ గోపురాల నిర్మాణంనుంచే ఈజిప్టులోని పిరమిడ్‌ల నిర్మాణం కూడా జరిగిందని ! అది ఇప్పటికి ఇన్నాళ్లకు కళ్ళముందుకు వచ్చింది ఆశ్చర్యమైన ఈ స్ఫటికపర్వతం రూపంలో !

"గురుదేవా ! నాకింకో ఆశ్చర్యం కలిగించే రహస్యంకూడా తట్టింది దైవికంగా ! అదేమిటంటే — మనమీ స్ఫటికపర్వతాన్ని చేరుకునేముందు నదికి అడుగున భూమిలోంచి సొరంగమార్గంలో ప్రయాణించాం కదా ?"

"అవును శ్రీనివాస చక్రవర్తీ — ఏమిటిప్పుడు నీసందేహం ?" — అన్నాడు లామా దోర్జీ.

“ఆ సొరంగ మార్గంలో మనకి కుడివైపున '**భూమిస్పర్శ**' ముద్ర పట్టిన రూపంతోవున్న భవిష్యత్తులో అవతరించే బుద్ధవిగ్రహం చూశారు కదా !

“అవును చూశాము ! ఐతే ?”

“ఆయన సరిగ్గా ఆ మైత్రేయబుద్ధుడు భూమిని చూపే మార్గంలో ఏదో రహస్య మార్గాన్ని చూపిస్తూవుండేలాగ హస్తం చెక్కబడివుందిగదా ? సరిగ్గా అలాగే నేనిప్పుడు చెప్పిన తిరుమలక్షేత్రంలోని మీ శ్రీనివాస ప్రభువు విగ్రహంకూడా ఒక చేతిని క్రిందకు చూపిస్తూవుంటుంది — భూమి స్పర్శముద్రలో ! తిరుమల క్షేత్రంలోని దేవరహస్యాలు తెలిసిన పండితులు చెప్పగా విన్నాను — శ్రీవేంకటేశ్వరస్వామివారి ఈ హస్తం — ఆయన పాదాలక్రింద అడుగున **రహస్యబిలం**గా ఏర్పడివున్న ఓ సొరంగ మార్గాన్ని చూపిస్తోందని ! ఇది, మా వైష్ణవులు, వైఖానసులలో — ఎవ్వరికీ తెలియదు ! ఈ రహస్యం నాకు కూడా ఇప్పుడే ఈ స్ఫటికపర్వతానికిచేరే భూమిలోని సొరంగమార్గాన్ని చూపించే బుద్ధవిగ్రహాన్ని చూస్తే — దాని లోని రహస్యార్థం వలన **శ్రీనివాసప్రభువు పాదాల అడుగునకూడా** ఒక **సొరంగమార్గం** వున్నదని **గుర్తుకువచ్చింది** !” అంటూ ఆశ్చర్యంగా చెప్పుకు పోతున్నాడు శ్రీనివాసచక్రవర్తి.

లామా దోర్జీ సావధానంగా వింటూ ఇలా అన్నాడు.

“చక్రవర్తీ ! నీకు ఎక్కడెక్కడో దేవరహస్యాలను కలిపే బ్రహ్మముడి వంటి సంధులు స్ఫురిస్తున్నాయి నీబుద్ధికి. నీవు చెప్పిన భూమిలోని సొరంగమార్గం “నరసింహ బిలం” అంటారని కూడా నీకుతెలుసా ?

"అలాగని ఎక్కడవున్నది గురుదేవా ?" అన్నాడు చక్రవర్తి ఆశ్చర్యంగా !

"మీ వెంకటేశ్వరస్వామి భక్తులలో మహాయోగిని, సిద్ధురాలు ఒకామె వుండేది !" — చోగ్యాల్ అందుకున్నాడు.

"తరిగొండ వెంగమాంబగారా ?" ఆశ్చర్యపోతూ అడిగాడు శ్రీనివాస చక్రవర్తి ! "అవును ! ఆమెను ఒకసారి ఆలయంలోకి ప్రవేశించకుండా మా ఆలయ అర్చకులు గడితలుపులు బంధిస్తే — ఆమె భూమిలో ఈ రహస్య సొరంగం ద్వారానే నరసింహబిలంలో ప్రయాణించి చివరికి గర్భగుడిలోని శ్రీనివాస ప్రభువుని దర్శించేది.

అంతేకాదు ! శ్రీవేంకటేశ్వరస్వామి కలియుగదైవం అంటారు గదా ? అంటే ఈ కలియుగాంతానికి ఆయన పాదాల క్రిందవుండే రహస్య మార్గాన్ని నృసింహబిలాన్ని చూపించే రహస్యమార్గానికి — ఇక్కడ స్ఫటిక పర్వతం అడుగున ప్రవేశించే రహస్య సొరంగమార్గానికీ రెండింటికీ ఏదైనా సంబంధంవున్నదా ?" అన్నాడు సూచనప్రాయంగా.

ఇంతలో జగదీష్ చంద్రబోస్ ఆసక్తిగా ముందుకువచ్చి లామా దోర్జీ చోగ్యాల్‌ను ప్రశ్నించాడిలా — "లామా గురుదేవా ! నేను పవిత్ర బెంగాలీ బ్రాహ్మణుల సాంప్రదాయంలో పుట్టాను. మా బెంగాలీలు జగన్మాత ఐన ఆదిశక్తిని పూజించే భక్తులు ! నవరాత్రులలో దేవీపూజలు తప్పక చేస్తాం మేము. ఇప్పుడు నేను చెప్పేది ఒకటే. మా పూజలలో శ్రీచక్రం - ప్రధానమైంది. ఈ శ్రీచక్రము రెండు రకాలుగా వుంటుంది. ఒకటి ల్లపరుపుగా రేకుమీద త్రిభుజాకారపు గీతలతో వేసిన రేఖాచిత్రము.

రెండవది పంచలోహాలతో మెట్లు మెట్లుగా శిఖరంలాగా పోతపోసిన మేరుప్రస్థార శ్రీచక్రం — ఇంకొకటి ! ఈ రెండవది గీతలతో వేసిన చిత్రానికి పొడవు వెడల్పు ఎత్తుగల స్థూలమైన ఆకారమే !

సరిగ్గా అదేశైలి ఈ స్ఫటికపర్వతం కట్టడంలో నాకు స్పష్టంగా కనిపిస్తోంది. ఒక త్రిభుజం తలక్రిందులుగావుంటే మరొక త్రిభుజం దానిపై నిటారుగా పెట్టినట్టుగా, కట్టుబడివున్నది. దానినే **"మేరుప్రస్తార శ్రీచక్రం"** అంటారుగదా ? మా బెంగాలీ శాక్తేయ సాంప్రదాయంలో."

"ఇంతకీ నీ సందేహం ఏమిటి జగదీష్‌బాబూ ?" సూటిగా ప్రశ్నించాడు లామా దోర్జీ.

"లామా గురుదేవా ! నా సందేహం ఒక్కటే ! ఇటు మా తూర్పు బెంగాలీల శాక్తేయ సాంప్రదాయంలో శ్రీచక్రమూ అటు దక్షిణాదిన తెలుగు వారి గడ్డమీద శ్రీనివాసప్రభువు దేవాలయ నిర్మాణమూ — రెండూ ఒకే మూలసూత్రాల వాస్తుపైన ఎలా నిర్మించబడివుంది ? ఈ రెండింటికీ ఏదైనా సంబంధం వుండవచ్చునేమో అని నా సందేహం !"

దాంతో లామా మహాశయుడి కళ్ళు జిగేల్మని తళుక్కున మెరిశాయి ఆనందంతో !

"ఏముంది? ఒకటి **'శ్రీచక్రం'** మేరుప్రస్తారం — అంటే ప్రకృతి స్వరూపిణి అయిన **జగన్మాతకు** సూచిక ! రెండవది ఈ ప్రకృతికి **ప్రభువైన** భగవంతుడు **'శ్రీనివాసునికి'** సూచిక !

ఒకటి **"శ్రీ"** అయితే — రెండవది ఆ "శ్రీ" నివసించడానికి ఆధారమైనవాడు — అంటే **"శ్రీనివాసుడు"** ! ఈ సృష్టికి ఆధారమైన శక్తికి



శరణ్యమైన భగవంతుడు ! మరి ప్రకృతికీ పురుషునికి సంబంధంలేకుండా ఈసృష్టి ఎలావుంటుంది ? ఒకటి "శ్రీ" అయితే రెండవది ఆమెకు **"నివాసుడు"** — తెలిసిందా ?" అన్నాడు లామా దోర్జీ చోగ్యాల్.

దానితో మా మనస్సులోని సందేహాలన్నీ తీరి — మాబుర్రలో ఏదో ఒక లైటు వెలిగినట్టయింది !

*

46

శంబల - భవిష్యాలు !

స్పటికపర్వతం చుట్టూరా ప్రదక్షిణంగా చేతులు జోడించి నమస్కారంతో తిరిగాం ! ఆ వెలుగుకూ, తీవ్రమైన దాని శక్తితరంగాలకూ మా కళ్ళు జిగేల్‌మంటూ సూర్యబింబం చుట్టూరా కనిపించే ఒక వెలుగులాగ ఒక 'వెండి-దూది' వంటి తేజస్సుతో కనిపించగానే మా మనస్సులూ, శరీరాలు ఈ ప్రపంచంలోనే లేనట్టూ, ఏదో స్వప్నలోకాలలో తేలిపోతున్నట్టూ ఫీలయ్యాం !

అలా పదమూడు (13) ఎకరాల వైశాల్యం గల ఆ 'స్ఫటిక-మందిరం' చుట్టూ ప్రదక్షిణంగా తిరగడానికి మాకు కొన్నిగంటలు

పట్టింది ! బాగా అలిసిపోయాం ! మాలో అందరికీ దిగచెమటలు పోసి బట్టలన్నీ తడిసిపోయాయి ! మేమంతా చల్లటి మంచుకొండలైన హిమాలయ శిఖరాలపైన వున్నామన్న విషయంకూడా — ఆ సమయంలో మాకు గుర్తురానేలేదు !

అలా ప్రదక్షిణం పూర్తి-అయి మేమంతా దాని ఉత్తరపు దిక్కున ఏటవాలుగావున్న దిక్కుకువున్న కొండచరియవేపు రాగానే — "ఈ స్ఫటిక-పర్వతం లోపలికివెళితే ఏముంటుంది గురుదేవా ! ఈ స్ఫటికమందిరం లోపల నిర్మాణంకాబడ్డ వాస్తుచిత్రాలూ, గణిత, ఖగోళ, జ్యోతిష అద్భుతాలూ ఇంకా ఎన్నోవుంటాయని నాకు గట్టిగా అనిపిస్తోంది !" అన్నాడు ఆధ్యాత్మిక విషయాలలో నిగూఢమైన పరిశోధనలుచేసిన రష్యన్ వేదాంతి — 'ఔస్పెన్-స్కీ' !

"దానిలోకి ప్రవేశించడానికి ఎటువేపునా ద్వారంలాంటిది ఆ నాలుగుదిక్కులలో ఎక్కడా కనిపించటంలేదే ? ఈజిప్టులోని 'పిరమిడ్' లాగే ఈ "స్ఫటిక-పర్వతం" కూడా దళసరిగా స్ఫటిక శిలతో నిర్మాణంకాబడి వుండవచ్చు !" అన్నాడు లామా-దోర్జీ ! తన ప్రదక్షిణం పూర్తిచేసుకుని పిరమిడ్‌వంటి స్ఫటికశిఖరానికి తూర్పుదిక్కున నిలబడి వెనక్కి తిరిగాడు — ఆయన వీపు వెనక స్ఫటికపర్వత శిఖరం వుండేలాగ !

అది ఇంక మాకు అందరమూ వెనక్కితిరిగే సూచనగా భావించి — ఆయన వెనకే మేమంతా బారుగా లైనుకట్టి నిలబడి నడవసాగాం ! అలా ఒక వెయ్యిగజాలు నడిచామో లేదో — అక్కడొక విచిత్రమైన 'శిల్పం' వంటిది కనిపించింది !

దాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అది ఓ సింహం ఆకారంలోవుండే శరీరమూ — మనిషి ఆకారంలోవున్న తలా కలిసి ఏర్పడివున్నాయి ! రెండుభుజాలకూ గరుడపక్షి రెక్కలవలే రెండు రెక్కలూ — ఎగురుతూన్నట్టుగా తెరుచుకుని, దాని కళ్ళు అరమోడ్చి ధ్యానముద్రలో వున్నాయి. మనిషిముఖం వున్న గరుత్మంతుడి ముక్కులాగ కోసుగా వంపుతేలి పొడవుగా ఎండుమిరపకాయ తొడిమెలాగ వున్నది దాని ముక్కు !! ఈ విగ్రహం సరిగ్గా 'ఈజిప్టు'లోని మనిషీ సింహం కలిసిన "స్పింక్స్" (Sphynx) ను పోలిన ఆకారాన్ని పోలివున్నది.

ఆ విగ్రహంముందు ఒక చిన్న అరుగువంటి రెండడుగుల చదరంగా ఓ 'బలి-పీఠం' లా వున్నది. దానిమీద లోతుగా దీపారాధన ప్రమిదవంటి గుంటలో లామా-దోర్జీ తన చేతికి తగిలించుకున్న జోలె వంటి సంచీలోంచి ఓ గుప్పెడు 'ధూపం-పొడి' తీసి దాంట్లో వేశాడు ! అది సాంబ్రాణీ, పచ్చకర్పూరం, చందనమూ, నెయ్యీ వంటి అనేక సుగంధ వస్తువులతో చేసినట్టుగా 'ఘుమ-ఘుమ' లాడిపోతున్నది ! ఏమిటదీ ? అని నేను ఆశ్చర్యపోయేలోగా రెండు నల్లటి రాళ్ళువంటివి, తన సంచీలోంచి తీసి గట్టిగా — ఒకదానికొకటి కొట్టి, రాపాడించగా సర్రున మూడు నిప్పురవ్వలు రాలి, ఆ పొడిమీద పడి దాంతో నిప్పంటుకున్నది ! అవి నిప్పు వెలిగించే 'చెకు-ముకి' రాళ్ళని అర్థమైంది !

అలా వెలిగించిన ధూపం పొడి వెంటనే అంటుకుని — దట్టమైన పొగలు ధూపంగా ఘుమ ఘుమా, పరిమళాలు వెదజల్లుతూ ఓ అడుగున్నర ఎత్తున జ్వాలగా మంటలేచింది 'ఛట్-పట్' మనే శబ్దాలతో !

లామా మహాశయుడు దానికెదురుగా నిలబడి రెండుచేతులూ ఎత్తి నమస్కరిస్తూ కళ్ళు మూసుకుని ధ్యానించాడు నోటిని కదుపుతూ ఏవో మంత్రాలు అస్పష్టంగా ఉచ్చరిస్తూ !

అలా ఐదారునిమిషాలు గడిచింది ! వెలిగించిన మంటవేడికి కాబోలు అనుకున్నాం ! 'ఛట్'-'ఫట్' మనే చప్పుడుతో పేలి ఆ విగ్రహం ముందు ఒక సూటిగా నిటారైన సందువంటి ద్వారం ఏర్పడింది !

అది క్షణాలమీద విచ్చుకుంటూ — కుడి ఎడమవైపులకు ఒక 'డ్రామా-తెర'లా రెండుపక్కలకూ తెరుచుకుంది ! ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని చూస్తూ అలాగే నిలబడ్డాం అందరం — విస్తుపోతూ !

“ఈక్రిందనుంచే ఒక రహస్య ద్వారం భూమిలోపలికి తెరుచుకుంటూవుంది — చూడండి !” ఈ సొరంగం లోపలినించి అడుగునకు దిగి ఆ 'స్ఫటిక-పర్వతం' దిక్కుగా నడిచిపోతే సొరంగంద్వారా నేరుగా ప్రయాణిస్తే అది సరిగ్గా — పోయి పోయి, అదిగో ! ఎదురుగా కనిపించే స్ఫటిక 'శ్రీచక్రం' వంటి పీఠం అడుగునకు చేరుకునే ఓ లోతైన బావిలోకి దారితీస్తుంది ! ఆ 'దారి' లోపలకి కిందికి మెట్లుగా దిగుతూపోతే సరిగ్గా పైనవున్న ఆ 'పిరమిడ్-ఆకారం' గల స్ఫటిక-శిఖరం క్రిందవున్న ఒక “పుష్కరిణి” వంటి కోనేరు మెట్లమీదుగా భూమి అడుగుకు దారి తీస్తాయి !

అవి క్రమంగా వెడల్పుతగ్గుతూపోతూ — ఆ పదమూడుఎకరాల పిరమిడ్ పీఠం-లోపల పన్నెండు ఎకరాల వైశాల్యంతో, అలా తగ్గుతూ పోయి — 13, 12, 11, 10, 9, 8, 7, 6, 5, 4, 3, ... ఇలా తగ్గి

చివరికి త్రికోణంయొక్క సూదిగా వుండే మొనక్రింద వుండే పుష్కరిణి అడుగుభాగానికి చేరుతుంది !

అది — ఈపైన కట్టబడిన 'స్ఫటిక-పర్వతం' ఎంతఎత్తు వున్నదో — భూమిలోపలకి కూడా మెట్టుమెట్టుగా కిందికి దిగుతూ ! — అడుగుకి వెళితే **అంతే లోతు** వున్నది !

అలా, అట్టడుగున వుండే సూదిలాంటి 'పిరమిడ్-కొస'నుండి నిచ్చెనవంటి మెట్లు నిటారుగా పైకి తీసుకువెళతాయి ! అవి చాలా మెరకగా నిట్టనిలువుగా వుండి ఎక్కడానికి కష్టమైనవి ! అవి క్రమంగా ఆ బోర్లించిన పిరమిడ్‌వంటి 'స్ఫటిక-పర్వతం'లో గుల్లగావుండే — లోపలి గర్భాలయం ఒకటి — అందులో దర్శనమిస్తుంది ! సరిగ్గా స్ఫటిక పర్వతం లోపల నడిమధ్యన తలక్రిందులుగా రివర్స్‌గావున్న 'పిరమిడ్'కు చేరుకునే మార్గం ఇది ! నిలబెట్టిన పిరమిడ్‌కు కేంద్రంకిందగా దాని నడిమధ్యన వుండే 'బిందువు' !

అక్కడ స్ఫటికపర్వతం గర్భాలయంలో — దాని హృదయంలాంటి ఒక గుహలావుండే 'చదరం' ఆకారంలో పన్నెండు అడుగుల పొడవు, పన్నెండు అడుగుల వెడల్పుతో కట్టబడిన ఒక నీలం స్ఫటికం రంగు గది దిగుతూవుంటుంది ! దానిలోకి 'మహాయోగులు' తప్ప మామూలు మనుషులు ఎవ్వరూ ప్రవేశించరాదు ! ప్రవేశించలేరు కూడా !! ఒకవేళ ఎవరైనా బలవంతంగా ప్రయత్నించి — అందులోకిగనక వెళితే నీలం రంగు వజ్రంవంటి ఆ స్ఫటికగదిలోని నీల-లోహిత (Ultra Violet) తరంగాల తీవ్రతకి శరీరంలో రక్తప్రసరణ ఆగిపోతుంది ! గుండె కొట్టు

కొవటం నిలిచిపోతుంది !! ఊపిరి తీసుకోలేక, చివరికి శ్వాసకూడా బంధించబడుతుంది !!!" — అన్నాడు లామా-దోర్జీ !

"అది యోగంలోని 'కేవల-కుంభకం' లోకి దారితీస్తుందా ? గురుదేవా !" అన్నాడు శ్రీనివాస చక్రవర్తి తనకున్న కొద్దిపాటి యోగసాధనలోని 'ప్రాణాయామం' లో కలిగిన "కేవల-కుంభకం" లోని స్థితిని అనుభవంలో గుర్తుచేసుకుంటూ !

"అది సమాధిస్థితిలోకి అంటే "నిర్వికల్ప సమాధి" లోకి లాగేస్తుంది సుడిగుండంవలే ! ఇదంతా నాడీగ్రంథం వంటి ఒక ప్రాచీన తాళపత్ర గ్రంథంలోవున్నది చదివి నా గురుదేవులు చెప్పగా విన్నాను ! అందులో ఇంకా శంబలప్రభువు వొచ్చినప్పుడు జరిగే విషయాలు ఎన్నో రాసివున్నాయి !" — అన్నాడు లామా.

"అందులో ఏమున్నాయి లామా గురుదేవా ? మేము ఎలాగూ 'స్ఫటిక-పర్వతం'లోకి ప్రవేశించలేము ! ప్రవేశించినా మనం ప్రాణాలతో బయటపడలేం ! కనీసం మీరు చెపితేనైనా విని సంతోషపడతాము." అన్న — మా మాటలు వినగానే తటాలున వెనక్కితిరిగాడు లామా దోర్జీ చోగ్యాల్ మహాశయుడు — మాకు ఎదురుగా నిలబడుతూ !

"అందులో ఏమున్నదో మాలో ఎవ్వరూ చదవలేదు ! కాని కొన్ని కొన్ని విచిత్రమైన వ్యాఖ్యలు, పాడిశ్లోకాలు, వచనములూ, కలిసి కొన్ని చదవగలిగేవి వున్నాయి. వాటిని **"శంబల–భవిష్యాలు"** అంటారు ! అవి పెద్దలు చెప్పగా నేను విన్నవి — ఇలావున్నాయి !

༎ དབང་ཐང་བསྟན་ཤད་གཉིཾ་ལོ་ཤིང་ཕོ་འབྲུག
། ལོ་སྐྱོང་རྒྱལ་པོ་གཉེན་ནུའི་སྐྱོང་།
། ཚེམ་ཀུན་ཟེན་ཆེ་རྗོད་འབྲུག་འོང་།
། དགྲ་རྒྱུན་ལ་སོགས་འཚེར་བ་མང་།
། མཚོན་གྱི་ལྷུག་བསྐུལ་སྣ་ཚོགས་འབྱུང་།
། ཆར་བབས་སྐྲ་རྒྱལ་ཡ་བུ་འཁྲུག
། སོ་སྨད་གཡུལ་རྒྱལ་སྨན་དག་མཁན༎

- ★ ఆకాశంలో ఓ కొత్త నక్షత్రం కనిపిస్తుంది !
- ★ 'సైతాన్' వస్తాడు !
- ★ మానవులు అణువును బ్రద్దలుచేస్తారు ! దాని మంటలకి వినాశం చెల రేగుతుంది.
- ★ రాత్రి ఎర్రగా — పగలు లాంటి, సంధ్యాకాంతితో మండి పోతుంది.
- ★ ప్రపంచమంతా భగ్గున మండిపోతుంది !
- ★ మండుతూవున్న దేశాలపై ఎగురుతూవున్న తెల్లగుఱ్ఱం

పోతూ కనిపిస్తుంది ! 'శంబలప్రభువు' చేతిలో 'మృత్యుకిరణం' అర్థ-చంద్రునిలా ఖడ్గంఆకారంలో ఫోకసింగ్‌చేస్తూ !

★ స్త్రీ పురుష లింగాల మార్పిడి జరుగుతుంది.
★ సృష్టిధర్మం తలక్రిందులవుతుంది. ఓజంతువుకు ఇంకో జంతువు పుడుతుంది. అప్పుడే 'యుగసంధి' పుట్టును.
★ అన్నిమతాలూ నశించిపోయి వాటి పేర్లుంటాయి అంతే !
★ పుట్టుకతో దివ్యశక్తులుగల పిల్లలు పుట్టుకొస్తారు ! వేదాలు చదువుతారు, భవిష్యత్తు చెబుతారు.
★ వారి వాక్యం అప్పుడే జరుగుతుంది.
★ వాళ్ళే ఋషులు !!!
★ ఋషుల — వెనకాలే 'శంబలప్రభువు' వస్తాడు.
★ ప్రపంచవ్యాప్తంగా వరదలు, మంచుతుఫానులు !
★ సముద్రాలు గట్టునుదాటి ఊళ్ళను ముంచుతాయి.
★ భూకంపాలు వస్తాయి.
★ భూపరిభ్రమణం మారి భూమి చలిస్తుంది.
★ టిబెట్‌కు 'ఎర్రబోయలు' వస్తారు. ఆలయాలను, లామాసరీలను అపవిత్రం చేస్తారు.
★ 'ఇనుప-పక్షి' టిబెట్‌పై ఎగురుతుంది — నిప్పులు కక్కుతూ !
★ ఒకేమాసంలో సూర్య చంద్ర గ్రహణాలు రెండుపక్షాలలోనూ వస్తాయి.
★ 'పదమూడు-రోజుల' పక్షం వస్తుంది ! ప్రళయాన్ని తెస్తుంది !

★ తురక క్రైస్తవ జాతులమధ్య భయంకర యుద్ధం వస్తుంది.

★ ప్రపంచంలోని అన్నిమతాలు నశిస్తాయి. సత్యధర్మం ఒక్కటే 'శంబలప్రభువు' — మతం నిలుస్తుంది!

★ ఒక్కడే భగవంతుడు — ఒక్కటే మానవజాతి! సత్యం ఒక్కటే అన్నదే చివరకు మిగులుతుంది.

★ 'కలిమాయ' అంతమవుతుంది. 'నిజం' నిలకడమీద నిలబడుతుంది.

★ ధర్మచక్రంతో ధర్మమూర్తిగా పాలించే రాజు వస్తాడు.

★ ఆయనే ప్రపంచాన్ని ఏకంచేస్తూ, నిర్మలంచేస్తూ ఈ స్పటిక పర్వతాన్ని ఇలా నిలబెట్టి ప్రభుత్వాన్ని స్థాపిస్తాడు.

★ సత్యయుగం తప్పదు! సత్యపురుషులే దానిని చూడగలరు.

ఇవి — "శంబల-భవిష్యాలు"!

47

"వజ్ర-శ్రీచక్రం" - 'మేరువు !'

ఆ స్ఫటికపర్వతం అడుగునే నడుస్తూ లామా దోర్జీ-చోగ్యాల్ వెనకే అనుసరిస్తూ వెళ్ళాం.

వాతావరణం వెచ్చగావున్నదిగాని మరీ అంత ఇబ్బందిగా ఉక్కగా లేదు, మరీ చల్లగానూ లేదు ! మేము చేరుకున్న ఈ నలుచదరపు గదిలో, తాళపత్రాలలో రాసివున్న '**భవిష్యాల్ని**' విన్నాక — మా అందరికీ ఒకగొప్ప అనుమానం కలిగింది. అసలీ తాళపత్రగ్రంథాలు దాచివుంచిన గదికి అడుగునగానీ ఎత్తున గానీ అసలైన ఇంకో సజీవమైన ఆధ్యాత్మిక పూజామందిరం వంటిదేదో వుండివుండాలనీ, అక్కడినుంచే ఈ శక్తివంత

మైన 'ఆధ్యాత్మిక-తరంగాల' వంటివి మనస్సులను బలవంతంగా ఆకర్షించి నిర్మలంచేసే జ్ఞానతరంగాలు వస్తూవుండివుండాలని ! ఆమాటే ధైర్యంచేసి లామా చోగ్యాల్‌తో అన్నాను. ఆయన తుళ్ళిపడ్డట్టుగా ఉలిక్కిపడి నావంక ఆశ్చర్యంగా చూస్తూ ఇలా అన్నాడు :

"నీవు అసాధ్యుడివయ్యా ! నీ పూర్వీకులు చేసిన పుణ్యం — సంస్కారాల రూపంలో నీ శరీరంలో, అంతటా జీర్ణించుకుపోయివున్నది. ఆ పూర్వపుణ్యం వల్లనే నీకిలాంటి శరీరం లభ్యంకావటం కూడా సాధ్యమైంది ! ఎందుకంటే ఈ శరీరం ఒక పనిముట్టు ! అంటే — మీ భాషలో చెప్పాలంటే ఒక టెలిఫోన్, టెలివిజన్ వైర్‌లెస్ లేదా కంప్యూటర్ వంటి యంత్రంలా పనిచేసే పనిముట్టు !! మనలోని నరాలు, మెదడు మనలోని సూక్ష్మ-శరీరమూ, మనచుట్టూ రెండు, మూడు అడుగులదాకా వ్యాపించి వుండే తేజస్సులాంటి 'జ్ఞానచక్రమూ', ఇలా ఎంతో దూరంనుంచి ప్రసరించే విషయాలనుకూడా ఇలా — ఆలోచన అక్కర్లేకుండానే గ్రహించగలుగుతాయి! నువ్విప్పుడు ఇక్కడికి దగ్గరలోనేవున్న స్ఫటికవజ్ర పూజా మందిరం గురించి అలానే అడిగావు! నువ్విలా అడగకపోయి వున్నట్టయితే నేనీయాత్రను ఇక్కడినుంచే పూర్తిచేయించి — మిమ్మల్ని వెనక్కి తీసుకువెళ్ళేవాడిని ! కాని, మీకు శంబలప్రభువు అనుగ్రహం సంపూర్ణంగా వున్నది. ఇకనుంచీ ఏ విషయం మీనుంచి, దాచను.

"మనం చూడని స్ఫటిక మందిరం — కేవలం మన శరీరంవంటి బాహ్యరూపం మాత్రమే ! దీని అడుగున మనం ప్రయాణించిన భూగర్భ సొరంగమార్గం — మన వెన్నెముకలోని బ్రహ్మరంధ్రంమధ్యలో ప్రసరించే

సుషుమ్నానాడి వంటి మార్గం అనుకుంటే — ఇప్పుడు మనం చేరుకోబోయేది **ఆత్మవంటి** అసలు మందిరం !

ఈ అతిపవిత్రమైన ఆధ్యాత్మిక జ్ఞానకేంద్రానికి మిమ్మల్ని ఇప్పుడే తీసుకువెళతాను !" అంటూ పది అడుగులు నడిచి ఓ మెట్లవంటి మార్గాన్ని సమీపించాడు. ఆ మెట్లు — నేలమీదనుండి ఏటవాలుగా ఇరవైమూడు (23°) డిగ్రీల కోణంలో పైకిలేస్తూ నిర్మాణంకాబడ్డాయి.

ఇక్కడ కాగడాలవంటివి ఏవీ అక్కరలేకుండానే సహజమైన రేడియం కాంతిద్వారా వెలుగుతున్న లైట్లలో ఈ మెట్లెక్కేమార్గం ఆశ్చర్యంగా వెలిగి — పగడాలతో తాపడం చెయ్యబడివున్నది ! కొన్ని పగడాలు ఎర్రగాను మరికొన్ని లేతనీలంగానూ మలచబడివున్నాయి. ఇంకొన్ని పగడాలు చిత్రవిచిత్రంగా డిజైన్‌లతో మెలికలు మెలికలుగా ఆకుపచ్చని రంగులో వైడూర్యంలానూ మెరిసిపోతున్నాయి !

ఇంతలో అకస్మాత్తుగా మెట్లు ఆగిపోయాయి ! ఎదురుగా ఒక పెద్ద ద్వారబంధం — ఏడడుగుల ఎత్తూ నాలుగుఅడుగుల వెడల్పూ, వున్నది ! నేను, లామావంక చూశాను ఆశ్చర్యంగా — ఆ ద్వారబంధాన్ని గురించిన సందేహాలను, సంశయాలను తీరుస్తాడని.

“ఇక్కడి కట్టడాలన్నీ సైన్సు గణితశాస్త్ర రహస్యాలలో నిర్మాణం చేయబడివున్నాయి. మీరు గణితశాస్త్రజ్ఞులు కదా ! ఈ ద్వారబంధం ఏడు అడుగుల ఎత్తువున్నది. మీ సైన్సు ప్రకారం కూడా గుండ్రంగావుండే వృత్తం కొలత ఇరవై-రెండును ఏడుపెట్టి భాగిస్తే వచ్చే $\frac{22}{7}$ “పై”-కి సూచన ! ఇది ఇరవైరెండులోని అంకెలైన 2+2 ను కలిపితే వొచ్చే

నాలుగు అడుగుల వెడల్పుతోనే, ఈ ద్వారబంధం ఏర్పాటుచేశారు! చూశారా?"

అంటూ ముందుకు దారితీశాడు గర్భాలయంవంటి ఓ షట్కోణ మందిరంలోకి !! దాని గోడలు స్ఫటికాలతో తాపడం చెయ్యబడి వున్నాయి. అవి, తళతళా అద్దాలవలే మెరుస్తూ మమ్మల్ని మాకే కనిపించేలా విచిత్రంగా వందలు, వేలసంఖ్యలో ప్రతిఫలిస్తూ వింతగొలుపుతున్నాయి" అని.

ఆశ్చర్యపోతున్న మాతో లామా దోర్జీ ఇలాఅన్నాడు — "ఇది మన ఆత్మకు ప్రతిరూపం ! మన ఆత్మ భగవంతుని ప్రతినిధి ! శరీరంలోని ఆత్మ ఇంద్రియాలద్వారా, తన్మాత్రలచేత పంచభూతాలలోనూ ప్రతిఫలించి మాయవలే అందరిలో కనిపిస్తుంది. ఈ మాయను దాటినవారే శంబలప్రభువును చేరగలుగుతారు, అని తెలిపేందుకే ఈ గర్భాలయం గోడలు మన బొమ్మల్ని మనకే బైటవాళ్లలా ప్రతిఫలించేలాగా ఇలా స్ఫటికపు అద్దాలతో నిర్మాణం చేయబడివున్నాయి.

"మీరు గమనించారో లేదో — ఈ స్ఫటికం అద్దాలు తెలుపు రంగువి కావు ! ఇందులో కొన్ని నీలంరంగు, కొన్ని ఆకుపచ్చా, మరికొన్ని ఎర్రటి అరుణవర్ణం కలిగి — ఇంద్రధనుస్సు కాంతివలే ఈ అద్దాలు ప్రతిఫలిస్తున్నాయి. మన సూర్యమండలంలోని ఏడుగ్రహాల కాంతులూ మన జాతకంమీద పడి ప్రతిఫలించినట్లే — ఇక్కడా ఇవి, మనని ప్రభావితం చేస్తాయి !" అంటూ

"ఇదిగో ఇక్కడ ఈక్రింద చూడండి !" — అంటూ గర్భాలయం నేలమీద స్థాపించబడివున్న పూజాప్రతిమను చూపించాడు. ఆశ్చర్యం ! అది వెయ్యి నక్షత్రాల కాంతితో కళ్ళు జిగేల్‌మనే వెలుగుతో తళతళా మెరిసిపోతున్న **మేరుప్రస్తార-శ్రీచక్రం** — పధ్నాలుగు త్రిభుజాలూ దళసరిగా ఒకదానిపైన ఒకటి పేర్చబడి 'శివ-శక్తి' స్వరూపాలుగా రూపొందించ బడ్డాయి !

మేము నోరుతెరుచుకుని దానివైపే ఆశ్చర్యంగా చూస్తూవుంటే లామా మహాశయుడు మాతో "ఇది ఒకే ఒక్క శిలతో నిర్మాణం చేయబడిన ఏకశిలా నిర్మాణంగా చెక్కబడ్డ శ్రీచక్రం **మేరుప్రస్తార యంత్రం !** దానిచుట్టూ పన్నెండు గదులుగల ద్వాదశారచక్రం — ఇది ఆకాశంలోని పన్నెండుమాసాల సంవత్సరానికి ప్రతిరూపమైన కాలచక్రానికి ప్రతిమగా పైన వెలిగే రాశిచక్రము.

"ఇంతపెద్ద స్ఫటిక శ్రీచక్రమే !!" — అన్నాను ఆశ్చర్యంతో నా ఊపిరి ఆగిపోగా.

"శ్రీనివాస చక్రవర్తీ ! మీరేదో నిద్రలో వున్నట్టున్నారు ! — మేలుకోండి !! ఈ మేరుప్రస్తార శ్రీచక్రయంత్రం — **స్ఫటికం కాదు.**"

"మరేమిటి ? నిర్మలంగా గాజులాగా, స్ఫటికంలాగే మెరుస్తోంది గదా ?" అన్నాడు శ్రీనివాస చక్రవర్తి.

"అయ్యా ! ఇది స్ఫటికం అయితే ఇంతలా వేలకి వేల నక్షత్రాలు మెరిసిపోతున్నట్టు కనిపిస్తుందా ? కాదు ! కానే కాదు !! ఇదంతా — ఒకే ఒకపెద్ద **వజ్రం** ! మీరు **'డైమండ్'** అంటారే అదే ! కోహినూరు వజ్రం

కన్నా నూరురెట్లు పెద్దది ! చెక్కి ఇలా మేరుప్రస్తార శ్రీచక్ర యంత్రంగా రూపొందించారు. చూడండి జాగ్రత్తగా !!" అంటూ పీఠంవైపు చూపాడు — వేలితో తాకకుండా !

దానిపై బీజాక్షరాలు స్పష్టంగా చెక్కబడివున్నాయి. కాని, అవి — అప్రదక్షిణంగా **'ఓం మణిపద్మహం'** అని ! దానిలోపల బాణంగుర్తులు సవ్యంగా ఎడంవైపు చూపబడివున్నాయి.

ఇదేమిటని ఆశ్చర్యపోయేలోగా లామా మహాశయుడు మోకాళ్ళ మీద కూలబడి ముందుకువొంగి తన రెండుచేతులతో శ్రీచక్ర మేరు ప్రస్తారాన్ని ఒడిసిపట్టి — అపసవ్యంగా తిప్పాడు ! దానితో గర గరమని శబ్దంచేస్తూ ఉరుములా ప్రతిధ్వనించి నిప్పురవ్వలు చెలరేగాయి ! దాంతో, ఆ యంత్రం ఒక మరలాగా, స్క్రూలాగా కుడివైపుకు తిరిగి — తెరుచుకుంది ! మరుక్షణమే లామా దానిపైన వున్న మిగతా త్రిభుజాలను కూడా అదేవిధంగా నొక్కిపట్టి — ఒకటి సవ్యంగానూ, ఒకటి అపసవ్యంగానూ, మార్చిమార్చి తిప్పాడు. "ఇదేం చిత్రం ?" — అని నేను అడిగితే నవ్వి **"సవ్యా-ప-సవ్య మార్గస్థా !"** — అన్నదీ "శంబలలోనిదే నండీ !" అన్నాడు లామా !

దాంతో అదేవిధమైన ధ్వని వినిపించి ఈసారి మందిరమంతా భూకంపంలా ఒణికిపోయింది ! ఇలా మేరుప్రస్తార యంత్రంలోవున్న త్రిభుజాలను ఒక్కొక్కటీ, ముందుకీ, వెనక్కూ తిప్పుతూపోతే — చివరికి ఆ శ్రీచక్రయంత్రం పీఠంతోసహా ఊడివచ్చింది ! మాలో నలుగురి సహాయంతో దానిని బలవంతంగా ఎత్తి పైకితీయించాడు.

దాని అడుగున పన్నెండు అడుగుల చతురస్రం ఆకారంలో ఒక **ద్వారబంధం** నిటారుగా భూమిలోకి చెక్కబడివున్నది ! దానిలోకి తొంగి చూసేలోగా అందులో పద్మం. ఆ పద్మంకేంద్రంలో వజ్రపుపీఠం ! పీఠం మధ్యలో — ఓ గుండ్రటి గోళంవంటిది పాదరసంలా మెరిసిపోతూ కోటిచంద్రుల కాంతితో జిగేలుమని మెరుస్తూ — క్షణకాలం మాకళ్ళు కనిపించకుండా పోయాయి. చెవులు వినిపించకుండా పోయాయి. చెవులలో 'ఓంకారం' హోరుమనే శబ్దంతో వినిపిస్తూంటే మరుక్షణమే మాచుట్టూవున్న ప్రపంచమంతా గిర్రున తిరిగిపోయినట్టు ఓ చిత్తభ్రమ వంటిది కలిగింది. మరుక్షణమే మేం స్పృహ కోల్పోయాము.

అలా ఎంతసేపున్నామో మాకే తెలియలేదు ! మాకు తెలివివచ్చి చూస్తే ఆ పర్వతం బయట — మొదట మేము స్నానంచేసిన వేడినీటి బుగ్గవద్ద వెల్లికిలా పడుకునివున్నాము. ఇక్కడికి ఎలావచ్చామా ? అని ఆశ్చర్యంతో చుట్టూ చూస్తూవుంటే ఏడుగురు సాధువులు ఆరు అడుగుల ఆజానుబాహువులు — మాచుట్టూ నిలబడివున్నారు ! వాళ్ళు చేసిన ఉపచారములవల్లే మేమింకా బతికి బయటపడ్డామని అర్థమైంది. ఆతరువాత కొన్నిగంటలకు మాశరీరం మాస్వాధీనంలోకి వచ్చి జ్ఞాపకశక్తి కలిగి స్ఫటిక పర్వతంలో ఈ ముందు మాకు జరిగినదంతా నెమ్మది నెమ్మదిగా గుర్తుకు రాసాగింది — అదంతా కాలచక్రం గిర్రున వెనక్కి తిరిగినట్టుగా — మా జీవితమంతా ఒక సినిమారీలులాగ వెనక్కి తిరుగుతూ మాకే కనిపించింది !

“మిత్రులారా ! మీరిప్పుడు చూసిన విద్యను టిబెటన్ పరిభాషలో

"కాలచక్ర-తంత్రం" అంటారు. ఇది ఒక్క శంబలప్రభువుకే సాధ్యం !" అంటూ మమ్మల్ని అక్కడినుంచి తొందరగా నడిపించాడు.

అలా ఎంతో సేపు నడిచి మేము మళ్లీ బయలుదేరినచోటికి తిరిగి చేరుకున్నాము. అక్కడ కొందరు లామాలు ఎండుకొబ్బరి చిప్పలతో వేడివేడి అన్నం వంటి పొంగలిని మాకు తినబెట్టారు ! అప్పటికి మా శరీరానికి సత్తువవొచ్చింది ! మా అనుభవాలను వాళ్ళకు అంతా వివరించాము.

అదంతా వేరే కథ !

⁂

48

శంబల - రహస్యం !

"ఈ విశ్వమే మన శరీరం — అన్నారుగదా ! కైలాస పర్వతమే శరీరానికి శిఖరమైన శిరస్థానమైతే — మరి శంబలకువెళ్ళేదారి ఏది ? మన శరీరంలోకూడా శంబలకు వెళ్ళేదారిలాంటి ద్వారం వున్నదా ? అదికూడా మూసుకుపోయి వుంటుందా ? ఎలా తెరుచుకుంటుంది ?

"మన శరీరంలో అయితే "శంబలకు చేరుకోవటం" అంటే యోగ సాధనలో ఏంజరుగుతుంది ? ఓ యోగి-లామా గురుదేవా ! దయచేసి మాకు తెలియజెప్పండి !" — అని అడిగాం అందరమూ !

లామా మహాశయుడు తనలో తానే మాట్లాడుకుంటున్నట్టుగా స్వరయుక్తంగా చెప్పటం ప్రారంభించాడు — "శరీరంలో సుషుమ్నానాడి తెరుచుకోవటం అంటే — శంబలకు మార్గం తెరుచుకోవటమే !"

మనలో '**బ్రహ్మనాడి**' అని వెన్నెముకలోని నాడులలో — ఇడ, పింగళనాడులకు నడిమధ్యన — మధ్యగా వుండే ద్వారాన్ని 'సుషుమ్న' ద్వారం అంటారు. యోగసాధనచేసి దానిని తెరవడానికి ప్రయత్నం చేయనివారిలో అది తెరవడానికి వీలుకాకుండా మూసుకుపోతుంది.

అలాంటివారు — తాముచేసిన పూర్వ చెడుకర్మ అడ్డంపడి శంబలకు దారి కనుక్కోలేరు.

తన గతజన్మ చెడుకర్మ, ఇహలోకానికి సంబంధించిన పుణ్యకర్మా — ఈరెండూ నశించిపోయి, ఆత్మ నిర్మలంగా, ఎట్టి పూర్వకర్మ వాసనలు లేకుండా నశించినవారికే — మనస్సులో చాలా గాఢంగా ముక్తిమీద ఆసక్తికలవారికే శంబల గురించిన కుతూహలం కలుగుతుంది. వారికే శంబల గూర్చి తెలుసుకోవటం సాధ్యపడుతుంది. దానికి సంబంధించిన భోగట్టా ప్రశ్నలు ఆరాతీయాలన్న ఆతృతకూడా కలుగుతుంది" — అంటూ ఆ ముసలి లామా ఆగాడు. అలా ప్రారంభమైంది శంబల యాత్రలోని మొదటి అంకం.

"ఆత్మ సాక్షాత్కారానికి — శంబలకుపోయే మార్గం గురించిన అన్వేషణకూ చాలా లోతైన సంబంధంవుంది ! అందుకే కేవలం పర్వతా లెక్కే విదేశీ యాత్రికులకూ ఏవేవో సాహసకార్యాలు చేసేద్దామనే యవ్వనో ద్రేకపు ఉడుకు రక్తంగల యువకులకు — ఈ శంబలకు మార్గం గురించిన ఆసక్తి కలగదు ! అలాంటివారు ఏ ఆల్ప్సపర్వతాలకో లేక ఉత్తరధృవంలోని మంచుకొండలకో అదీకాకపోతే చీకటిఖండం అనబడే ఆఫ్రికాలోని కిలిమేంజరో పర్వతాన్ని ఎక్కడానికో సాహసయాత్రలు చేస్తారు

గాని **'శంబల'** గురించి వీరికి తెలియదు ! అది చాలా రహస్యంగా వుంచబడివున్నది — కొన్ని శతాబ్దాలనుంచీ కూడా ! ఇది నిగూఢమైన ఆధ్యాత్మిక రహస్యం !"

యోగి లామా మహాశయుడు తనలో తానే మాట్లాడుకుంటున్నట్టుగా లయబద్ధంగా ఒక మంత్రం సస్వరంగా చదువుతున్నట్టుగా చెప్పుకుపోతున్నాడు! ఇంతలో నేను :

"గురుదేవా ! లామా మహాశయా ! ఎందుకిలా శంబలగురించీ —శంబలకు పోయే రహస్యమార్గం గురించీ ఇంత రహస్యంగా దాచి వుంచారు ? అలా రహస్యంగా వుంచాల్సిన అవసరమేమిటి ? శతాబ్దాల తరబడి ఈ శంబల సంకేతాల్ని నిగూఢమైన ఆధ్యాత్మిక రహస్యాలుగా దాచివుంచబడడానికి కారణం ఏమిటి ?" అన్నాను.

ఈ ప్రశ్నలకు లామా మహాశయుడు వెంటనే సమాధానం చెప్పలేదు ! క్షణకాలం తుళ్ళిపడ్డట్టు ఆల్లోచనలోకి మునిగిపోయాడు ! ఆతర్వాత తనలోనే తనకు లోపలనుంచి ఏదో అంతర్వాణి మౌనభావంగా అందిస్తున్నట్టుగా లోపలిసందేశాన్ని వింటున్నట్టు నిశ్శబ్దంగావున్నాడు ! కాసేపటికి నెమ్మదిగా మళ్ళీ బాహ్యస్మృతిలోకి వచ్చి — ఇలా చెప్పడం మొదలుపెట్టాడు !

"ఈ శంబల రహస్యాలు నాకూ పూర్తిగా తెలియవు ! మీరంతా నేనేదో పెద్ద గురుదేవుడినని, ఒక జ్ఞాని లేక ఋషి వంటి మహాపురుషుడుగా భావిస్తున్నారేమో !" అంటూ భళ్ళున పగలబడి నవ్వాడు ముసలి లామా — కళ్ళవెంబడి నీరు వచ్చేదాకా ! "నాకేదో ఇక్కడా

అక్కడా విన్నవీ, కన్నవీ, తెలిసినవీ, తెలియనివీ అన్నీ కలగాపులగంగా నాబుర్రలో కలిసిపోయాయి ! దానికితోడు నా వయస్సా — 98 దాటింది ! నాకా మీలాగ ప్రపంచజ్ఞానం లేదు !''

"నాకు పెళ్ళీలేదు ! పెటాకులూ లేవు ! అసలు భార్య అంటే ఎలావుంటుందో కూడా తెలియదు ! అంతెందుకు అసలు మనిషికి సంసారం చేయాల్సిన అగత్యం ఏమిటో కూడా నాకింతవరకూ ఏమీ తెలియదు ! దానికి కారణం కూడా వుంది.''

"నన్ను చిన్నప్పుడే అయిదారేళ్ళ వయస్సులో వుండగా మాతల్లి చనిపోయింది ! మా నాయనగారు తల్లిలేని నన్ను ఒంటరిగా సాకలేక ఒక ప్రాచీనమైన మఠంలో 'లామాసరీ' ఆశ్రమంలో ధానం ఇచ్చినట్టుగా అప్పగించేశాడు ! అక్కడి గురువులు లామాలు నన్ను చూసి — నా అరచేతిరేఖలు శరీర సాముద్రికం పరిశీలించారు ! ఆపైన ముగ్గురు పెద్దలు జ్యోతిషంలో గొప్ప పండితులు నేను పుట్టిన సమయం రాసుకొని — నా జాతకం — అంటే నేను పుట్టినపుడు ఆకాశంలో వున్న గ్రహస్థితి ఎంతో శ్రద్ధగా గణితంచేసి లెక్కించారు ! ఆతర్వాత ఆ మఠంలోని ఆశ్రమంలో ప్రాచీన తాళపత్రగ్రంథాలు వెతికి అందులోని పురాతనమైన **'నాడీగ్రంథం'** తీశారు ! దాంట్లో — ఒకదాంట్లో — ఎక్కడో నాపేరు దొరికింది !

అంతేకాదు నా గతజన్మచరిత్ర — నేనెవరో పూర్వజన్మలో ఎక్కడ పుట్టానో ఏం జరిగిందో — మళ్ళీ ఇక్కడ ఎందుకు జన్మించానో అంతా వివరంగా రాసివుందిట ! ఇంతేకాదు నా చిన్నప్పుడే తల్లి చనిపోతుందనీ,

నాతండ్రి నన్ను తీసుకొచ్చి సరిగ్గా ఇదే లామాసరీ ఆశ్రమానికి సమర్పిస్తానని కూడా ఇక్కడ నాడీగ్రంథంలో రాసివున్నది ! దాన్నిబట్టి నన్ను అక్కడ మఠంలో గురుకులంలో బాలశిష్యుడిగా చేర్చుకున్నారు ! భోజనం, నిద్రా, నివాసం అన్నీ మఠంలోనే !

'సత్రంభోజనం — మఠంనిద్రా' అన్న సామెతలా నా జీవితం గడిచింది ! పాతికేళ్ళు వచ్చేదాకా తోటి గురుకుల శిష్యులతో మంత్రాలు, పద్యాలు వల్లించడం, పాఠాలు చదవడం, ఖాళీసమయాల్లో వాళ్ళతో కుస్తీలు పట్టడం, మధ్య మధ్య దెబ్బలాటలు, మళ్ళీ స్నేహంగా కలుసుకోవడం, నవ్వులు, ఏడ్పులు — మా మఠంపెద్ద గురువుగారినుంచి చీవాట్లు ఇవే తెలుసు నాకు ఇరవైఅయిదేళ్ళు వచ్చేదాకా ! అసలు ఆడది అంటే ఎలావుంటుందో కూడా నాకూ — ఇంకా మా మిగతా గురుకులం పిల్లలకు ఎవరికీ తెలియదు ! బాల్యంనుంచీ మాకు యోగ సాధన, ధ్యానం, ఆసనాలు, ప్రాణాయామం, జపం నేర్పిస్తారు ! కొంచెం యుక్తవయసు అంటే 12-16 ఏళ్ళు వచ్చేసరికి దేవతావిగ్రహాల్ని అభిషేకించడం, పూజాపాత్రలు, పళ్ళాలు తోమి శుభ్రంచేయడం, ఆలయ ముఖమండపం ఊడ్చి దీపం పెట్టడం, గురువుగారు పూజా, జపం, ధ్యానం చేస్తుంటే నిశ్శబ్దంగా ధ్యానించడం ఆయన మనస్సుతోనే నామనస్సు కూడా లీనంచేస్తూ — ఇదే నాకు తెలిసిన జీవితం ! అందుకని మీలాగ ప్రపంచం ఎరిగినవాడిని కాదు ! ఏదో చదువులేని మూర్ఖుడైన ముసలి లామాను ! నేను చెప్పినదంతా వేదంగా మీరు భావించరాదు" అంటూ మొహమాటంగా తలవంచి మౌనం వహించాడు ముసలి లామా !

మాకు క్షణకాలం నోటమాటరాలేదు — ఆయన మమ్మల్నీ మా నిజాయితీని అనుమానిస్తున్నాడా ? — మాకెందుకు శంబలగురించిన వివరాలు చెప్పకుండా తప్పించుకో చూస్తున్నాడు ? మిమ్మల్ని ఏమాత్రం నొప్పి కలిగించకుండా బాధ కలగనీయకుండా, మా జ్ఞానాన్నీ, మా గొప్ప తనాన్నీ తక్కువచేయకుండా అవసరమైన శంబల రహస్యాలు దాచేశాడు ! దాంతో మాకు ఈయనతో ఎలా ప్రవర్తించాలో ఏంచేస్తే శంబలగురించిన దేవరహస్యాలు ఈయన చెబుతాడో అంతుపట్టలేదు ! క్షణకాలం నిశ్శబ్దంగా మేమందరం ధ్యానించాము ! ఏమంత్రమూ జపించలేదు ! అదికూడా ఆయన మనస్సు చికాకు కలిగిస్తుందేమో అన్న భయంతో ! కేవలం దయాసముద్రుడు ప్రపంచంలో జీవులందరికీ ముక్తిని కోరి తన మోక్షాన్ని త్యాగంచేసే బుద్ధదేవుడు భోదిసత్వుడి దయకై ప్రార్థించాము !

ముసలిలామా కళ్ళుతెరిచి మావంకే చూస్తూ చిరునవ్వు నవ్వాడు — మా ఆలోచనలు గ్రహించినట్టు ! "బోధిసత్త్వుని దయ ఒక్కటే మనకి సరైనమార్గం చూపించే ఉపాయం ! ఓపికతో వుండండి ! తొందర, చికాకు, అమిత ఉత్సాహం పనికిరాదు ఆధ్యాత్మిక విషయాలలో" అంటూ కాసేపు ఆయన పూజాకార్యక్రమంలో మునిగిపోయాడు ! మేమంతా తలోపనీ చేసిపెట్టి ఆయనకు చేతనైన సాయంచేసి తోడ్పడ్డాం ! మళ్ళీ ఏదైనా మామీద జాలిగలిగి శంబల రహస్యాలు చెప్తాడేమో అన్న ఆశతో !

పూజ పూర్తిచేసిన లామా ఇత్తడి ప్రమిదలో వెన్నతో వెలిగించిన దీపారాధన ప్రదక్షిణంగా ముమ్మారు తిప్పి గంట మోగించాడు ! మళ్ళీ పచ్చకర్పూరం పొడి ఆ దీపారాధనపై చల్లి ఉద్ధరిణిలో తీర్థంతో మంట చుట్టూరా తిప్పి దీపారాధనపైగా తీసి హారతి, నీరాజనం బుద్ధదేవునికి

సమర్పించాడు ! ఆయన వెలిగించిన పొడుగాటి టిబెటన్ అగరువత్తులు, కస్తూరి, జవ్వాది, చందనం కలిసిన పరిమళంతో గుబాళిస్తూ లేతనీలం పొగ మబ్బులాగా మఠంలోని పూజామందిరం అంతా వ్యాపించింది ! ఆ ప్రశాంతతకు మాకు శరీరం పులకరించి వెంట్రుకలు నిక్కబొడుచుకుని కళ్ళవెంబడి నీరు పొంగిరాసాగినాయి ! ఇక లామా మహాశయుడి తర్వాత సందేశం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాం — ఎవరూ ఏమీ మాట్లాడకుండా ! కాసేపటికి మళ్లీ ఆయనే ఇలా అందుకున్నాడు — మా క్రమశిక్షణ నచ్చినట్టుంది!

“శంబల గురించిన వృత్తాంతం రహస్యంగా వుంచడంలో ఇంకొక ముఖ్యకారణంకూడా వున్నది ! శంబలయొక్క రహస్యం ఈ **కలియుగం** యొక్క '**అంతం**'తో సంబంధించి వుంటుంది ! ఇప్పుడు ప్రపంచంలో జరుగుతున్న కలియుగం ఆరంభమైనది — అప్పటి అవతారమూర్తి శ్రీకృష్ణుని నిర్యాణ సమయంలో ! ఆయన తిరిగి అవతరించేది మళ్ళీ కలియుగాంతంలోనే ! కలియుగాంతంలో వచ్చే అవతారమూర్తితో సంబంధించివున్నందున ఈ శంబలవృత్తాంతం రహస్యంగా వుంచబడింది !

“ఎందుకంటే కలియుగంలో అనేకమంది క్రూరులు, దుర్మార్గులు, స్వార్థపరులు, అధికారదాహం, ధనదాహం, కామదాహం, రక్తపిచ్చితో రక్తపాతాలు చేసే దుర్మార్గులు పుట్టే కాలం గనక, వారికి శంబల గురించి తెలిస్తే భవిష్యత్తులో అవతరించే కారణజన్ములకు అవతారమూర్తికి అనవసరమైన ప్రమాదాలు ఇబ్బందులు కలిగిస్తారు !

ఎవరు పుణ్యాత్ములో మన సొంతబుద్ధితో తెలియడం కష్టం కాబట్టి

— ప్రతీవాడు తనని తాను చాలా పుణ్యాత్ముడనిగానూ, ధర్మాత్ముడనిగానూ భావిస్తాడు కాబట్టి అలాంటివానికి శంబలగురించి చెప్పడం అంటే ప్రపంచంలో ఎంతో నరరూపరాక్షసుడు అయిన క్రూరుడికి ఆటంబాంబుకు మించిన విధ్వంసశక్తిని చేతికిచ్చినట్టేకదా ! అందుకని ఈ శంబలగురించిన భవిష్యాలు అవతారమూర్తి జన్మించే పుణ్యభూమియొక్క వింతలూ, విశేషాలూ — ఎవరికి చూసినా అర్థంకాకుండా గుప్తంగా వుంచారు ! అంతేకాక సరైన కాలం వచ్చినపుడు తెలియవలసిన దేవరహస్యాలు — సరిగ్గా ఆ టైములోనే తెలియాలి ! ముందు తెలియడంవల్ల వాటిపై భారంగా మొద్దుబారిపోయి ప్రజల మనస్సుపై ఒక మందు పనిచేసినట్టు పనిచేయకుండా పోతాయి ! ఇవికాక ఇంకా ఎన్నో రహస్యాలు వున్నాయి ! అవి శంబల వెళ్ళేదారిలో మీకే ఎదురవుతాయి ! వాటిగురించి మీకు ఎవరూ చెప్పకుండానే — అనేక ఆశ్చర్యకరమైన విషయాలు మీకు అవే తెలుస్తాయి !

“బోధిసత్త్వుడు, బుద్ధభగవానుడు మీపై తన దయాకిరణాలను వర్షించుగాక మీ మనస్సులు, హృదయాలు నిర్మలంగా ప్రకాశించాలి ! మీ బుద్ధి, స్వార్థంవైపు, అహంకారంవైపు పరుగులుపెట్టకుండా శంబల ప్రభువు కాపాడాలి !”

“అహంకారం కలియుగంలో పుట్టిన పెద్దవిషం ! ఇది హృదయాన్ని చేదుగా విషమయం చేస్తుంది ! ప్రేమతో నిండి మధురంగా వుండాల్సిన మన హృదయాన్ని విషపూరితంచేసి ద్వేషంతో నింపేస్తుంది ! ఈపని ప్రత్యేకించి కలియుగం చివరలో అవతారమూర్తికంటే ముందుగా జన్మించే సైతాను చేపట్టే దుర్మార్గపు కార్యక్రమాల్లో ముఖ్యమైంది ! శంబల రహ

స్యాలు వీడికి అందకుండా వుండేందుకే మహాత్ములు, యోగులు, దేవరహస్యాలను ముఖ్యంగా శంబలవెళ్ళే మార్గాన్ని అది ఎక్కడవున్నదో భౌతికంగా కనుగొనే గుర్తులను చెరిపివేశారు ! అంటే కనపడకుండా కాలంతోనూ, మాయతోనూ కప్పేశారు" — అని అంటూ ఆ ముసలి యోగి లామా తన కమండలువూ, జపమాల, తాటియాకుల గ్రంథాలు కట్టగట్టుకొని వడివడిగా నడుస్తూ వెళ్ళిపోయాడు దూరంగావున్న ఒక లామాసరీ ఆశ్రమంవైపు !

ఆయన ఎక్కడికి దారితీస్తున్నాడో తెలియక మేంకూడా ఆయన్ని అనుసరించాం — "బహుశా ఈయన స్పటిక పర్వతానికి దారితీస్తున్నాడేమో మేం ఎంతవరకు ఆయనని నమ్మి పూర్తి విశ్వాసంతో ఆయనని అనుసరిస్తామో చూద్దామని !" అనుకుంటూ — ఆయన వెనకే మేం అంతా పరుగులాంటి నడకతో అనుసరించాం! మాఊహే నిజమైంది ! తుళ్ళిపడ్డాం లామా దోర్జీ మహాశయుడు మమ్మల్ని ఎక్కడికి చేర్చాడో ఎదురుగా — "స్పటికమందిరం" చూడగానే !!!

* * *

49

స్పటిక-మందిరం !

అది స్పటికశిలలతో నిర్మాణంచేయబడ్డ ఒక మందిరం ! సూర్యరశ్మి ఇటునుంచి అటు గాజులాగా ప్రసరించే నిర్మలమైన చంద్రకాంత శిలలతో అద్భుత నైపుణ్యంతో చెక్కబడినదానిలో — స్ఫటికాలు, ఒక వెంట్రుక వాసి సందుకూడా లేకుండా ఒక ఉంగరంలోని రాళ్ళు బిగించినట్టుగా ఎంతో బిగుతుగా ఇమిడ్చి పేర్చబడివున్నాయి !

ఆ శిలలు నిర్మాణంలో ఎంత చక్కగా చెక్కబడివున్నాయంటే ప్రతీ స్పటికంసైజూ అది పట్టే సందువుండేటంత పరిమాణమే — సరిగ్గా కొలత ఒక వెంట్రుక మందంకూడా తేడాలేకుండా — ఎంత ఖాళీవున్నదో అంతేసైజుతో చెక్కిన స్పటిక శిలలను — మంచి పనితనంతో వాటిని ఆ స్థంభంలోకి బిగించి లోపలికి దిగగొట్టినందువల్ల రాళ్ళమధ్య సిమెంటు

వంటి అతికే వస్తువేదీ లేకుండానే ఆ స్పటికశిలల నిర్మాణం ఎంతో అద్భుతంగా చెక్కినట్టు చెక్కబడింది !

అంతెందుకు? ఎవరైనాసరే అథాట్టున ఆ స్పటికశిలల మందిరాన్ని చూస్తే — అదంతా ఏకస్పటికంతో చెక్కబడినట్టుగా ఒక శ్రీచక్రం ఆకారంలో అది కనిపిస్తుంది — కోటి నక్షత్రాల కాంతిని విరజిమ్ముతూ !

ఆ మందిరం నిర్మాణం రెండు అరలుగా నిర్మించబడివున్నది ! బయటవున్న అరలో త్రిభుజాకారంగా నిలబడివున్న ఈజిప్టు పిరమిడ్‌వంటి శిఖరం కలిగిన లోపల హాలువలే నిటారుగావున్న త్రిభుజంలోకి — దిగుడుబావిలాగా మెట్లు మెట్లుగా కిందకి దిగుతూపోయి — ఒక ఆలయంలోని కోనేరుమెట్లు చెక్కినట్లు మెట్లు మెట్లుగా అలా కిందకు దిగుతూ వెళతాయి ! త్రిభుజంయొక్క అడుగుకోణం సూదివలే తలక్రిందుగా బోర్లించిన త్రిభుజాకారంలోవుంది ! ఆ అట్టడుగు ముక్కోణం నుంచి ఒకద్వారం — ఉత్తరంగా తెరుచుకుంటోంది ! ఆశ్చర్యపోతూ ఆ ద్వారం సమీపించగానే ఉత్తర దిక్కునుండి సన్నటి వెలుతురు సూదివలే ఒక కాంతికిరణంలా లోపలికి ప్రకాశిస్తున్నది ! దాని వెలుగుతో మందిరం లోని ఆ స్ఫటిక ఫలకం — జిగేల్‌మని మెరిసింది !

ఆతర్వాత తెలిసింది — అది ఉత్తరదిక్కునుండి ధృవనక్షత్రంనుండి లోపలికి ప్రసరించే కాంతికిరణమని !

సూదిబెజ్జంవంటి ఆ సందులోంచి సరిగ్గా ధృవుడు మాత్రమే ప్రకాశించేటంత రంధ్రం ఏర్పడివున్నది — స్పటికశిలలతో కట్టిన గోడ మధ్యలో ! ఆశ్చర్యంగా ఆ ధృవనక్షత్రపు కాంతికిరణం వెలుగుతున్న

దిక్కుగా నడిచి, చూస్తే అది ఏటవాలుగా కిందకి 23° డిగ్రీల — కోణంలో వెలుగు ప్రకాశిస్తూ నేలకి తాకుతున్నది !

ఆశ్చర్యం ! ఆ కోణం సరిగ్గా — మన భూమియొక్క ఉత్తరధృవం ఎంత పక్కకి వంగివుంటుందో — అంతే కోణం సరిపోయేలాగా ఇరవై మూడు (23°) డిగ్రీలపైచిలుకు వంపుతిరిగి వున్నది ! ఆశ్చర్యపోతూ ఆకాంతి నేలపై స్పటికఫలకంమీద పడ్డచోట కుతూహలంకొద్దీ ముట్టుకుని తాకి చూశాను ! అంతే ! — వెంటనే ఓ ఉరుములాంటి పెద్దశబ్దం వినపడి ఒక పంజరంలోనికి తెరుచుకునే స్ప్రింగుమూత వలే 'స్పటిక-గోడ' పక్కకి తిరిగి — తెరుచుకుంది ! ఒక్కసారిగా నా ఊపిరి ఆగి పోయింది ఆశ్చర్యంతో !

ఆశ్చర్యంతోనూ, సంతోషంతోనూ ఒకరిమొహాలు ఒకరు చూసుకున్నాం ! చివరకు రష్యన్ పరిశోధకుడైన నికోలాస్ రోరిఖ్ఛ్, తెగించి — ఆ తెరుచుకున్న ద్వారంలోంచి ముందుకువెళ్ళాడు ! అంతే ! రెండు అడుగులు వేశాడోలేదో అతడు లోపలికి ప్రవేశించిన ద్వారబంధంనుంచీ ఎదురుగా నేల మెరకగా గోడవలే పైకిలేచివున్నది — సరిగ్గా అంతే కోణంలో 23° ల వంపుతో ఒక జారుడుబల్లలాగా !!!

దానిమీద జారిపడకుండా జాగ్రత్తగా నడుస్తూ పైకి పైకి పోతే — రెండవ అంతస్థులోని స్పటిక మందిరంలోని వరండాలోకి చేరుకున్నాము ! అది నలుచదరంగా దేవాలయంలోని కోనేరు మెట్లవలే ప్రదక్షిణంగావున్న పైగట్టుమీదకి తీసుకువెళ్ళింది ! అక్కడినుండి త్రిభుజాకారంగా అడుగుకు పోయే ముక్కోణపు హాలులోకి దిగుడు బావిలా — కిందకిపోతూ మెట్లు ! ఇదేమిటి ?



ఈ స్ఫటికమందిరం — ఉల్లిపాయపొరల్లాగా వున్నదే ? ఒక వరండా నిలబడిన త్రిభుజాకారంలో వుంటే దాని బయటవున్న వరండా – తలక్రిందులుగా వున్న త్రిభుజంలా వున్నది ! మళ్ళీ దాని బయట వున్న వరండా నిలబడివున్న త్రిభుజంలా వుంది అలా మెట్లుమెట్లుగా ! చివరకు ఈ స్ఫటికమందిరంలో మేమందరం దారితప్పిపోయామేమో ఇక్కడిక్కడే తిరుగుతూ **'జంతర్ మంతర్'** లోని చిక్కు-వరండాల వలయం లోకి వెళ్ళి — అక్కడే ఇరుక్కుని చస్తామేమో ! అన్న భయంకూడా పట్టుకుంది మాలో కొందరికి !

ఇంతలో పైప్ తీసి జేబులో పెట్టుకొన్న చార్లెస్ బెల్ తటాలున తన తలపై టోపీతీసి మోకాళ్ళమీద కూలబడ్డాడు ! ఏమైనా తలత్రిప్పు గాని, చక్కర్ వంటిది ఏమైనా వచ్చిందేమోనని — ఆయనచుట్టూ చేరాము !

"బ్రదర్ ! హలో ! ఏమిటిలా నాచుట్టూ చేరుకున్నారు ? నాకేమీ పైత్యవికారం లేక తలతిప్పుడూ రాలేదు ! నేనిక్కడ మోకాలుమీద వంగి నమస్కరిస్తున్నది ఈ స్పటికమందిరంలోని ఆఖరిద్వారం — గర్భాలయం లోకి తీసుకుని వెళుతున్నది — ఎక్కడికంటే నేరుగా శంబల ప్రభువు అంతరాళ మందరింలోకి !

ఇది ప్రపంచంలో అన్ని దేవాలయాల్లోకీ, అన్ని మశీదులూ, అన్ని చర్చిలూ, ఈజిప్టులోని పిరమిడ్ల వంటి త్రికోణాకారంలోని మందిరాలకు అన్నిటికీ మూలమైన ప్లాన్ — అదే మీ హిందువులు గీతలు గీతలుగా రాసి "**శ్రీచక్రం**" అని పిలుస్తారే — సరిగ్గా దాని గర్భాలయంలోకి తీసుకెళ్ళే ముఖద్వారాన్ని మనం సమీపిస్తున్నాం !

అక్కడి శక్తితరంగాలు కరెంటు కాంతి నా మెదడులోని విద్యుత్తు శక్తినంతా గుంజి జివ్వున ఓ సుడిగుండంలా తిప్పి లాగేస్తున్నాయి — ఓ కేంద్రబిందువులోకి ! ఆహా ! ఎవరు నిర్మించారోకదా ? ఈ స్పటిక మందిరాన్ని ! ప్రపంచంలోని నిగూఢ రహస్యాలన్నీ కలబోసి ఒక్కచోట నిక్షిప్తంచేసి మంత్రశక్తి, తాంత్రికం, యూదుల కబాలా, అరబ్బుల అబ్జద్ అనే అంకెలు అక్షరాలూ సరిపోయే సంఖ్యాశాస్త్రానికి మాతృకైన విద్య ఇది! ఇవన్నీ కలిపి ఒక ఆకారంలో మూర్తి కట్టి నిర్మించారు !

ఇది మన ఈ విశ్వానికే మూలమైన ప్లాన్ ! సృష్టిరహస్యాలన్నీ ఇందులో అమర్చిన సైన్సుఫార్ములా వంటిదీ — "**శ్రీయంత్ర–నగరం**" అంటూ వంగి వంగి తన నుదురు నేలకితాకించి మూడుసార్లు ప్రణామంచేసినట్టు ఒంగి — తటాలున లేచి నిలబడ్డాడు, నడినెత్తిన ఆకాశంలోకి చూస్తూ !

మళ్ళీ ఉరుములాంటి శబ్దంతో ఒక తలుపు తెరుచుకుంది ! అక్కడనుంచి నిటారుగా పైకి నిచ్చెనవలే ఏటవాలుగా మెట్లు మెట్లుగా స్పటిక ఫలకాలు పేర్చివున్నాయి ! ఆ మెట్లుకూడా ఎలావున్నాయంటే ప్రతి మెట్టూ, ఎక్కుతుంటే దానిపై మెట్టు — వెడల్పు తక్కువవుండి — అలా చివరిదాకా కోసుగా త్రికోణాకారంలో పైకి చేసిన నిచ్చెనలాగా ఆ మెట్లు కట్టబడివున్నాయి !

ఆ పిరమిడ్‌వంటి భవనానికి చివర శిరస్థానంలో పైన, ఓ నలు పలకల రంధ్రం వుంది ! సరిగ్గా మనిషిమాత్రమే దూరగలిగే సందు ! అందులోంచి ఒక మనిషిమాత్రమే పైకి ఎక్కి వెళ్లగలడు. అలా ఎక్కి పైకి తలదూర్చి, తొంగిచూశాడు ! మానవుడి కళ్ళు మిరుమిట్లు గొలిపే తెల్లటి కాంతి — ఆ పిరమిడ్ శిఖరంమీద కరిగిన వెండితో చేసిన దూది పింజలా వున్నది — జిగేల్‌మని మెరిసిన ఆ వెలుతురు పుంజం ! దాన్ని తట్టుకోలేక కళ్ళు తిరిగినట్లై క్షణకాలం స్పటికమందిరం గోడ పట్టుకుని పడిపోకుండా నిలబడవలసి వచ్చింది చార్లెస్ బెల్ అంతటి వాడికి కూడా !

చుట్టూరా ప్రదక్షిణంగా వున్న నలుపలకల వరండా — పైకి పోయినకొద్దీ కోసుగా కోణంతో ఓ త్రిభుజంలా కట్టిన గాజుపలకల వంటి

ఆ స్పటికమందిర — శిఖరం కళ్లముందు, గిర్రున తిరిగిపోసాగింది !

ఇంద్రధనుస్సులోని ఏడురంగుల కాంతులు చిమ్మే వెయ్యి సూర్యుల కిరణాలనుంచి భూమీ, ఆకాశమూ కలిసే — రేఖ చుట్టూరా వెలుగుతూ కుమ్మరిసారెలా తిరిగిపోతున్న కాంతిచక్రం ! అది చూడగానే తళుక్కున మెరిసింది ఒక ఆలోచన ! నాదికాని ఆలోచన — **“రాశిచక్రం తిరిగిపోతున్నది !”** అని !!

ఇంతలోనే స్పృహతప్పిపోయాను ! ఏం జరుగుతుందో కూడా నాకు ఏమీ తెలియలేదు ! అంతా మైకం ! శూన్యంలో కరిగిపోయాను **‘నేను’** అన్న భావంకూడా !

◆

50

జీవించే - 'నడిచే-శిల' "చింతామణి !"

ఆ వజ్రంలో చెక్కిన '**శ్రీచక్ర–మేరుప్రస్తారం**' ఒక మరలాగా గుండ్రంగా తిప్పి మూతలా తీయగానే వెలవడిన ఆ '**భూపురం**'లో, అంటే – భూమికివున్న కేంద్రం వంటి పురంలో ఒక గోళాకారంగా పెద్ద పంపరపనాస కాయసైజులో వున్నది, కోటిసూర్యుల కాంతీ, లక్ష చంద్రుల కాంతీ కలిసి వేలకిరణాలతో తేజస్సు విరజిమ్ముతూ ! అదే — '**చింతామణి**' అన్న ప్రపంచప్రఖ్యాతిపొందిన దివ్యప్రభావంగల మణి — శంబలప్రభువు దగ్గరవుంటుందని అపూర్వమైన మహిమల వర్ణనలతో పురాణాలలో గుర్తుగా చెప్పబడ్డ దివ్యమణి ! దానిని చూడడమనేది ఏ కోటిజన్మల పుణ్యం ఫలితమో !

అది 'రసలింగం' — అనగా గడ్డకట్టినట్టు ఘనీభవించిన పాదరసాన్ని బంధించిచేసినట్టూ, పాదరసబంధంలో సప్తధాతువులూ కలిపి తయారు కాబడ్డ ఓ సజీవమైన సాలగ్రామంవంటి మణి !!

దానికి ఒకపక్క అర్థచంద్రాకారంలో ముఖం, అంటే రెండు పెదవులూ తెరచినట్లు సన్నటి ద్వారం వుంది ! ప్రతినిత్యం ఐదుసేర్ల పాలు దానికి అభిషేకించాలి — తేనె, పచ్చకర్పూరం, కుంకుమపువ్వు, యాలకులవంటి దివ్యపూజావస్తువులతో కలిపిన టెంకాయ నీటినీ, తేనెనూ కలిపి అభిషేకమంత్రాలతో అభిషేకిస్తారు — శివ, విష్ణు, శక్తి వేదమంత్రాలతో సుదర్శనమంత్రం సంపుటిచేసి సుదర్శనచక్రార్చన, ఆవరణపూజలతో శ్రీచక్రార్చన చేసి పూర్తిచేశారు — పురుషసూక్తం, శ్రీసూక్తం మొదలైన సస్వరమైన వేదమంత్రాలతో !!! అప్పుడు జరిగింది ఒక అద్భుతమైన ఆశ్చర్యం.

అకస్మాత్తుగా బంగారుపాత్రలో అభిషేకించిన పాల-అమృతం బుద బుడ మని ఆవుత్రాగి గుటకలువేస్తున్న శబ్దం కలిగి — ఆ పాలన్నీ చింతామణి త్రాగేసింది ! అంటే లోనికి పీల్చుకున్నది !

అలా ఒక ముహూర్తకాలం గడిచాక పూజామందిరంలో మంగళ హారతి, పుష్పాంజలి ఇచ్చిన తరువాత గలగలమని — పెద్ద శబ్దంతో ఒక జలపాతంలా అభిషేకంలో త్రాగిన పాలన్నీ బయటికి ధారాపాతంగా కక్కి ధారపోసింది. అలా మళ్ళీ బయటికి చింతామణి త్రాగి ఇచ్చిన ప్రసాదమే ఇక్కడి లామాలకు పవిత్ర తీర్థం ! శరీరంలో ధాతువుల లోపాలు, దోషాలు పోగొట్టే పుణ్యతీర్థం !

ఈ చింతామణి సజీవమైన శిల ! అంటే ప్రాణం కలిగిన **సాలగ్రామం** వలే తనంత తాను గిర్రున ప్రదక్షిణగా భూగోళంవలే తిరుగుతుంది. అప్పుడు ప్రపంచానికి రానున్నకాలంలో — శుభములే కలుగుతాయి. యజ్ఞయాగాది కర్మలు అనేకచోట్ల వెల్లివిరుస్తాయి. వేదములకూ, బ్రాహ్మణులకూ, గోవులకూ, తపస్సుచేసేవారికీ, సిద్ధగురువులకూ మేలు జరుగుతుంది ! — కోట్లాది జనం ఆనందిస్తారు.

ఒక్కొక్కసారి అది ఎర్రగానూ, ఉదయిస్తున్న సూర్యునిలాగా, నిప్పు కణికలాగా భయంకరంగా వెలుగుతుంది ! అప్పుడది చూశేందుకు ఆకాశం లోని అంగారక గ్రహంలాగా ఇటుకరంగు మంటతో ప్రకాశిస్తుంది ! అప్పుడు ప్రపంచంలో యుద్ధాలు చెలరేగి బాంబులవర్షం కురిసి రాజులు నశిస్తారు ! కోట్లాదిమంది సైనికులు హతమౌతారు ! వర్షాలులేకుండా పోతాయి. కరువుకాటకాలతో ప్రజలు అలమటిస్తారు.

మరొక్కప్పుడు అది నీలంగా మెరుస్తూ శుక్రగ్రహంలా ప్రకాశిస్తుంది. అప్పుడు గొప్పగొప్ప కళాకారులు జన్మిస్తారు — కాళిదాసమహాకవి, భవభూతి ఇంగ్లీషువాడు షేక్స్‌ఫియర్ ఇంకా ఇతరభాషలలో మహాకవుల వంటివారూ, ఆధ్యాత్మికదృష్టికలవారూ, ఎందరో జన్మిస్తారు.

ఇంకోసారి అది ఆకుపచ్చరంగులో మరకతంపచ్చలాగా ప్రకాశిస్తుంది, బుధగ్రహంవలే ! అప్పుడు ప్రపంచంలో పంటలూ, ఫలపుష్పాలూ సమృద్ధిగా ఫలించి చెట్లూ, ఆకులూ, తోటలూ, వ్యవసాయం తామర తంపరగా ఫలితాన్నిస్తాయి !

అదే **చింతామణి** ఇంకొకసారి తెల్లగా పూర్ణిమ చంద్రునివలె వెలుగు

తుంది. తళతళామెరిసే చింతామణి — అలా చంద్రకాంతితో వెలిగినప్పుడు అదోపెద్ద ముత్యంలాగా వెలిగిపోతుంది కోటిచంద్రుల కాంతితో ! అప్పుడు ప్రపంచంలో ఆవులూ, దూడలూ వృద్ధిపొంది సమృద్ధిగా పాలిస్తాయి. పాడిపంటలు వృద్ధికావడం జరుగుతుంది. బియ్యమూ, బార్లీవంటి తెల్లధాన్యాలు సమృద్ధిగా పండుతాయి. బ్రాహ్మణులకూ, పురోహితులకూ, మంత్రశాస్త్రవేత్తలకూ, యజ్ఞయాగాలు చేసేవారికీ — గొప్పమేలు జరుగుతుంది.

ఒక్కోసారి — అది, లేతపసుపువర్ణం కలిగిన ముత్యంలాగా ప్రకాశిస్తే అప్పుడు యోగులూ, మహాత్ములూ, సిద్ధగురువులూ జన్మిస్తారు ! ఇంకోసారి నల్లగా తళతళామెరుస్తూ నల్లని చలువరాయిలాగా వెలిగితే — ప్రపంచంలో భయంకరవ్యాధులూ, ప్లేగు, మారి, మశూచి వంటి వ్యాధులు ప్రజ్వలించి ప్రపంచంలోని జనాభాను లక్షల్లో పొట్టనపెట్టుకుంటాయి — జనక్షయమౌతుంది ! కరువుకాటకాలతో ప్రజలు తిండికి లేక అల్లాడతారు. వర్షాలు కురవక కాలమేఘాలు కూడా దూదిపింజల్లా ఎగిరిపోతాయి.

ఇలా ఇది రాబోయే ప్రపంచ భవిష్యత్తును ముందుగానే సూచిస్తుంది. అందుకని దానికి ‘కాలగర్భ చింతామణి’ అనిపేరు ! **శంబల ప్రభువు** దానికి తాంత్రిక ప్రయోగశాస్త్ర ప్రక్రియతో ‘కాలచక్రతంత్రంలోని పూజావిధానంతో తన దివ్యశక్తినీ భగవద్భక్తినీ ధారపోస్తారు. అప్పుడు ప్రపంచం దైవికమైన శక్తితో నిండిపోతుంది !

ఆయన తన శరీరంలోని కాలచక్రంయొక్క తిరగడాన్ని నక్షత్ర

మాస ఆయన ఋతు సంవత్సరాల విభాగంలో నాలుగుయుగాల చతుర్యుగ చక్రందాకా సమస్త కాలవిభాగాన్నీ ఒక దివ్యదృష్టితో దర్శింపజేస్తుంది. అప్పుడే శంబలప్రభువు అవతరించే సందర్భం వారికి తెలుస్తుంది ! అవతారమూర్తి గురించిన వివరాలు తెలుస్తాయి'' — అంటూ లామాదోర్జీ మహాశయుడు మా సాహసబృందాన్ని ఆ వజ్రమందిరం నుంచి బయటికి నడిపించుకునివచ్చి బయట మంచు మైదానంలో బంగారపు పొడిలాగా మెరిసే మంచుమీద వెచ్చగాకాస్తున్న ఎండలో ప్రసాదాలు తినిపిస్తూ వివరించారు.

చింతామణి అభిషేకతీర్థంకూడా మాకు తలోచుక్కా చేతిలో పోశాడు. అమృతంలాగా అద్భుతమైన రుచి ! అది త్రాగగానే తలలు గిర్రునతిరిగి కాలచక్రమంతా మాతలలోనే తిరుగుతున్న భ్రాంతికలిగి గతించిన ప్రపంచపు చరిత్ర అంతా అతివేగంతో సంగ్రహంగా తిరిగి — తెలిసింది !

"ఈ చింతామణి ఒక్క శంబలప్రభువుదగ్గరే — వున్నా ఈ స్ఫటిక మందిరంలోని ధ్యానమందిరంలో మీరు ఎక్కివచ్చిన పగడాలమంటపంలోని వజ్రపు శ్రీచక్రంలోనే వుండదు ఎల్లకాలం.

ఇది ప్రపంచమంతా సంచారంచేస్తుంది !! ఎప్పుడు ఎక్కడ ఎందుకు సంచారంచేస్తుందోకూడా ఎవరికీ తెలియదు ! అది ఎవరికీ కనపడదు. కానీ అది ఏదేశంలో కనపడితే లేక సంచారంచేస్తే ఆ దేశానికి ప్రపంచ కేంద్రంగా అత్యంత ప్రాధాన్యత ఏర్పడుతుంది ! అన్నిదేశాలవారూ ఆ దేశం నాయకత్వాన్ని అంగీకరించి ఆ దేశాన్నే వారి కేంద్రంగా భావిస్తారు'' అంటూ పూర్తిచేశాడు లామాదోర్జీ.

“అప్పుడు నిద్రలాగా మగతవచ్చినట్లు సమాధిస్థితివంటి — దశలో కాలచక్రంయొక్క భూతభవిష్యత్తులు రెండూ అతివేగంగా ఒక సినిమా రీలువలే తిరిగిపోతూ కనిపించాయి !

నక్షత్రాలు శరవేగంతో ట్రైన్‌లో నిప్పురవ్వలలాగా వెనక్కిపరిగెట్టాయి. కానీ అదంతా విస్తరించి వివరించాలంటే వేరే ఒక '**భవిష్యపురాణం**' లాగా అవుతుంది ! ఎవరైనా భక్తులు కోరితే దానిని వేరేగ్రంథంగా అందిస్తాను” — అంటూ లామాదోర్జీ మహాశయుడు అయిష్టంగానే మమ్మల్ని ఇంటికి తిరిగివెళ్ళే మార్గంవైపు నడిపించాడు.

మా మనస్సులుమాత్రం వెనక్కి స్ఫటికమందిరంవైపుకూ, చింతామణి విషయంమీదకీ, లాగుతూ శంబలప్రభువు ఆకారాన్నూహించుకుని (మాకు తోచినట్టుగా) సంతుష్టిగా మా మిగిలిన జీవితాన్ని నడిపించమని కోరుకున్నాము.

* * *



51

శ్రీచక్రం - అర్థం !

"గురుదేవా ! లామామహాశయా ! ఇక్కడ స్పటికమందిరం అడుగున వున్న శ్రీచక్రం త్రికోణపు ఆకారంలో స్పటికపర్వతంలోవున్న బుద్ధమందిరం లోని స్పటిక శ్రీయంత్ర మేరుప్రస్థారాన్ని ఇలా త్రిభుజాలు త్రిభుజాలుగా అమర్చడంలో ఏదైనా ప్రత్యేకమైన ఆధ్యాత్మికరహస్యం దాగివున్నదా ?" అంటూ ప్రశ్నించాడు గూఢచారి మహాశయుడు చార్లెస్ బెల్ భయం భయంగానే !

"ఒకటి మీకిదివరకే చెప్పానుగదా ! ఇది స్పటికపర్వతంయొక్క ప్లానువంటిదని" అన్నాడు లామాదోర్జీ చోగ్యాల్ నవ్వుతూ !

"మీరు మాకు అంతకంటే ఎక్కువే చూపించారుగదా ! ఇప్పుడు దానిలో మీకే తెలియని రహస్యార్థం దాచబడివున్నదని — అది మీవంటి

భారతదేశంలోని ఆధ్యాత్మిక సాంప్రదాయంతో పరిచయంవున్న మహాత్ములు ఉపదేశంగా నేర్చుకొనివున్న వారికిమాత్రమే సాధ్యంఅని నాకిప్పుడు తెలుస్తుంది ! అందుకే మిమ్మల్ని ప్రశ్నించాను" అన్నాడు చార్లెస్ బెల్ !

"కాలచక్రతంత్రం అంటే ఏమిటి గురుదేవా ? దీనికీ దలైలామాకు వున్న సంబంధం ఏమిటి ?" అంటూ ప్రశ్నను జోడించాడు నికోలాస్ రోరిఖ్చ్ చిత్రకారుడు.

"ఇవన్నీ త్రిభుజాలు త్రిభుజాలుగా ఏర్పడినప్పటికీ అన్నీ సమవర్తులంగా ఒక చక్రంవంటి వృత్తంలోపల చక్కగా ఇమిడిపోతాయి !" అన్నాడు అలగ్జాండర్ నోటోవిచ్ బూటాన్‌లోని లామాసరీ పీఠంతో పరిచయంవున్న సంస్కారంతో !

"ఈ శ్రీచక్రంలోని త్రిభుజాలలో — తలక్రిందులుగావున్న త్రికోణం ప్రకృతిలోని స్త్రీశక్తికి చిహ్నమని నిట్టనిలువుగా నిలబడివున్న త్రిభుజం పురుషశక్తి అయిన శివశక్తికి చిహ్నమని చెపుతారే — అంటే దానికి అర్ధమేమిటి మహాశయా ?"

"అంతేకాదు ఇక్కడ మీ టిబెట్‌లోని హేవజ్జరతంత్రం తారాతంత్రం అవలోహితేశ్వరతంత్రం అనబడే తాంత్రికసాంప్రదాయంలోకూడా — ఈ స్త్రీపురుషశక్తుల సమ్మేళనం ఇలా మంత్రంతో కాకుండా శరీరంలోనే చేస్తూ తాంత్రికసాధనచేసే యోగులుకూడా వున్నారని విన్నాను. అదెంతవరకు నిజం ? స్త్రీపురుషులు కలిస్తే సంతానం కలగడం ఎరుగుదుముగాని మోక్షవిద్యకు, దానికి సంబంధమేమిటి ? అదీగాక మీ టిబెటన్ సాంప్రదాయంలో మహాయోగి రూపంలోవున్న అవలోకితేశ్వర పద్మపాణి ఒడిలో

కూర్చుని సంయోగక్రియలో ఆనందంలో తేలియాడుతూ ఆ పురుషుని గట్టిగా ఆలింగనంచేస్తూవున్న పూజావిగ్రహాలు అంత బహిరంగంగానే మీ టిబెటన్ దేవాలయాలలో పూజిస్తారెందుకు ? దీనికి శ్రీచక్రంలోని స్పటికపర్వతం యంత్రానికి ఏదైనా సంబంధంవున్నదా ? అని నన్ను చాలాకాలం పీడిస్తున్న సందేహం ! ఇవన్నీ మీరే తీర్చాలి'' అన్నాడు బెంగాలి శాక్తీయ సాంప్రదాయంలో పుట్టిన జగదీశ్ చంద్రబోస్ అదనపు ప్రశ్నగా తన సందేహాన్ని జోడిస్తూ.

“అయినాయా ? — ఇంకా ఏమైనా ప్రశ్నలున్నాయా ? అన్నీ చెప్పండి ఒకేసారి ! నాచేతనయినంతవరకూ మీకు సందేహాలను తీర్చే ప్రయత్నం చేస్తాను'' అన్నాడు లామాదోర్జీ. మిగతావాళ్ళెవరూ మాట్లాడలేదు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారంతే ! ఇంక ఎవ్వరివీ ప్రశ్నలు లేవని నిర్ధారించుకున్నాక లామా దోర్జీ చోగ్యాల్ తన వివరణాత్మకమైన ప్రవచనాన్ని ఈవిధంగా కొనసాగించాడు.

“ఈ ప్రపంచంయొక్క తత్వమే ద్వంద్వమైనది ! అంటే వెలుగుంటే నీడ. భూమివుంటే ఆకాశము. సూర్యుడుంటే చంద్రుడు పగలుంటే రాత్రి ప్రకృతిలోనే సహజంగా ఏర్పాటుచేయబడివున్నాయికదా ! అంతెందుకు మనలోని వాక్కు — అంటే మాటకూడా కిందదవడ పైదవడ కిందపెదవి పైపెదవి రెండూ లేకుండా శబ్దంపుట్టదుకదా ! ఒకవేళ ఏదైనా పేరు ఉచ్ఛరిస్తే — దానియొక్క అర్థంఅంటే దానిలోని ప్రాణంవుంటేనే గాని మంత్రం దగ్గరనుంచి మామూలుమాటదాకా ఏదీ ఏర్పడదు ! అంతెందుకు మనచూపుకూడా కంటికి పైరెప్ప కిందిరెప్ప రెండూ వుంటేనే

గాని దృష్టి అనేది సాధ్యపడదు. కాబట్టి సృష్టిమొత్తం ద్వంద్వము అనగా రెండుగా ఏర్పడివున్నది.

“మీరేదో పురుషుడనీ స్త్రీఅని రకరకాలుగా మాట్లాడుతున్నారే ? మన శరీరంలో కుడిఎడమ భాగాలు ఒకేరకమైన అవయవాలతో ఏర్పడి లేవా ? కుడికన్ను, ఎడమకన్ను, కుడిముక్కు, ఎడమముక్కు అలాగ మనలోని ప్రతిదీ జంటగా ఏర్పడినవేకదా ?” అనగానే శ్రీనివాసచక్రవర్తి అడ్డుప్రశ్న వేసాడు — “అలా జంటగాలేని అవయవాలున్నాయికదా నాలుక హృదయము... వంటివి అన్నాడు నసుగుతున్నట్టుగా !

“ఊ... సందేహమెందుకు ? అడగండి. పురుషలింగము, యోని, మలద్వారము అనిగదా మీ ఉద్దేశ్యము అని భళ్ళున నవ్వాడు లామా మహాశయుడు. శ్రీనివాస చక్రవర్తి ఒక్కసారిగా చిన్నబోయినట్టు తలదించుకున్నాడు తన సందేహానికి సిగ్గుపడుతూన్నట్టు.

“దీనిలో సిగ్గుపడవలసినదేమీలేదు ! అని మళ్ళీ అందుకుని మీరు చెప్పిన నాలుక పైకెత్తి చూడండి. దాని అడుగున సన్నని ఈనె రావిఆకులాగా ఏర్పడివున్నదాన్ని చూస్తే మీ నాలుకలోగూడా రెండు భాగాలున్నాయని జంట-కలసి నాలుక ఏర్పడినదని తెలుస్తుంది! ఇంకా — వైద్యులనడగండి గుండెలో కుడిఎడమభాగాలు ఇలాగే జంటగావున్నాయని ! ఇక లింగము, యోని అడుగునకూడా సన్నని దారంతో కుట్టిన కుట్టువేసినట్టు అతుకు ఈనెలా కనిపిస్తుంది — శరీరంలోని రెండుభాగాలు, కుడిఎడమ సగాలు — అతికినట్టుగా ! ఇలా ప్రతీ అవయవమూ జంటగా ఏర్పడివున్నాయి ! కిడ్నీలు, జననేంద్రియాలు దగ్గరనుంచి చెవులదాకా —

చేతులు సరేసరి ! ఇది ప్రతీ వైద్యుడికీ తెలిసినది ! అలా ఎందుకు ఏర్పడివున్నాయని ఆలోచించలేరు ఎందుకంటే ఈ శరీరం ఎందుకు నిర్మాణం కాబడిందో అట్టి భగవత్ సంకల్పం ఏమిటో ఆలోచించే తీరికా, ఓపిక లేదు తెలుసుకుందామన్న శ్రద్ధకూడా లేదు. కాని అలా ఎందుకేర్పడింది అని ఆలోచిస్తే — ఈ సృష్టిలో ప్రతిదీ ద్వంద్వము ! అనగా రెండింటితో ఏర్పడింది అని తెలుస్తుంది! యోగశాస్త్రంలో కుడముక్కుతో పీల్చే శ్వాస సూర్యనాడిఅనీ, ఎడమముక్కుతో పీల్చే శ్వాస చంద్రనాడిఅని శరీరాన్ని అది చల్లబరుస్తుంది అని ఈరెండింటికీ మధ్యవుండే సుషుమ్నా నాడి మాత్రమే బ్రహ్మజ్ఞానానికి సంబంధించిన కుండలినీశక్తి మేల్కొని నిద్రలేచేలా చేస్తుందని తెలుస్తుంది.''

''ఇప్పుడింకొక రహస్యం చెపుతాను. ప్రపంచంలో అన్నీ జంటలతో ఏర్పడివున్నాయని కదా చెప్పాను. ఇలా రెండుకళ్ళతో చూసేదంత మాయ ! అంటే శివుడు శక్తికలిసి ఆడే నాటకమన్నమాట. ఈ నాటకంలో మూడుపాత్రలుంటాయి. ఒకటి ఈనాటకానికి రంగస్థలమైన ఈ ప్రపంచం లేక జగత్తు ! రెండవది ఇందులో పాత్రధారిఅయిన జీవుడు నాటకంలోని పాత్ర. మూడవది ఈ నాటకాన్ని కథరాసి నడిపించే కర్త అంటే తెర వెనుక వుండి అంతా నడిపించేవాడు ఈశ్వరుడు. ఇలా జగత్తు జీవుడు ఈశ్వరుడు అనే ముక్కోణాలుగల త్రిభుజమే ఈ శ్రీచక్రపీఠానికి ఆధారము. దీన్ని తిరగేసి తలక్రిందులుగావుండే త్రిభుజమే సృష్టిస్థితి సంహారం అనబడే పుట్టుట, పెరుగుట, నశించుట అనే కాలచక్రంలోని మూడు శక్తులసూచిక ! వీరే బ్రహ్మవిష్ణుమహేశ్వరులనే త్రిమూర్తులు ! ఓంకారాన్ని విడగొడితే వచ్చే మూడు అక్షరాలకు అకార ఉకార మకారములనే

త్రివృత్ అనే ఓంకారము. ఇవే మనలోని నిద్ర మెలుకువ, యోగజ్ఞానం అనబడే మూడుశక్తులకు అధిపతులు ! వీటి కలయికయే శ్రీచక్రము."

"ఇకపోతే ఈ కాలచక్రం ఎలాగో చెపుతాను వినండి ! ఈ శ్రీచక్రంలో 14 త్రికోణాలు ఏర్పడివున్నాయి. ఇవి మాసంలోని 14 తిథులు. అలానే ఒక సృష్టిలోని బ్రహ్మకల్పంలోని 14 మనువులకు ప్రతీకలైన శక్తులు దీనిలోపల త్రిభుజాలలో 10 త్రిభుజాలు కలిగిన దశకోణములు — ఇవి తల్లిగర్భంలో జీవుడు పెరిగే 10 మాసములవంటి — శరీరంలోని నవద్వారములతో బ్రహ్మరంధ్రమైన గురుద్వారం కలిసే ఏర్పడే పది ద్వారములుగల ద్వారక అనే పురి అంటే మన శరీరమే ! ఇందులోవుండే జీవుడే ద్వారకాధీశుడు. అంటే పరమాత్ముడు. శరీరంలో బంధించబడి పుట్టాడు గనుక జైలులో పుట్టిన శ్రీకృష్ణుడు అన్ని కర్మబంధాలలో వుండి ముక్తిపొందాక జైలులో పుట్టిన శ్రీకృష్ణప్రభువే కల్కిభగవానుడిగా శంబలలో అవతరిస్తాడు.

దానిలోపల 9 త్రిభుజములు గర్భంలో జీవుడు పెరిగే నవమాసములు ప్రకృతిలోని నవదుర్గలు అనబడే నవగ్రహాలశక్తులు బయట కాలాన్ని కొలిచే తొమ్మిది అంకెలుగా సంఖ్యగా ఏర్పడిన సాంఖ్యము. పది స్త్రీసంఖ్య, తొమ్మిది పురుషసంఖ్య అనుకుంటే తొమ్మిదిమాసాలలో సూర్యుని గతివల్ల లెఖ్ఖించబడే కాలంలో పది చంద్రమాసాలు జీవుడు తల్లిగర్భంలో పెరిగి జన్మించే కాలం — దశావతారాల రహస్యము. వీటన్నిటికీ లోపలవుండే తలక్రిందులు త్రిభుజం ప్రతి జంతువుకి మనిషికి చెట్టుకి జన్మనిచ్చే తల్లిగర్భం అనబడే మాతృమూర్తియైన ప్రకృతిశక్తికి చిహ్నం !

కాని ఎంతటి మాతృమూర్తియైనా తనంతట తానే గర్భవతికాలేదు గదా కనుక ప్రకృతికి భర్తయైన పురుషుడు ఆమె గర్భంలోనే కుమారుడిగా జన్మించే బిందువు శ్రీచక్రంలోని కేంద్రంలోని గుండ్రని వృత్తాకారంలోని బిందుప్రస్థారం. అదే పెరిగి మేరుప్రస్థారం శ్రీచక్రంపైన ముక్కోణాలు కలిగిన సూదిమొనవలే ఆలయశిఖరం పరబ్రహ్మస్థానం !

అనగా తానొక్కడే అయిన పరబ్రహ్మ పరమాత్ముడు పీల్చిన శ్వాసవలే రెండువిధాలుగా లోపలికి పీల్చే శ్వాసను బయటకు విడిచిపెట్టే నిశ్వాసమువలే సృష్టి ప్రళయములు జననమరణములు స్త్రీపురుషులుగా ఈ జగత్తునే లీలానాటకాలుగా నడిపించేదే ఈ శ్రీచక్రం ! ఇదంతా ఆనందం, ప్రేమ, మమకారం, ఆత్మీయత అనబడే పరమాత్మయొక్క అమృతవర్షంయొక్క ప్రతిఫలమే ! అందువల్ల జీవుడు తల్లిదండ్రుల యొక్క ఆనందంలోనే గర్భస్థుడవుతాడు బిడ్డగా ! తల్లిదండ్రులకు ఆనందమిస్తాడు బిడ్డగా! భర్తగా భార్యకు ఆనందమిస్తాడు. చివరగా తనలోనే ఆనంద మనుభవిస్తూ ఆ ఆనందంలోనే లీనమైపోతాడు కనుక ఆనందమనే సముద్రంలో కెరటంవలే ఆనందలహరి అనేదే ఈ శ్రీచక్రం ! అర్థం తెలిసినవారికి ఇంతకంటే వివరణ అక్కరలేదు. తెలియనివారికి ఎంత వివరణఇచ్చినా అర్థమవ్వదు.''

“ఈ త్రిభుజాలమాట చెప్పారు గురుదేవా ! అద్భుతంగావుంది ! దీనిచుట్టూ ఏర్పడివున్న తామరరేకులవంటి పద్మాలు దానిచుట్టూరా వున్న దళాలగురించి చెప్పండి'' అన్నాడు శ్రీనివాస చక్రవర్తి !

“ఏమున్నది ! ఈ త్రిభుజాలకి బయట తామరపువ్వు బొడ్డులాగా

గుండ్రని వృత్తం పీఠంలావున్నది. దానికి అష్టదళపద్మం అనే 8 రేఖలుగల పరమాత్మ ప్రకృతి లేక పరాప్రకృతి ! — లక్ష్మి, పార్వతి, సరస్వతి అని ఏ పరాప్రకృతిని పిలుస్తారో దానియొక్క 8 భాగాలు — అవి ఏవంటే పంచభూతాలు అంటే భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, ఆత్మ, ప్రాణము అన్న 8 తత్వములు కలిస్తేనే జీవుడు ఏర్పడుతాడు అనే ఈ అష్టదళపద్మము ఇందులోని ప్రతీఒక్క దళమూ అష్టలక్ష్ములు అనబడే ప్రకృతియొక్క శక్తులు ! — ఆనందలక్ష్మి, సంతానలక్ష్మి, సామ్రాజ్యలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి అంటూ మీదేవాలయంలో ప్రతిష్టించే అష్టలక్ష్ములు సూచించే ఈ అష్టదళపద్మంలో 8 రేఖలు ! దీనిపైన వుండేది చక్రంలో 16 దళాలుగల షోడశదళ పద్మం ఇది ! పరిపూర్ణమైన రాత్రిపూటంతా వెలిగే 16 కళల పూర్ణచంద్రునివంటి పూర్ణానందస్వరూపమైన పరబ్రహ్మలోని 16 కళలే ! అంటే ఆత్మలోని అంశలన్నీ కలిస్తే 8 పురుషునివి, 8 ప్రకృతిశక్తులు మొత్తం 16 శక్తులుగల పూర్ణావతార పురుషుడే షోడశకళానిధి ! ఆయనయే పూర్ణావతారుడు. ఆనందోబ్రహ్మ అనబడే మానవ శరీరంలోని పరమాత్మ శంబలప్రభువు !" అంటూ తన చేతులెత్తి నమస్కరించి తన జపమాలను నుదుటికి ఆనించి ఆనంద భాష్పాలు రాల్చాడు లామా దోర్జీ మహాశయుడు.

అమృతప్రవాహం వంటి ఆ అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రవచనానికి దిమ్మెరపోయిన మా సాహసయాత్రాబృందం మాటాపలుకూ లేకుండా అలా స్థంభించిపోయాం !

◆

52

అంతర్జాతీయ అంతరిక్ష సంస్థ - "నాసా" - 'శిఖరాగ్ర సమావేశం!'-II

మా ముత్తాతగారైన శ్రీనివాస చక్రవర్తి ఇతర సాహస పర్వతారోహకుల బృందం శంబలకోసం చేసిన యాత్ర ఇలా ముగిసింది. శంబల ప్రభువు ఈ కలియుగం చివర్లో రాబోయే అవతారంగా ప్రపంచ భవిష్యత్తును తెలిపే పురాణసంహిత, భవిష్యపురాణం — తాళపత్ర గ్రంథాలు కలియుగంలో పుట్టబోయేవారి జాతకాలు ముందే వ్రాసిన నాడీగ్రంథాలూ, ఒక్కసారి కర్పూరం హరించుకుపోయినట్టు గాలిలోకి

కరిగిపోయి మాయమయ్యాడు. గడ్డకట్టిన నీళ్ళు ద్రవంగామారి చివరికి ఆవిరిగా ఆపైన అణువులుగా, అణుధార్మిక విద్యుత్‌శక్తిగా మేఘాల్లో మెరుపులుగా లీనమైనట్లే — పదార్థంతో చేయబడిన వస్తువులన్నీ పంచ భూతాలలోకి మార్పుకాబడి చివరిదైన ఆకాశతత్వంలోకి లీనమైపోతాయి — ఈవిధంగా అంతర్జాతీయ సంస్థ యునైటెడ్ నేషన్స్ సైన్సు అంతరిక్ష కేంద్రం నాసా (NASA) కు వివరించబడింది. పూర్తి సైన్సు విశ్లేషణతో "ఎవరీ గుఱ్ఱంమీద వీరుడు ? ప్రపంచంలో అన్ని నగరాల్లోనూ ఒకేసారి కన్పించడం ఎలా సాధ్యం ? — ఆయనమీద పేల్చిన తుపాకులూ, ఆయుధాలూ తిరిగి పేల్చినవారినే చంపడం ఏమిటో?" అన్న విషయం పూర్తి విశ్లేషణకోసం నివేదికగా సమర్పించమని ఆదేశించి — యునైటెడ్ నేషన్స్ సభ తాత్కాలికంగా వాయిదా పడింది.

ఇలా ముగిసింది హిమాలయ పర్వతాల్లోని నిగూఢ రహస్యాలను ఆధ్యాత్మిక సత్యాలను కళ్ళతో స్వయంగా దర్శించాలన్న సాహస యాత్రీకుల రిపోర్టు ! ఇది ఎప్పుడో 1909 లోనే బ్రిటీష్ గూఢచారి ఛార్లెస్ బెల్ రాసిన సీక్రెట్ రిపోర్టు-212 అన్న ఫైల్‌లో నిబద్ధం చెయ్యబడి సాహసబృందం ఫొటోతోబాటు ఫైల్‌లో సీల్‌చెయ్యబడి భూమిలో పాతి వెయ్యబడ్డది.

నాకు ఇదెలా దొరికిందంటే ఈ సాహసయాత్రలోని శ్రీనివాస చక్రవర్తి మనవడైన రెండవ శ్రీనివాస చక్రవర్తికి తన పూర్వీకుల ఇంటి ప్రహరీ గోడను తవ్వి పునాదిని బాగుచేసుకోవాలని గోడక్రింద తవ్వినప్పుడు బయటపడింది. ఈవిధంగా — ఇప్పుడు జరుగుతున్న సంఘటనలు చాలావరకు 1909 లోనే 13వ దలైలామాగారి **"శంబల భవిష్యాలు"**

లో రాయబడ్డ వింతలు — ఈ సాహసయాత్రలో స్వయంగా చూసిన ఛార్లెస్ బెల్ రిపోర్టులో బయటపడటం జరిగింది !

కాబట్టి తెల్లగుఱ్ఱంమీద వీరుడు, మద్రాస్‌లో నడిరోడ్డుమీద అకస్మాత్తుగా ప్రజలముందు కనబడ్డంతో "గతం"లోని భవిష్యాలు — ప్రస్తుతంలోని నిజజీవితంలోని అనుభవాలుగా మారినప్పుడే అప్పటి సీక్రెట్ రిపోర్ట్-212 పరిశీలించిన అంతర్జాతీయ సంస్థ యునైటెడ్ నేషన్స్ యొక్క సర్వసభ్య సమావేశంలో ఈ విషయాన్ని పరిశీలించినప్పుడు — ప్రపంచంఅంతా ఆశ్చర్యంలో మునిగి ఉక్కిరిబిక్కిరి కావటం జరిగింది !

"ఇంతకీ ఇదంతా గతం చరిత్రా ? సరి–సరి ! మీరు ఈ సీక్రెట్ ఫైల్‌తో మాముందర ప్రవేశపెట్టి మాకు అంతా విశ్లేషించి తెలియజెప్పారు సరే ! ఈ పరిస్థితిని మనం ఎలా ఎదుర్కోవటం ? అది చూడండి మహాశయా !

ఓపక్కన లెక్కలేనంతమంది పోలీస్ అధికారులు, మిలటరీసిబ్బంది, రక్షణశాఖవాళ్ళూ ప్రయోగించిన తుపాకీలు, బాంబులు, లాఠీలు అన్నీ తిరిగి ప్రయోగించినవారిమీదే విరుచుకుపడుతున్నాయి. దానికితోడు ఒకచోట కనిపించిన గుఱ్ఱంమీద వీరుడు రోజుకొక కొత్తప్రదేశంలో అంచె లంచెలుగా హెచ్చువేసినట్టుగా కనిపిస్తున్నాడు !

మీరేమో "అది గుఱ్ఱంకాదు, ఒక ఎలక్ట్రానిక్ లేక అంతరిక్షశక్తితో నడిచే యంత్రం" అంటారు ! మీ కమిటీలోని టిబెటన్ లామా, యోగీ, సహాయకుడు — అది భూమ్మీద దిగిన బలమైన ఆధ్యాత్మికశక్తి తరంగం అంటున్నారు. ఇది న్యూక్లియర్‌శక్తివంటి దేనికీ లొంగని అంతరిక్షశక్తి

(Extra-terrestrial Cosmic Power) అంటున్నారు. ఏదైతేనేమి ? ఈ శక్తిని ఎదుర్కొనేదెలా ?" — అన్నారు అంతర్జాతీయ కాన్ఫరెన్స్ బృందంలోని వివిధ దేశాల నేతలు ఏకకంఠంతో !

హ్యారీపాట్టర్ క్షణకాలం దీర్ఘాలోచనలో మునిగిపోయాడు — ఇంతలోనే తన మనస్సులోకి ఎవరో రహస్య సంకేతాలను పంపినట్టుగా తృళ్ళిపడి...

"అరే ! ఇప్పుడే అందింది ఒక సందేశం" ... —

గుణ్ణం-వీరుడూ ఒక అంతరిక్ష న్యూక్లియర్ తరంగాలతో స్పందించే పరికరం అయితే దానికో టెలిగ్రాఫ్‌వార్త వంటి ప్రశ్నను అందించి చూద్దాం; ఏమౌతుందో ? ఒకవేళ దానినుంచి సమాధానం ఎలక్ట్రానిక్ పరికరాల తరంగాలవంటి సిగ్నల్స్‌నుంచి సమాధానం రూపంగా లభిస్తే అది మన యంత్రాల డిస్ప్లేతెరమీద బొమ్మలరూపంలో కనిపించ వచ్చు !" అంటూ గబగబా తన టేబుల్‌ముందున్న ఎలక్ట్రానిక్ **"సూపర్ కంప్యూటర్"** బటన్ నొక్కగానే టి.వి. (T.V.) అద్దం వంటి తెరమీద నక్షత్రాల వంటి తరంగాలు చిటపటలాడి కనిపించటం అవి క్రమంగా విచ్చుకుని టి.వి. చిత్రాల్లాగ బొమ్మలుగా మారటం జరిగింది ! ముందుగా పెద్ద-అక్షరాలు ఇలా కనపడ్డాయి !

భగవంతుని – ఆఖరి హెచ్చరిక :–

అందరూ ఆసక్తిగా అటువైపే చూస్తున్నారు. ఆశ్చర్యం ! స్క్రీన్‌మీద ముందుగా నీలాకాశంలా కనిపించింది — దాని వెనకనుంచి తెల్లటి నక్షత్రం వంటిది దూసుకునివచ్చి పువ్వులా విచ్చుకుంది ! అది చెరువులో

రాయివేస్తే తరంగాలు ఏర్పడ్డట్టుగా రింగులుగా అలలు ఏర్పడి పువ్వులా విచ్చుకుని — తెల్లగుఱ్ఱం దానిమీద కూర్చున్న వీరుడూ మళ్లీ ఈ తెర మీద కనిపించారు. కరెంటు “షాక్” కొట్టినట్టు అందరూ ఒక్కసారిగా తుళ్ళిపడ్డారు !

“అతడేదో మాట్లాడుతున్నట్టున్నాడు — సంకేతాలతో ! చదవండి !” అన్నారు సభలోని శాస్త్రజ్ఞులు, దేశాధిపతులు ఏకకంఠంతో ! “అతడు మానవజాతికి ఏదో సందేశం ఇస్తాడట !” — అన్నాడు హ్యారీ ! ఇది ప్రపంచంలోని అన్నిదేశాల కోసం అని తెలిసేట్టుగా అతని గుఱ్ఱంనుంచి అన్నివైపులా వ్యాపించే కిరణాలులాటి బాణాలగుర్తులు (Arrow marks) భూగోళంమీద అన్నిదేశాలకూ ఒంపులు తిరిగి చూపిస్తున్నాయి. అందరూ కుర్చీలలో ముందుకు జరిగి సీట్లలో నిఠారుగా కూర్చున్నారు. వెంటనే యునైటెడ్‌నేషన్స్ సభలోని ప్రపంచ భాషలను తర్జుమాచేసే యంత్రాన్ని దానికి లింక్‌పెట్టగా — అది కంఠంతో మాటలాగా వినిపించింది ఇలా...

★ సందేశం

“ప్రపంచ మానవాళికి — ఈ భూమిమీద మానవజాతిని సృష్టించిన భగవంతుడినుండి సందేశం !”

‘భగవంతుడు’ అంటే ఈ భూగోళంమీద ఇప్పటికే అనేక మతాలు, అనేక జాతులు ఏర్పడివున్నాయికదా ! — అందుకని ఈ గ్రహంమీద ప్రాణికోటిని పెంచి పోషించిన తోటమాలి వంటి యజమానినుండి నానుంచి మీకు సందేశం ! వినండి !! మీకు మేము ఆలోచనా తరంగాలుగా అనుగ్రహించిన తెలివితేటల్ని — ‘సైన్సు’గా మార్చుకుని

మారణాయుధాలు, అణుశక్తి ఆయుధాలు తయారుచేసి ఇప్పటికే మిమ్మల్ని మీరే — గంటల్లో నాశనం చేసుకోగల తెలివిని సంపాదించుకున్నారు ! ఇది మా సంకల్పానికి విరుద్ధం !

మీరే విజ్ఞానంతో మీ పిల్లలూ, ఏ సహాయంలేని బీదవారూ తిండి, నివాసం, బట్ట, ఆరోగ్యమూ — అందరికీ సమకూర్చాలని ఈ విజ్ఞానం మేము మీకిచ్చాం !

మీకున్న విజ్ఞానం మాకులేకకాదు. మీ మారణాయుధాలు ఏమీ చేయలేవని — అంతకుమించిన శక్తి మీ కళ్ళముందే మీసైన్యుకు అర్థమయ్యేలాగ చూపించాలని ఈ చిత్రాలను ప్రదర్శించాము. మీరు మానవజాతిఅంతా **ఒకటిగా ఏర్పడి — ప్రపంచ ప్రభుత్వంగా** ఏర్పడాలి ! ఇది మొదటిసందేశం ! ఆదేశం !!

ప్రపంచ – ప్రభుత్వం :

ఈ ప్రపంచ ప్రభుత్వంలో అన్నిదేశాలు, అందరి ప్రజలూ సభ్యులు కావాలి సమాన హక్కులతో ! ఇది ఇరవైనాలుగు గంటలలోగా టెలికమ్యూనికేషన్ ద్వారా జరగాలి. దానికి మీ అంగీకారం అంతర్జాతీయ సంస్థ శాసనంద్వారా వెంటనే నాకు తెలియజెయ్యాలి మీ ఎలక్ట్రానిక్ సంకేతాలద్వారా ! అలా ఎందుకంటే మీ ప్రపంచంలోని మానవుల భాషలు లెక్కకుమీరినన్ని రకాలుగా వున్నాయి. అందుకే ఆలోచనా తరంగాలుగా మార్చిన ఈ ఎలక్ట్రానిక్ సంకేతాలుగా నా సందేశాన్ని పంపిస్తున్నాను. పూర్తివివరాలు మీ అంతర్జాతీయ భాషలో ఒక లెటర్ (మీ ఇంగ్లీషులో) పంపిస్తున్నాను" అంటూ తెరమీద గుజ్జం తటాలున

పెరిగి తెరఅంతా వ్యాపించింది. గుఱ్ఱంమీద వీరుడు తన తలచుట్టూ కత్తి తిప్పి కత్తిసాము చేసినట్టు మెరుపులా తళుక్కున మెరిపించాడు నక్షత్రాలుగా నిప్పురవ్వల వలే చిటపటలాడి టి.వి. అద్దం మీదనుంచి గాలిలోకి T.V. తెరదాటి బైటికివొచ్చి విద్యుత్తు రవ్వలుగా ఎగిరిపడ్డాయి. ఆ శక్తియొక్క వేడికి టి.వి. నుంచి పొగ రాసాగింది. మరుక్షణమే తెరమీద వెలుగు మాయమై మామూలు వెలుగుగా మారిపోయింది.

అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు ఆశ్చర్యంతో! ఇంతలో ఒకపెద్ద కవరు వంటిది కాన్ఫరెన్స్‌హాలు పైకప్పునుండి మెరుపులా వెలిగి కెమెరా ఫ్లాష్‌లాగా మెరిసి పొగమంచులాగ, దూది పింజలాగా వచ్చి కవరులాగా మారి కప్పునుండి క్రిందపడింది — 'టప్' మన్న చప్పుడుతో.

ఏదో పడింది ! చూడండి ! అన్నారు అందరూ. హ్యారీపాట్టర్ చేతికి తొడుక్కున్న అణుశక్తి నిరోధక ప్లాస్టిక్ వంటి గ్లౌజ్‌తో ఆ కవరును పటకారుతో పట్టి చాకుతో చింపి చూస్తే లోపల రావుసైజులోని తెల్ల కాగితంమీద రాసిన ఇంగ్లీష్ అక్షరాలలో లేఖ — అని తేలింది. దాన్ని టి.వి. తెరమీద పెద్దదిగా చేసి కంప్యూటర్‌ద్వారా అందరికీ చూపిస్తే — ఇలా చదివారు ఆ లెటర్‌లోని సందేశాన్ని !

మానవజాతికి – నా సందేశం ! – ఆదేశం !!

* * *

53

అంతర్జాతీయ సైనిక కూటమి NATO సేన రాకెట్లాంచెర్ తెల్లబూడిద ?

అంతర్జాతీయ సంస్థ యునైటెడ్ నేషన్స్ (UNO) లోని కార్యాచరణ కమిటీ — "సెక్యూరిటీ కౌన్సిల్"లో శిఖరాగ్రదేశాలు నేటో (NATO) మిలటరీసంస్థ వంటి అనేక అధికారాలుగల దేశాల ఎమర్జెన్సీ సమావేశంలో — సైన్సు సంస్థ నాసా ఇచ్చిన విశ్లేషణ — **"అది గుఱ్ఱమూ**
కాదు ! ఆపైనుండేది వీరుడూ కాదు ! అం
కంట్రోలు' ద్వారా నడిపించబడుతున్నది"
ఎదుర్కోవాలి ? దీనికి ప్రపంచ అగ్రదేశాలు
కుని తర్జనభర్జనలు పడ్డారు. పక్కనేవున్
హాలు (Conference Hall) లోకి గుమి

అక్కడకూడా ఒకపెద్ద టేబుల్మీ
(NASA) నుంచి సైంటిస్టులు పంపే కం

టి.వి. స్క్రీన్ ఒక్క వెలుగు వెలిగి
రవ్వలతో చిటపటలాడి టి.వి. అద్దంపై
పడ్డాయి. గుఱ్ఱంమీద వీరుడు పంపిన –
ప్రపంచంలోని అన్నిదేశాలూ రాష్ట్రాలలా
జాతి అంతా ఒక్కటిగా ఏకంకావాలన్
(Play) చెయ్యగా ఈసారి శిఖరాగ్రదేశ
ఇంకోసారి విని తల పంకించారు.

అందరూ ఒకరి ముఖాలు ఒక
యునైటెడ్ నేషన్స్ (UNO) సంస్థ సర్వసే
in Chief) లేచి సభకు సెల్యూట్ చేశా

"చెప్పండి త్వరగా, ఏంచేద్దాం ?

"సర్ ! అతను అలా T.V. తెరమీ
తూండగానే ఆ తెల్లగుఱ్ఱాన్నీ, వీరుడినీ ఇ
రిమోట్ కంట్రోల్ (Remote Control)

కాదు ! ఆపైనుండేది వీరుడూ కాదు ! అంతరిక్షంనుంచీవస్తున్న "రిమోట్-కంట్రోలు' ద్వారా నడిపించబడుతున్నది" — అన్న సందేశాన్ని ఎలా ఎదుర్కోవాలి ? దీనికి ప్రపంచ అగ్రదేశాలు ఏంచేయాలి ? అని తలపట్టుకుని తర్జనభర్జనలు పడ్డారు. పక్కనేవున్న గూఢచారి విభాగం కాన్ఫరెన్స్ హాలు (Conference Hall) లోకి గుమికూడారు.

అక్కడకూడా ఒకపెద్ద టేబుల్‌మీద టి.వి. సెట్‌ద్వారా నాసా (NASA) నుంచి సైంటిస్టులు పంపే కంప్యూటర్ చిత్రాలు చూడవచ్చు.

టి.వి. స్క్రీన్ ఒక్క వెలుగు వెలిగి తళుక్కున నక్షత్రాల్లాగా నిప్పురవ్వలతో చిటపటలాడి టి.వి. అద్దంపైనుంచి విద్యుత్తురవ్వలు జారిపడ్డాయి. గుజ్జంమీద వీరుడు పంపిన — ప్రపంచ ప్రభుత్వంగా ఏర్పడి ప్రపంచంలోని అన్నిదేశాలూ రాష్ట్రాలలాగ పనిచెయ్యాలనీ — మానవజాతి అంతా ఒక్కటిగా ఏకంకావాలన్న సందేశం తిరిగి వెనక్కి "ప్లే" (Play) చెయ్యగా ఈసారి శిఖరాగ్రదేశాల నేతలందరూ దాన్ని మళ్లీ ఇంకోసారి విని తల పంకించారు.

అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఇంతలో యునైటెడ్ నేషన్స్ (UNO) సంస్థ సర్వసేనాని (Military Commander in Chief) లేచి సభకు సెల్యూట్ చేశాడు "నాదొక్క మిలిటరీ ప్లాన్ !"

"చెప్పండి త్వరగా, ఏంచేద్దాం ?"

"సర్ ! అతను అలా T.V. తెరమీద కనిపిస్తూ మనతో మాట్లాడుతూండగానే ఆ తెల్లగుజ్జాన్నీ, వీరుడినీ ఇక్కడినుంచే మిలిటరీ ఆయుధాల రిమోట్ కంట్రోల్ (Remote Control) ద్వారా మనం అంతరిక్షంలో

అంగారక గ్రహంమీదికి పంపే అణువిధ్వంసక రాకెట్ ద్వారా పేల్చి వేద్దామా ? మీవద్దనుంచి వెంటనే ఆదేశం కోరుతున్నాను."

"యస్! - చప్పున !!! ఇప్పుడే మొహరించండి" యునైటెడ్ నేషన్స్ (UNO) అధ్యక్షుడు ఆజ్ఞాపించే స్వరంతో అన్నాడు.

అన్నిదేశాల నాయకులూ, దానికి అంగీకారం సూచించారు. "నేనే వ్యక్తిగతంగా వెళతాను — మళ్ళీ మనం టెలీకంప్యూటర్ద్వారా ఈ విషయాన్ని సందేశంగా పంపితే గుఱ్ఱంమీద వీరుడు దాన్ని కనిపెట్టేయ వచ్చు. అలా చెయ్యకుండా నా మనస్సులోనే రహస్యంగా దాచుకొని ఇక్కడినుంచి చల్లగా జారుకుంటాను ! కాగల కార్యమిప్పుడే పూర్తి చేస్తాను !" అంటూ సర్వసేనాని లేచి మరొకసారి సభకు వందనంగా సెల్యూట్ చేసి గిరుక్కున వెనుతిరిగి క్షణంలో బయటికి పోయాడు.

సంస్థలోని గోడమీద పెద్ద జెండామీద ఎర్రని చారలు నక్షత్రాలు గల NATO, యునైటెడ్ నేషన్స్ జెండాలకు సెల్యూట్చేసి మరీ వెళ్ళాడు. సభహాలు తలుపులు మూసివేశారు. చీకట్లో టి.వి. మీద కనపడుతున్నది. అందరూ ముందుకు ఆతృతతో వంగి మరీ చూస్తున్నారు.

అప్పుడు టి.వి. మీద కనిపించింది — అంతర్జాతీయ సంస్థ UNO ప్రపంచ అణుధార్మిక బాంబుల యుద్ధభూమి ! చెట్లూ, పొదలూ, మైదానం మధ్య నిటారుగా నిలబెట్టిన 70 అడుగుల అంతరిక్ష రాకెట్ నిలబడి వుంది. అందరూ ఆసక్తిగా ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. ఇంతలోకే రాకెట్ అడుగున అన్నివైపులనుంచీ పొగలు మేఘాల్లా పైకిలేచాయి. ఉరుమువంటి పెద్దశబ్దంతో రాకెట్ అంటుకుని అంతరిక్షం

లోకి ఎగిరిపోయింది. దాని శక్తికీ పేలుడికీ భూమి దద్దరిల్లిపోయింది. కాన్ఫరెన్స్ హాల్లోని అందరూ భూకంపం వచ్చినట్టుగా తుళ్ళిపడ్డారు.

టి.వి. స్క్రీన్మీద నీలాకాశం మెరుపులతో వెలిగిపోతోంది. దూరాన ఎగురుతున్న రాకెట్ తెల్లగా పెన్సిల్ వంటి అణుక్షిపణి కొనదేలి వెండిలా మెరుస్తోంది. నిటారుగా వెళ్తూనే రాకెట్ చటుక్కున కుడివైపుకి తిరిగి సమకోణంలో వొంగి, అందులో కనపడుతున్న వీరుడూ-తెల్లగుళ్ళం మీదకు దూసుకుపోయింది.

కింద నేలమీద పెద్దపెద్ద ట్యాంకులు, సైనికశకటాలు, యుద్ధ ఫిరంగుల, వాహనాలూ వరుసలు తీరి మోహరించబడి రాకెట్ గమనాన్ని ఆసక్తిగా చూస్తున్నాయి. వాహనాల్లో నిలబడిన సైన్యాధిపతులు బైనాక్యులర్స్తో అంతరిక్షంలో ఎగురుతున్న రాకెట్ను — వెలుగుతూ గుళ్ళం మీదకూ దానిమీదున్న వీరుడిమీదకి దూసుకువెళ్ళడం చూశారు.

కౌంట్-డౌన్ లేకుండా ఆ వీరుడికి ముందు హెచ్చరికలు లేకుండా గురిపెట్టించి — "ఫైర్ !" (Fire) అన్న కమాండ్ (Command) వినిపించింది. అగ్నిపర్వతంలాగా పొగలుచిమ్ముకుని నల్లగా దట్టంగా వ్యాపించి జ్వాల ఎర్రని తోకలా ముందుకు దూసుకునివెళ్ళి గుళ్ళం మీదకు మోహరించి పేలింది ! చెవులు బద్దలయ్యేంత ధ్వని ! తెల్లగుళ్ళం తెల్లటి కాంతినక్షత్రంలా వెలిగి వెయ్యిసూర్యుల వంటి కాంతితో మెరిసింది.

టి.వి.స్క్రీన్ ఆకాశంఅంతా కనులు మిరుమిట్లుగొలిపే ఆర్క్ (Arc) వంటి మంట, వెలుగు — అరసెకనులో అంతా చీకటి. భయంకరమైన

శబ్దం. పైనుంచి తుక్కు, చెదారంలా రాకెట్ శకలాలు క్రిందకి దిగుతూ సైనిక స్థావరంమీద పడ్డాయి.

"అరె ! మన జీపులూ, ఆయుధశకటాలూ, సేనాధిపతులూ ఎవరూ లేరే ! — ఏమయ్యారు?" అనుకుంటూ కాన్ఫరెన్స్‌హాల్లో టి.వి.ని దగ్గరగా జూమ్ చేశారు. దాంతో సైనికస్థావరం మీది వాహనాలు, ట్యాంకులు నిలబడ్డచోట తెల్లటి ముగ్గువంటి బూడిద — సరిగ్గా ఆ వాహనాల ఆకారంలో ఏర్పడింది. కొన్ని రాకెట్లు నిలబడి అదే ఆకారంలో మాడి పోయాయి — పిడకలు కాల్చిన కచ్చికలాగ, ఆకారంమాత్రమే వున్న బూడిదగా ! అంతా క్షణాలమీద జరిగిపోయింది.

అయ్యో ! అమ్మో ! 'చదరంగం' లో గళ్లలాగా నిలబడ్డ రాకెట్లూ, ఆయుధాలు మన NATO సర్వసేనాని, కమాండర్ మన అణుధార్మిక, సైనిక శకటాలూ మొత్తం తెల్లని బూడిద చదరంగంబల్లలాగా ఆకాశంలో విమానంలోంచి కనిపించాయి ! మరుక్షణమే టి.వి. తెరమీద తెల్లగుఱ్ఱమూ దానిమీద వీరుడూ యథాప్రకారం కనిపించాయి — ఈసారి అతని కళ్ళు ఎర్రగా నిప్పుకణికల వలే క్రోధాన్ని సూచిస్తున్నాయి. అతని తలపైన కిరీటంవంటి ఉక్కు శిరస్త్రాణం, అగరువత్తి పొగ వంటి ఆవిరితో పొగలూ సెగలు బయటికి వ్యాపించసాగాయి. కమిటీ హాలులో ఎవరూ మాట్లాడే ధైర్యం చేయలేదు. అలా క్షణంలో ప్రపంచదేశాల నేతలందరిలో వాళ్ళ యుద్ధట్యాంకులూ, రాకెట్లూ చదరంగంబల్లమీద గళ్ళవలే తెల్లని బూడిదగా — ముఖానికి రాసుకునే ఫేస్‌పౌడర్‌లా — భస్మీపటలం కావడంతో "ఇప్పుడేం చేద్దాం ? ఇంకేం చేయగలం ? కింకర్తవ్యం ?" అన్న ప్రశ్నార్థకం అంతటా నిశ్శబ్దంగా తాండవించింది.

II

రాకెట్లూ, అణుబాంబులూ, ఏధ్వంసక క్షిపణులు అన్నీ — ఈనాటి ప్రపంచదేశాలు తమశక్తి దేనిమీద ఆధారపడి వుందని నమ్మి గర్వంగా ధైర్యంగా బ్రతుకుతున్నాయో ఆ తెల్లజాతి గర్వం ఒక్కసారిగా బూడిదయ్యింది ! తెల్లని భస్మంలాగా నశించిపోయింది ! ఆయుధాలే కాదు, ఆయుధాలమీదా యుద్ధంమీదా వున్న నమ్మకం కూడా ఒక్కదెబ్బతో పటాపంచలైపోయింది. దాంతో “ఇప్పుడిక మనం దేన్ని నమ్మవచ్చు ?” అన్న శేషప్రశ్న మానవాళిని ఒక్కసారిగా భూకంపంలా కుదిపివేసింది. కుదిపేసి “ఇంక దేనిని నమ్మాలి ?” అన్న వెతుకులాట, అన్వేషణతో మానవజాతి సందిగ్ధంలో పడింది.

దానితో **“కలియుగం”** అనబడే ఆధునిక యూరోపియన్, అమెరికన్, ఆస్ట్రేలియన్ వంటి తెల్లజాతుల అధికారం — ఒక్కసారిగా తుడిచి పెట్టుకుపోయింది. అంటే కలియుగపు సంస్కృతి అంతా గంగలో కలిసి పోయింది. కలియుగం అంటే ఏమిటో, ఇన్నాళ్ళూ తమని చీకటిలాగా ఎలా మోసగించిందో — ఆ చీకటి తొలిగాకగాని తెలిసిరాలేదు. అహంకారం, మదం, బలహీనజాతులను బానిసత్వంతో అణచివేయడం లక్ష్యంగా పెట్టుకున్న యూరోపియన్ సంస్కృతి అంతా కలియుగం అన్న విషయం అప్పుడుగానీ గుర్తుకురాలేదు. డబ్బుబలం, ఆయుధాల బలంతో విధ్వంసం చేయడానికీ, మారణహోమం చేయడానికీ రక్తపాతాలతో భూమిని ఎర్రని వసంతంలా కలుషితం చేయగలమనే గర్వమూ, — ఈ ఆయుధాలే ఈ మదానికి కారణం ! తెల్లగుఱ్ఱంమీద అవత

రించిన కల్కిభగవానుని అవతారం ఈ శంబల ప్రభువు రూపంలో ఈ అధికారమదాలన్నింటినీ తుడిచివేసింది.

గుడ్డివాడికి తన చేతికర్ర పడిపోతే వెతుకులాట ఎలావుంటుందో అలాగ; కళ్ళజోడు దళసరిఅద్దాలు రాలిపోతే ఏమీ కనిపించని కబోది పరిస్థితిలాగ మానవజాతికి — మానవత్వం అంటే కొత్త నిర్వచనం అవసరమైంది.

పాత విలువలైన ఆయుధాలు, రాకెట్లు, విమానాలూ, డాలర్లూ, అధికారమదం అన్నీ తుడిచిపెట్టుకుపోగా — మానవత్వపు విలువలే ఇప్పుడు ఎంతో అవసరమయ్యాయి. అంతేకాదు, చాలామంది అసలు మానవత్వపు విలువలు అంటే ఏమిటో మొట్టమొదటిసారిగా తెలుసుకోవలసిన అవసరాన్ని ప్రపంచదేశాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇదే రెండు విలువల సంఘర్షణభరితమైన — యుగసంధి !

కలియుగం అంతమై సత్యయుగం ప్రారంభమయ్యే ఈ యుగసంధిలోనే అవతారమూర్తులు వస్తారని చెప్పిన కలియుగ ప్రారంభంలోనే శ్రీ వేదవ్యాస మహర్షి భవిష్యత్ కాలజ్ఞానమే నిజమైంది. దాంతో తెల్లగుఱ్ఱంమీద వీరుడు చెయ్యదల్చుకున్న పనిలో **కలిరూపు** నాశనం చేయడం — పూర్తి అయింది.

ఇప్పుడీ ప్రపంచాన్ని తిరిగి పునర్నిర్మాణం చెయ్యాలి ! మానవ సమాజానికి కొత్తవిలువలు ఇవ్వాలి ! మానవజాతికి కొత్తపునాదులు సృష్టించాలి. మనిషిలో విలువైనదేమిటో గుడ్డివాళ్ళ కళ్ళు తెరిపించినట్లు కొత్త దృక్పథాన్ని ప్రసాదించాలి.

మనిషి శరీరం కుళ్ళిపోయి మట్టిలో కలిసిపోయే వ్యర్థపదార్థం. అందులోని మనస్సూ, ఆలోచనాశక్తీ, వివేకమూ, శాశ్వతమనే సత్యాన్ని గుర్తించే 'ఆత్మ' — వీటిని అభివృద్ధి చేసుకోవడానికే మానవజాతి ఈ భూమ్మీద సృష్టించబడిందని తెలిపే "నూతన యుగధర్మం" కల్కి భగవానుడు చేపట్టే గాథఅంతా రాయాలంటే అదంతా వేరే గ్రంథం అవుతుంది.

దుష్టసంహారం అన్న మొదటిధర్మం పూర్తయింది. ధర్మసంస్థాపన అన్న రెండవధర్మం ప్రారంభించాలి మరి ! ఎలాగో తెలుసుకుందామా ? — రానున్న గ్రంథంలో !

* * *

54

రానున్నది - "భవిష్యపురాణం" కల్కిపురాణం !

నేను నా "**ముందుమాట**" లో మీతో చెప్పినట్టు — ఇది కథకాదు ! — కల్పిత నవలా కాదు ! ఈ సంగతి మీరీపాటికే ఇంతకుముందరి అధ్యాయాలలో వర్ణించిన "**హిమాలయాలలోని - సాహసయాత్ర**" వివరాలు చదివితే ఈ విషయాన్ని గ్రహించేవుంటారు.

ఎప్పుడో దాదాపు మూడు దశాబ్దాలక్రింత అంటే సరిగ్గా చెప్పాలంటే — 1985-అక్టోబరు-23వ తేదీన మా తాతగారైన శ్రీనివాస చక్రవర్తి అంతర్జాతీయ సంస్థ "**యునైటెడ్-నేషన్స్**" (UNO) లో చేసిన గంభీరోపన్యాసంలో ఆయన చెప్పిన "**జరగబోయే ప్రపంచ భవిష్యత్తు**"లో —

రాగల ప్రళయాలూ, భూకంపాలూ, “సునామీ”లూ (అంటే సముద్ర ఉప్పెనలూ) **“కాలజ్ఞానం”** లో — వీరబ్రహ్మేంద్రయోగి వ్రాసిన ‘భవిష్యత్తు’ ఆధారంగానూ — ఇంకా హిమాలయపర్వతాలలోని **“శంబల భవిష్యాల”**ల్లో చెప్పబడినవీ ఇంకా ఎన్నో — జరుగుతాయనీ, వారిచ్చిన ప్రపంచ భవిష్యత్తు ఇప్పుడు యదార్థంగా జరుగుతున్నది ! — అందులోని ముఖ్యమైన — మెరుపుసంఘటన తెల్లగుఱ్ఱంమీద కత్తిపట్టుకుని కూర్చున్న వీరుడు ప్రపంచంలోని అనేకదేశాల ప్రధాన నగరాలలో ఒక్కసారిగా దర్శనమియ్యటంతో ప్రపంచమంతా ఒక్కసారిగా సంక్షోభంలో పడిపోయింది ! ఇది ప్రపంచవార్తలలోకల్లా సంచలనవార్త అయి — టీ.వి. వార్తలలోనూ, పత్రికలలోనూ, ప్రచార సాధనాలలోనూ, అంతర్జాతీయ వేదికలమీదా మారుమోగిపోయింది! ఇదంతా వొక ఎత్తూ !

ఇక దీనిని మించిన పరమాశ్చర్యం ఇంకొకటి వుంది — అది వేరే ఎత్తు ! అదేమిటంటే — మాతాతగారు శ్రీనివాసచక్రవర్తి చెప్పిన భవిష్యత్తులో ఉదహరించిన — **“శంబలకు సాహసయాత్ర”** అన్న రహస్య నివేదిక అంతర్జాతీయ యునైటెడ్ నేషన్స్ రహస్య కాగితాలలో **“సీక్రెట్ ఫైల్-212”** లో భద్రంగా సీలుచేయబడినది నాకు లభించడం !

ఇది నేనింతకుముందే మనవిచేసినట్టుగా — 1903-1909 మధ్య కాలంలో ఒక సాహసయాత్రికుల బృందం హిమాలయపర్వతాలలో రహస్యంగా పర్యటించి **“శంబల”** కోసం అన్వేషించారు. అందులో ఎందరో ప్రపంచప్రఖ్యాత వ్యక్తులు పాల్గొన్నారు. వీరిలో ముఖ్యులు లండన్‌లోని అసాధారణ మేధావీ, అపరాధపరిశోధకుడూ అయిన “షెర్లాక్‌హోమ్స్” (Sherlok Hoems) నిజమైన వ్యక్తి అనీ — ఆయన నవలలో కల్పించ

బడిన కల్పితపాత్ర కాదనీ తెలియజేసే రహస్యాలు ఈ **"శంబల-సాహసయాత్ర"** రిపోర్టులో లభించడం — నమ్మలేని సత్యం ! వీటన్నిటినీ మించిన యదార్థసాక్ష్యం, ప్రత్యక్ష నిదర్శనం — మాతాతగారి సాహస యాత్రికుల బృందం అంతా కలిసి తీసుకున్న గ్రూప్-ఫోటో ! ఈ ఫోటోలో **"షెర్లాక్ హోమ్స్"** తన ప్రత్యేకమైన పొడుగాటి "పైపు"తో తలపై ఎత్తుటోపీ (Cop Hat) ధరించి కూర్చునివుండటంతోపాటు — అతడే మారువేషంలో బ్రిటీష్ గూఢచారిగా "ఛార్లెస్ బెల్" (Charles Bell) అన్న నకిలీపేరుతో "శంబల"కుపోయే ఈ సాహసయాత్రికుల బృందంతో చేరడం — అత్యంత నిగూఢమైన ఉత్కంఠభరితమైన నిజం.

ఇవన్నీ — అంటే మాతాతగారి సాహసయాత్రలోని ఇన్ని వింతలూ విశేషాలేవీకూడా, నాదృష్టికి రాకుండానే కాలగర్భంలో కలిసిపోయివుండేవి ! కాని — అంతా "కాలపురుషుని" లీల ! ఎప్పుడో వెనుకటి 19వ శతాబ్దంలో చేసిన "శంబలయాత్రా-విశేషాలు" గల ఈ రిపోర్టు భద్రంగా తోలుతో బైండుచేసి చెక్కలతో అట్టవేసిన చిట్టాపుస్తకంలో — పైనచెప్పిన గ్రూప్ ఫోటోతో సహా భద్రపరచబడి పెద్ద బోషాణంవంటి ట్రంకుపెట్టెలో మాఇంటి ప్రహరీగోడకింద భూస్థాపితం చేయ్యబడివుండటం !

అది మామూలుగా అయితే నాదృష్టికి రాకుండానే కాలగర్భంలో కలిసిపోయి వుండాల్సింది — వానకు తడిసి తేమకు తుప్పుపట్టి, నూరేళ్ళు దాటి చెదలు తినేసి మట్టిగా మారిపోకుండా ఈవిధంగా నిలిచి వుండటమా !

ఈ అన్నిటికన్నా ఆశ్చర్యం — నాకు మాఇంటి ప్రహరీగోడని తవ్వించాలనే సంకల్పం కలగడం — నాకే ఊహకందని ఆశ్చర్యం !

ఇది కేవలం నా మనస్సులోనే కలిగిన ఆలోచన అయివుండదని నాకు తోస్తోంది! మాతాతగారి 'సంకల్పం' ఆ రిపోర్టులో భద్రపరచబడిన "శంబల రహస్యాల"తో కలిసి ఒక ఆధ్యాత్మిక-తరంగంలాగా వారిపేరుపెట్టుకున్న శ్రీనివాసచక్రవర్తిగా వారి మనవడినైన నాకు — గోడక్రింద తవ్వాలనే సంకల్పాన్ని ప్రేరేపించేలా చేసిందని నా విశ్వాసం! లేకపోతే ఈ హిమాలయపర్వతాలు — వాటిమధ్యన ఎక్కడో రహస్యంగావున్న "శంబల", ఆ "శంబల"కు వెళ్ళేదారిలోని "స్ఫటికపర్వతమూ", మంచుతో గడ్డ కట్టుకున్న నది అడుగున "సారంగమార్గం"లో ప్రయాణం, ఆపైన 'టిబెట్' లోని దలైలామాల "పోతాలా" (Potala) కోట గోడలలో చిత్రించబడ్డ "కల్కిభగవానుని" చిత్రాలుగా భవిష్యత్ భవిష్యాలు — ఇవన్నీ చిత్రించబడివుండటం నాకు తెలిసే సావకాశమే — లేకపోయేది !!!

'శంబల' గురించి, **"శంబల ప్రభువు"** గురించీ తెలిపే ఈ **"సాహస యాత్ర సీక్రెట్ రిపోర్టు"** మా గోడకింద తవ్వినపుడు నాకు లభించివుండకపోతే — ప్రపంచమంతటినీ కుదిపేసిన "తెల్లగుఋం" మీద కూర్చున్న — "కల్కిభగవానుడు" ప్రచండ సంచలనం సృష్టించి అణుబాంబులకూ రాకెట్లకూ అతీతమైన "రుద్రశక్తి"తో ఆధునిక అణుబాంబులు రాకెట్లను కూడా మాడ్చి, తెల్లని బూడిదగా భస్మంచేసిన వింత — ఇదంతా నాకెలా తెలిసివుండేది ? — "ఇవన్నీ భగవత్సంకల్పం లేకుండా జరుగుతాయా ?" అన్నదే నా శేషప్రశ్న !

అంతకన్నా వింతలలోకెల్లా వింత నాకు దొరికిన "శంబలకు దారి"ని వర్ణించే ఈ రహస్యరిపోర్టు ! దీన్ని రాత్రీ పగలూ విరామము లేకుండా చదివేశాను. ఒక్కొక్క పేజీ చదువుతూవుంటే నాలో ఉత్కంఠత

పెరిగిపోసాగింది...! శంబల ప్రభువుపై అణుబాంబుల రాకెట్లతో దాడి చేసిన అంతర్జాతీయసంస్థ "నేటో" (NATO) సైనికదళం క్షణంలో — తెల్లని బూడిదగా మాడి మసైపోవడం నన్ను ఆశ్చర్యపరిచింది !

అంటే ఈనాటి అత్యాధునిక సైన్సుకన్నా కొన్ని వేలరెట్లు శక్తివంతమైన, అణుధార్మిక శక్తికంటే అతీతమైన "ప్రళయాగ్ని" వంటి శక్తి ఒక తెల్లని గుఱ్ఱం రూపంలో ఆకాశంలో కనిపించింది ! ఇది ఎన్నిసార్లు తలచుకున్నా ఆశ్చర్యపరచే — వింతలకు వింత ! పరమాశ్చర్యం !

II

ఇంతకీ నేనీ శంబలకు — రహస్య సాహసయాత్రలోని వింతలను తెలిపే కాలజ్ఞాన భవిష్యత్తునూ, రహస్యాలనూ ఇలా మీకందరికీ పుస్తకం రూపంలో ఎందుకు అందిస్తున్నానో — ఇంతవరకూ చెప్పలేదు కదూ ! దానికి కారణం ఒక్కటే.

అనేకచోట్ల కల్కిభగవానునిపేరు మాతాతగారైన శ్రీనివాసచక్రవర్తి అనబడే వేదవ్యాసగారు రాసిన గ్రంథం **"1999-కలియుగాంతం"** చదివి తెలుసుకున్నవారు దీనిని తేలికగా డబ్బుచేసుకునే దుష్టసంకల్పంతో — **"మేమే కల్కిభగవానులం"** అంటూ ప్రచారంచేసుకునే ప్రమాదం వున్నది — ఈ కలియుగం చివరిభాగంలో — రానున్న సత్యయుగం లోపల జరిగే కాలం **యుగసంధి** !! అంటే రెండుయుగాల మధ్య సంధి ! రాత్రి-పగలూ కలిసే సంధ్యాకాలం వంటిది — అసురసంధ్యల వంటి ఈ "యుగసంధి".

రానున్న ఈకాలంలో అనేకమంది దుర్మార్గులు, దొంగలూ అమాయకులను మోసంచేసి భక్తివిశ్వాసాలున్నవారిని దోపిడీచేసే పన్నాగంతో — "మేమే భగవంతుని అవతారం !" అంటూ కొందరూ,

"మేమే **'కల్కి-భగవానులం'** ! అంటూ ఇంకొందరూ దండిగా దక్షిణలు దండుకుంటూ — "ఎక్కువ దక్షిణలిచ్చినవారికి మర్నాడే మోక్షం ఇస్తాం !" — అంటూ మరికొందరూ;

'మా **'కల్కి-ముఠా'** లో చేరినవారికి 24 గంటల్లోగా 'మోక్షం'-గ్యారంటీ ! — సంతృప్తిలేకపోతే "మీడబ్బు-వాపస్ !"

అంటూనో, వ్యాపార సరళిలో ప్రకటనలు చేస్తూ ప్రచారంచేసుకొని అమాయకులను కొల్లగొట్టుతారు ! అలాంటి దొంగవెధవలకు — అసలు 'శంబల'-అంటే ఏమిటో ? — కనీసం అది ఏదిక్కునవుందో కూడా తెలియని జంతుదశలో బ్రతికే మానవమృగాలు ! అలాంటివాళ్లు — చెలరేగిపోయేకాలమిది !

అసలు **"శంబల"** హిమాలయ పర్వతాల్లో వున్నదని కూడా తెలియని వాళ్ళు ఈ సమాజంలో ఎక్కువమంది వున్నారు ! అలాంటి నిజాయితీ పరులకు నిజమైన భక్తులకూ **"శంబల"**-గురించీ, **"స్పటిక-పర్వతం"** గురించీ దానిని ఆనుకొని ప్రవహించే గంగానదికి పుట్టుకస్థానమైన "గౌముఖ్" కుండంగురించీ కనీసం — అక్షరాలుకూడా తెలియవు ! మనస్సుకంటే అతీతమైన, ఆకాశంవలే నిర్మలమైన 'అతీత-జ్ఞాన'-స్థితిలో వుండి నిరంతరం తపస్సులో మునిగివున్న — "చిరంజీవులూ" సిద్ధ పురుషుల, తపోభూమి ఈ 'శంబల'కు చుట్టూ ప్రహరీగోడవలే —

కాపలాగా వున్నదని అసలే తెలియని అజ్ఞానులు — ఇంకా ఎందరో! అలాంటివారు తన ఇల్లు కదలకుండానే డబ్బులు మూటకట్టుకొని ప్రజల గొంతులు కొయ్యాలనిచూసే రాజకీయవేత్తలకన్నా హీనాతిహీనమైనవారు! వ్యాపారస్థులకన్నా నీచులు!

అలాంటివారిబారిన మంచివారు పడకుండా నిజమైన భక్తీ, విశ్వాసమూ, నిర్మలమైన జీవితంగడిపే ఇలాంటివారికోసం — మన ప్రాచీన మహర్షుల వేదసంస్కృతి అంటే గౌరవమూ, శ్రద్ధా, భక్తీ, కలవారికోసమూ, ఈ "కలియుగ-ప్రారంభం" లోనే వ్యాసమహర్షి రాబోయే భవిష్యత్తును గురించిన పురాణం ఒకటి రాశాడు!

అందులో శ్రీకృష్ణభగవానుని నిర్యాణం, జరిగిన "కలియుగారంభం" రోజునుంచీ భవిష్యత్తులో రాగల "యుగసంధి" దాకా జరగనున్న చరిత్ర, "భవిష్యాలూ" ఎన్నో సంస్కృతంలో రాసిపెట్టాడు మనకోసం! ఆ పురాణం పేరు **"భవిష్యపురాణం"**! అందులో శంబలగురించి — **"కల్కి-భగవానుడి"** గురించీ **"స్ఫటిక-పర్వతం"** గురించీ — శ్వేతద్వీపం అన్న రహస్య సంస్కృత నామంతో వర్ణించాడు!

"కల్కిపురాణం" అన్న ఒక రహస్యపురాణం కూడా ఆయన వేరే రాసివుంచారు!

అందులోని విషయాలు 1903 ప్రాంతంలో రష్యానుంచి బయలుదేరిన పరిశోధకుడు "నికోలాస్ రోరిఖ్స్" తో పాటు కొందరు సైన్సు పరిశోధనాయాత్రగా (Scientific Expedition) హిమాలయాలలో పర్యటించారు! అందులో వీరు కనుగొన్నవీ, చూసినవీ, అనుభవించినవీ ఒక 'రిపోర్టు' లాగా వ్రాసి అందులో అందరిసభ్యులూ సంతకాలు

చేశారు ! దానియొక్క సారాంశమే ఇంతవరకూ మీకు అందించాను ! దీనివల్ల సమాజంలోని దొంగవెధవల మోసాలు, డబ్బు-వాంఛా, స్త్రీ-వాంఛా, అధికారవాంఛా పోని నీచులు మద్య-మాంసాలు తినే తాగే వాళ్ళూ సమాజాన్ని కొల్లగొట్టాలనీ, ప్రపంచాన్ని దండుకోవాలని — "మేమే ! కల్కిభగవానులం !" అని ప్రచారం చేస్తున్న దొంగలు కొందరు అరెస్టుఅయి, లాకప్‌లలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు ! మరికొందరు పోలీసు డిపార్టుమెంటలోనే **"శిష్యుల"**ను పోగుచేసి వారిసాయంతో పోలీసులను కూడా తప్పించుకొని తిరుగుతున్నారు ! ఇలాంటివారి తప్పుడు ప్రచారానికి మోసపోకుండా నిజమైన భక్తులు పరిశోధనాదృష్టిగల ఆధ్యాత్మిక సాధకులు యదార్థం తెలుసుకోవాలని ఈ "రిపోర్టు"ను బహిరంగంగా ప్రచురిస్తున్నాను — నాకోసం ఎటువంటి స్వార్థచింతనా లేకుండా ! దీనినర్థం చేసుకొని సహృదయంతో చదివి ఇందులోని మహత్తర విషయాలని ధ్యానించి పరమాత్ముని దయను పొందగలరని — గాఢంగా కోరుతూ ! మీకిది పూజాపుష్పంగా సమర్పిస్తున్నాను !

దీని తరువాత పూర్తి ఆధ్యాత్మిక రహస్యాలతో ఈ కలియుగం మొదట్లో శ్రీ వేదవ్యాస భగవానుడు రాబోయే ప్రపంచ భవిష్యత్తును తెలిపిన **"భవిష్యపురాణం"** లోని అనేక ఆశ్చర్యకరమైన వింతలు-రానున్న నా మరొక గ్రంథం **"భవిష్యపురాణం"** లో అందిస్తున్నాను — ఇప్పటికే ఈ పుస్తకం పొడుగు చాలా పెరిగిపోయినందువల్ల పాఠకులకు శ్రమ లేకుండా ! రానున్న కల్కిభగవానుని అవతారగాథ యావత్తూ ఇటు కల్కిపురాణంలోనూ అటు భవిష్యపురాణంలోనూ ఇంకా టిబెట్‌లోని 13-వ దలైలామా గోడలపై చిత్రింపించిన కల్కిభగవానుని భవిష్యత్తు వివరాలు దీంట్లో అందజేస్తానని మనవిచేస్తున్నాను !

అన్నట్టు — మరిచిపోయానండోయ్ — అసలు విషయం ఒకటి — “దేవ-రహస్యం” గురించి మీకు చెప్పలేదు. “శంబల ప్రభువు” అని హిమాలయాలలోని టిబెట్-భూటాన్-సిక్కిం-గోబీఎడారి క్రిందనున్న “కార-కోరం” మంచుపర్వతాలలో ప్రసిద్ధిపొందిన అవతారమూర్తి — “కల్కిభగవానుడు”గా కల్కిపురాణం అనబడే — “ఉపపురాణం” లో వేదవ్యాస మహర్షి మహాభారతకాలం చివర్లో రాసిపెట్టాడని !

ఈ “కల్కిపురాణం”లో చెప్పని ఇంకొన్ని రహస్య వింతలు, విశేషాలు వేదవ్యాసమహర్షి రచించిన “భవిష్య-పురాణం”లో ఇచ్చాడు.

ఇందులో కల్కి భగవానుని తల్లితండ్రులు ఎవరు — ఆయన ఎప్పుడు అవతరిస్తాడో ఆనాటి తిథి, నక్షత్రం, గ్రహస్థితి — జాతక కుండలితో వివరిస్తుందీ “భవిష్యపురాణం” — రాముడిగురించి రామాయణంలోనూ, ‘భాగవతం’ “హరివంశ-పురాణాల్లో శ్రీకృష్ణభగవానుని సంపూర్ణ జీవితచరిత్ర రాసినట్టే !!!

అందులో ఎన్నో వింతలూ విశేషాలూ దేవరహస్యాలూ — “కల్కి మంత్రం” వంటివి, మీకు చెప్పాలనివున్నా — ఈ గ్రంథం ఇప్పటికే హనుమంతుని తోకలా పెరిగిపోకుండా — రానున్న నాగ్రంథంలో వ్రాశాను ! త్వరలో అచ్చుకు కూడా సిద్ధం అవుతోంది.

మరిన్ని విశేషాలతో “భవిష్య-పురాణం” తో కలుసుకుందామా ?

* * *

'శంబల'-ప్రభువు!

'పరిశోధనాత్మక నవల'

ఈ భూమ్మీద అన్యాయం పెచ్చు పెరిగి అధర్మం జడలు విదిల్చి దుర్మార్గం విషం కక్కుతూ అమాయకులకూ, సాధు సత్పురుషులకూ, ఇతర్లకేమీ అపకారం చేయకుండా జీవించే సాధుజీవులకూ ప్రమాదం వాటిల్లినపుడూ - ఈ సృష్టికి కర్తా, అధికారీ, [illegible]డివంటి రక్షకుడూ, ఐన శ్రీవిష్ణుభగవానుడు - భూమికి అవతరించి తిరిగి ధర్మాన్ని స్థాపించి దుర్మార్గులను సంహరించి సమాజంలోని అన్యాయాలనూ అక్రమాల్నీ రూపుమాపి 'గర్మరాజ్యాన్ని' స్థాపించుతాడు.

వ్యాస వాల్మీకులు గతించిన అవతారాల గాధమాత్రమే కాకుండా రానున్న "శంబల ప్రభుని" దివ్యావతారగాధను కూడా ఇలాగే అందించారు. భవిష్యత్తును 'కాలజ్ఞానం' ద్వారా పెవ్యదృష్టితో చూసి - రాబోయే 'భవిష్యపురాణం' రూపంలో! చదవడం - తెలుగులో ఇంకా 'శంబల ప్రభువు' పరిశోధనా - రహస్యాల్ని. ఇంకా :-

ఇందులో ...

- ❖ మానవ-సృష్టి జరిగిందిక్కడే !
- ❖ "నదిక్రింద సొరంగంలో" !
- ❖ గంగ-పుట్టిన "పాద-తీర్థం" !
- ❖ 'స్పటిక' - పర్వతం !
- ❖ శంబల - ఎక్కడ !
- ❖ శంబలకు పోయే దారి
- ❖ శంబల - భవిష్యాలు
- ❖ "వజ్రశ్రీ చక్రం" - మేరువు !
- ❖ శ్రీచక్ర అర్థం
- ❖ శంబల ప్రభువు !
- ❖ "తెల్ల-గుఱ్ఱం" - అర్థం !
- ❖ తుఫానులు రాకుండా - హోమం !
- ❖ ప్రపంచం-భవిష్యత్తు తెలిపే -
- ❖ 'నాడీగ్రంథం' - "పురాణసంహిత' '
- ❖ అంతర్జాతీయ 'అంతరిక్ష-సంస్థ'
- ❖ "నాసా" -'శిఖరాగ్ర సమావేశం-11
- ❖ సింహావలోకనం

చిత్రవిచిత్రమైన - పరిశోధనా నవలిక

డా. వేదవ్యాస D.Litt. గారి - ఇతర ఆధ్యాత్మిక ప్రచురణలు లోపలి పేజీల్లో...

100/-